www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 23-4-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 24 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం; తిథి: పౌర్ణమి తె. 5.19 తదుపరి పాడ్యమి; నక్షత్రం: చిత్ర రా. 10.32 తదుపరి స్వాతి; వర్జ్యం: తె.4.38 మొదలు, దుర్ముహూర్తం: ఉ.8.27-9.17, రా.10.14-10.58; అమృతఘడియలు: మ.3.27-5.13; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 5.57; సూర్యాస్తమయం: 6.29 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వెంకయ్యకు పద్మవిభూషణ్

వేదిక దిగి వచ్చి పురస్కారం అందించిన రాష్ట్రపతి ముర్ము

తెలంగాణ కళాకారులు గడ్డం సమ్మన్న, దాసరి కొండప్ప, సోంలాల్ నాయక్‌లకు పద్మశ్రీ

132 మందిలో 67 మందికి పురస్కారాల అందజేత 14





25 వేల మంది టీచర్లు ఇంటికే!

- ఎనిమిదేళ్లుగా తీసుకున్న జీతాలు 4 వారాల్లో వడ్డీతో సహా చెల్లించాల్సిందే
- బెంగాల్‌లో 2016 ఉపాధ్యాయ నియామకాలపై కలకత్తా హైకోర్టు తీర్పు
- 15 రోజుల్లోగా నియామక ప్రక్రియ చేపట్టాలని బెంగాల్ సర్కారుకు ఆదేశం
- దర్యాప్తు కొనసాగించి 3 నెలల్లో నివేదిక ఇవ్వాలని సీబీఐకి సూచన

కోల్‌కతా, ఏప్రిల్ 22: పశ్చిమబెంగాల్‌లో జరిగిన ఉపాధ్యాయ నియామకాల కుంభకోణం కేసులో కలకత్తా హైకోర్టు సోమవారం సంచలన తీర్పు వెలువరించింది. మమత సర్కారు రాష్ట్ర స్థాయి ఎంపిక పరీక్ష (ఎస్ఎల్ఎస్‌టీ) ద్వారా 2016లో జరిపిన బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలను రద్దు చేసింది. ఈ తీర్పుతో 25,753 మంది ఉద్యోగాలను కోల్పోయారు. వారి నియామక ప్రక్రియ చెల్లదని జస్టిస్ దేబాంగ్సు బసక్, జస్టిస్ మహ్మద్ షబ్బార్ రషీదీతో కూడిన డివిజన్ బెంచ్ తేల్చిచెప్పింది. అంతేకాదు.. అక్రమంగా ఉద్యోగాలు పొందినవారంతా గత ఎనిమిదేళ్లుగా తాము తీసుకున్న జీతాలను వడ్డీతో సహా.. నాలుగు వారాల్లోగా తిరిగి చెల్లించాలని తీర్పులో పేర్కొంది. వసూలు బాధ్యతను ఆయా జిల్లాల కలెక్టర్లకు అప్పగించింది. అలాగే.. ఖాళీ అయిన ఉద్యోగాల భర్తీకి 15 రోజుల్లోగా కొత్తగా నియామక ప్రక్రియ చేపట్టాలని ఆ రాష్ట్ర స్కూల్ సర్వీస్ కమిషన్‌ను ఆదేశించింది. ఈ స్కామ్‌పై సమగ్ర విచారణ జరిపి 3 నెలల్లో నివేదిక ఇవ్వాలని సీబీఐని ఆదేశించింది. కాగా.. ఉపాధ్యాయ నియామకాల్లో తమకు అన్యాయం జరిగిందంటూ కోర్టును

మిగతా 11వ పేజీలో...

సుప్రీంలో సవాల్ చేస్తాం

బాధితులకు అండగా ఉంటాం

బీజేపీ నేతలు తీర్పుల్ని ప్రభావితం చేస్తున్నారు: మమత



అలీగఢ్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ తదితరులు

మీ ఇళ్లు, నగలు.. అన్నీ లాక్కుంటుంది!

- ఆదాయం, ఆస్తులపై కాంగ్రెస్ సర్వే చేస్తుంది
- ఊళ్లో ఇల్లు, నగరంలో ఫ్లాట్ ఉంటే.. ఒక దాన్ని స్వాధీనం చేసుకుంటారు
- ఇది మావోయిస్టు, కమ్యూనిస్టు ధోరణి
- కాంగ్రెస్, ఇండి కూటమి ఈ పద్ధతిని భారత్‌లో అమలు చేయాలని చూస్తున్నాయి
- యూపీ ఎన్నికల ప్రచారంలో మోదీ విమర్శలు
- ప్రధానిపై చర్యలు తీసుకోవాలి.. ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ ఫిర్యాదు
- వనరులపై తొలి హక్కు మైనారిటీలకు కాదు పేదలు, ఆదివాసీలు, దళితులు, బీసీలకే: షా
- **కాంగ్రెస్ మేనిఫెస్టో గురించి వివరిస్తా**
- అపాయింట్‌మెంట్ ఇవ్వండి.. మోదీని కోరిన ఖర్గే

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి కాంగ్రెస్ పార్టీపై విరుచుకుపడ్డారు. రాజస్థాన్‌లో ఎన్నికల ప్రచారంలో ఆయన.. కాంగ్రెస్ వస్తే ప్రజల సంపదను లూటీ చేసి, మైనారిటీలకు పంచుతుందని ఆరోపించిన సంగతి తెలిసిందే. ఆ వ్యాఖ్యలు వివాదాస్పదమైనప్పటికీ మోదీ తగ్గలేదు. విమర్శల దాడిని మరింత పెంచారు. సోమవారం ప్రధాని ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ.. ఇండి కూటమి నేతలు భవిష్యత్తుపై ఆశలు వదులుకున్నారన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజల్ని హెచ్చరించారు. కాంగ్రెస్, ఇండి కూటమి

మిగతా 11వ పేజీలో...

హామీల అమలులో కాంగ్రెస్, బీఆర్ఎస్ విఫలం 12

పేదలకు రేషన్ కార్డులు కూడా ఇవ్వలేదు

వారికి ఓటడిగే హక్కు లేదు: కిషన్‌రెడ్డి

బీజేపీ ఖాతాలో సూరత్

- ఏకగ్రీవంగా ఆ పార్టీ అభ్యర్థి ఎన్నిక
- కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ తిరస్కరణ
- ప్రతిపాదించిన వారి సంతకాలు నకిలీవని రిటర్నింగ్ అధికారి ప్రకటన
- ఇవే కారణాలతో కాంగ్రెస్ ప్రత్యామ్నాయ అభ్యర్థి నామినేషనూ తిరస్కరణ
- బరిలోని మరో 8 మంది ఉపసంహరణ
- ఇదంతా బీజేపీ కుట్రలో భాగమన్న కాంగ్రెస్
- హైకోర్టులో సవాల్ చేస్తామని వెల్లడి



ముఖేశ్ దలాల్‌కు ధ్రువీకరణ పత్రం ఇస్తున్న ఆర్వో

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: లోక్‌సభ ఎన్నికల ఆరు దశలు ఇంకా మిగిలి ఉండగానే బీజేపీ ఖాతా తెరిచింది. గుజరాత్‌లో సూరత్ లోక్‌సభ స్థానాన్ని ఆ పార్టీ అభ్యర్థి ముఖేశ్ దలాల్ 'ఏకగ్రీవంగా' గెల్చుకున్నట్లు స్థానిక ఎన్నికల అధికారి (కలెక్టర్) సోమవారం ప్రకటించారు. ఈ మేరకు దలాల్‌కు ధ్రువీకరణ పత్రాన్ని కూడా అందించారు. దలాల్‌తో పోటీ పడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురి కావటం, అదే పార్టీకి చెందిన ప్రత్యామ్నాయ అభ్యర్థి నామినేషన్‌కూ అదే పరిస్థితి ఎదురుకావటం, బరిలో ఉన్న మిగిలిన 8 మంది అభ్యర్థులు తమ

మిగతా 11వ పేజీలో...

జనజాతర బహిరంగ సభకు హాజరైన జనం; (ఇన్‌సెట్) మల్కాజిగిరి అభ్యర్థి సునీతారెడ్డితో సీఎం రేవంత్



మోదీకి ఓటమి భయం

- అందుకే మతాల మధ్య చిచ్చు పెడుతున్నారు
- ఏం చేసినా.. వచ్చేది ఇండియా కూటమి సర్కారే
- రాష్ట్రంలో కాంగ్రెస్‌ను ఓడిస్తే పథకాలు ఆగిపోతాయ్
- అక్కడ మోదీ, ఇక్కడ కేసీఆర్.. ఇద్దరూ తోడు దొంగలే
- పదేళ్లు వారిని చూశారు.. ఇక కాంగ్రెస్‌ను దీవించండి
- జీవన్‌రెడ్డిని గెలిపిస్తే కేంద్ర మంత్రిని చేసే బాధ్యత నాది
- పసుపు బోర్డు ఏర్పాటు జీవోలో నిజామాబాద్ పేరేది?
- బండిని, గుండును ప్రజలు నమ్మరు: సీఎం రేవంత్
- ఆదిలాబాద్, నిజామాబాద్, మేడ్చల్‌లో కాంగ్రెస్ సభలు

ఆదిలాబాద్/మేడ్చల్/నిజామాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీకి ఓటమి భయం పట్టుకుందని, అందుకే మతాల మధ్య చిచ్చు పెడుతున్నారని, ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే హిందువుల ఆస్తులను గుంజుకొని ముస్లింలకు పంచుతారన్న మోదీ ఆరోపణలను ఆయన ఖండించారు. "ఇది సాధ్యమేనా.!? రాజ్యాంగం ప్రకారం ఎవరి ఆస్తులను ఎవరూ తీసుకునే హక్కు లేదు. దేశాన్ని మత ప్రాతిపదికన విభజించి రాజకీయ లబ్ధి పొందాలని మోదీ చూస్తున్నారు" అని విమర్శించారు. నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లా కేంద్రాలతోపాటు మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలోని అంతాయపల్లిలో సోమవారం నిర్వహించిన జనజాతర సభల్లో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. మతాల ఆధారంగా

మిగతా 12వ పేజీలో...

కుంభకోణంలో కవితే కీలకం.. బెయిలివ్వొద్దు

- రౌస్ అవెన్యూ కోర్టులో సీబీఐ వాదనలు
- నేరానికి సంబంధించిన ఆధారాల్లేవు
- బెయిల్ ఇవ్వండి: కవిత తరఫు న్యాయవాది
- సీబీఐ కేసులో మే 2కు తీర్పు రిజర్వ్ 3
- ఈడీ కేసులో వాదనలు నేటికి వాయిదా

వేలిముద్రల క్లోనింగ్‌తో 36 లక్షలు కొట్టేశారు

- ప్రధానమంత్రి కౌశల్ కేంద్రంలో నకిలీ వేలిముద్రల రాకెట్ 3
- మంచిర్యాల కేంద్రంగా దందా
- 300 మంది వేలిముద్రలు క్లోనింగ్
- వాటి ఆధారంగా హాజరు.. బిల్లులు స్వాహా
- ఛేదించిన రామగుండం పోలీసులు
- భోపాల్ సంస్థ నిర్వాకం.. నలుగురి అరెస్ట్

బీజేపీ అభ్యర్థి మాధవీలతను ఆలింగనం చేసుకున్న ఏఎస్సై

సోషల్‌మీడియాలో వీడియో వైరల్ 12

ఏఎస్సై ఉమాదేవిని సస్పెండ్ చేసిన సీపీ

రేపు ఇంటర్ ఫలితాలు

ఉదయం 11 గంటలకు వెల్లడి 3

వచ్చే వారంలో పదో తరగతి ఫలితాలు!

గుబులు గులాబీ!



- విషమ పరీక్షను అధిగమించాలని ఎత్తులు.. కాంగ్రెస్, బీజేపీని ఢీకొనేలా ప్రచార వ్యూహం
- నేరుగా ప్రజల వద్దకు వెళుతున్న కేసీఆర్.. 'ప్రజాస్వామ్యం కోసం' పేరిట ప్రచారం
- కాంగ్రెస్‌తో మోసపోయింది చాలంటూ నినాదం.. గౌరవప్రద సీట్లు గెలిస్తేనే నిలబడే చాన్స్

అధికారంలో ఉన్నప్పుడే 'సారు.. కారు.. పదహారు' అని నినదిస్తే గెలిచిన సీట్లు తొమ్మిది! ఇప్పుడు అధికారం లేదు! అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఐదు గ్యారెంటీలు అమలు చేసిన దూకుడుతో ఉంది! గతంతో పోలిస్తే పుంజుకున్న బీజేపీ.. మోదీ గ్యారెంటీతో ముందుకు పోతోంది! మరోవైపు, పార్టీ నాయకులు కారు దిగేస్తున్నారు! టికెట్ ఇచ్చిన తర్వాత కూడా టూచ్.. అంటూ అభ్యర్థులు జంప్ చేసేస్తున్నారు! లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటకపోతే ఉన్న ఎమ్మెల్యేలను నిలుపుకోవడమూ కష్టమే! దశాబ్ద కాలంపాటు తెలంగాణలో ఏకఛత్రాధిపత్యంగా హవా నడిపించిన భారత రాష్ట్ర సమితికి ఎదురైన విషమ పరీక్ష ఇది!

హైదరాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో మెరుగైన ఫలితాల సాధనే లక్ష్యంగా బీఆర్ఎస్ ముందుకెళుతోంది. మళ్లీ నిలబడి.. కలబడాలంటే.. ఈ ఎన్నికల్లో గౌరవప్రదమైన సీట్లు సాధించాల్సిందే. మెరుగైన ఫలితాలు సాధిస్తే మాత్రం అధికార పార్టీకి పక్కలో బల్లెంగా మారే అవకాశం ఉంది. అన్ని స్థానాల్లోనూ వీలైనంతగా పోటీ పడాలని, కొన్ని స్థానాల్లో మాత్రం చావోరేవో అన్నట్లుగా సర్వశక్తులు ఒడ్డాలని సంకల్పించింది. అందుకే, ఆ పార్టీ అధినేత కేసీఆర్ చెమటోడ్చుతున్నారు! అధికారంలో ఉన్నప్పుడు ప్రజలను కలవకపోయినా.. భారీ బహిరంగ సభలకు మాత్రమే హాజరైనా.. ఇప్పుడు నేరుగా ప్రజల వద్దకు వెళుతున్నారు! వారితో కష్టసుఖాలు మాట్లాడుతున్నారు. తుంటి ఎముక విరిగి ఇబ్బంది పడుతున్నా.. ఇప్పటికే కొన్ని జిల్లాలను చుట్టేశారు. బుధవారం నుంచి బస్సు యాత్ర చేపట్టనున్నారు. దాదాపు 17 రోజులపాటు ఏకబిగిన

మిగతా 13వ పేజీలో...

కాంగ్రెస్‌లో తేలని టికెట్ల పంచాయితీ

పెండింగ్‌లోనే ఖమ్మం, కరీంనగర్, హైదరాబాద్ సీట్లు

- ఖమ్మంలో రఘురామిరెడ్డి, రాయల నాగేశ్వర్‌రావు మధ్య పోటీ
- లోకల్ కమ్మకు ఇవ్వాలని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క పట్టు
- బెంగళూరులో ఖర్గేతో భేటీ అయిన భట్టి, మంత్రి పొంగులేటి
- నేడు లేదా రేపు అభ్యర్థిని ప్రకటించే అవకాశం
- ఖమ్మంతో కరీంనగర్ సీటుకు లింక్
- అధిష్ఠానం చెప్పకుండానే కరీంనగర్‌లో వెలిచాల నామినేషన్
- ఇంకా రేసులోనే ప్రవీణ్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో నామినేషన్ల దాఖలుకు తుదిగడువు ముంచుకొస్తున్నా.. కాంగ్రెస్‌లో టికెట్ల పంచాయితీ ఇంకా తెగలేదు! ఖమ్మం, కరీంనగర్, హైదరాబాద్ సీట్లలో అభ్యర్థుల ప్రకటనపై సస్పెన్స్ ఇంకా కొనసాగుతూనే ఉంది. ఖమ్మం సీటుపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఎవరి పట్టుమీద వారు ఉండడంతో ప్రకటన ఆలస్యం అవుతూ వస్తోంది. ఖమ్మం సీటుతో కరీంనగర్ సీటూ ముడిపడి ఉండడంతో అక్కడా నిర్ణయం ఆలస్యం అవుతోంది. ఖమ్మం సీటుకు భట్టివిక్రమార్క సతీమణి నందిని, పొంగులేటి సోదరుడు ప్రసాదరెడ్డి, మంత్రి తుమ్మల తనయుడు యుగంధర్, టీపీసీసీ మాజీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కుసుమ్‌కుమార్ తదితరుల పేర్లు తొలుత పరిశీలనకు వచ్చాయి. అయితే, మంత్రుల కుటుంబ సభ్యులకు టికెట్లు ఇవ్వకూడదన్న వాదన ముందుకు రావడంతో.. కమ్మ సామాజిక వర్గానికి సీటు కేటాయించాలని భట్టి



మిగతా 13వ పేజీలో...

ఎంతకూ తగ్గని ఎండలు!



నల్లగొండ పట్టణంలో నిర్మానుష్యంగా మారిన రహదారి

- నల్లగొండ జిల్లా టిక్యా తండాలో 45 డిగ్రీలు
- వానలు పడుతున్నా అధికంగానే ఉష్ణోగ్రతలు 3
- నేడు, రేపు తేలికపాటి వానలు
- నిజామాబాద్, నల్లగొండలో వర్షాలతో తడిసిన ధాన్యం

తెలంగాణలో అవినీతి సర్కార్

- పేదల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారు
- పదేళ్లు దోచుకున్న బీఆర్ఎస్ పనైపోయింది
- ఇండియా కూటమిలో పదవుల కోసం కుస్తీ
- రాహుల్ ఎన్నటికీ ప్రధాన మంత్రి కాలేరు
- కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ 12
- కొండా, బీబీ పాటిల్ నామినేషన్లకు హాజరు



రాజేంద్రనగర్‌లో నామినేషన్ వేస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి.. పక్కన గోయల్

'కొండా' ఆస్తులు రూ.4,490 కోట్లు 14

అప్పులు రూ.13.83 కోట్లు

సొంత వాహనం మాత్రం లేదు!

5,705 కోట్లు

గుంటూరు లోక్‌సభ టీడీపీ అభ్యర్థి పెమ్మసాని ఆస్తులివి.. 10

దేశంలోని ధనిక అభ్యర్థుల్లో ఒకరు

'క్యాండిడేట్స్ చెస్‌లో మన ఆటగాళ్లు టైటిల్ గెలిచే అవకాశం లేదు..మెరుగైన ప్రదర్శన కనబరిస్తే చాలు'.. ఈ టోర్నీకి ముందు భారత చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ అన్న మాటలివి. మనోళ్ల ప్రదర్శనను తక్కువ చేయడం ఆనంద్ ఉద్దేశం కాకపోవచ్చు.. కానీ, ఆ టోర్నీలో పోటీ ఏస్థాయిలో ఉంటుందో చెప్పేందుకు అతని మాటలే నిదర్శనం.

ఏమాత్రం అంచనాలు లేని ఓ భారత కుర్రాడు అసామాన్య ప్రదర్శన చేసి ఏకంగా విజేతగా నిలవడం అద్భుతం.. అదీ ఎవరికీ సాధ్యం కానిరీతిలో 17 ఏళ్ల వయసులోనే ఈ టైటిల్ నెగ్గి చదరంగ క్రీడలో సరికొత్త చరిత్ర లిఖించడం మహాద్భుతం.. అసాధారణమైన ఈ ఘనతతో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ పోరుకు కూడా అర్హత సాధించిన తెలుగు మూలాలున్న తమిళనాడు కుర్రాడు దొమ్మరాజు గుకేశ్ ఇప్పుడు చెస్‌లో సరికొత్త సంచలనం.

యంగ్ 'క్యాండిడేట్'.. మన గుకేశ్

కొత్త కుర్రాడు కొల్లగొట్టాడు



ప్రపంచ చెస్‌లో భారత టీనేజర్ గుకేశ్ సంచలనం

- 17 ఏళ్లకే క్యాండిడేట్స్ టైటిల్ నెగ్గిన ఆటగాడిగా చరిత్ర
- వరల్డ్ చాంపియన్‌షిప్‌కు అర్హత

టొరంటో: భారత యువ గ్రాండ్‌మాస్టర్ డి. గుకేశ్ అంతర్జాతీయ చెస్‌లో ప్రభంజనం సృష్టించాడు. తమిళనాడుకు చెందిన ఈ టీనేజర్ ప్రతిష్ఠాత్మక క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్‌లో చాంపియన్‌గా నిలిచి సంచలనం సృష్టించాడు. ఆదివారం ఇక్కడ జరిగిన ఆఖరిదైన 14వ రౌండ్లో అమెరికా గ్రాండ్‌మాస్టర్ హికారు నకమురాతో గేమ్‌ను డ్రా చేసుకున్న గుకేశ్.. మొత్తం 9 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి టైటిల్ దక్కించుకున్నాడు. దీంతో తన మెంటార్ విశ్వనాథన్ ఆనంద్ (2014లో) తర్వాత ఈ టోర్నీ విజేతగా నిలిచిన రెండో భారత ఆటగాడిగా గుకేశ్ రికార్డుకెక్కాడు. అంతేకాదు.. క్యాండిడేట్స్ చెస్ చరిత్రలో టైటిల్ నెగ్గిన పిన్న వయస్కుడు ఇతడే కావడం విశేషం. ఈ క్రమంలో రష్యా దిగ్గజం గ్యారీ కాస్పరోవ్ పేరిటనున్న 40 ఏళ్ల రికార్డును గుకేశ్ బద్దలు కొట్టాడు. కాస్పరోవ్ 22 ఏళ్ల వయసులో చాంపియన్‌గా నిలిచాడు. ఈ విజయంతో గుకేశ్.. చైనాకు చెందిన వరల్డ్ చాంపియన్ డింగ్ లిరెన్‌తో చాలెంజర్ హోదాలో ఈ ఏడాది ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ పోరులో తలపడతాడు. ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీల తేదీలు, వేదికలు ఖరారు కావాల్సి ఉంది. క్యాండిడేట్స్ విజేతగా నిలిచిన గుకేశ్‌కు రూ. 78.5 లక్షలు ప్రైజ్‌మనీగా దక్కింది.

ప్రత్యర్థికి అవకాశమే లేకుండా...: విజేతగా నిలవాలంటే కనీసం డ్రా చేసుకోవాల్సిన ఆఖరి రౌండ్లో నల్లపావులతో ఆడిన గుకేశ్ ఎక్కడా ప్రత్యర్థికి పైచేయి సాధించేందుకు అవకాశమివ్వలేదు. చివరకు 71వ ఎత్తు వద్ద ఇద్దరూ డ్రాకు అంగీకరించడంతో చెరో అరపాయింట్ లభించింది. దీంతో మొత్తం ఎనిమిది మంది పోటీపడ్డ ఈ టోర్నీలో గుకేశ్ అందరికంటే అత్యధిక పాయింట్లతో టైటిల్ విజేతగా అవతరించాడు. ఆఖరి రౌండ్లో నెపోమ్నియాచి (రష్యా), కరువానా (అమెరికా) మధ్య జరిగిన గేమ్ డ్రాగా ముగియగా.. ఫిరౌజా అలీరెజా (ఫ్రాన్స్)తో గేమ్‌ను భారత ఆటగాడు విదిత్ డ్రా చేసుకున్నాడు. మరో గేమ్‌లో అబసోవ్ (అజర్‌బైజాన్)ను ప్రజ్ఞానంద ఓడించాడు. అన్ని రౌండ్లు ముగిసిన అనంతరం నకమురా, నెపోమ్నియాచి, కరువానా తలా 8.5 పాయింట్లతో సంయుక్తంగా రెండోస్థానంలో నిలిచారు. ఏడు పాయింట్లతో ప్రజ్ఞానందకు ఐదో స్థానం, ఆరు పాయింట్లతో విదిత్‌కు ఆరో స్థానం దక్కాయి.

ఆ ఓటమితో.. ప్రేరణ

ఏడో రౌండ్‌లో అలీరెజా చేతిలో ఓటమి నాలో గెలవాలనే కసిని రగిల్చింది. టోర్నీ ఆరంభ రౌండ్లలో చక్కని ప్రదర్శన చేసినా.. ఏడో రౌండ్‌లో ఓడడంతో చాలా బాధపడ్డా. కానీ, పరాజయం నాలో ఉత్సాహాన్ని, ప్రేరణను రగిల్చింది. దీంతో సానుకూల ధోరణితో ఆలోచిస్తూ.. టైటిల్ కోసం పోరాడా.

\- గుకేశ్

హంపికి రెండో స్థానం



వైశాలికి నాలుగో స్థానం

చైనా స్టార్ జోంగ్యీ టాన్‌కు మహిళల టైటిల్

క్యాండిడేట్స్ మహిళల విభాగంలో చైనాకు చెందిన జోంగ్యీ టాన్ చాంపియన్‌గా నిలిచింది. ఆఖరిదైన 14వ రౌండ్లో అన్నా ముజిచెక్ (ఉక్రెయిన్)తో గేమ్‌ను డ్రా చేసుకున్న జోంగ్యీ ఓవరాల్‌గా 9 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. ఇక, తెలుగమ్మాయి కోనేరు హంపి, ఆర్. వైశాలి వరుసగా రెండు, నాలుగు స్థానాల్లో నిలిచారు. చివరిరౌండ్లో టింగ్జీ లీ (చైనా)పై హంపి, క్యాటరీనా లాగ్నో (ఉక్రెయిన్)పై వైశాలి గెలిచారు. అయితే ఆఖరి రౌండ్ ముగిసేసరికి హంపి, వైశాలి, టింగ్జీ తలా 7.5 పాయింట్లతో సమంగా నిలిచారు. దీంతో సుపీరియర్ టైబ్రేక్ విధానంతో హంపి రెండు, టింగ్జీ మూడు, వైశాలి నాలుగు స్థానాలకు పరిమితమయ్యారు.

గర్వంగా ఉంది

క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొని నీవు గెలిచిన తీరుతో ఎంతో గర్వపడుతున్నాం.

\- విశ్వనాథన్ ఆనంద్

చిచ్చరపిడుగు



తల్లిదండ్రులతో..

ఆటలో ఎప్పుడూ వయసుకంటే ఎక్కువ పరిణతిని కనబర్చే గుకేష్ దొమ్మరాజు.. క్యాండిడేట్స్ చెస్ టోర్నీ టైటిల్‌తో ఒక్కసారిగా వరల్డ్ ఫేమస్ అయ్యాడు. ఆర్థిక కష్టాలు వెంటాడినా వెనుకడుగు వేయకుండా.. క్రౌడ్ ఫండింగ్‌తో పోరాటం కొనసాగించాడు. 12 ఏళ్లకే గ్రాండ్ మాస్టర్ అయిన గుకేష్ .. 17 ఏళ్లకే వరల్డ్ చాంపియన్‌తో సవాల్‌కు సిద్ధమయ్యాడు. విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ఆ అరుదైన ఘనతను అందుకొన్న గుకేష్.. నిశ్శబ్దంగా ప్రపంచచెస్‌ను ఏలడానికి సిద్ధమయ్యాడు.

పిన్నవయసులోనే 64 గళ్లను అవపోసన పట్టేశాడు గుకేష్. సహచరులు ప్రజ్ఞానంద, అర్జున్ ఇరిగేసి, విదిత్ గుజరాతీ లాంటి యువ ఆటగాళ్లు ఎప్పుడూ వార్తల్లో ఉంటే.. ప్రచార ఆర్భాటం లేకుండా కూల్‌గా తనపని తాను చేసుకొంటూ వెళ్లిపోతుంటాడు.

12 ఏళ్లకే జీఎం..: చెన్నైలోని వేళమ్మాల్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో ఏడేళ్ల వయసులో చెస్ ఓనమాలు దిద్దుకొన్నాడు. 2015 ఆసియా స్కూల్ చెస్ చాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకొన్న గుకేష్ మరింత ఉత్సాహంతో టోర్నీల్లో పాల్గొనేవాడు. 2018లో ఆసియా యూత్ చెస్ చాంపియన్‌షిప్స్‌లో 5 పతకాలతో అందరి దృష్టినీ ఆకర్షించాడు. 11 ఏళ్లకే ఇంటర్నేషనల్ మాస్టర్ హోదా సాధించిన గుకేష్.. 2019లో 12 ఏళ్ల 7 నెలల 17 రోజుల వయసులో జీఎం టైటిల్‌ను సొంతం చేసుకొన్నాడు. 2022లో జరిగిన చెస్ ఒలింపియాడ్‌లో టీమ్‌కు కాంస్యం అందించిన గుకేష్.. వ్యక్తిగత విభాగంలో స్వర్ణం సాధించాడు. 2023లో జూనియర్ స్పీడ్ చెస్ చాంపియన్‌గా నిలిచాడు. గత జూలైలో 2750 రేటింగ్ సాధించిన గుకేష్.. చిన్నవయసులో ఈ అరుదైన ఘనతను సొంతం చేసుకొన్న వాడిగా రికార్డులకెక్కాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

కొడుకు కల కోసం..

గుకేష్ విజయాల వెనుక అతడి తల్లిదండ్రుల త్యాగం ఎంతో ఉంది. కొడుకు కోసం అతడి తండ్రి, ఈఎన్‌టీ డాక్టర్ రజనీకాంత్ తన కెరీర్‌నే పణంగా పెట్టారు. గుకేష్‌ను టోర్నీలు ఆడించడానికి అతడితో కలసి పర్యటించేవాడు. దీంతో మైక్రోబయాలజిస్ట్ అయిన తల్లి పద్మ ఇంటి బాధ్యతలు చూసుకొనేది. నాలుగో తరగతి తర్వాత స్కూల్‌కు వెళ్లడం ఆపేసిన గుకేష్.. పూర్తిగా చెస్ సాధనపైనే దృష్టి సారించాడు. తన కొడుకు కల నెరవేర్చడానికి విరాళాలు కూడా సేకరించేవారు. అరకొర డబ్బుతోనే ఎన్నోసార్లు గుకేష్‌ను విదేశీ టోర్నీలకు తీసుకెళ్లారు.

శతక 'జై'స్వాల్



జైస్వాల్ (60 బంతుల్లో 104 నాటౌట్)

- సందీప్‌నకు ఐదు వికెట్లు
- రాజస్థాన్ ఘనవిజయం
- ముంబైకి నిరాశ

జైపూర్: ఫామ్ కోల్పోయి ఇబ్బందిపడుతున్న యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (60 బంతుల్లో 9 ఫోర్లు, 7 సిక్సర్లతో 104 నాటౌట్) ఎట్టకేలకు బ్యాట్ ఝుళిపిస్తూ అజేయ శతకం సాధించాడు. అటు బౌలింగ్‌లో పేసర్ సందీప్ శర్మ (5/18) అద్భుత గణాంకాలు నమోదు చేయడంతో.. ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ 'టాప్'షో కొనసాగుతూనే ఉంది. సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌పై రాజస్థాన్ 9 వికెట్లతో ఘనవిజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై 20 ఓవర్లలో 9 వికెట్లకు 179 పరుగులు చేసింది. తిలక్ వర్మ (65), నేహాల్ వధేరా (49) మాత్రమే రాణించారు. బౌల్ట్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో రాజస్థాన్ 18.4 ఓవర్లలో వికెట్ నష్టానికి 183 పరుగులు చేసి గెలిచింది. శాంసన్ (38 నాటౌట్), బట్లర్ (35) ఆకట్టుకున్నారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా సందీప్ శర్మ నిలిచాడు.

అవలీలగా..: స్వేచ్ఛగా బ్యాట్ ఝుళిపించిన ఓపెనర్ యశస్వీ జైస్వాల్ లీగ్‌లో తన రెండో శతకంతో మెరిశాడు. తొలి ఓవర్‌లో బట్లర్ రెండు ఫోర్లతో జోరు చూపగా.. నాలుగో ఓవర్‌లో జైస్వాల్ 6,4,4తో 16 రన్స్ అందించాడు. ఇక పవర్‌ప్లేలో జట్టు 61 పరుగులు సాధించింది. ఆ తర్వాత వర్షంతో ఆట 40 నిమిషాలపాటు ఆగింది. ఎనిమిదో ఓవర్‌లో బట్లర్ అవుటయ్యాడు. జైస్వాల్‌కు కెప్టెన్ శాంసన్ జత కలవడంతో ముంబై బౌలర్లు చేసేదేమీ లేకపోయింది. 31 బంతుల్లోనే జైస్వాల్ అర్ధసెంచరీ పూర్తి చేశాడు. తర్వాత 19వ ఓవర్‌లో తొలి బంతికి సెంచరీ పూర్తి చేయగా.. నాలుగో బంతికి ఫోర్‌తో మ్యాచ్‌ను సైతం ముగించాడు.

1

ఐపీఎల్ చరిత్రలో 200 వికెట్లు తీసిన ఏకైక బౌలర్‌గా చాహల్



సందీప్ శర్మ (5/18)

ఆదుకున్న తిలక్-వధేరా: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ముంబై ఇన్నింగ్స్‌లో తిలక్ వర్మ, నేహాల్ వధేరా బ్యాటింగే కీలకంగా నిలిచింది. పేసర్లు బౌల్ట్, సందీప్ శర్మల ధాటికి తొలి నాలుగు ఓవర్లలోనే ఓపెనర్లు రోహిత్ (6), ఇషాన్ (0), సూర్యకుమార్ (10) పెవిలియన్‌కు చేరారు. ఆరో ఓవర్‌లో నబీ (23) 6,4,4తో 18 రన్స్ సాధించగా పవర్‌ప్లేను 45/3తో ముగించింది. అయితే నబీని 8వ ఓవర్‌లో చాహల్ అవుట్ చేయడంతో 52/4తో ముంబై కష్టాలు మరింత పెరిగాయి. ఈ దశలో తిలక్-వధేరా ఇన్నింగ్స్ బాధ్యత తీసుకున్నారు. 16వ ఓవర్‌లో సిక్సర్‌తో తిలక్ ఫిఫ్టీ పూర్తి చేయగా వధేరా మరో రెండు సిక్సర్లు బాది 20 రన్స్ రాబట్టాడు. కానీ ప్రమాదకరంగా మారిన ఈ జోడీని బౌల్ట్ విడదీస్తూ వధేరాను అవుట్ చేశాడు. దీంతో ఐదో వికెట్‌కు 99 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక 19వ ఓవర్‌లో హార్దిక్ (10)ను అవేశ్ అవుట్ చేయగా.. ఆఖరి ఓవర్‌లో సందీప్ మూడు పరుగులే ఇచ్చి తిలక్, కొట్జీ (0), డేవిడ్ (3)ల వికెట్లు తీయడంతో ముంబై స్కోరు 180లోపే ముగిసింది.

సంక్షిప్త స్కోర్లు

ముంబై: 20 ఓవర్లలో 179/9 (తిలక్ వర్మ 65, నేహాల్ వధేరా 49, సందీప్ శర్మ 5/18, బౌల్ట్ 2/32);
రాజస్థాన్: 18.4 ఓవర్లలో 183/1 (యశస్వీ జైస్వాల్ 104 నాటౌట్, సంజూ శాంసన్ 38 నాటౌట్, బట్లర్ 35).

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	8	7	1	0	14	0.698
కోల్‌కతా	7	5	2	0	10	1.206
హైదరాబాద్	7	5	2	0	10	0.914
చెన్నై	7	4	3	0	8	0.529
లఖ్‌నవూ	7	4	3	0	8	0.123
గుజరాత్	8	4	4	0	8	-1.055
ముంబై	8	3	5	0	6	-0.227
ఢిల్లీ	8	3	5	0	6	-0.477
పంజాబ్	8	2	6	0	4	-0.292
బెంగళూరు	8	1	7	0	2	-1.046

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

కోహ్లీపై 50 శాతం జరిమానా

కోల్‌కతా: బెంగళూరు స్టార్ విరాట్ కోహ్లీ మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత విధించారు. కోల్‌కతాతో జరిగిన మ్యాచ్‌లో తన అవుట్ నిర్ణయంపై కోహ్లీ అంపైర్లతో వాగ్వాదానికి దిగి కోడ్ ఆఫ్ కండక్ట్‌ను అతిక్రమించాడు. మరోవైపు ఇదే మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా ఆర్‌సీబీ కెప్టెన్ డుప్లెసిపై రూ.12 లక్షల జరిమానా విధించారు. గుజరాత్‌తో మ్యాచ్‌లో పంజాబ్ కెప్టెన్ కర్రాన్ అంపైర్ నిర్ణయంపై అసహనం వ్యక్తం చేయడంతో అతడి మ్యాచ్ ఫీజులోనూ 50 శాతం కోత విధించారు.

నేటి మ్యాచ్	రాత్రి 7.30 గం.
చెన్నై X లఖ్‌నవూ	

బిజినెస్

ధ్రువ స్పేస్ రూ.78 కోట్ల సమీకరణ

హైదరాబాద్: అంతరిక్ష రంగానికి చెందిన హైదరాబాద్ స్టార్టప్ 'ధ్రువ స్పేస్' తాజాగా 94 లక్షల డాలర్లు (రూ.78 కోట్లు) సమీకరించింది. ఈక్విటీతో పాటు డెట్ ఇన్‌స్ట్రుమెంట్స్ జారీ ద్వారా ఐఎఎస్ ఆల్ఫా ఫండ్ సహా ఇతర ఇన్వెస్టర్ల నుంచి ఈ నిధులను సేకరించింది. దీంతో కలిపి సిరీస్ ఏ ఫండింగ్‌లో భాగంగా ఈ స్టార్టప్ సమీకరించిన నిధుల మొత్తం 1.4 కోట్ల డాలర్ల (రూ.123 కోట్లు)కు చేరుకుంది. హైదరాబాద్‌లో 2.8 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్న స్పేస్‌క్రాఫ్ట్ తయారీ యూనిట్ తొలి దశను పూర్తి చేసేందుకు తాజాగా లభించిన నిధులను వినియోగించుకోనున్నట్లు ధ్రువ స్పేస్ సహ వ్యవస్థాపకులు, సీఈఓ సంజయ్ నెక్కంటి తెలిపారు. ఈ కంపెనీ గడిచిన రెండేళ్లలో నాలుగు స్పేస్ మిషన్స్‌ను పూర్తి చేసింది. మౌలిక వసతుల అభివృద్ధి అవసరాలతో పాటు కస్టమర్ల తరపున చేపడుతున్న కొన్ని కార్యక్రమాల కోసం వచ్చే 12-18 నెలల్లో మరో 3 కోట్ల డాలర్ల (సుమారు రూ.250 కోట్లు) నిధులు సమీకరించాలని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ మార్చి 31తో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ రూ.15 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసుకుంది.

వచ్చే 3-5 ఏళ్లలో కంపెనీ ఆదాయం రూ.1,500-2,000 కోట్ల స్థాయికి చేరుకోవచ్చని నెక్కంటి అన్నారు. సంజయ్ నెక్కంటి, చైతన్య సూరపు రెడ్డి, అభయ్ ఎగూర్, కృష్ణ తేజ పెనమకూరు కలిసి 2012లో ధ్రువ స్పేస్‌ను హైదరాబాద్ కేంద్రంగా ప్రారంభించారు.

విమానయానం ఒక్క రోజు రికార్డు

న్యూఢిల్లీ: దేశీయ విమానయాన రంగం ఆదివారం ఒక కొత్త రికార్డును నమోదు చేసింది. ఒక్క రోజులోనే 4,71,751 మంది ప్రయాణికులు విమానయానం చేశారు. ఒక రోజులో ప్రయాణికుల అత్యధిక రికార్డు ఇది. ఆదివారం మొత్తం 6,128 విమానాల్లో 4,71,751 మంది దేశీయంగా వివిధ గమ్యాలకు ప్రయాణించినట్లు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ తెలిపింది. కొవిడ్ ముందు నమోదైన ఒక రోజు ప్రయాణికుల సగటు సంఖ్య 3,98,579 కన్నా ఇది 14 శాతం అధికం. అలాగే గత ఏడాది ఏప్రిల్ 21వ తేదీన నమోదైన 5,899 విమానాల్లో 4,28,389 ప్రయాణికుల కన్నా కూడా అధికం. దేశీయంగా విమానాల్లో ప్రయాణించే వారి సంఖ్య క్రమంగా పెరుగుతున్నదని, మరింత అధిక శాతం ప్రజలకు విమానయానం అందుబాటులో ఉన్నందు వల్ల ఈ రంగానికి మరింత వృద్ధి అవకాశాలున్నాయని విమానయాన శాఖ పేర్కొంది. ఈ ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంలో విమాన ప్రయాణికుల సంఖ్య గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే 375.04 లక్షల నుంచి 391.46 లక్షలకు పెరిగినట్లు డీజీసీఏ గత వారం ప్రకటించింది.

టయోటా ఫార్చ్యూనర్ లీడర్ ఎడిషన్



టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం).. దేశీయ మార్కెట్లోకి లీడర్ ఎడిషన్ పేరుతో సరికొత్త ఫార్చ్యూనర్‌ను తీసుకువచ్చింది. ప్రస్తుత కస్టమర్ అవసరాలకు తగ్గట్టుగా ఫార్చ్యూనర్ లీడర్ ఎడిషన్‌ను రూపొందించినట్లు పేర్కొంది. రెండు వేరియంట్లలో అందుబాటులో ఉండనున్న లీడర్ ఎడిషన్ ధరలు వరుసగా రూ.35.93 లక్షలు, రూ.38.21 లక్షలు (ఎక్స్‌షోరూమ్)గా ఉన్నాయి. 2.8 లీటర్ డీజిల్ ఇంజన్, 6 స్పీడ్ ఆటోమేటిక్, 6 స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్‌తో ఈ ఎస్‌యూవీ అందుబాటులో ఉండనుంది. టైర్ ప్రెజర్ మానిటరింగ్ సిస్టమ్ (టీపీఎంఎస్) దీని ప్రత్యేకత అని తెలిపింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,690 ▼	67,550 ▼	89,000 ▼
ముంబై	72,875 ▼	66,754 ▼	81,554 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



23వ తేదీ			
హైదరాబాద్	360	విజయవాడ	380
వరంగల్	362	గోదావరి	380
చిత్తూరు	473	విశాఖపట్నం	400
		డజను గుడ్లు రూ.60	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	118	గోదావరి	121
వరంగల్	118	విజయవాడ	121
కరీంనగర్	118	గుంటూరు	125
మహబూబ్‌నగర్	118	ఒంగోలు	125
కర్నూలు	118	చిత్తూరు	107
విశాఖపట్నం	113		

రిలయన్స్ @ రూ.10 లక్షల కోట్లు

వార్షిక టర్నోవర్‌లో సరికొత్త రికార్డు .. ఈ ఘనత సాధించిన తొలి భారత కంపెనీ

- రూ.లక్ష కోట్లు దాటిన వార్షిక స్థూల లాభం
- మార్చి త్రైమాసిక లాభం రూ.18,951 కోట్లు
- రూ.2.4 లక్షల కోట్లకు పెరిగిన ఆదాయం
- ఒక్కో షేరుకు రూ.10 డివిడెండ్ ప్రకటన

ముంబై: మార్కెట్ విలువపరంగా దేశంలో అతిపెద్ద కార్పొరేట్ కంపెనీ రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) త్రైమాసిక ఆర్థిక ఫలితాలు మోస్తరుగానే నమోదైనప్పటికీ వార్షిక గణాంకాలు మాత్రం అద్భుతం అన్పించాయి. గత ఆర్థిక సంవత్సరం (2023-24) మొత్తానికి గాను రిలయన్స్ నికర లాభం రూ.69,621 కోట్లకు పెరిగింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.66,702 కోట్లుగా నమోదైంది. కాగా, 2023-24 టర్నోవర్ (స్థూల ఆదాయం) వార్షిక ప్రాతిపదికన 2.6 శాతం వృద్ధితో రూ.10 లక్షల కోట్లకు చేరుకుంది. దేశంలో రూ.10 లక్షల కోట్ల వార్షిక టర్నోవర్‌ను నమోదు చేసిన తొలి కార్పొరేట్ కంపెనీ రియలన్సే కావడం గమనార్హం. అంతేకాదు, వార్షిక స్థూల లాభం (పీబీటీ) కూడా తొలిసారిగా రూ.లక్ష కోట్ల స్థాయిని దాటింది. అలాగే, కంపెనీకి చెందిన డిజిటల్ సేవల విభాగమైన జియో ప్లాట్‌ఫామ్ వార్షిక లాభం సైతం తొలిసారిగా రూ.20,000 కోట్ల మైలురాయిని దాటింది. రిలయన్స్ రిటైల్ లాభం కూడా రూ.10,000 కోట్ల మార్క్‌ను అధిగమించింది.



విభాగాల వారీగా పనితీరు

జియో ప్లాట్‌ఫామ్

రిలయన్స్ జియో సహా కంపెనీ డిజిటల్ సేవలన్నింటినీ కలిపి ఏర్పాటు చేసిన విభాగమైన జియో ప్లాట్‌ఫామ్ క్యూ4 లాభం వార్షిక ప్రాతిపదికన 12 శాతం వృద్ధితో రూ.5,583 కోట్లకు చేరుకుంది. నికర ఆదాయం 13.4 శాతం పెరిగి రూ.28,871 కోట్లుగా నమోదైంది. కాగా, వార్షిక నికర లాభం రూ.21,423 కోట్లకు, నికర రాబడి రూ.1,09,558 కోట్లకు పెరిగింది. గత ఆర్థిక సంవత్సరంలో రిలయన్స్ జియో కస్టమర్లు మరో 4.24 కోట్లు పెరిగి మొత్తం 48.18 కోట్లకు చేరుకున్నారు. క్యూ4లో కంపెనీకి ఒక్కో వినియోగదారు నుంచి లభించిన సగటు ఆదాయం (ఆర్పు) రూ.181.7గా నమోదైంది.

రిలయన్స్ రిటైల్

రిలయన్స్ చిల్లర వర్తక వ్యాపారాల విభాగమైన రిలయన్స్ రిటైల్ వెంచర్స్ లిమిటెడ్ (ఆర్ఆర్‌వీఎల్) క్యూ4 లాభం 11.7 శాతం పెరిగి రూ.2,698 కోట్లుగా, నికర రాబడి 9.8 శాతం వృద్ధితో రూ.67,610 కోట్లకు చేరుకుంది. వార్షిక లాభం రూ.11,101 కోట్లుగా, నికర ఆదాయం రూ.2.73 లక్షల కోట్లుగా నమోదైంది. గడిచిన మూడు నెలల్లో తమకు చెందిన అన్ని ఫార్మాట్ల రిటైల్ స్టోర్లను మొత్తం 27.2 కోట్ల మంది సందర్శించారు. 31.1 కోట్ల లావాదేవీలు జరిగాయని ఆర్ఆర్‌వీఎల్ తెలిపింది. క్యూ4లో కొత్తగా తెరిచిన 562 విక్రయ కేంద్రాలతో కలిపి మొత్తం స్టోర్ల సంఖ్య 18,836కు చేరుకుంది.

ఓ2సీ

రిలయన్స్ ఆయిల్ టు కెమికల్స్ (ఓ2సీ) విభాగ ఆదాయం క్యూ4లో 10.9 శాతం వృద్ధితో రూ.1,42,634 కోట్లకు పెరగగా.. నిర్వహణ లాభం (ఎబిటా) 3 శాతం పెరిగి రూ.16,777 కోట్లుగా నమోదైంది. కాగా, వార్షికాదాయం రూ.5.64 లక్షల కోట్లు దాటగా.. నిర్వహణ లాభం రూ.62,393 కోట్లకు చేరుకుంది.

ఆయిల్ అండ్ గ్యాస్

కంపెనీకి చెందిన ముడి చమురు, సహజ వాయువు ఉత్పత్తి విభాగ ఆదాయం (ఆయిల్ అండ్ గ్యాస్) క్యూ4లో 42 శాతం ఎగబాకి రూ.6,468 కోట్లకు, నిర్వహణ లాభం 47.5 శాతం వృద్ధితో రూ.5,606 కోట్లకు చేరుకుంది. వార్షికాదాయం రూ.24,439 కోట్లుగా, నిర్వహణ లాభం రూ.20,191 కోట్లుగా నమోదైంది. ఏపీలోని కృష్ణా గోదావరి బేసిన్‌లోని కేజీ డీ6 బ్లాక్ నుంచి ప్రస్తుతం రోజుకు 30 మిలియన్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల గ్యాస్‌ను, 23,000 బ్యారెళ్ల ఆయిల్‌ను ఉత్పత్తి చేస్తున్నట్లు కంపెనీ తెలిపింది.

మరిన్ని ముఖ్యాంశాలు..

- మార్చి 31తో ముగిసిన నాలుగో త్రైమాసికానికి (క్యూ4) రిలయన్స్ ఏకీకృత నికర లాభం రూ.18,951 కోట్లకు (ఒక్కో షేరుకు రూ.28.01) పరిమితమైంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం (2022-23)లో ఇదే కాలానికి ఆర్జించిన రూ.19,299 కోట్ల (ఒక్కో షేరుకు రూ.28..52) లాభంతో పోలిస్తే 2 శాతం తగ్గింది.
- క్యూ4లో కంపెనీకి వ్యాపార కార్యకలాపాల ద్వారా సమకూరిన నికర ఆదాయం వార్షిక ప్రాతిపదికన 11 శాతం వృద్ధితో రూ.2.4 లక్షల కోట్లకు పెరిగింది. 2022-23లో ఇదే త్రైమాసికానికి ఆదాయం రూ.2.16 లక్షల కోట్లుగా నమోదైంది. కంపెనీకి చెందిన ఆయిల్ టు కెమికల్స్ (ఓ2సీ), కన్స్యూమర్ (టెలికాం, రిటైల్) వ్యాపారాలు రెండంకెల వృద్ధిని నమోదు చేసుకోవడం ఆదాయం మెరుగుదలకు దోహదపడింది.
- గడిచిన మూడు నెలల్లో రిలయన్స్ నిర్వహణ లాభం (ఎబిటా) 14 శాతం వృద్ధి చెంది రూ.47,150 కోట్లకు చేరుకోగా.. నిర్వహణ లాభాల మార్జిన్ వార్షిక ప్రాతిపదికన 0.50 శాతం పెరిగి 17.8 శాతానికి ఎగబాకింది.
- డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)తో పోలిస్తే మాత్రం క్యూ4 లాభంలో 10 శాతం, ఆదాయంలో 6 శాతం వృద్ధి నమోదైంది.
- గత ఆర్థిక సంవత్సరానికి గాను వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.10 డివిడెండ్‌ను చెల్లించేందుకు రిలయన్స్ బోర్డు ఆమోదం తెలిపింది. ఇప్పటికే చెల్లించిన రూ.9 డివిడెండ్‌తో కలిపి 2023-24కు గాను కంపెనీ చెల్లించబోయే మొత్తం డివిడెండ్ రూ.19కి చేరుకోనుంది.
- మార్చి 31 నాటికి కంపెనీ స్థూల రుణభారం రూ.3.24 లక్షల కోట్లకు పెరిగింది. కాగా, సంస్థ వద్దనున్న నగదు నిల్వలను కూడా పరిగణనలోకి తీసుకుంటే నికర రుణ భారం రూ.1.16 లక్షల కోట్లుగా నమోదైంది.
- కంపెనీకి చెందిన పలు వ్యాపారాలు చేపట్టిన కార్యక్రమాలు భారత ఆర్థిక వ్యవస్థలో ఆయా రంగాల త్వరితగతి వృద్ధికి గణనీయమైన తోడ్పాటును అందించాయని రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్, ఎండీ ముకేశ్ అంబానీ అన్నారు. గత ఆర్థిక సంవత్సరానికి కంపెనీ స్థూల లాభం (పన్నులు చెల్లించక ముందు లాభం) రూ.లక్ష కోట్లు దాటిందని, భారత కార్పొరేట్ రంగంలో ఈ మైలురాయిని చేరిన తొలి కంపెనీ తమదేనని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు.

దేశీయంగా తయారైన సౌండ్‌బాక్స్ ఆవిష్కరించిన పేటీఎం

న్యూఢిల్లీ: యూపీఐ లావాదేవీలు, యూపీఐ మాధ్యమంలో క్రెడిట్ కార్డు చెల్లింపుల కోసం పేటీఎం దేశీయంగా తయారైన సౌండ్‌బాక్స్‌ను ఆవిష్కరించింది. ఆధునిక సౌండ్‌బాక్స్‌లు మంచి ధ్వని నాణ్యత, మెరుగైన బ్యాటరీ లైఫ్ కలిగి భారతదేశంలోని పరిస్థితులకు మెరుగ్గా సరిపోయేలా ఉంటాయని పేటీఎం వ్యవస్థాపకుడు, సీఈఓ విజయ్ శేఖర్ శర్మ అన్నారు. దేశంలోని వాతావరణంలో ధ్వనులు అధికంగా ఉంటాయి గనుక మెరుగైన సామర్థ్యం గల హైబ్రిడ్ సౌండ్‌బాక్స్‌ల ఆవశ్యకత పెరిగిందని శర్మ చెప్పారు.

కొనసాగిన రికవరీ

సెన్సెక్స్ 560 పాయింట్లు అప్

ముంబై: ఆసియా, యూరోపియన్ మార్కెట్లలో ర్యాలీతో పాటు విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్ల మద్దతుతో ఈక్విటీ మార్కెట్లో రెండో రోజు కూడా రికవరీ కొనసాగింది. తగ్గిన బ్రెంట్ క్రూడ్ ధరలు ఈ రికవరీకి మరింత మద్దతు ఇచ్చాయి. దీంతో సోమవారం సెన్సెక్స్ 560.29 పాయింట్ల లాభంతో 73,,648.62 వద్ద, నిఫ్టీ 189.40 పాయింట్ల లాభంతో 22,336.40 వద్ద ముగిశాయి. సెన్సెక్స్ షేర్లలో ఎన్‌టీపీసీ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మినహా ప్రధాన కంపెనీల షేర్లు లాభపడ్డాయి. అలాగే బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 1.26 శాతం, మిడ్‌క్యాప్ సూచీ 0.93 శాతం లాభపడ్డాయి. రంగాల వారీ సూచీల్లో యుటిలిటీస్ మినహా అన్ని సూచీలు లాభాల్లో ముగిశాయి. మరోవైపు బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 0.80 శాతం తగ్గి 86.59 డాలర్ల వద్ద స్థిరపడింది. ఎఫ్ఐఐలు గత శుక్రవారం రూ.129.39 కోట్ల విలువ గల ఈక్విటీలు కొనుగోలు చేశారు.

కీలక భేటీకి తెలంగాణ దూరం!

- కృష్ణా బోర్డు సమావేశానికి గైర్హాజరు
- వర్చువల్‌గా పాల్గొన్న ఏపీ ఈఎన్‌సీ

హైదరాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నిధుల కోసం చర్చించడానికి కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి తెలంగాణ అధికారులు హాజరవలేదు. ఈభేటీ హైబ్రిడ్ విధానం (నేరుగా/ఆన్‌లైన్)లో జరిగింది. బోర్డులో అడ్మినిస్ట్రేటివ్ సభ్యులుగా తెలంగాణ నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఏపీ జలవనరుల శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్, సాంకేతిక సభ్యులుగా తెలంగాణ ఈఎన్‌సీ అనిల్‌కుమార్, ఏపీ ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి ఉన్నారు. అయితే ఒక్క నారాయణరెడ్డి మాత్రమే వర్చువల్ విధానంలో ఏపీ నుంచి హాజరవగా.. తెలంగాణ నుంచి ఇద్దరు అధికారులు గైర్హాజరయ్యారు. తెలంగాణ అధికారుల కోసం బోర్డు కూడా మధ్యాహ్నం 3 గంటల దాకా వేచిచూసింది. అయితే కోర్టు కేసులో హాజరుకావాల్సి ఉండడంతో అడ్మినిస్ట్రేటివ్ సభ్యులు దూరంగా ఉన్నారని సమాచారం అందింది. ఇక సాగర్ ప్రధాన జలవిద్యుత్కేంద్రం అవసరాల కోసమే కట్టిన టెయిల్‌పాండ్‌లోని నీటిని ఏపీ జెన్‌కో అధికారులు కృష్ణా బోర్డు అనుమతి లేకుండా కిందకి వదలడంతో జలవిద్యుత్కేంద్రంపై తీవ్ర ప్రభావం పడింది. టెయిల్‌పాండ్‌లో 6.737 టీఎంసీల నీటి నిల్వ ఉండగా.. ఈ నెల 13 నుంచి నీటిని క్రమంగా వదిలిపెట్టేశారు. గ్రిడ్‌ను సమతుల్యం చేయడానికి వీలుగా రాత్రిపూట డిమాండ్ కన్నా అధికంగా ఉన్న విద్యుత్తును వినియోగించి.. టెయిల్‌పాండ్‌లోని నీటిని సాగర్‌లో ఎత్తిపోసేవారు. మళ్లీ డిమాండ్ ఉన్న సమయంలో ఆ నీటితో విద్యుత్తును ఉత్పత్తి చేసి, టెయిల్ పాండ్‌లోకి వదిలేస్తారు. ఇలా శ్రీశైలం, సాగర్ జలాశయాల కింది భాగంలో టెయిల్‌పాండ్‌లు కట్టుకున్నారు. ఇందులోని నీటిని రివర్సిబుల్ పంపింగ్ కోసం వినియోగిస్తారు. అయితే ఏపీ జెన్‌కో తీరుపై తెలంగాణ ఇప్పటికే బోర్డుకు ఫిర్యాదు చేసింది. ఈ తరుణంలో సమావేశానికి హాజరవకపోవడం పట్ల విమర్శలు వస్తున్నాయి. మరోవైపు జలసౌధలోనే అందుబాటులో ఉన్న ఈఎన్‌సీ (ఓఅండ్ఎం) బి.నాగేంద్రరావు రెండు దఫాలుగా బోర్డు వద్దకు వచ్చినా సభ్యత్వం లేకపోవడంతో సమావేశానికి దూరంగా ఉండిపోయారు. ఇక ఏపీ మాత్రం బోర్డు సమావేశంలో తన వాదనను వినిపించింది.

తెలంగాణ ఇస్తే చూస్తాం: ఏపీ

పదేళ్ల కాలంలో రూ.138 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం తెలపగా.. ఈ లెక్కన ఒక్కో రాష్ట్రం రూ.69 కోట్ల చొప్పున విడుదల చేయాల్సి ఉందని ఏపీ తెలిపింది. తాము ఇప్పటిదాకా రూ.28.26 కోట్లను విడుదల చేయగా తెలంగాణ రూ.19.71 కోట్లే ఇచ్చిందని పేర్కొంది. ఇక ముందు నిధులు ఇవ్వబోమని, తెలంగాణ ఇస్తే పరిశీలిస్తామని ఏపీ ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి బోర్డుకు స్పష్టం చేశారు. దాంతో రెండో దశ టెలిమెట్రీకి నిధుల్లేవని, మే నెల వేతనాలకు బోర్డు వద్ద నిధుల్లేవని కృష్ణాబోర్డు ఛైర్మన్ శివ్‌నందన్‌కుమార్ చెప్పినా.. ఏపీ మెత్తపడలేదు.

కవితే కీలకం.. బెయిలివ్వొద్దు

రౌస్ అవెన్యూ కోర్టులో సీబీఐ వాదనలు

- నేరానికి సంబంధించిన ఆధారాల్లేవు
- బెయిల్ ఇవ్వండి: కవిత తరఫు న్యాయవాది
- సీబీఐ కేసులో మే 2కు తీర్పు రిజర్వ్
- ఈడీ కేసులో వాదనలు నేటికి వాయిదా
- కవిత ఆధారాలను ధ్వంసం చేశారు: ఈడీ
- ఆమెను టెర్రరిస్టుగా చూస్తున్నారు: సింఘ్వీ
- నేటితో ముగియనున్న కస్టడీ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కల్వకుంట్ల కవితది కీలక పాత్ర అని రౌస్ అవెన్యూ కోర్టులో సీబీఐ బలమైన వాదనలను వినిపించింది. సీబీఐ తరఫు న్యాయవాది వాదనలను వినిపిస్తూ.. కవితకు బెయిల్ ఇస్తే.. ఆమె విడుదలయ్యాక సాక్షులను ప్రభావితం చేస్తారని వివరించారు. ఆమెకు బెయిల్ ఇవ్వొద్దని కోరారు. తనపై ఈడీ, సీబీఐ నమోదు చేసిన కేసుల్లో బెయిల్ మంజూరు చేయాలంటూ రౌస్ అవెన్యూ కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే..! ఈ పిటిషన్లపై ప్రత్యేక న్యాయమూర్తి కావేరి భవేజా సోమవారం వేర్వేరుగా విచారణ చేపట్టారు. ఉదయం సీబీఐ కేసుకు సంబంధించిన బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిగింది. సీబీఐ తరఫున పంకజ్‌గుప్తా, కవిత తరఫున విక్రమ్ చౌదరి వాదనలను వినిపించారు. "ఈ కేసులో ఇప్పటి వరకు ఎటువంటి ఆధారాలు లేవు. కేవలం కొందరి వాంగ్మూలాల ఆధారంగానే కేసు నడుస్తోంది. ఆధారాల్లేకుండానే కవితను అరెస్టు చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కస్టడీలో ఉండగానే, అవసరమేమీ లేకపోయినా సీబీఐ ఎలా అరెస్టు చేస్తుంది? దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి. కవిత బీఆర్ఎస్ పార్టీకి స్టార్ కాంపెయినర్‌గా ఉన్నారు. చిదంబరం కేసులో తీర్పు కవిత విషయంలోనూ వర్తిస్తుంది. ఏడేళ్లలోపు శిక్ష పడే కేసులకు అరెస్టు అవసరం లేదు. పీఎంఎల్ఏ సెక్షన్ 45 ప్రకారం కవిత మహిళగా బెయిల్‌కు అర్హురాలు. సరైనా ఆధారాల్లేని ఈ కేసులో కవితకు బెయిల్ మంజూరు చేయండి" అని విక్రమ్ చౌదరి కోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఇరుపక్షాల వాదనలను నమోదు చేసుకున్న కోర్టు.. తీర్పును మే 2వ తేదీకి రిజర్వ్ చేశారు.

ఈడీ కేసులో..

మనీలాండరింగ్ కేసులో బెయిల్ పిటిషన్‌కు సంబంధించి మధ్యాహ్నం విచారణ జరిగింది. ఈడీ తరఫున న్యాయవాది జోహెబ్ హుస్సేన్, కవిత తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలను వినిపించారు. ఢిల్లీ మద్యం కేసుతో కవితకు ఎటువంటి సంబంధం లేదని, కేవలం రాజకీయ దురుద్దేశంతోనే కవితను కేసులో ఇరికించాలని చూస్తున్నారని సింఘ్వీ వాదించారు. "ఈ కేసులో తొలుత అనుమానితురాలిగా కూడా లేని కవితను, ఉద్దేశ పూర్వకంగా నిందితురాలిగా చేర్చారు. దాదాపు 5, 6 గంటలు విచారణకు హాజరైనా.. ఆమెను ఒక టెర్రరిస్టు, కరుడుగట్టిన నేరస్థులను ట్రీట్ చేసినట్టు దర్యాప్తు సంస్థలు వ్యవహరిస్తున్నాయి. విజయ్ నాయర్ సోషల్ మీడియా కో-ఆర్డినేట్ చేస్తారనే.. ఆయనతో కవిత భేటీ అయ్యారు. మద్యం కేసులో కవితను ఇరికించిన తీరు అనేక సందేహాలకు తావిస్తోంది. ఈ కేసులో బుచ్చి బాబు నాలుగు స్టేట్‌మెంట్లు ఇచ్చారు. వెంటనే ఆయనకు బెయిల్ వచ్చింది. అదే తరహాలో స్టేట్‌మెంట్ ఇచ్చిన మరో వ్యక్తి మాగుంట రాఘవకు కూడా బెయిల్ దొరికింది. ఆ తర్వాత మాగుంట రాఘవ తండ్రి శ్రీనివాసులుకు ఎన్డీయే అభ్యర్థిగా అవకాశం కల్పించారు. శరత్‌రెడ్డి అప్రూవర్‌గా మారిన తర్వాత బెయిల్ ఇచ్చారు. ఆయన బీజేపీకి పెద్ద ఎత్తున ఎలక్టోరల్ బాండ్లు ఇచ్చారని ఎస్బీఐ నివేదికతో బహిర్గతమైంది. వీళ్ల స్టేట్‌మెంట్ ఆధారంగా కవితను ఈ కేసులో ఇరికించారు. అయినా.. కవిత విచారణకు అన్నివిధా లా సహరిస్తున్నా.. అరెస్టు చేయాల్సిన అవసరం ఏముంది?" సంఘ్వీ కోర్టుకు వివరించారు. ఈడీ ఆరోపిస్తున్నట్లు కవిత ఎలాంటి ఆధారాలను ధ్వంసం చేయలేదని పేర్కొన్నారు. "ఆమె వాడిన ఫోన్లను తన సిబ్బం దికి ఇచ్చారు. అలాంటి ఫోన్లను వాడేవా రెవరైనా ఫార్మట్ చేస్తారు. ఈడీ అడిగిన వెంటనే.. తన వద్ద పనిచేసే వారి నుంచి ఆ ఫోన్లను తీసుకుని, దర్యాప్తు అధికా రులకు అందజేశారు" అని ఆయన పేర్కొ న్నారు. ఈడీ తరఫు న్యాయవాది జోహెబ్ హుస్సేన్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. కవిత విచారణకు సహకరించడం లేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. "ఈ కేసులో కవితది కీలక పాత్ర. ఉద్దేశ పూర్వకంగానే 10 ఫోన్ల లో సమాచారాన్ని డిలీట్ చేశారు. సాక్ష్యా లను ధ్వంసం చేశారు" అని కోర్టుకు చెప్పా రు. న్యాయమూర్తి కల్పించుకుంటూ.. "సాక్ష్యాలను ధ్వంసం చేశారా? లేదా? అనేది మాత్రమే చెప్పండి. 10 ఫోన్లను ఈడీకి ఇచ్చేముందే ఫార్మట్ చేశారా? లేదా?" అని ప్రశ్నిం చారు. దానికి జోహెబ్ హుస్సేన్ స్పందిస్తూ.. ఫోన్లను వేరే వారికి ఇచ్చానని, అందుకే వారు ఫార్మాట్ చేశారని కవిత స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు చెప్పారు. 2023లోనే తాము కేస్ ఫైల్‌లో ఈ అంశాన్ని స్పష్టంగా పేర్కొన్నట్లు గుర్తుచేశారు. దీనిపై సింఘ్వీ అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. రిజాయిండర్‌లో ఈ అంశంపై స్పష్టమైన వివరాలను కోర్టుకు సమర్పిస్తామని చెప్పారు. తదుపరి వాదనలను కొనసా గించడానికి కొంత సమయం కావాలని కోరారు. సమయం తక్కువగా ఉన్నం దున విచారణను మంగళ వారం కొనసాగిస్తామని న్యాయమూర్తి తెలిపారు. కాగా.. తన కుమారుడికి పరీక్షలున్నందున బెయిల్ ఇవ్వాలంటూ కవిత గతంలో పిటిషన్ వేయడగా.. కోర్టు తిరస్కరించిన విషయం తెలిసిందే..! దాంతో ఈడీ కేసులో బెయిల్ కోసం గత నెల 25న.. సీబీఐ కేసులో బెయిల్ కోసం ఈ నెల 15న పిటిషన్లు వేశారు. ఆరోగ్య సమస్యలను కారణంగా చూపారు. మరోవైపు కవితకు విధించిన సీబీఐ కస్టడీ మంగళవారంతో పూర్తికానుంది. దాంతో ఆమెను తిరిగి కోర్టులో హాజరుపరుస్తారు.

క్లోనింగ్‌తో 36 లక్షలు కొట్టేశారు

ప్రధానమంత్రి కౌశల్ కేంద్రంలో నకిలీ వేలిముద్రల రాకెట్

- మంచిర్యాల కేంద్రంగా దందా
- 300 మంది వేలిముద్రలు క్లోనింగ్
- ఛేదించిన రామగుండం పోలీసులు

కోల్‌సిటీ, ఏప్రిల్ 22: వేలిముద్రలను క్లోనింగ్ చేసి నిరుద్యోగులకు శిక్షణనిచ్చినట్లు ఆధారాలను సృష్టించి.. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన(పీఎంకేవీవై) కేంద్రం నుంచి రూ.36 లక్షల మేర బిల్లులను కొల్లగొట్టిన ఉదంతవిది. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌కు చెందిన అల్టిమేట్ ఎనర్జీ రిసోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ దారుణానికి పాల్పడింది. రామగుండం పోలీసులు.. ఈ ముఠా ఆటను కట్టించారు. నలుగురుని అరెస్టు చేసి.. వేలిముద్రల క్లోనింగ్ యంత్రాన్ని సీజ్ చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ వివరాలను వెల్లడించారు. భోపాల్‌కు చెందిన అల్టిమేట్ సంస్థ తెలంగాణలో యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చేందుకు కేంద్రం నుంచి కాంట్రాక్ట్ తీసుకుంది. ఈ సంస్థను సాహిల్ వలీ అనే వ్యక్తి నిర్వహిస్తూ.. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్నారు. హైదరాబాద్ కార్యాలయ మేనేజర్‌గా ఆవునూరి శ్రీనివాస్ కొనసాగుతున్నారు. మంచిర్యాల, హుజూర్‌నగర్, జనగామల్లో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు రికార్డులు సృష్టించిన ఈ సంస్థ.. తొలుత 320 మంది నిరుద్యోగులకు శిక్షణనిస్తున్నట్లు పేర్కొంది. పీఎంకేవీవైలో భాగంగా ఒక్కో నిరుద్యోగికి ఇచ్చే శిక్షణకు గాను.. కాంట్రాక్ట్ సంస్థకు రూ.3 వేలు ఇస్తారు. ఈ ఏడాది నిరుద్యోగుల సంఖ్యను 720కి పెంచారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. నిరుద్యోగులకు రోజువారీ బయోమెట్రిక్ హాజరు అవసరం. ఎప్పటికప్పుడు బయోమెట్రిక్ హాజరును పీఎంకేవీవై పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తేనే.. నిధులు విడుదలవుతాయి. "అల్టిమేట్ సంస్థకు చెందిన శ్రీనివాస్ పథకం ప్రకారం మంచిర్యాల సెంటర్ ఇన్‌చార్జి బార్మణి మల్లికార్జున్, ఉమ్మడి వరంగల్ జిల్లా నర్సంపేట కేంద్రం ఇన్‌చార్జి విజయ్, టెక్నీషియన్ వెంకటేశ్వర్లు, హార్డ్‌వేర్ నిపుణులు సలీం జాఫర్ సాయంతో.. లేని నిరుద్యోగులను ఉన్నట్లుగా చూపిస్తూ.. క్లోనింగ్ వేలిముద్రలను సృష్టించారు. శిక్షణ కోసం దరఖాస్తు చేసుకునే నిరుద్యోగుల వేలిముద్రలను ఓ కాగితంపై తీసుకుంటారు. ఆ వేలిముద్రపై పాలిమేక్ ద్రావణం వేసి, క్లోన్ చేస్తారు. దానిసాయంతో నకిలీ వేలిముద్రలు తయారుచేయించేవారు. 50 మంది నిరుద్యోగులు ఒక శిక్షణ కేంద్రానికి హాజరైతే.. అక్కడ 250 మంది హాజరైనట్లు క్లోనింగ్ వేలిముద్రల సాయంతో బయోమెట్రిక్ హాజరు తీసుకునేవారు" అని సీపీ శ్రీనివాస్ వివరించారు. ఇలా ఏడాది కాలంలో 300 మంది నిరుద్యోగుల వేలిముద్రలను క్లోన్ చేసిన ఈ ముఠా రూ.36 లక్షల మేర కేంద్రం నిధులను స్వాహా చేసిందని పేర్కొన్నారు. ఈ ముఠాకు చెందిన నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం గజ్జెర గ్రామానికి చెందిన పీఎంకేకే డైరెక్టర్ బార్మణి మల్లికార్జున్, వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలం బుధరావుపేటకు చెందిన షేక్ సలీంజాఫర్, పాడిబండల వెంకటేశ్వర్లు, మంచిర్యాల సెంటర్ ఇన్‌చార్జి కొత్తపల్లి దేవేందర్‌ను అరెస్టు చేసి, వారి నుంచి పాలిమేక్ లిక్విడ్, నకిలీ వేలిముద్రలు, వేలిముద్రలను క్లోన్ చేసే యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. భోపాల్‌కు చెందిన సూత్రధారి సాహిల్, ఆవునూరి శ్రీనివాస్ పరారీలో ఉన్నట్లు వివరించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లోనూ ఈ తరహా ముఠాలున్నట్లు భావిస్తున్నామని, విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, ఆయా రాష్ట్రాల పోలీసులకు సమాచారం అందజేస్తామని వెల్లడించారు. సమావేశంలో మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ బన్సీలాల్ పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న నకిలీ వేలి ముద్రలు, యంత్రాలు



సభలో ప్రసంగిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

లోక్‌సభ ఎన్నికల తర్వాత

కొత్త రేషన్‌కార్డులు

ఎన్డీయే హయాంలో ప్రమాదంలో ప్రజాస్వామ్యం

బీఆర్ఎస్‌కు మనుగడ ఉండదు: మంత్రి ఉత్తమ్

హాలియా, ఏప్రిల్ 22: రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల తర్వాత కొత్త రేషన్‌కార్డులు అందజేస్తామని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి నల్లగొండ జిల్లా హాలియాలో నిర్వహించిన నాగార్జునసాగర్ నియోజకవర్గస్థాయి ప్రచార సభలో ఆయనపాల్గొని మాట్లాడారు. ఎన్డీయే ప్రభుత్వ హయాంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని, ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి 'ఇండియా' కూటమి గెలుపు చారిత్రక అవసరమని తెలిపారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని చెప్పి తగ్గించారని ఆరోపించారు. రైతులు ఆందోళనకు దిగినా స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయలేదని విమర్శించారు. అందరికీ ఇళ్లు, రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. 'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే 30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని తెలిపారు. ఈ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీకి రాష్ట్రంలో మనుగడ ఉండదని జోస్యం చెప్పారు. నెల్లికల్లు ప్రాజెక్టు రూ.200 కోట్లు కేటాయించి, రెండేళ్లలో పూర్తి చేసి 7 వేల ఎకరాలకు సాగునీరు అందించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 14 ఎంపీ సీట్లు గెలవడం ఖాయమని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పోడు భూముల హక్కుల చట్టం తీసుకురావడంతో 8 లక్షల మందికి లబ్ధి చేకూరిందని సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి తెలిపారు. రికార్డు స్థాయి ఆధిక్యంతో నల్లగొండ పార్లమెంట్ ప్రజలు విజయాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కుందూరు జైవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, బాలునాయక్, పార్టీ జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎంతకూ తగ్గని ఎండలు!

నల్లగొండ జిల్లా టిక్యా తండాలో 45 డిగ్రీలు.. నేడు, రేపు మోస్తరు వానలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): సూరీడు రోజురోజుకు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. సోమవారం నల్లగొండ జిల్లా టిక్యా తండాలో అత్యధికంగా 45 డిగ్రీలు నమోదైంది. అదే జిల్లా బుగ్గబావిగూడ, మాడుగులపల్లి, సూర్యాపేట జిల్లా మామిళ్లగూడెంలో 44.9, నల్లగొండ జిల్లా మాటూర్‌లో 44.7, మహబూబాబాద్ జిల్లా కొమ్ములవంచలో 44.6, నల్లగొండ జిల్లా తిరుమలగిరిలో 44.4, అదే జిల్లా తిమ్మాపూర్, ఇబ్రహీంపేటలో 44.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నాలుగైదు జిల్లాలు మినహా మిగిలిన అన్నిటికి మంగళ, బుధవారాల్లో వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఈ రెండ్రోజులు కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశముందని వెల్లడించింది. ఇక దేశవ్యాప్తంగా కొన్ని ప్రాంతాల్లో అసాధారణ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని.. 4 నుంచి 6 డిగ్రీల మేరకు పెరిగాయని భారత వాతావరణ విభాగం వెల్లడించింది.

అకాల వర్షాలతో రైతులు ఆగం..

ఉమ్మడి నిజామాబాద్, నల్లగొండ జిల్లాల్లో అకాల వర్షాలు రైతులను ఆగం చేశాయి. నిజామాబాద్ నగరంతో పాటు డిచ్‌పల్లి, ధర్పల్లి, కమ్మర్‌పల్లి, మోర్తాడ్, ఏర్గట్ల తదితర ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. కామారెడ్డి జిల్లాలో వర్షానికి రైతులు ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. నిర్మల్ జిల్లా కేంద్రంతో పాటు భైంసా, ముథోల్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం పడింది. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలంలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం రాశులు తడిసిపోయాయి. మామిడి తోటల్లో కాయలు రాలిపోయాయి. గుండాల మండలం, నార్కట్‌పల్లి మండలంలో ఐకేపీ కేంద్రాల్లోని ధాన్యపు రాశులు కొట్టుకుపోయాయి. చిట్యాల మండలంలో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలులో రైతులు రాస్తారోకో నిర్వహించారు. డీసీఎస్‌వో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోళ్లు జరుపుతామని నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో సోమవారం రాత్రి వర్షం కురిసింది. ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. ఎల్లారెడ్డిపేటలో మామిడి నేల రాలింది. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రుద్రంగిలో విద్యుత్ స్తంభం కూలింది. చందుర్తి మండలంలో పడ్డ వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది.

రేపు ఇంటర్ ఫలితాలు

ఉదయం 11 గంటలకు వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాలను ఈనెల 24న వెల్లడించాలని నిర్ణయించినట్టు బోర్డు కార్యదర్శి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ ఫలితాలు ఒకేసారి విడుదల చేయనున్నట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఇంటర్ బోర్డు కార్యాలయంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా విడుదల చేస్తారని, ఫలితాలను https://tsbie.cgg.gov.in, http://results.cgg. gov.in అనే వెబ్‌సైట్ల ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. రాష్ట్రంలో ఫిబ్రవరి 28 నుంచి మార్చి 18వ తేదీ వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు జరిగాయి. 9,80,978 మంది విద్యార్థులు ప్రథమ, ద్వితీయ ఇంటర్ పరీక్షలు రాశారు. మార్చి 10 నుంచి మూల్యాంకనం ప్రారంభించిన అధికారులు ఏప్రిల్ 10వ తేదీతో పూర్తి చేశారు.

వచ్చే వారంలో టెన్త్ ఫలితాలు!

పదో తరగతి పరీక్షల ఫలితాలను వచ్చే వారంలో వెల్లడించే అవకాశం ఉంది. ఇప్పటికే స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియ, స్కానింగ్ పూర్తి చేశారు. ప్రస్తుతం వెరిఫికేషన్ సాగుతోంది. వచ్చే వారంలో ఈ ఫలితాలను వెల్లడించాలని అధికారులు భావిస్తున్నారు.

'జూనియర్ లెక్చరర్స్' తుది కీ విడుదల

జూనియర్ లెక్చరర్ల పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన పరీక్షల తుది కీని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమిషన్ విడుదల చేసింది. కమిషన్ వెబ్‌సైట్‌లో ఈ కీ అందుబాటులో ఉంది.

హాస్టల్ సంపులో పడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

నిర్వాహకుడి నిర్లక్ష్యమే కారణం

రాయదుర్గం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): హాస్టల్ నిర్వాహకుల నిర్లక్ష్యం... ఉజ్వల భవిష్యత్తు ఉన్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఉసురు తీసింది. బయటికెళ్లిన అతను... హాస్టల్ గేటు దగ్గర ఉన్న సంప్ మూత తెరిచి ఉండడాన్ని గమనించకుండా అందులో పడి మృతి చెందాడు. ఈ ఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లాకు చెందిన షేక్ అక్మల్ సుఫియాన్(25) రెండు సంవత్సరాల నుంచి గచ్చిబౌలి అంజయ్యనగర్‌లోని షణ్ముక్ పీజీ హాస్టల్‌లో ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం బయటకు వెళ్లిన అతను ఉదయం 10.30 గంటల సమయంలో తిరిగి హాస్టల్‌కు వచ్చాడు. గేటు తెరుచుకొని లోనికి వెళ్తుండగా.. నీటి సంపు మూత తెరిచి ఉండడాన్ని గమనించకుండా ప్రమాదవశాత్తు అందులో పడ్డాడు. ఈ క్రమంలో తల... సంపు శ్లాబ్‌కు తగిలి ఉంటుందని అందరూ భావిస్తున్నారు. సుఫియాన్ సంపులో పడినప్పుడు శబ్దం కావడంతో పక్కనే ఉన్న నిర్వాహకుడు మధుసూదన్‌రెడ్డి, అతని కుటుంబ సభ్యులు సంపు వద్ద చూశారు. అయినా వారు గుర్తించలేక పోయారు. కొద్దిసేపటి తర్వాత తిరిగి చూడగా అతను మృతి చెందినట్లు గుర్తించారు. దీంతో హాస్టల్ నిర్వాహకుడు మధుసూదన్‌రెడ్డి రాయదుర్గం పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి తరలించారు. కాగా, మధుసూదన్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

కొయ్యకాళ్లను కాల్చుతుండగా.. నిప్పంటుకుని రైతు మృతి

కామారెడ్డి జిల్లా బీర్కూర్‌లో ఘటన

బీర్కూర్, ఏప్రిల్ 22 : పొలంలో కొయ్యకాళ్లకు పెట్టిన నిప్పు.. ఆ రైతు పాలిట మృత్యు పాశమైంది. ఒక్కసారిగా దట్టమైన పొగ కమ్ముకోవడం.. ఆ వెంటనే మంటలు చుట్టు ముట్టడంతో ఆ అన్నదాత పొలంలోనే ప్రాణాలు వదిలాడు. కామారెడ్డి జిల్లా బీర్కూర్‌కు చెందిన రైతు అరిగె రాములు(65)కు గ్రామ శివారులో ఐదెకరాల పొలం ఉంది. దానిని గ్రామానికి చెందిన మరో రైతుకు కౌలుకు ఇచ్చాడు. ఇటీవల పంట కోసేశారు. దీంతో రాములు ఆదివారం పొలం వద్దకు వెళ్లి కొయ్యకాళ్లకు నిప్పు పెట్టాడు. గాలి విపరీతంగా వీయడంతో ఒక్కసారిగా పొగ కమ్ముకుంది. దీంతో ఊపిరాడక రాములు స్పృహ తప్పి పడిపోయాడు. మంటలు వ్యాపించి రాములు ఒంటికి నిప్పు అంటుకుని అక్కడికక్కడే మృతి చెందాడు. రాత్రి వేళ కుటుంబ సభ్యులు పొలానికి వచ్చి చూడగా.. రాములు కాలిన గాయాలతో చనిపోయి ఉన్నాడు.



సివిల్స్ ర్యాంకర్ అక్షయ్‌ను అభినందించిన సీఎం

హైదరాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ ప్రకటించిన సివిల్స్-2023 ఫలితాల్లో 196వ ర్యాంకు సాధించిన జి.అక్షయ్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందించారు. ఈ మేరకు సోమవారం అక్షయ్ కుటుంబ సభ్యులు సీఎం నివాసంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి.. అక్షయ్‌ను శాలువాతో సన్మానించారు.

పాలిసెట్ దరఖాస్తుల గడువు పెంపు

రాష్ట్రంలో నిర్వహించే పాలిసెట్ దరఖాస్తుల గడువును పొడిగించారు. రాష్ట్రవ్యాప్తంగా వచ్చే నెల 24న పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (పాలీసెట్-2024) నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన దరఖాస్తు దాఖలు గడువును ఈ నెల 28 వరకు పొడిగించినట్టు సాంకేతిక విద్యా శాఖ, శిక్షణా మండలి కార్యదర్శి పుల్లయ్య ఓప్రకటనలో తెలిపారు.

జేఈఈ మెయిన్ తుది కీ విడుదల

జేఈఈ మెయిన్-2024 (సెషన్-2) పరీక్షలకు సంబంధించిన తుది కీ విడుదలైంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) సోమవారం ఈ కీని అందుబాటులోకి తెచ్చింది. షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 25న వీటి ఫలితాలు వెల్లడించాల్సి ఉంది. అయితే..అంతకన్నా ముందే విడుదల చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఫలితాలు వచ్చాక అప్లికేషన్ నంబర్, పుట్టిన తేదీ, సెక్యూరిటీ పిన్ ఎంటర్ చేసి విద్యార్థులు తమ స్కోరు కార్డు పొందొచ్చు.

ఆర్టీసీ ప్రైవేటు డ్రైవర్ల ఆందోళన

- దాడికి నిరసన.. నిలిచిపోయిన బస్సులు

వికారాబాద్, ఏప్రిల్ 22: తమ సిబ్బందిపై ప్రయాణికుడి దాడిని నిరసిస్తూ ఆర్టీసీ ప్రైవేటు డ్రైవర్, కండక్టర్లు ఆందోళనకు దిగారు. తమకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆర్టీసీ ప్రైవేటు బస్సులన్నింటినీ నిలిపి వేసి నిరసన తెలిపారు. దీంతో హైదరాబాద్, తాండూరు, సదాశివపేట, పరిగి మార్గాల్లో తిరిగే ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. ఓ వైపు బస్సులు నిలిచిపోవడం, మరో వైపు ఎండ వేడిమితో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న వికారాబాద్ డిపో మేనేజర్, వికారాబాద్ సీఐ నాగరాజు ఆందోళన చేస్తున్న ఆర్టీసీ ప్రైవేటు డ్రైవర్లతో మాట్లాడారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని, ఇక ముందు ఇలా జరుగకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. ఈ ఘటనపై ఇరువర్గాలు స్థానిక పోలీసు స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నాయి.

తెలంగాణలోకి ఏనుగుల దండు!

ఏనుగుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలి

వర్క్‌షాప్‌లో వివిధ రాష్ట్రాల రిటైర్ పీసీసీఎఫ్‌ల సూచనలు

హైదరాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోకి ఏనుగుల దండు వచ్చే అవకాశాలున్నాయి. దాంతో వాటి వల్ల ప్రజలకు పొంచి ఉన్న ప్రమాదాలపై అవగాహన కల్పించే చర్యలపై అటవీశాఖ దృష్టి సారించింది. ఇటీవల మంద నుంచి విడిపోయిన ఓ ఏనుగు ఆసిఫాబాద్ జిల్లాలోకి ప్రవేశించి ఇద్దరు రైతులను దాడి చేసి చంపేసిన సంగతి తెలిసింది. అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు అటవీశాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ఏనుగుల మంద రాష్ట్రంలో ప్రవేశిస్తే జరిగే సంక్షోభం గురించి సోమవారం దులపల్లి ఫారెస్ట్ అకాడమీలో వర్క్‌షాప్ నిర్వహించారు. తమిళనాడు, ఛతీస్‌గఢ్, కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన రిటైర్ పీసీసీఎఫ్‌లు, నిపుణులు పలు సూచనలు చేశారు. సాధారణంగా ఏనుగులు సాదు జంతువులు వాటి దగ్గరకు వెళ్లిన ఏమిచేయవని అందరు అనుకుంటారని, కానీ పులుల కంటే ఏనుగులే అత్యంత ప్రమాదమని వారు తెలిపారు. మహారాష్ట్ర, ఛతీస్‌గఢ్ రాష్ట్రాల్లో ఏనుగుల కారిడార్‌లలో వాటి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతుందని, అవి సమీపంలోని తెలంగాణ రాష్ట్రంలోకి ప్రవేశించే అవకాశాలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా ఆ రాష్ట్రాలతో సరిహద్దులున్న మంచిర్యాల, జగిత్యాల, భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఆసిఫాబాద్ జిల్లాలోకి ఏనుగులు ప్రవేశించే అవకాశాలు ఉన్నాయి. ఈ జిల్లాల్లో అటవీ విస్తీర్ణ తక్కువ, జన సంచారం ఎక్కువగా ఉండటంతో ఏనుగుల నుంచి పొంచి ఉన్న ప్రమాదాలను ప్రజలకు వివరించాలని, వాటి నుంచి తప్పించుకోవడంపై ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించాలని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సంరక్షణ ప్రధానాధికారి (పీసీసీఎఫ్) డొబ్రియాల్, పీసీసీఎఫ్(వైల్డ్ లైఫ్) ఎంసీ పర్గేయిన్, పీసీసీఎఫ్(ప్రొటెక్షన్, విజిలెన్స్) డైరెక్టర్ ఏలూసింగ్ మేరు ,పీసీసీఎఫ్ (కంపా) డా. సువర్ణ, అడిషనల్ పీసీసీఎఫ్ సునీతా భగవత్, ఇతర జిల్లాల అటవీ అధికారులు పాల్గొన్నారు.

నీవు లేక నేనుండ లేను!

భర్త మృతిచెందిన మూడో రోజే గుండెపోటుతో భార్య మృతి

నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో విషాదం

నాగార్జునసాగర్, ఏప్రిల్ 22: ఆరవై ఏళ్ల అన్యోన్య దంపత్య జీవితం వారిది. ఇన్నాళ్లు కష్టసుఖాల్లో పాలుపంచుకున్న భర్త మరణాన్ని ఆమె తట్టుకోలేక పోయింది. ఆ బాధతో భర్త చనిపోయిన మూడో రోజే ఆమె గుండె కూడా ఆగిపోయింది. ఈ విషాదకర ఘటన నల్లగొండ జిల్లాలో జరిగింది. కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగార్జునసాగర్‌లోని హిల్‌కాలనీకి చెందిన గోరంట్ల శివశంకర్(84), జయమ్మ(75) దంపతులకు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె కాగా వారి పెద్ద కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వారం రోజుల క్రితమే శివశంకర్-జయమ్మ.. తమ 60 వసంతాల వివాహ వార్షికోత్సవాన్ని కొడుకు, కూతురు, బంధువుల సమక్షంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ తర్వాత ఈనెల 20న శివశంకర్ అనారోగ్యానికి గురవ్వడంతో ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందారు. భర్త మరణాన్ని తట్టుకోలేక పోయిన జయమ్మ సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. మూడు రోజుల్లోనే భార్యాభర్తలు మృతి చెందడంతో కుటుంబసభ్యులు విషాదంలో మునిగిపోయారు. స్థానికులు కూడా కంటతడి పెట్టుకున్నారు.

సబ్ రిజిస్ట్రార్ తస్లీమా ఇంట్లో ఏసీబీ సోదాలు

- ఆదాయానికి మించిన ఆస్తులున్నట్లు గుర్తింపు..
- బహిరంగ మార్కెట్‌లో విలువ 10 కోట్ల పైమాటే..

వరంగల్ క్రైం, ఏప్రిల్ 22: లంచం తీసుకుంటూ దొరికిపోయి సస్పెండ్ అయిన మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా నివాసంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు సోమవారం సోదాలు చేశారు. హనుమకొండలోని తస్లీమా నివాసంతో పాటు ఆమె భర్త గ్రామమైన నల్లగొండలో, భూపాలపల్లి పట్టణానికి చెందిన ఓ డాక్యుమెంట్ రైటర్ నివాసంలో ఏకకాలంలో దాడులు చేసి ఆదాయానికి మించి ఆస్తులున్నట్లు తేల్చారు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సోదాల్లో గుర్తించిన ఆస్తులు ప్రభుత్వ విలువ మేరకు రూ.2.94 కోట్లు కాగా, బహిరంగ మార్కెట్‌లో రూ.10 కోట్లకు పైగానే ఉంటుందని సమాచారం. సోదాల్లో ఐదు ఇళ్లకు సంబంధించి పత్రాల విలువే రూ.2.07 కోట్లుగా ఉంది. ఇక వాహనాలు సంబంధించి రూ.23.66 లక్షలు కాగా.. పొలాలు, ప్లాట్లు తదితరాలకు సంబంధించిన పత్రాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం జైల్లో ఉన్న తస్లీమా సోమవారం బెయిల్ పిటిషన్ వేసేందుకు సిద్ధమవుతున్న క్రమంలో ఈ దాడులు జరగడం విశేషం. ఆమెకు ఆదాయానికి మించి ఆస్తులున్నట్లు తేలడంతో అధికారులు మరో కేసు నమోదు చేసినట్లు సమాచారం.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ప్రజలూ అటే..!

మాల్దీవుల పార్లమెంటరీ ఎన్నికల్లో అధ్యక్షుడు మహమ్మద్ మొయిజ్జుకు చెందిన పీపుల్స్ నేషనల్ కాంగ్రెస్ భారీ మెజార్టీ సాధించింది. మజ్లిస్‌లోని మొత్తం 93స్థానాల్లో ఆయన పార్టీకి 70సీట్లు దక్కాయి. మిత్ర పక్షాలకు మరో మూడు లభించాయి. మొయిజ్జుకు అగ్నిపరీక్షగా నిలిచిన ఈ ఎన్నికలు భారత్, చైనాలకు కూడా అత్యంత ముఖ్యమైనవి. చైనా అనుకూలుడికి పేరుపడిన అధ్యక్షుడికి సభలో ఇంతబలం చేకూర్చిన ప్రజలు, భారత్‌కు అనుకూలంగా ఉండే మాజీ అధ్యక్షుడు ఇబ్రాహీం మహ్మద్ సోలీ నేతృత్వంలోని మాల్దీవియన్ డెమోక్రాటిక్ పార్టీ (ఎండీపీ)కి పన్నెండు స్థానాలే ఇచ్చారు. గతంలో 65 స్థానాలున్న ఈ పార్టీని తన భారత వ్యతిరేక ప్రచారంతో మొయిజ్జు బలంగా దెబ్బతీయగలిగారు.

'చిన్నదేశమైనంత మాత్రాన మమ్మల్ని వేధించే హక్కు ఎవరికీ లేదు' అంటూ భారతదేశాన్ని ఉద్దేశించి పరోక్షవ్యాఖ్యలతో, మన డెబ్బయ్‌మంది సైనికులను వెళ్ళగొట్టడం వంటి చర్యలతో ప్రజలను మొయిజ్జు తనవైపు బాగా తిప్పుకోగలిగారు. గత ఏడాది ఇబ్రాహీం మహ్మద్ సోలీని ఓడించి అధ్యక్షుడైన మొయిజ్జు పార్లమెంట్ ఎన్నికల్లో అంతకంటే ఎక్కువబలాన్ని ప్రదర్శించగలడని ఎవరూ అనుకోలేదు. మొయిజ్జు చైనా అనుకూల వైఖరి మీద ప్రజల్లో అంత సానుకూలత లేదని, అధ్యక్షుడైన తరువాత ఆయన పొరుగు దేశమైన భారత్‌తో ఘర్షణాత్మకంగా వ్యవహరించడం అధికులకు నచ్చడం లేదని విశ్లేషకులు భావించారు. మహా అయితే, త్రిశంకు సభ ఏర్పడుతుంది తప్ప, విజయం అధ్యక్షుడి పక్షాన ఏకపక్షంగా ఉండబోదని విపక్షం ఎంతగానో నమ్మింది. కానీ, దాని అంచనాలకు భిన్నంగా ప్రజలు ఆయనకు భారీ మెజారిటీ కట్టబెట్టడం విచిత్రం. 2008లో మాల్దీవుల్లో ప్రజాస్వామిక పాలన ఆరంభమైన తరువాత, ఏ పార్టీతోనూ పొత్తుపెట్టుకోకుండా, కూటమికట్టకుండా తొలిసారిగా ఒంటరిగా 2019లో అధికారంలోకి వచ్చిన ఎండీపీ ఇప్పుడు ఏకంగా చతికిలబడిపోయింది. అనేకమంది స్వతంత్రుల కంటే ఇబ్రాహీం సోలీ పార్టీ అభ్యర్థులు వెనుకబడ్డారు. ఇండిపెండెంట్లుగా గెలిచిన ఆరుగురూ అధ్యక్షుడి కూటమిలో చేరినపక్షంలో ఆయన మరింత బలపడతారు.

మాల్దీవుల్లో 'ఇండియా ఔట్' నినాదానికి పునాదులు వేసి, ఆరేళ్ళక్రితం వరకూ భారతదేశానికి తలనొప్పిగా పరిణమించిన దేశమాజీ అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్ ఒక అవినీతి కేసులో పదకొండేళ్ళ జైలుశిక్ష అనుభవిస్తున్న కారణంగా తన బదులు శిష్యుడైన మొయిజ్జును అధ్యక్ష ఎన్నికల బరిలోకి దింపారు. ప్రమాణస్వీకారం చేయగానే పొరుగున ఉన్న భారతదేశాన్ని సందర్శించడమనే సంప్రదాయాన్ని పక్కనబెట్టి తుర్కియే, సౌదీ అరేబియా వెళ్ళారు. తరువాత చైనా వెళ్ళివచ్చి భారత్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారు. భారతప్రధాని నరేంద్రమోదీ అనూహ్యంగా లక్షద్వీప్‌ను సందర్శించి అక్కడి ప్రకృతిశోభను ప్రశంసించి, చక్కని పర్యాటక ప్రదేశంగా అభివర్ణిస్తూ ట్వీట్లు చేయడం, వాటి ఆధారంగా అభిమానులు మాల్దీవులపని అయిపోయిందని వ్యాఖ్యానించడం, ఇందుకు ప్రతిగా మొయిజ్జు మంత్రులు ముగ్గురు నోరుపారేసుకోవడం, వారిని ఆయన సస్పెండ్ వంటి పరిణామాలు తెలిసినవే. ఆ తరువాత కూడా భారతదేశ ప్రముఖులు చాలామంది సామాజిక మాధ్యమాల్లో మాల్దీవులను వెంటాడినందువల్ల దాని పర్యాటకం దెబ్బతిన్నది. దీనికి పోటీగా మొయిజ్జు చైనా సందర్శించి ఇరవైకు పైగా ఒప్పందాలు కుదర్చుకున్నారు, బిఆర్‌ఐని పునరుద్ధరించారు. ఈ తరహా భారత్ వైఖరి మొయిజ్జు ఘనవిజయానికి మరింత దోహదపడిందా అన్నది అటుంచితే, ఇప్పుడు ఆయన చైనాకు మరింత సన్నిహితం కావడానికి మార్గం సుగమం అయింది.

మొయిజ్జు భారత వ్యతిరేక ఎజెండా మాల్దీవులకు మేలుచేయదని ప్రధాన విపక్షపార్టీ ఎండీపీ చెప్పిచూసింది, పార్లమెంటులో తనకున్న సంఖ్యాబలంతో అధ్యక్షుడి నిర్ణయాలకు, నియామకాలకు అడ్డుతగిలి దారికి తెచ్చేందుకు విఫల యత్నంచేసింది. చివరకు అభిశంసన తీర్మానంతో ఆయనను దించేందుకు కూడా సిద్ధపడింది. కానీ, ఇప్పుడు ప్రజలు ఆయనకే భారీ విజయం చేకూర్చి సమర్థించారు. నిరంకుశమైన బలంతో ఇప్పుడు ఆయన కావాల్సిన చట్టాలు చేసుకోవచ్చు, నచ్చిన విధానాలు అమలుచేయవచ్చు. భారత్ పక్షాన ఆయనను నిలదీసే, ప్రశ్నించే ప్రధానప్రతిపక్షం ప్రస్తుతానికి తన ఉనికి కోల్పోయింది. చారిత్రకంగా, భౌగోళికంగా ఎంతో సన్నిహితంగా ఉండే భారత దేశంతో, ఇప్పటివరకూ కొనసాగిన సత్సంబంధాలను విఘాతం కలగకుండా, నిప్పురేపకుండా వ్యవహరించాలని కోరుకోవడం వినా చేయగలిగిందేమీ లేదు. విదేశాంగమంత్రి జయశంకర్ అన్నట్టుగా ఎవరు వచ్చినాపోయినా, ఇరుగూపొరుగూ అన్నాక పొద్దున్న లేస్తే ముఖాలు చూసుకోవాల్సిందే.

ప్రతిపక్షాల పగటి కలలు

భారతీయ జనతా పార్టీ కేవలం ఉత్తరాది పార్టీ అని, దక్షిణాదిలో అది నెగ్గుకు రాదని కాంగ్రెస్ నేతలు నిర్వహిస్తున్న బూటకపు ప్రచారంలో అణుమాత్రమైనా వాస్తవం లేదు. ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ బీజేపీ ఉత్తరాది పార్టీ మాత్రమేనని, ఉత్తరాది వారికే బీజేపీ పెద్ద పీట వేస్తుందని అర్థం పర్థం లేని ఆరోపణ చేశారు. నిజానికి తెలంగాణలో బీజేపీ మూలంగానే ఆయన కాళ్ళ కింద నీరు ప్రవహిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లోనూ, పట్టణ మేధావుల్లోనూ బీజేపీ ప్రభావం ఎంత విస్తరించిందంటే ఇవాళ బీఆర్ఎస్ స్థానాల్లో దూసుకురావడమే కాదు. కాంగ్రెస్ స్థానాలను కూడా అది కైవసం చేసుకునే క్రమంలో ఉన్నది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత లోక్‌సభలో ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరి సీటుతో సహా మెజారిటీ సీట్లలో ఇవాళ బీజేపీ ప్రాబల్యం కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా బీజేపీ విస్తరిస్తున్న తీరు ఆశ్చర్యం కలిగిస్తోంది. బీజేపీ సీట్ల కోసం ప్రతి నియోజకవర్గంలోనూ నేతలు పోటీపడుతున్న తీరే బీజేపీ ప్రాబల్యానికి నిదర్శనం. బీజేపీ నేతలు ఎక్కడకు వెళ్లినా వేలాది ప్రజలు నీరాజనాలు పడుతున్నారు. బీజేపీ–తెలుగుదేశం–జనసేన కూటమి జనాదరణ జగన్మోహన్ రెడ్డి అనుయాయుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తోంది. బీసీలు, దళితులు, ఆదివాసీలతో సహా అట్టడుగు వర్గాలు తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల్లో బీజేపీకి ఆకర్షితులవుతున్నారు. గత ఎన్నికల్లో దాదాపు 13 రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీ, జమ్ము కశ్మీర్, ఉత్తరాఖండ్ చండీగఢ్, దాద్రానగర్ హవేలీ, డామన్ దయ్యూ, నాగాలాండ్, సిక్కిం, త్రిపురలో ఒక్క సీటు కూడా సంపాదించుకోలేని కాంగ్రెస్, బీజేపీని ఢీకొంటుందంటే ఎవరు విశ్వసిస్తారు? అదే సమయంలో 21 రాష్ట్రాల్లోని 224 సీట్లలో 50 శాతం పైగా ఓట్లను సాధించిన బీజేపీ కేవలం కొన్ని ప్రాంతాలకే పరిమితమయిందన్న ప్రతిపక్షాల విమర్శలో అర్థం ఏమైనా ఉన్నదా?



■ వై. సత్యకుమార్

సత్యకాలమ్

తమిళనాడు, కేరళలో బీజేపీ విస్తరిస్తోందని, ఈ ఎన్నికల్లో అనూహ్యమైన ఫలితాలు సాధిస్తుందని ఇటీవల ప్రముఖ ఆర్థికవేత్త సుర్జిత్ భల్లా వ్యాఖ్యానించారు. ఒక్క తమిళనాడులోనే బీజేపీకి 5 సీట్లు వచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదని ఆయన చెప్పారు. తమిళనాడులో ప్రధాన పోటీ డీఎంకె, బీజేపీల మధ్యే ఉన్నదని స్పష్టంగా తెలుస్తోంది. 2019 ఎన్నికల్లో తమిళనాడులో ఒక్క సీటు కూడా సాధించలేని బీజేపీ ఈసారి కనీసం పది నియోజకవర్గాల్లో డీఎంకే కూటమికి గట్టి పోటీనిస్తోంది. కన్యాకుమారి–నాగర్ కోయిల్–తిరునల్వేలి బెల్ట్– రామనాథపురం, కోయంబత్తూరు ప్రాంతాల్లో బీజేపీ బలం రోజురోజుకూ పుంజుకుంటోంది. ఈ ఎన్నికల్లో బీజేపీకి 25 శాతం పైగా ఓట్లు లభించినా ఆశ్చర్యపోనక్కర్లేదు. తమిళనాడులో అనేకసార్లు ఉధృతంగా పర్యటించిన మోదీ తమిళ ప్రజలకు సుపరిచితుడయ్యారు. కొత్త పార్లమెంట్ భవనంలో చోళ రాజ వంశీకుల సెంగోల్‌ను ప్రతిష్ఠాపించడం నుంచి కాశీ–తమిళ సంగమం వరకు అనేక చర్యల ద్వారా ఆయన ఉత్తరాదికి, దక్షిణాదికి వారధి నిర్మించారు. భారత దేశానికి చెందిన కచ్చతీవును శ్రీలంకకు అకారణంగా అప్పగించిన కాంగ్రెస్ ప్రభుత్వం తీరును ఆయన తీవ్రంగా ఎండగట్టారు. గత వారం మోదీ కోయంబత్తూరులో రోడ్ షో నిర్వహించినప్పుడు వేలాది మంది మోదీ, మోదీ అంటూ ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా మోదీ తన ప్రసంగం తమిళ భాషలో ప్రజలకు చేరేలా చూడడం వారి మనసులను హత్తుకుంది. వీటన్నిటి రీత్యా ఉత్తర–దక్షిణ విభజనను సృష్టించి దక్షిణాదిలో ప్రజలను బీజేపీకి దూరం చేయాలని చూస్తున్న ప్రతిపక్షాల ఎత్తుగడలు ఏ మాత్రం ఫలించేలా లేవు. ఈసారి దక్షిణాదిలో బీజేపీ సాధించే విజయాలు అందర్నీ దిగ్భ్రాంతి పరుస్తాయని స్వయంగా మోదీ ప్రకటించడం ఆయన ఆత్మవిశ్వాసానికి నిదర్శనం.



మోదీ చేసిన మంచిపనులే మొత్తంగా బీజేపీ గెలుపునకు కారణమవుతాయని 45 శాతం మంది విశ్లేషిస్తున్నట్లు 'ఎకానమిస్ట్' పత్రిక అంచనా వేసింది. 57 శాతం మంది ప్రజలు మోదీ పాలన పట్ల సంతృప్తికరంగా ఉన్నారని, దేశంలో సగం మంది ప్రజలు మోదీ తిరిగి రావాలని ఆశిస్తున్నారని సిఎస్‌డిఎస్– లోక్‌నీతి కూడా వెల్లడించింది. ఈ రీత్యా, మోదీ సారథ్యంలో ఎన్డీఏ తిరిగి అధికారంలోకి రాలేదని అంటున్న వారిని భర్తృహరి చెప్పిన మూర్ఖుల జాబితాలో చేర్చాలి.

ఇవాళ దక్షిణాదిన ప్రతి నియోజకవర్గంలోనూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇళ్ల నిర్మాణం, ఉచిత ఎల్పిజి, వైద్య బీమా, ఉచిత ఆహారధాన్యాల సరఫరా గురించి తెలుసు. ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకల్లో యువకుల్లో అత్యధికులు బీజేపీ వైపు మొగ్గుచూపుతున్న విషయం ప్రతిపక్ష పార్టీలు గమనించడం లేదు. ముఖ్యంగా తొలిసారి ఓటర్లైనవారు బీజేపీ వల్లనే దేశం మెరుగుపడుతుందని భావిస్తున్నారు. కేరళలో కొన్ని దశాబ్దాలుగా వామపక్ష ప్రజాస్వామిక ఫ్రంట్, యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ ప్రభుత్వాలను చూసిన అక్కడి ప్రజలు క్రమంగా బీజేపీ వైపు ఆకర్షితులవుతున్నారు. ఈ ప్రభుత్వాల హయాంలో జరిగిన అవినీతిని, మోదీ హయాంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలు పోల్చి చూసుకుంటున్నారు. అక్కడ బీజేపీకి కేథలిక్ క్రైస్తవుల మద్దతు రోజురోజుకూ పెరుగుతోంది. తమిళనాడులో అన్నాడిఎంకె, తెలంగాణలో భారత రాష్ట్ర సమితి పట్ల ప్రజలకు పెరుగుతున్న ఏహ్యభావం బీజేపీ క్రమంగా బలపడేందుకు ప్రధాన కారణమవుతున్నది.

నేడు దేశంలో జరుగుతున్న అభివృద్ధి, మౌలిక సదుపాయాల నిర్మాణం, సంక్షేమ కార్యక్రమాల అమలు, నగదు బదిలీలు గమనించినవారెవరైనా ఈ దేశ ఆర్థిక వ్యవస్థ బలహీనంగా ఉన్నదంటే విశ్వసించలేరు. దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతి వల్ల మోదీకి అత్యధిక సీట్లు లభిస్తాయని ఆర్థికవేత్తలు విశ్లేషిస్తున్నారు. తలసరి వినియోగం మెరుగుపడిందని, జీవన పరిస్థితులు మెరుగుపడ్డాయని, పేదరికం తగ్గిపోయిందని, ఇవన్నీ ప్రజల్లో మోదీ పట్ల సానుకూల అభిప్రాయాలు ఏర్పరిచాయని భల్లా అభిప్రాయపడ్డారు. ఎవరు కాదన్నా మోదీ హయాంలో జీడీపీ రెట్టింపు స్థితిలో 3.8 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నది. ప్రపంచంలో ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించింది. తలసరి ఆదాయం రెట్టింపైంది. ఎగుమతులు 400 శాతం పెరిగి 750 బిలియన్ డాలర్లకు మించిపోయాయి. ఇవాళ అనేక పట్టణాలు మెట్రోనగరాలుగా మారి ప్రజలకు అక్కడే ఉపాధి లభిస్తోంది. ఎక్స్‌ప్రెస్ హైవేలు దాదాపు 400 శాతం పెరిగి 4067 కి.మీ మేరకు విస్తరించాయి. జాతీయ రహదారులు 53,700 కి.మీ విస్తరించాయి. విదేశీ రిజర్వులు 694 బిలియన్ డాలర్లకు పెరిగాయి.

మోదీ చేసిన మంచి పనులే మొత్తంగా బీజేపీ గెలుపునకు కారణమవుతాయని 45 శాతం మంది విశ్లేషిస్తున్నట్లు ఎకానమిస్ట్ పత్రిక అంచనా వేసింది. ఆ తర్వాత సంక్షేమ పథకాలు, నాయకత్వ లక్షణాలు, అయోధ్యలో రామమందిర నిర్మాణం, కశ్మీర్‌లో 370 అధికరణ రద్దు, భారతదేశానికున్న అంతర్జాతీయ ప్రతిష్ఠ, హిందువుల ప్రయోజనాలు కాపాడడం మొదలైనవన్నీ మోదీ విజయపరంపరలో భాగమవుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు. 57 శాతం మంది ప్రజలు మోదీ పాలన పట్ల సంతృప్తికరంగా ఉన్నారని, దేశంలో సగం మంది ప్రజలు మోదీ తిరిగి రావాలని ఆశిస్తున్నారని సిఎస్‌డిఎస్– లోక్‌నీతి కూడా వెల్లడించింది. ఈ రీత్యా, మోదీ సారథ్యంలో ఎన్డీఏ తిరిగి అధికారంలోకి రాలేదని పగటి కలలు కంటుంటే వారిని భర్తృహరి చెప్పిన మూర్ఖుల జాబితాలో చేర్చాలి.

(బీజేపీ జాతీయ కార్యదర్శి)

విభజన హామీల అమలులో ఏదీ సమాఖ్య స్ఫూర్తి?

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్ద కాలం ముగుస్తున్న తరుణంలో విభజన బిల్లులో రాష్ట్రానికి ఇచ్చిన హామీలు అరకొరగానే అమలవుతున్నాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం హామీల అమలులో చిత్తశుద్ధి చూపించవలసి ఉంది. కేంద్రంలో ఎన్నో కీలక బిల్లులకు మద్దతు ఇచ్చిన బీఆర్ఎస్ పార్టీ తాను అధికారంలో ఉన్నప్పుడు పలు హామీలను రాబట్టంలో విఫలమైంది.

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే రేవంత్ రెడ్డి కేంద్రంతో సత్సంబంధాల కోసం సయోధ్యతో వ్యవహరించి రాష్ట్ర ప్రయోజనాలు కాపాడతామని, విభజన బిల్లులోని హామీలు అమలయ్యేట్టు కేంద్రంపై ఒత్తిడి తెస్తామని అన్నారు. బీఆర్ఎస్‌లా కాకుండా ఫెడరల్ స్ఫూర్తితో వ్యవహరిస్తామన్నారు. ఈ తరుణంలో కేంద్రం సానుకూలంగా బీజేపీ పాలిత రాష్ట్రంతో సమానంగా తెలంగాణను చూస్తుందని ఆశిద్దాం. విభజన బిల్లులో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలలోనూ కీలకమైనవి ఏవీ అమలుచేయక అరకొర మాత్రమే చేస్తున్నారు. దీనికి ప్రధాన కారణం ఉభయ రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి కాదు కదా కనీసం ప్రధాన ప్రతిపక్షంగా కూడా వచ్చే పరిస్థితి దరిదాపుల్లో కనిపించకపోవడమే అని జరుగుతున్న ప్రచారాన్ని ప్రజలు నమ్ముతున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో బీజేపీకి విభజన బిల్లు రూపంలో బంగారం లాంటి అవకాశం లభించింది. గడిచిన పదేళ్ళల్లో బిల్లులో మంజూరు చేసిన, ఇచ్చిన హామీలను అమలు చేసి ఉంటే ఆ పార్టీకి కీలక రాజకీయపక్షంగా జెండా ఎగురవేసే అవకాశం లభించి ఉండేది. బిల్లులో తప్పొప్పుల గురించి మాట్లాడే బీజేపీ ఆనాడు వారి పరిశీలన తరువాతే దాన్ని పార్లమెంట్‌లో పెట్టిన అంశాన్ని కప్పిపుచ్చుతుంది. దాన్ని సరిచేసే అధికారం వచ్చి ఇన్ని సంవత్సరాలైనా ఆ దిశగా ఏనాడూ పని చేయలేదు.

విభజన చట్టంలోని సెక్షన్ 93లో కేంద్ర ప్రభుత్వం షెడ్యూల్ 13లో మంజూరు చేసిన అంశాలు కొత్త రాష్ట్రాలలో సుస్థిర అభివృద్ధి కోసం పదేళ్ళ లోపు ఏర్పాటు చేయాలని స్పష్టంగా నిర్దేశించింది. గిరిజన, హార్టికల్చర్ యూనివర్సిటీలను ఏర్పాటు చేయాలనీ నిర్దేశించారు. హార్టికల్చర్ యూనివర్సిటీకి కేవలం రూ.135 కోట్లు కేటాయించి మీరే ఏర్పాటు చేసుకోవాలని చేతులు దులుపుకున్నారు. విభజన బిల్లులో పెట్టినవన్నీ కేంద్రం ఏర్పాటు చేసేవి మాత్రమే. అలాంటప్పుడు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ హార్టికల్చర్ యూనివర్సిటీని రూ.1500కోట్లతో నిర్మించి ఐసీఆర్ క్రింద నిర్వహించాలి. కేసీఆర్ ప్రభుత్వం రూ.135కోట్లు తిరస్కరించి కేంద్రమే విద్యాలయాన్ని నిర్మించాలని పట్టుబట్టి ఉంటే ఫలితం మరోలా ఉండేదేమో.



దేశవ్యాప్తంగా విద్యుత్ డిమాండ్ పెరుగుతున్నందున ఎన్టీపీసీ ప్రాజెక్ట్ రెండో దశను నిర్మించేందుకు పవర్ పర్చేస్ అగ్రిమెంట్ చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఎన్నో సంవత్సరాలుగా కోరుతున్నప్పటికీ అప్పటి రాష్ట్ర పాలకులు స్పందించలేదు. తాము ఇతర రాష్ట్రాలతో ఒప్పందాలు కుదుర్చుకుంటామని హెచ్చరించటంతో ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్పందించింది. దీని వల్ల రాష్ట్రానికి కేంద్ర పెట్టుబడులు, ప్రత్యక్ష పరోక్ష ఉపాధితోపాటు ఉత్పత్తయ్యే విద్యుత్‌లో 85 శాతం రాష్ట్రానికే చెందుతుంది.

బయ్యారం ఉక్కు కర్మాగారం విషయంలో స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా విభజన జరిగిన ఆరు నెలలకే ఫీజిబిలిటీ రిపోర్ట్ ఇచ్చామని, రాష్ట్ర ప్రభుత్వం కోరిక మేరకు దీని సాధ్యాసాధ్యాలపై లోతైన పరిశీలన చేసేందుకు ఉక్కు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామని, ఇప్పటి వరకు నివేదిక సమర్పించలేదని చెప్పింది. మరోవైపు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బయ్యారంలో లభించే ఐరన్ ఓర్‌లో నాణ్యత లేదని, అందువలనే ప్లాంట్ ఏర్పాటు సాధ్యపడదని ప్రకటించారు. మరోవైపు ఉక్కు మంత్రిత్వ శాఖ డీపీఆర్ కోసం సమాచారం పంపాలని రాష్ట్ర ప్రభుత్వానికి పదమూడు సార్లు లేఖలు రాసినా స్పందన లేదని తెలియజేసింది. అసలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల్లో ఎవరి మాట నమ్మాలి అనే మీమాంసలో ప్రజలు ఉన్నారు.

తెలంగాణలో 4000 మెగా వాట్ల సామర్థ్యంతో ఎన్టీపీసీ ప్రాజెక్టును మంజూరు చేస్తూ అందుకు అవసరమైన కోల్ లింకేజీ కల్పించాలని విభజన బిల్లు ఆదేశించింది. కానీ ఇప్పటికి కేవలం 1600 మెగావాట్లు రూ.10,898కోట్లతో ఏర్పాటు చేసి మిగిలిన 2400 మెగావాట్లకు రూ.17,739 కోట్లతో 2016 మొదటి త్రైమాసిక ధరల ప్రకారం డీపీఆర్‌ను ఎన్టీపీసీ పెట్టుబడుల బోర్డు ప్రతిపాదించింది. 2023 ధరల ప్రకారం సవరించిన అంచనాలు రూపొందించాలి, వాటికీ పెట్టుబడుల ఆమోదం పొందాలి. దేశవ్యాప్తంగా విద్యుత్ డిమాండ్ పెరుగుతున్నందున ఎన్టీపీసీ ఈ ప్రాజెక్ట్ రెండో దశను నిర్మించేందుకు పవర్ పర్చేస్ అగ్రిమెంట్ చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఎన్నో సంవత్సరాలుగా కోరుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదు. తాము ఇతర రాష్ట్రాలతో ఒప్పందాలు కుదుర్చుకుంటామని హెచ్చరించటంతో ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్పందించింది. దీని వల్ల రాష్ట్రానికి కేంద్ర పెట్టుబడులు, ప్రత్యక్ష పరోక్ష ఉపాధితోపాటు ఉత్పత్తి ఐయ్యే విద్యుత్‌లో 85శాతం రాష్ట్రానికే చెందుతుంది. జనవరిలో కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ శక్తి పథకం క్రింద ఈ రెండవ దశ ప్రాజెక్టుకు సింగరేణి నుంచి బొగ్గును కేటాయించింది.

రైల్వేశాఖకు సంబంధించి కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ నిర్మించాలనీ, హైదరాబాద్ – ఆంధ్రప్రదేశ్‌లోని నగరాల మధ్య ర్యాపిడ్ రైల్ కనెక్టివిటీ కోసం కొత్త రైల్వే లైన్ల నిర్మాణం చేయాలని స్పష్టంగా నిర్దేశించింది. తెలంగాణలో నాలుగు దశాబ్దాల నినాదం, కలగా మిగిలిపోయిన కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీపై రైల్వేశాఖ చిన్నచూపు చూసిందనే చెప్పాలి. టీఆర్ఎస్ ప్రభుత్వంతోపాటు అన్ని పార్టీలు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి భూమి కేటాయింపు జరిపినా ముందుకు రాలేదు. ఈ మేరకు 2019 ఆగస్టుకు ముందే దేశంలో కోచ్ ఫ్యాక్టరీల అవసరం ఇప్పుడు లేదు, భవిష్యత్తులో కూడా పెట్టే ప్రసక్తి లేదు, అలాగే దేశంలో ఏటా అవసరమైన కోచ్‌ల కంటే మంజూరైన ఫ్యాక్టరీలలో ఎక్కువ కోచ్‌లు తయారవుతున్నాయని రైల్వే మంత్రిత్వ శాఖ స్పష్టంగా తెలిపింది. అంతేగాక భవిష్యత్తులో కూడా ఎట్టి పరిస్థితులలో తెలంగాణలో కోచ్ ఫ్యాక్టరీ పెట్టే అవకాశం లేదని రైల్వే బోర్డు 2020 తేల్చి చెప్పింది.

హైదరాబాద్ – ఆంధ్ర రాజధాని, ఇతర నగరాలకు ర్యాపిడ్ రైల్వే సౌకర్యం ఏర్పాటు చేయాలని స్పష్టంగా విభజన చట్టంలో చెప్పినా సర్వే నిర్వహించాలన్న నిర్ణయానికి తొమ్మిదేళ్ళు పట్టింది. ఈ మేరకు ఈ ఏడాది ఫిబ్రవరిలో రైల్వే బోర్డ్ నిర్ణయం తీసుకుందని ఆర్టీఐకు సమాధానంగా సౌత్ సెంట్రల్ రైల్వే తెలిపింది.

కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్, ఇతర తెలంగాణలోని ముఖ్య పట్టణాల నుండి ఆంధ్రప్రదేశ్ రాజధానికి ర్యాపిడ్ రోడ్ కనెక్టివిటీని ఏర్పాటు చేయాలన్న నిబంధన విషయానికొస్తే ఈ పదేళ్లలో రవాణా రహదారుల అభివృద్ధి సంస్థ రోడ్డు ప్రాజెక్టులను మంజూరు చేయలేదు, మంజూరైన వాటి నిర్మాణంలో పురోగతి లేదు.

ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని సెక్షన్ 26 ప్రకారం తెలంగాణకు 34, ఆంధ్రప్రదేశ్‌కు 50 అసెంబ్లీ స్థానాలు పెంచి పునర్విభజన చేయాలని నిర్దేశించినప్పటికీ రాజ్యాంగ సవరణ చేయనిదే పెంపుదల కుదరదన్న అటార్నీ జనరల్ అభిప్రాయాన్ని పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ఘంటాపథంగా చెప్పింది. కానీ జమ్మూ కశ్మీర్లో ఆర్టికల్ 370 రద్దు చేసిన తరువాత దేశంలోని అన్ని రాష్ట్రాలతో కశ్మీర్ రాజ్యాంగ పరంగా సమానం అయింది. బీజేపీ రాజకీయ ప్రయోజనాలు ఆశించి జమ్మూ కశ్మీర్ విభజన చట్టంలో 7 అసెంబ్లీ స్థానాలను పెంచుతూ తదనుగుణంగా డీలిమిటేషన్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. రాజకీయ పార్టీల ఇలాంటి వైఖరి వల్ల ప్రాంతాల మధ్య అనవసర విద్వేషాలు పెరుగుతాయి.

విభజన హామీల అమలు విషయంలో నిజానికి కేంద్రంపై ఆర్థిక భారం లేదు. బీఆర్ఎస్ బలహీనపడిన ప్రస్తుత తరుణంలో విభజన హామీలన్నీ నెరవేర్చిన పక్షంలో బీజేపీ తెలంగాణలో అధికారం వైపు వేగంగా అడుగులు వేయగలుగుతుంది.

• ఇనగంటి రవికుమార్
సీనియర్ జర్నలిస్ట్

ప్రతి మనిషి ఒక కొత్త పుస్తకమే

చదివే స్ఫూర్తిపి ఉండాలే కానీ
మనిషి కూడా ఒక పుస్తకమే
మనిషిని చదవాలి
రోజుకో పేజీ చొప్పున అచ్చయ్యే
అనుభవాల సరికొత్త సంకలనమే పుస్తకం
కన్నీటి అక్షరాలు చిరునవ్వుల పదాలు
కష్టసుఖాల వాక్యాలు నిండిన గ్రంథమే మనిషి
ఎన్నో ఆశల్ని ఆశయాలనీ స్వప్నించిన మహాకావ్యం
బతుకు జలధిలో ఎగిసిపడే కెరటాలు, బంధాల గంధాలను రాసుకొనే పర్యాయాలు, మాటలు మంత్రాలను పాటించే ఆత్మీయతలు, చిరునవ్వుల సిరుల్ని మార్చుకొనే పరిచయాలు...
నవరసాల నిత్య నూతన నాటకం మనిషి
నూరేళ్ల పుస్తకాన్ని నిండు మనసుతో చదవాలి
ప్రతి అక్షరానికి సరికొత్త అర్థాల సంచయం జరగాలి
మనిషితో ఎదుగుతున్న...
నానా జంతుజీవజాతుల జ్ఞానాన్వేషణలో
తక్షణం మనిషిని చదవాలి
మనిషే కదా మహాకావ్యం
అందుకే మనిషిని చదవాలి
తప్పనిసరిగా మనిషి పుస్తకం చదవాలి



– ఈతకోట సుబ్బారావు

పుస్తకం ఓ మంచి నేస్తం...!

పుస్తకాలలో మనం నేర్చుకోవలసిన, గుర్తుంచుకోవలసిన విలువైన సమాచారం ఉంటుంది. ఒక పుస్తకం ఒక వ్యక్తి తాలూకు జ్ఞాపకాల పరంపర కావచ్చు. అనుభవాల సారం కావచ్చు, లేదా యదార్థాల వస్తు సంగ్రహణము కావచ్చు. మొత్తం మీద పుస్తకం ద్వారా జ్ఞానాన్ని పొందవచ్చు. మన పూర్వీకులు మొదట్లో తాళపత్రాల మీద రాసి విలువైన సమాచారాన్ని వాటిలో భద్రపరిచేవారు. అనంతరం పేపర్‌ను కనుగొనడంతో దానిపై రాయడం మొదలుపెట్టారు. 15వ శతాబ్దంలో అచ్చు యంత్రం అందుబాటులోకి వచ్చిన తర్వాత పుస్తకాల ముద్రణ ప్రారంభమైంది. ఇలా అనేక రకాల పుస్తకాలు ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చి ప్రపంచ సమాచారాన్ని, ఒకరికొకరు పంచుకోవడం, భద్రపరచుకోవడం మొదలుపెట్టారు. క్రీస్తుపూర్వం భారతదేశంలో వివిధ విశ్వవిద్యాలయాలలో మేధోపరమైన చర్చలు జరుగుతుండేవి. ప్రపంచ దేశాల నుంచి చాలామంది మన దేశంలోని నలంద, తక్షశిల, విక్రమశీల విశ్వవిద్యాలయాలను సందర్శించి, విలువైన పుస్తకాలను చదివేవాళ్ళని చరిత్రలో చదువుకున్నాం. అంటే మన దేశానికి చారిత్రకంగా పుస్తకంతో ఉన్న అనుబంధం వేల ఏళ్ళనాటిది.

ఏప్రిల్ 23కు ఉన్న ప్రత్యేకత ఏమిటి? ఈ రోజు ప్రపంచ సాహిత్యంలో ప్రతీకాత్మకమైనది. ప్రముఖ ఆంగ్ల రచయితలు విలియం షేక్‌స్పియర్, మిగ్యుల్ డేగెర్వం టీస్, గార్సిలాసోడీలా వేగా మరణించిన తేదీ. వీరి స్మృతికి చిహ్నంగా ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ యునెస్కో 1995లో ఈ రోజును ప్రపంచ పుస్తక దినోత్సవంగా ప్రకటించింది. మొత్తం 100 దేశాల్లో ప్రపంచవ్యాప్తంగా మొదటి ప్రపంచ పుస్తక దినోత్సవం జరిగింది. మొదటిసారిగా ఘనంగా బ్రిటన్‌లోను, అలాగే ఐర్లాండ్‌లో నిర్వహించారు.

మన జీవితంపై ఇంతటి ప్రభావం తీసుకొచ్చే పుస్తకంపై నేటి యువత ఒకింత అశ్రద్ధ కనబరచడం ఆందోళన కలిగిస్తోంది. నేడు యువత చేతిలో సెల్‌ఫోన్ చేరడం, దానిని దుర్వినియోగం చేసుకోవడం, ఫలితంగా జరుగుతున్న సంఘటనలు మనం నిత్యం చూస్తూనే ఉన్నాం. అందుబాటులోకి వచ్చిన ఓ సాంకేతిక పరిజ్ఞానాన్ని మనం ఎలా ఉపయోగించుకుంటున్నామన్నది యువత ఆలోచించాలి. ఓ చిన్న పుస్తకం మన జీవితాన్ని మారుస్తున్నప్పుడు, దానికి మనం సమయం కేటాయించలేకపోవడం అంటే, లోపం ఎక్కడుంది? మనలోనే కదా! కాబట్టి యువత పుస్తకపఠనానికి ప్రాముఖ్యం ఇచ్చి, చెడు అలవాట్లను దూరం చేసుకోవాలి. "మంచి పుస్తకం మంచి స్నేహితుడితో సమానం" కాబట్టి, అలాంటి పుస్తకాలను ఎంచుకొని ఆరోగ్యకరమైన సమాజానికి యువత నడుం బిగించాలి.

– డాక్టర్ సుంకరి రాజారామ్
ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల(స్వ), నల్గొండ

(నేడు ప్రపంచ పుస్తక దినోత్సవం)

ఆమె ఒక మహావృక్షం!

ఒక మహా వృక్షాన్ని దూరం నుంచి చూస్తే దాని వైశాల్యం, కన్ను పారినంత ప్రాంతంలో అదెలా భాగమైపోయిందనే విషయాలు తెలుస్తాయి. వ్యక్తుల విషయంలోనూ దూరం నుంచి తెలుసుకున్నప్పుడు వారి ప్రతిభాపాటవాలు, విజయాలు తెలుస్తాయి.

గత వారం ఆకస్మికంగా మరణించిన సాయి పద్మ గారి గురించి చెప్పుకోవాలంటే ఆవిడ పుట్టిన నలభై ఐదు రోజులకే పోలియో బారిన పడ్డారు. ఎన్నెన్నో సర్జరీలు, మరెన్నో ట్రీట్‌మెంట్స్ జరిగాక శరీరం పై భాగాన్ని కూడదీసుకుని వీల్ చెయిర్‌లో కూర్చోగలిగే అంతగా మాత్రమే కోలుకున్నారు. శారీరిక వైకల్యాన్ని అధిగమించి కామర్స్‌లో డిగ్రీ చేసి, ఆ పైన ఇంటెలెక్చ్యువల్ ప్రాపర్టీ, సైబర్ చట్టాలపై స్పెషలైజేషన్‌తో ఎల్ఎల్‌బిలో పట్టభద్రులయ్యారు. సంగీతం నేర్చుకున్నారు. గ్లోబల్ ఎయిడ్, బ్రేస్ టెక్ వంటి సంస్థలు స్థాపించారు. తెలుగులో కథలు, కవితలు రాశారు. సామాజిక సేవ చేశారు. వికలాంగుల హక్కుల కోసం పోరాడారు. దేశవిదేశాలలో సభలు, సమావేశాలలో తన ఆలోచనలను వందల వేల మందితో పంచుకున్నారు. బ్రేసెస్ సాయంతో నడవడంతో పాటు ఈత కొట్టడం, డ్రైవింగ్ నేర్చుకున్నారు.

నివాళి



సాయి పద్మ

ఒక వ్యక్తి జీవిత కాలంలో ఇన్ని సాధించినప్పుడు 'గొప్ప వ్యక్తి'గా, 'ప్రతిభాశాలి'గా గుర్తించబడడంలో వింత లేదు. అయితే సాయి పద్మ మరణ వార్త విన్నాక సంతాప సందేశాల దగ్గర ఆగకుండా, ఎంతో మంది ఆవేదన చెందారు. దుఃఖం వ్యక్తం చేశారు. ఆవిడ లేకపోవడం వల్ల ఏర్పడ్డ శూన్యాన్ని పూరించలేమంటూ వాపోయారు. ఎందుకని?

ఒక మహా వృక్షం కిందకు చేరుకొని తలెత్తి పైకి చూసినప్పుడే దాని దృఢమైన కొమ్మలు, ఆకులతో అల్లిన దట్టమైన పందిరి కనిపిస్తాయి. కాస్తున్న కాయలు, రాలిపోతున్న పూలు కనిపిస్తాయి. అన్నింటికన్నా ముఖ్యంగా ఆ వృక్షం ఎన్ని ప్రాణులను తల్లిగా సాకిందో, ఎన్ని పక్షులకు, జంతువులకు ఆవాసమైందో అర్థమవుతుంది.

సాయి పద్మ ఆఫ్‌లైన్ ప్రపంచంలో తన సామాజిక కార్యక్రమాల ద్వారా ఎందరికో విద్య, ఉపాధి కలిపించారు. ఆన్‌లైన్ లోకంలో వేదనాభరితమైన తన రోజూవారీ జీవితాన్ని, దానిలో జయాపజయాలను, ఆశానిరాశలను అలతి పదాలతో, ఏ మాత్రం మెలోడ్రామా లేకుండా డాక్యుమెంట్ చేసుకుంటూ పోయారు. సోషల్ మీడియా అనగానే అనవసరమైన హంగూ ఆర్భాటమే అన్న అభిప్రాయం ఏర్పడిపోయిన ఈ కాలంలో ఆవిడ ఫేస్‌బుక్ పేజ్ ఒక ఒయాసిస్. అక్కడ జీవకాంక్ష, ధైర్యం, ఓదార్పు, హాస్యం, ఊరట, ప్రేరణ అన్నీ దొరికేవి. అన్నింటికన్నా ముఖ్యంగా వైవిధ్యం, బహుళత్వం పట్ల అసహనం, ఏకపక్ష కథనాల (singular narratives) వైపే మోజు ఉన్న ఈ కాలంలో, ఆవిడ సూక్ష్మాన్ని, మరో దృక్పథాన్ని పరిచయం చేయడానికే ప్రయత్నించారు. సంక్లిష్ట ఆలోచనలనూ సరళ భాషలో వ్యక్తీకరించగలిగారు. ఉదాహరణగా ఈ మాటలు చూడండి:

'అంగవైకల్యం ఉన్న ఆడవాళ్ళను అయితే సూపర్ వుమన్‌గా, లేదంటే సూపర్ నథింగ్‌గా చూస్తారు. వాస్తవానికి రెండూ కారు'. 'మాతృత్వం అంటే పిల్లల్ని కనడమనే కాదు. మాతృత్వం మనం ప్రకృతికి స్పందించే విధానం లోనూ ఉంటుంది. మన పట్ల మన స్పందించే తీరులోనూ ఉంటుంది. ఒకరిద్దరు పిల్లలకు జన్మనిచ్చి తల్లి అవ్వడం కన్నా నా శక్తిసామర్థ్యాల మేరకు అనేక మంది అనాథలకు ఆసరా అవుదామని నిర్ణయించుకున్నాను'. 'మనసుతో పని చేయండి, మేధతో పని చేయండి అంటుంటారు. అసలు పని చేసి పెట్టే శరీరాన్ని మర్చిపోతుంటాం. మనలో అలసటను గుర్తించడం ముఖ్యం'.

అచ్చయిన పుస్తకాలు, వరించిన అవార్డులు ఒక రచయిత ప్రతిభకు ప్రధాన కొలమానంగా ఉన్న నేపథ్యంలో కూడా సాయి పద్మ రచనలు ముఖ్యమైనవి. #అమ్మకథలు, #అమ్మమ్మకథలు, #అకవిత్వం, #సాయిమ్యూజింగ్స్ వంటి హాష్ టాగులలో ఆవిడ పంచుకున్న జీవితానుభవాలు 'కంటెంట్' అన్న లేబుల్ కన్నా 'సాహిత్యం' కిందకే వస్తాయి. రచనలపై కాపీరైట్స్, మహిళా రచయితలపై సైబర్ బుల్లియింగ్ వంటి అంశాలపైన వ్యాసాలు రాయాలని అనుకున్నారు.

సాయి పద్మ అటు చేతలతోనూ, ఇటు మాటలతోనూ తన చుట్టూ ఉన్న జీవితాల్లో చైతన్యం తీసుకురావడానికి ప్రయత్నించారు. కంటికి కనిపించే అంగ వైకల్యాల గురించే కాక, మానసిక, ఆర్థిక, సామాజిక డిజబిలిటీస్ కూడా గుర్తించారు. స్త్రీలు తమ జీవితాలను డాక్యుమెంట్ చేసినప్పుడు అవి ఎందరికో ప్రేరణగా మారతాయనడానికి ఆవిడ రచనలే ఒక ఉదాహరణ. చేస్తున్న సామాజిక సేవ ద్వారానే కాకుండా, అక్షరాల మాధ్యమంతో కూడా ఎందరికో దగ్గరయ్యారు.

– పూర్ణిమ

కాకతీయుల ఆలయాల్లోనూ సూర్యతిలకం!

శ్రీరామ నవమి రోజున అయోధ్యలో బాల రాముడి నుదుటిపై సూర్య కిరణాలు ప్రసరించిన దృశ్యాలను అన్ని చానెళ్ల ప్రసారం చేశాయి. ఇటీవలికాలంలో చేపట్టిన శాస్త్ర సాంకేతిక అద్భుతమిది.

సీఎస్ఐఆర్ ఆధ్వర్యంలోని సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీబీఆర్ఐ) ఈ సూర్య తిలకం వ్యవస్థను రూపొందించింది. రామ మందిరం మూడవ అంతస్తునుంచి సూర్య కిరణాలు గర్భగుడిలోని విగ్రహం వరకు ఏటా శ్రీ రామ నవమి రోజు ప్రసరించేలా కటకాలు, అద్దాలు, గేర్ బాక్సులు, గొట్టాలు అమర్చారు. ఈ ప్రక్రియలో ఉక్కు, ఇనుము, బ్యాటరీలు, విద్యుత్తు వాడలేదని సీబీఆర్ఐ తెలిపింది. శ్రీ రామ నవమి రోజు బాలరాముడికి సూర్య తిలకం దిద్దిన ఆ దృశ్యాలు చూసి కోట్లాది మంది భావోద్వేగానికి గురయ్యారు.

ఈ నేపథ్యంలో, ఇప్పటికే ఈ పరిజ్ఞానాన్ని ఉపయోగించిన వివిధ దేవాలయాలపై చర్చ జరుగుతోంది. దేశంలో దాదాపు 800 సంవత్సరాలకు పూర్వమే దీని వాడకం మొదలైంది. ఎన్నో రాజవంశాలు తాము నిర్మించిన ఆలయాల్లో ఈ పరిజ్ఞానాన్ని ఉపయోగించాయి. ప్రధానంగా, కాకతీయులు తాము కట్టిన ఆలయాల్లో సూర్యరశ్మిని పరావర్తనం చేయించి, సూర్య కిరణాలు మూల విరాట్టుపై నేరుగా పడేలా, తద్వారా ఆలయం చీకటిగా ఉన్నా, దేవతామూర్తిని చక్కగా దర్శించుకునేలా ఏర్పాటుచేశారు. నల్లగొండ పట్టణ సమీపంలోని పానగల్లు ఛాయా సోమేశ్వరస్వామి ఆలయం ఈ విషయంలో ప్రత్యేకంగా చెప్పుకోదగినది. అరసవెల్లి సూర్యనారాయణ స్వామి ఆలయం, సింహాచలం, కోణార్క్, ఎల్లోరా గుహలు... ఇలా ఎన్నో చోట్ల ఈ విధమైన వ్యవస్థతో వందల సంవత్సరాల క్రితమే ఆలయాలను నిర్మించారు. ఎల్లోరా గుహల్లోని 10వ గుహలో ధర్మచక్రముద్రలో ఉన్న బుద్ధుడి మొఖం మీద కాంతి పడే ఏర్పాటు 7వ శతాబ్దంలోనే చేశారు. గుడిగోపురాల్ని నిర్మించిన పాలకులు ఆ రకంగా దేవతామూర్తులపై సూర్య కిరణాలు పడే ఏర్పాట్లు చేశారు. అరసవెల్లి నుండి నాగులాపురం దాకా తెలుగుగడ్డమీద ఇలాంటి ఆలయాలున్నాయి. కాకతీయ నిర్మితమైన ఆలయాలలో, వీటిలో అత్యధికం శివాలయాలు, ప్రధాన విగ్రహమైన శివలింగంపై ప్రత్యేకంగా వెలుతురు ప్రసరించేలా నిర్మించారు. ప్రధానంగా, వేయిస్తంభాల ఆలయం, రామప్ప ఆలయం, ఘనపురం దేవాలయాల్లో వెలుతురు ప్రసరించే విధానాన్ని చూడొచ్చు. నల్లగొండలోని పానగల్లు ఛాయా సోమేశ్వరస్వామి ఆలయం ఆధునిక శాస్త్రజ్ఞులను సైతం ఆశ్చర్యానికి గురిచేసే అద్భుత విశేషాలు కలిగినది. 11వ శతాబ్దంలో కందూరు చోళులు నిర్మించిన ఈ ఆలయంలో కాంతి పరావర్తనం ద్వారా స్తంభాల ఛాయ (నీడ) ఎదురుగాగల శివలింగంపై పడడం ఇక్కడి ప్రత్యేకత. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం... ఇలా ఏ వేళలోనైనా ఒకే వైపు ఛాయా పడడం ఈ ఛాయా సోమేశ్వర ఆలయం ప్రత్యేకత. సూర్య కిరణాలను పరావర్తనం చెందించడం ద్వారా నీడ అన్నివేళలా ఒకే దగ్గర పడేలా చేశారని పరిశోధకులు వెల్లడించారు. ఈ సోమేశ్వరాలయంలో 'ఏకఛాయా' స్తంభం కనిపిస్తుంది. అంతేకాదు పక్కలకు నిలబడితే మననీడ వ్యతిరేకదిశలో లోపల కనిపిస్తుంది. మధ్యలో కనిపించే నీడలో ఏ తేడా ఉండదు. నిశ్చలంగా వుంటుంది. మనుషులు, వస్తువులు కదిలేవి అడ్డొస్తే వాటి నీడలు వ్యతిరేకదిశల్లో కదులుతుంటాయి. చాలా దేవాలయాల్లో నీడలు వ్యతిరేకదిశల్లో కదిలినట్టు కనిపిస్తాయి. కాని, ఇక్కడివలె స్థిరమైన ఛాయ ఎక్కడా కనిపించదు.



అయోధ్య బాల రాముడి నుదిటిపై శ్రీరామ నవమి రోజున మాత్రమే సూర్య కిరణాలు పడేలా అక్కడి వ్యవస్థను రూపొందించారు. ఈ మెకానిజమ్‌లో భాగంగా ఆలయ మూడో అంతస్తులో ఉండే అద్దంపై పడే సూర్య కిరణాలు పలు ఇత్తడి పైపులు, కటకాల గుండా ప్రసరించి అద్దాల ద్వారా ప్రతిబింబించి రామ్‌లల్లా నుదుటన పడతాయి. ప్రస్తుత కాలంలో ఇదో గొప్ప సాంకేతిక అద్భుతం. అయోధ్య రాముడి సూర్య తిలకానికి కల్పించిన ప్రాచుర్యం పానగల్లు లాంటి దేవాలయాలకు కూడా లభించిన పక్షంలో అవి గొప్ప పర్యాటక ప్రాంతాలుగా రూపొందుతాయి. అంతేకాదు, వందలేళ్ళక్రితమే సూర్యగతిని లెక్కించి, తదనుగుణంగా నిర్మాణాలను చేపట్టిన అప్పటి ప్రతిభమీద యువతలో శాస్త్రీయ పరిశోధన ఆసక్తి కూడా పెరుగుతుంది.

■ కన్నెకంటి వెంకటరమణ
జాయింట్ డైరెక్టర్, సమాచార శాఖ, హైదరాబాద్

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru







ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
హనుమకొండ
HANUMAKONDA
మంగళవారం 23 ఏప్రిల్ 2024



అగ్రనేతలు వస్తున్నారు..

అభ్యర్థుల తరపున ప్రచారానికి రంగంలోకి ముఖ్యనాయకులు

- నేడు బీఆర్ఎస్ ప్రచారానికి మాజీ మంత్రి కేటీఆర్
- వర్ధన్నపేట, వరంగల్ తూర్పు నియోజకవర్గాల్లో కార్యకర్తల సమావేశాలు
- రేపు వరంగల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి రాక
- మడికొండలో 'జనజాతర' సభకు కాంగ్రెస్ ఏర్పాట్లు
- 25న బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ నామి ఎనేషన్
- పాల్గొననున్న ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి
- కీలకనేతల రాకతో వేడెక్కుతున్న ఓరుగల్లు రాజకీయాలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

లోక్‌సభ ఎన్నికల పోరు వేడెక్కుతోంది. నామినేషన్ల దాఖలు ప్రక్రియ ఊపందుకోవడంతో అభ్యర్థులకు మద్దతుగా ఆయా పార్టీల అగ్రనేతలు రంగంలోకి దిగుతున్నారు. వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి పోటీకి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు బరిలో నిలుస్తుండగా.. ఇప్పటికే బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ నామినేషన్ దాఖలు చేయగా, కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య ఒక సెట్ నామినేషన్ వేశారు. మరో సెట్‌ను 24న వేయనున్నారు. అదే రోజు సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనే జన జాతర బహిరంగ సభ విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ 25న తన నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ సందర్భంగా నగరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహణకు కసరత్తు చేస్తుండగా..ఈ కార్యక్రమానికి ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామీ హాజరుకానున్నారు. ఇదే క్రమంలో మంగళవారం బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతుగా కేటీఆర్ వరంగల్‌లో ప్రచారంలో పాల్గొననున్నారు. ఇలా ప్రధాన పార్టీలు పోటాపోటీగా సభలు, సమావేశాలు, ర్యాలీలకు ఏర్పాట్లు చేస్తుండటంతో ఓరుగల్లు రాజకీయాలు వేడెక్కుతున్నాయి.

నేడు ప్రచార పర్వంలోకి కేటీఆర్..

2014, 2015 ఉపఎన్నికతో పాటు 2019లో వరుసగా వరంగల్ లోక్‌సభ స్థానంలో విజయం సాధించిన బీఆర్ఎస్ ఈ సారి కూడా సత్తా చాటేందుకు ప్రయత్నిస్తోంది. తెలంగాణ ఉద్యమంలో ఎంతో కీలకంగా ఉన్న వరంగల్ పోరుగడ్డలో పట్టు సడలకుండా గులాబీ పార్టీ కసరత్తు చేస్తోంది. కడియం శ్రీహరి గులాబీ పార్టీకి హ్యాండిచ్చి కాంగ్రెస్‌లో చేరటంతో డీలా పడిన కేడర్‌లో ఉత్సాహం నింపేందుకు అధిష్ఠానం ప్రణాళిక రూపొందిస్తోంది. అందులో భాగంగానే పార్టీకి దూరమైన తాటికొండ రాజయ్యను పార్టీలోకి చేర్చుకున్నారు. కేసీఆర్‌తో పాటు కీలక నేతలతో వరంగల్ లోక్‌సభ స్థానంలో ప్రచారం నిర్వహించాలని కార్యా చరణ సిద్ధం చేస్తున్నారు. ఇప్ప టికే బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ సోమవారం నామినేషన్ దాఖలు చేయగా.. ఆయనకు మద్దతుగా ప్రచారం చేసేందుకు మంగళవారం మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వరంగల్‌కు వస్తున్నారు. మంగళవారం సాయంత్రం 4గంటలకు వర్ధన్నపేట అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం డీ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేశారు. అలాగే సాయంత్రం 6గంటలకు వరంగల్‌లోని ఉర్సు గుట్ట సమీపంలోని నాని గార్డెన్‌లో నిర్వహిస్తున్నారు. ఈ రెండు సమావేశాలకు కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొనున్నారు.

రేపు కాంగ్రెస్ జనజాతర సభ

వరంగల్ లోక్‌సభ సీటుపై కన్నేసిన కాంగ్రెస్ పార్టీ సత్తా చాటేందుకు సిద్ధమవుతోంది. 2009లో సిరిసిల్ల రాజయ్య ఎంపీగా విజయం సాధించారు. ఆ తరువాత మూడు పర్యాయాలు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ బోణీ కొట్టలేదు. దీంతో ఈసారి పక్కాగా గెలువలనే లక్ష్యంతో వ్యూహాత్మకంగా వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థిగా డాక్టర్ కడియం కావ్య పేరును అధిష్ఠానం ఖరారు చేసింది. దీంతో కావ్య ఇప్పటికే ప్రచారాన్ని ముమ్మరం చేశారు. సోమవారం మంచి రోజు కావడంతో తొలిసెట్ నామినేషన్ పత్రాలను కావ్య దా ఖలు చేశారు. బుధవారం రెండో సెట్ నామినేషన్ వేయనున్నారు. ఈ సందర్భంగా భారీగా జన సమీకరణ చేస్తున్నారు. దీంతో పాటు సాయంత్రం 4గంటలకు మడికొండలో లక్ష మందితో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనే ఈ సభకు వరంగల్ పశ్చిమ, స్టేషన్ ఘనపూర్ ని యోజకవర్గాల నుంచి భారీగా జనస మీకరణ చేసేందుకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిలు ప్రత్యేకం గా దృష్టిపెట్టారు. వరంగల్ లోక్‌సభ పరిధిలో రానున్న రోజుల్లో మరో రెండు సభలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనే అవ కాశం ఉంది. అలాగే మే మొదటివారం ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ లేదా ప్రియాంక గాంధీలలో ఒకరిని ప్రచారానికి తీసుక వచ్చేందుకు కాంగ్రెస్ అధి ష్ఠానం ప్రణాళిక రూపొందిస్తుంది. వరంగల్‌పై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి పెట్టడంతో పార్టీలోని అన్ని

మిగతా 8వ పేజీలో..





హనుమకొండలో తస్లీమా నివాసంలో సోదాలు చేస్తున్న ఏసీబీ అధికారులు

సబ్ రిజిస్ట్రార్ ఇంట్లో ఏసీబీ సోదాలు

- ఆదాయానికి మించి ఆస్తులున్నట్లు గుర్తించిన అధికారులు
- రూ.10 కోట్లకు పైగా ఆస్తి పత్రాలు స్వాధీనం



హనుమకొండ కాకతీయ కాలనీలోని తస్లీమా నివాసం

వరంగల్ క్రైం, ఏప్రిల్ 22 : గత నెల లంచం పుచ్చుకుంటూ ఏసీబీకి పట్టుబడి సస్పెండ్‌కు గురైన మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా నివాసంలో సోమవారం ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు సమాచారం అందుకున్న ఏసీబీ అధికారులు హనుమకొండలోని తస్లీమా నివాసంతోపాటు ఆమె భర్త గ్రామమైన నల్లగొండలో, భూపాలపల్లి పట్టణానికి చెందిన డాక్యుమెంట్ రైటర్ నివాసంలో ఏకకాలంలో దాడులు చేశారు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సోదాల్లో ప్రభుత్వ విలువ మేరకు రూ.2 కోట్ల 94 లక్షల 84 వేల 547 కాగా, బహిరంగ మార్కెట్ విలువ రూ.10 కోట్లకు పైగానే ఉంటుందని సమాచారం. సోదాల్లో ఐదు ఇళ్లకు సంబంధించి పత్రాలు (రూ.2కోట్ల 7లక్షల 426), ఆరు ఖాళీ స్థలాలకు చెందిన పత్రాలు (రూ.12లక్షల 1500), మూడు ఎకరాల స్థలం పత్రం (రూ.20లక్షల 40వేలు), నెట్ క్యాష్ రూ. లక్ష 92వేల 900, బ్యాంక్ బ్యాలెన్స్ రూ.98వేల 787, ఇంట్లో వస్తువులు (రూ.9 లక్షల 4,800), వాహనాలు (రూ.23లక్షల 66,218) తదితరాలకు సంబంధించిన పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం తస్లీమాకు బెయిల్ పిటిషన్ వేసే క్రమంలో ఈ దాడులు జరగడం విశేషం. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు గుర్తించిన అధికారులు మరో కేసు నమోదు చేసినట్లు తెలిసింది. మొత్తంగా సస్పెన్షన్‌కు గురై జైల్లో ఉన్న క్రమంలో ఆమె నివాసంలో ఏసీబీ సోదాలు నిర్వహించడం రిజిస్ట్రేషన్ శాఖలో హాట్ టాపిక్‌గా మారింది.

సోమవారం ఉష్ణోగ్రత	గరిష్ఠం : 40.0° C	కనిష్ఠం : 25.5° C

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్న ఇద్దరు వైద్యులపై కేసు



నెక్కొండ, ఏప్రిల్ 22 : లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న ఇద్దరు వైద్యులపై కేసు నమోదు చేస్తున్న నెక్కొండ ఎస్సై మహేందర్ సోమవారం తెలిపారు. మహబూబాబాద్ జిల్లా గూడూరుకు చెందిన దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు ఉండగా మూడోసారి గర్భం ధరించడంతో పుట్టబోయేది ఆడ, మగ బిడ్డ అనే విషయం తెలుసుకునేందుకు నెక్కొండలోని ఉపేందర్ ఆస్పత్రికి వచ్చారు. ఈనెల 17 వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్ పార్థు ఆడపిల్లని నిర్ధారించాడు. దీంతో ఆ గర్భిణి అబార్షన్ చేయించుకొనుటకు నెక్కొండలోని శ్రీవెంకటేశ్వర గ్రామీణ వైద్యశాలకు రాగా, గ్రామీణ వైద్యుడు నమస్కారం అబార్షన్ చేశారు. వైద్యం సరిగా చేయకపోవడంతో ఆమెకు తీవ్ర రక్తస్రావం జరిగి ప్రాణాపాయ స్థితికి చేరుకోవడంతో చికిత్స నిమిత్తం హన్మకొండలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. ఈ విషయమై విచారణ జరిపి గూడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.యమున నెక్కొండ పోలీసుకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.



ఉర్సులో పనులను పరిశీలిస్తున్న కమిషనర్

స్మార్ట్‌సిటీ పనులు త్వరగా పూర్తి చేయండి

- నగర కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 22 : గ్రేటర్ వరంగల్ పరిధిలోని 66 డివిజన్లలో జరుగుతున్న స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. సోమవారం గ్రేటర్ వరంగల్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కరీమాబాద్ దసరా రోడ్డు, గవిచర్ల రోడ్డులో కొనసాగుతున్న స్మార్ట్‌సిటీ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

అదే విధంగా నాయుడు పెట్రోల్‌పంపు జంక్షన్ వద్ద అభివృద్ధి పనులు త్వరగా మొదలు పెట్టాలని సూచించారు. ఖమ్మం రోడ్డు ప్రధాన రహదారిపై నిర్మిస్తున్న గ్రాండ్ ఎంట్రెన్స్ పనులను పరిశీలించారు. ఉర్సు ట్యాంక్‌బండ్ పనులను అడిగి తెలుసుకున్నారు. ఉర్సు ప్రాంతంలో 5 ఎంఎల్‌డీ ఎస్‌టీపీ ప్లాంట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి మురుగు నీరు శుద్ధీకరణ తీరును అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ వెంట ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఈఈలు శ్రీనివాస్, సంజయ్ కుమార్, డీఈలు రవికిరణ్, సారంగం, కృష్ణమూర్తి, ఏఈ ముజామిల్, శానిటరీ సూపర్‌వైజర్ మాదాసి సాంబయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకన్న, స్మార్ట్ సిటీ ప్రతినిధి ఆనంద్ ఓలేటి ఉన్నారు.



నామినేషన్ వేయడానికి వచ్చిన సందర్భంగా కడియం కావ్యతోపాటు ఎమ్మెల్యేలు



నామినేషన్ వేసిన అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న కావ్య

భారీ మెజారిటీతో గెలిపించండి

- 35ఏళ్ల తర్వాత మహిళకు పోటీ అవకాశమొచ్చింది
- వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య
- నామినేషన్ దాఖలు.. పాల్గొన్న ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు

వరంగల్ సిటీ, ఏప్రిల్ 22: వరంగల్ లోక్‌సభకు సుమారు 35ఏళ్ల తర్వాత మహిళకు పోటీచేసే అవకాశం వచ్చిందని, ప్రజలంతా తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య అభ్యర్థించారు. సోమవారం ఆమె ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, గండ్ర సత్యనారాయణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు దొమ్మాటి సాంబయ్య, రామకృష్ణ, ఈవీ శ్రీనివాస్‌లతో కలిసి కలెక్టరేట్‌కు వెళ్లి తన నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కావ్య మాట్లాడుతూ.. వరంగల్ పార్లమెంట్ పరిధిలో మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారని, తను కూడా మహిళా సమస్యలపైనే ఎక్కువగా పనిచేశానని గుర్తుచేశారు. వరంగల్ అభివృద్ధికి దోహదపడే రైల్వే ఫ్యాక్టరీ, రైల్వే డివిజన్‌గా అప్‌డేట్ చేసుకోవడం, లెదర్ పార్క్, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, ఇండస్ట్రీయల్ పార్క్, ఐటీ పార్క్ అభివృద్ధి, ఎడ్యుకేషన్ హబ్ విషయాల్లో పోరాటం చేసి వాటిని తీసుకువస్తాననన్నారు. శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎలాగైతే ఓటేసి ఎమ్మెల్యేలను గెలిపించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారో అలాగే, ఇప్పుడు కూడా కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు కృషి చేయాలని కోరారు. రాహుల్ గాంధీని ప్రధాన మంత్రి చేయాలని కోరారు. మీ ఇంటి ఆడబిడ్డగా దీవించి, మే 13న ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఓటడిగే హక్కు కాంగ్రెస్ పార్టీకే ఉందని ప్రజలు గుర్తించారన్నారు. రాష్ట్ర విభజన చట్టంలోని కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం గనులు, ట్రైబల్ యూనివర్సిటీ సమస్యను పరిష్కరించలేని అసమర్థ పార్టీ బీజేపీ అయితే ఆ పార్టీకి కొమ్ము కాసిన బీఆర్ఎస్ మరో అసమర్థ పార్టీ అని ఆ రెండు పార్టీల వారు ఏముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారో చెప్పాలన్నారు. వారు వరంగల్ ప్రజలకు క్షమాపణలు చెప్పిన తరువాతనే ఓట్లు అడాగలన్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ మాట్లాడుతూ బీజేపీ గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోయినా కల్లబొల్లి మాటలతో ఓట్లను కొల్లగొట్టేందుకు ప్రయత్నిస్తోందన్నారు. నల్లధనాన్ని ప్రతీ ఒక్కరి ఖాతాల్లో వేస్తామని, ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలిస్తామన్న బీజేపీ ఇవ్వలేదని, అలాగే గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రం కోసం అమరులైన వారి కుటుంబాలకు ఏం చేయలేదని, ఇంటికో ఉద్యోగం, డబుల్ బెడ్రూం ఇళ్లు, ఎస్సీలకు మూడెకరాల హామీలతో ప్రజలను మభ్యపెట్టిదని, బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒక్కతాను ముక్కలేనన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు మాట్లాడుతూ.. మోసపూరిత మాటలు చెప్పే కుంటికాలు కేసీఆర్ మళ్లీ వస్తున్నాడని, ఓటర్లు జాగ్రత్తగా ఉండాలన్నారు. సబ్బండవర్గాలకు న్యాయం చేసే కాంగ్రెస్‌కే ఓటేసి కడియం కావ్యను గెలిపించాలని కోరారు. మండలానికో గెస్ట్ హౌస్ కట్టుకున్న నాయకుడు ఏకంగా ఏడు నియోజకవర్గాలపై కన్ను వేశాడని, ఆయన తరిమేయాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని మారుస్తామని ఒకరు, అంబేడ్కర్ విగ్రహాలు లేకుండా చేస్తామని మరొకరు, రిజర్వేషన్లు లేకుండా చేస్తామని ఇంకొకరు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సీనియర్ నాయకుడు దొమ్మాటి సాంబయ్య మాట్లాడుతూ దేశానికి దిశ దశ చూపించింది కాంగ్రెస్సేనని, బడుగు బలహీన వర్గాల పార్టీ అని అన్నారు. అమలుకు నోచుకోని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తున్న వారికి ఓటర్లు బుద్ధిచెప్పాలన్నారు. రైతునే రాజును చేస్తా అని చెప్పి మూడు నల్ల చట్టాలను తీసుకువచ్చి 780 మంది రైతుల మరణాలు కారణమయ్యారని బీజేపీనేతలపై మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



ఆర్ట్స్ కళాశాలలో వాకర్‌ను ఓటు అడుగుతున్న అరూరి రమేష్

వరంగల్ అభివృద్ధికి బీజేపీని గెలిపించాలి

- బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 22 : వరంగల్ అభివృద్ధికి బీజేపీని గెలిపించాలని బీజేపీ ఎంపీ అభ్యర్థి ఆరూరి రమేష్ అన్నారు. హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సోమవారం ఉదయం అరూరి రమేష్ వాకర్స్‌తో కలిసి వాకింగ్ చేస్తూ ఓట్లు వేయాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా అరూరి రమేష్ మాట్లాడుతూ పదేళ్ల మోదీ పాలనలో దేశం సుభిక్షంగా, సురక్షితంగా ఉందని, అందుకు మరోసారి బీజేపీకి ఓటు వేయాలన్నారు. ఇప్పటికే ప్రధాని నరేంద్ర మోదీ కృషితో వరంగల్ నగరంలో స్మార్ట్ సిటీ, అమృత్ పథకాలతో పాటు కాజీపేటలో రైల్వే వ్యాగన్ పరిశ్రమ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ ధర్మారావుతో పాటు జిల్లా బీజేపీ నాయకులు ఉన్నారు.

25న నామినేషన్ : అరూరి

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 22 : వరంగల్ పార్లమెంట్ స్థానానికి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా అరూరి రమేష్ ఈ నెల 25న నామినేషన్ వేయనున్నారు. ఈ కార్యక్రమానికి ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ దామి హాజరుకానున్నారు. ఈ క్ర మంలో సోమవారం హనుమకొండ హంటర్‌రోడ్ లోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అరూరి రమేష్ మాట్లాడుతూ 25న హనుమకొండ వేయిస్తంభాల దేవాలయం నుంచి వరంగల్ కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి తాను నా మినేషన్ వేయనున్నానని, ఈ కార్యక్రమానికి ఉత్త రాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ దామి హాజ రవుతారని వెల్లడించారు. తాను ప్రచారానికి వెళ్లిన స మయంలో జనం నుంచి విశేష స్పందన వస్తోంద ని, వరంగల్ పార్లమెంట్ స్థానాన్ని గెలవబోతున్నా మని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హను మకొండ, వరంగల్ జిల్లాల బీజేపీ అధ్యక్షులు రావు పద్మ, గంటా రవికుమార్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్‌తో పాటు రెండు జిల్లాల బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రోకర్లు, ద్రోహులే పార్టీని వీడుతున్నారు

- భారీ మెజారిటీతో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం ఖాయం
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- బీఆర్ఎస్ అభ్యర్థి నామినేషన్‌కు తరలి వచ్చిన పార్టీ శ్రేణులు



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాంనగర్, ఏప్రిల్ 22 : బ్రోకర్లు, ద్రోహులే పార్టీని వీడుతున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ధ్వజమెత్తారు. సోమవారం వరంగల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ఏకశిల పార్కు వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో దయాకరావు మాట్లాడారు. కడియం శ్రీహరి, అరూరి రమేశ్‌ల చరిత్ర ప్రజలకు తెలుసని వారిని ఓడగొట్టాలనే కసి ప్రజల్లో వచ్చిందన్నారు. ఈ ఎన్నికల్లో వారిద్దరు నామరూపాలు లేకుండా పోతారని దుయ్యబట్టారు. కడియం శ్రీహరికి తాను రాజకీయ అవకాశాలు కల్పించానని ఆయన తెలిపారు. తనకు రావాల్సిన అవకాశాలు కడియం కోసం వదులుకున్నానని ఆయన స్పష్టం చేశారు. తనను పార్టీ మారాలని పలువురు ఒత్తిడి తెస్తున్నారని దయాకర్ తెలిపారు. ఫోన్ ట్యాపింగ్‌లో ఉన్నానని బెదించారని ఆయన పేర్కొన్నారు. కేసులకు భయపడేది లేదన్నారు. మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కేసీఆర్‌ను ఓడించి తప్పుచేశామనే భావన ప్రజల్లో వచ్చిందన్నారు. రేవంత్ ఓ బ్రోకరని ఈ ఎన్నికల్లో ఆయన మాటలు ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. వరం గల్ ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కు మార్ భారీ మెజారిటీతో విజయం సాధిస్తారని దయాకర్‌రావు ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హ నుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయభాస్కర్ మాట్లాడుతూ కార్యకర్తలు మంచి జోష్‌లో ఉన్నారని, ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ విజయం సాధిస్తాడని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను ఓడించాలనే కసి ప్రజల్లో వచ్చిందన్నారు. వెన్నుపోటు పొడిచిన ద్రోహులకు ఈ ఎన్నికల్లో గుణపాఠం తప్పదన్నారు. బీఆర్ఎస్ శ్రేణులపై కేసులు పెడితే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. కేసులకు భయపడేది లేదన్నారు. పార్టీ క్యాడర్‌ను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. అభ్యర్థి సుధీర్‌కుమార్ మాట్లాడుతూ తనను గెలిపిస్తే వరంగల్ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ చేసింది ఏమిలేదన్నారు. బీజేపీ పేదవాడి నడ్డివిరుస్తూ కార్పొరేట్లకు అండగా నిలుస్తుందన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, బస్వరాజ్ సారయ్య, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు డా.రాజయ్య, చల్లా ధర్మారెడ్డి, నన్నపునేని నరేందర్, గండ్ర వెంకటరమణారెడ్డి, నేతలు మర్రి యాదవరెడ్డి, సుందర్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి మే 22 వరకు గోల్కొండ, ఇంటర్ సిటీ రద్దు

గిర్మాజీపేట, ఏప్రిల్ 22: సికింద్రాబాద్ రైల్వే డివిజన్‌లో సోమవారం నుంచి ప్రారంభమై మే 26 వరకు జరిగే రోలింగ్ కారిడార్ బ్లాక్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 29 నుంచి మే 22వ తేదీ వరకు వరంగల్ మీదుగా సికింద్రాబాద్, గుంటూరు వెళ్లే గోల్కొండ, ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సోమవారం రాత్రి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ప్రతీ రోజు వరంగల్ మీదుగా సికింద్రాబాద్ - గుంటూరు మధ్య నడిచే గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైళ్లు, ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈ నెల 29 నుంచి మే 10 వరకు, తిరిగి మే 16 నుంచి మే 22 వరకు రద్దు చేసినట్లు తెలిపింది.

సికింద్రాబాద్-తిరుపతి రైళ్లు 28 నుంచి రద్దు

ప్రతి ఆదివారం తిరుపతి నుంచి వరంగల్ మీదుగా సికింద్రాబాద్ వెళ్లే, ప్రతి సోమవారం సికింద్రాబాద్ నుంచి వరంగల్ మీదుగా తిరుపతి వెళ్లే సికింద్రాబాద్-తిరుపతి ఏసీ స్పెషల్ రైళ్లను 28 నుంచి మే 6 వరకు, మే 19, 20 తేదీల్లో రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే వరంగల్ మీదుగా ప్రతి శనివారం నర్సాపూర్ నుంచి హైదరాబాద్, ప్రతి ఆదివారం హైదరాబాద్ నుంచి నర్సాపూర్ వెళ్లే ప్రత్యేక రైళ్లను కూడా మే 4 నుంచి 12 వరకు, మే 18, 19 తేదీల్లో రద్దు చేసినట్లు తెలిపారు.

ఫార్మసీ ప్రాక్టికల్స్‌పై వివాదం

- వర్సిటీ క్యాంపస్‌ను కాదని ప్రైవేట్ కళాశాలలో నిర్వహణ
- వర్సిటీ పరీక్షల విభాగంపై విమర్శలు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 22 : కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ విభాగంలో మరోసారి వివాదం నెలకొంది. ఫార్మసీ ప్రాక్టికల్స్ వర్సిటీ క్యాంపస్‌లోని ఫార్మసీ కళాశాలలో కాకుండా ప్రైవేట్ కళాశాలలో నిర్వహించడం వివాదాస్పమైంది. ఏప్రిల్ 18న మూడవ సెమిస్టర్ ఫార్మస్యూటికల్ ప్రాక్టికల్ పరీక్ష కేయూ ఫార్మసీ విభాగంలో జరిగగా. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి వెళ్లి తనిఖీలు చేశారు. పరీక్షల్లో అవకతవకలు జరిగాయని భావించారు. తర్వాత అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికారెడ్డి ఆయా ఫార్మసీ ప్రాక్టికల్స్ పరీక్షలను రద్దు చేశారు. అక్కడి వరకు బాగానే ఉన్న మళ్ళీ అదే పరీక్షలను తిరిగి ఏప్రిల్ 22న సోమవారం హనుమకొండలోని సెయింట్ పీటర్స్ ప్రైవేట్ ఫార్మసీ కళాశాలలో నిర్వహించారు. అయితే వర్సిటీ క్యాంపస్ ఫార్మసీ కళాశాల విద్యార్థులకు ప్రైవేట్ కళాశాలలో పరీక్షలు నిర్వహించడం వివాదాస్పదమైంది. ఆయా ప్రైవేట్ అధ్యాపకులు ఎగ్జామినర్స్‌గా వ్యవహరించారు. క్యాంపస్‌లోని సీనియర్స్ ప్రొఫెసర్స్‌ను కాదని ప్రైవేట్ కళాశాల అధ్యాపకులైన ఎగ్జామినర్స్‌తో పరీక్షలు నిర్వహించడం పలు సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే క్యాంపస్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలు మళ్ళీ క్యాంపస్‌లోనే నిర్వహించాలని అభ్యర్థించినప్పటికీ కావాలనే ప్రైవేట్ కళాశాలలో నిర్వహించారనే ఆరోపణలున్నాయి. ఇదిలా ఉండగా వర్సిటీ క్యాంపస్ ఫార్మసీ కళాశాలలో ప్రాక్టికల్స్ పరీక్షలు రాసే విద్యార్థులకు సరైన కెమికల్స్‌తో పాటు ల్యాబ్ ఎక్విప్‌మెంట్‌లు కొనుగోలు చేయడం లేదనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఫార్మసీ కళాశాలల అనుమతుల్లో అవకతవకలపై రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదులు సైతం అందాయి. ఫార్మసీ విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలకు కావాల్సిన ల్యాబ్‌తో పాటు ఇతర ఎక్విప్‌మెంట్ సెయింట్ పీటర్స్ కళాశాలలో ఉన్నాయని అక్కడే ప్రాక్టికల్స్ పరీక్షల సెంటర్‌ను ఏర్పాటు చేశామని కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికారెడ్డి తెలిపారు. అయితే కేయూ ఫార్మసీ విభాగం సూచనల మేరకే ప్రైవేట్ కళాశాలలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించామని స్పష్టం చేశారు.

ఆంధ్రజ్యోతి
మంగళవారం 23 ఏప్రిల్ 2024
7 www.andhrajyothy.com

నామినేషన్ కౌంటర్

నాలుగో రోజు (22-4-2024)

వరంగల్ (ఎస్సీ)
కడియం కావ్య (కాంగ్రెస్), మారపల్లి సుధీర్‌కుమార్ (బీఆర్ఎస్), మేకల సుమన్ (ధర్మసమాజ్ పార్టీ), మచ్చ దేవేందర్ (వీసీకేపార్టీ), తాళ్లపల్లి వెంకటయ్య, ఈసంపెల్లి వేణు, మంద నరేశ్, శనిగరపు రమేశ్ (2 సెట్లు), బొచ్చు రాజు, పొంగుల అశోక్ (స్వతంత్ర)

మహబూబాబాద్ (ఎస్టీ)
అజ్మీర సీతారం నాయక్ (బీజేపీ), పగిడి ఎర్రయ్య (యూసీసీఆర్ఐఎంఎల్), పాల్వంచ దుర్గ (స్వతంత్ర), మైపతి అరుణ్‌కుమార్ (స్వతంత్ర)

దాఖలైన మొత్తం నామినేషన్లు	వరంగల్	మహ-బాద్
	22	10



కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నేతలు

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 22 : వర్ధన్నపేట నియోజక వర్గ పరిధిలోని 56వ డివిజన్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. సోమవారం హనుమకొండలోని వర్ధన్నపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో చేరికల కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే నాగరాజు కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్, ఎన్ఎస్‌యుఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పల్లకొండ సతీశ్, పూర్ణచందర్, రమేశ్‌గౌడ్, జనార్దన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

ఉద్దండుల అడ్డా

సెగ్మెంట్ స్కాన్



అసెంబ్లీ సెగ్మెంట్లు ఇవే..

వరంగల్ లోకసభ స్థానంలో వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ వర్దన్నటపేట, స్టేషన్‌ఘనపూర్, పాలకుర్తి, పరకాల, భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. వీటి పరిధిలో కొత్తగా నమోదైన ఓటర్లను కలుపుకొని మొత్తం 18,16,543 మంది ఓటర్లున్నారు.

హనుమకొండ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : కాకతీయుల సుపరిపాలనకైనా.. కాకలుతీరిన రాజకీయానికైనా.. కదిలించే పోరాటానికైనా.. చైతన్య వేదిక వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం. 1952లో ఏర్పాటైన ఈ లోక్‌సభ స్థానానికి ఉప ఎన్నికలతో కలిపి ఇప్పటి వరకు 20 సార్లు ఎన్నికలు జరిగాయి. వీటిలో ఏడు సార్లు కాంగ్రెస్, నాలుగు సార్లు టీడీపీ మూడు సార్లు టీఆర్ఎస్ అభ్యర్థులు గెలిచారు. పీడీఎఫ్, సీపీఐ, టీజేఎస్, టీఎల్‌డీ, జనతా, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు ఒక్కోసారి గెలిచారు. ఇలా.. వరంగల్ లోక్‌సభ స్థానం పరిధిలోని ఓటర్లు అన్ని పార్టీలను అక్కున చేర్చుకున్నారు. తమ విలక్షణమైన తీర్పు ద్వారా ఆదరించారు. వరంగల్ లోక్‌సభ స్థానం ఒకప్పుడు కాంగ్రెస్‌కు కంచుకోట. రాష్ట్రంలో మారిన రాజకీయ సమీకరణాలకు అనుగుణంగా ఓటర్లూ స్పందించారు. ఆ తర్వాత టీడీపీకి, తదనంతరం టీఆర్ఎస్‌కు పెద్దపీట వేశారు. తమకు నచ్చిన అభ్యర్థిని, పార్టీని ఒకటి కన్నా ఎక్కువ సార్లు గెలిపించారు. నచ్చనివారిని ఒకసారికే ఇంటికి పంపారు. వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి రామసహాయం సురేందర్‌రెడ్డి మూడు సార్లు గెలిచారు. ఎస్‌బీ గిరి, చందూలాల్, పసునూరి దయాకర్‌ను రెండేసిసార్లు లోక్‌సభకు పంపారు.

1957లో ఏర్పాటు

1952లో వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం ఏర్పాటైంది. అప్పుడు తొలిసారి జరిగిన ఎన్నికల్లో పీడీఎఫ్ పక్షాన పెండ్యాల రాఘవరావు.. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన ప్రజాకవి కాళోజీ నారాయణరావుపై విజయం సాధించారు. 1957 ఎన్నికల్లో ఎస్ఏ ఖాన్ (కాంగ్రెస్), 1962 ఎన్నికల్లో బీపీ మీర్జా (కాంగ్రెస్), 1967లో రామసహాయం సురేందర్‌రెడ్డి (కాంగ్రెస్) 1971, 1977లో ఎస్‌బీ గిరి ఒకసారి కాంగ్రెస్, ఒకసారి టీపీఎస్ పక్షాన గెలిచారు. 1979లో జరిగిన ఉప ఎన్నికల్లో గండి మల్లికార్జున్‌రావు (కాంగ్రెస్ ఐ), 1980లో కమాలొద్దీన్ అహ్మద్ (కాం గ్రెస్ ఐ), 1984లో టి.కల్పనాదేవి (టీడీపీ) 1989లో, 1991, ఎన్నికల్లో రెండు సార్లు రామసహాయం సురేందర్ రెడ్డి (కాంగ్రెస్) 1996, 1998 ఎన్నికల్లో అజ్మీరా చందూలాల్ (టీడీపీ), 1999 ఎన్నికల్లో బోడకుంటి వెంకటేశ్వర్లు (టీడీపీ) ఎన్నికయ్యారు



పెండ్యాల రాఘవరావు | కమాలొద్దీన్ అహ్మద్ | టి. కల్పనాదేవి | అజ్మీరా చందూలాల్ | బి.వెంకటేశ్వర్లు

మారిన సీన్

2004లో నుంచి వరంగల్ లోక్‌సభ ఎన్నికల్లో సీన్ మారింది. తెలంగాణ ఉద్యమం ప్రభావం తో టీఆర్ఎస్ ఈ స్థానంలో తన బలాన్ని పెంచుకున్నది. 2004 ఎన్నికల్లో మొదటిసారి టీఆర్ఎస్ విజయం సాధించింది. ఆ పార్టీ పక్షాన డి.రవీంద్రనాయక్ పోటీ చేసి గెలుపొందారు. అయి తే 2008లో జరిగిన ఉప ఎన్నికల్లో ఎర్రబెల్లి దయాకర్‌రావు టీడీపీ పక్షాన పోటీ చేసి గెలిచారు. ఆ తర్వాత ఏడాదికే 2009 ఎన్నికల్లో జరిగిన ఎన్నికల్లో సిరిసిల్ల రాజయ్య (కాంగ్రెస్) విజయం సాధించారు. 2014 నుంచి వరంగల్‌లో సీన్ మారిపోయింది. తెలంగాణ ఉద్యమంలో భాగంగా టీడీపీని వీడి టీఆర్ఎస్‌లోకి వచ్చిన సీనియర్ నేత కడియం శ్రీహరిని ఓరుగల్లు ఎంపీగా కేసీఆర్ బరిలో దించారు. అలా కడియం వరంగల్ గడ్డపై గులాబీ జెండాను రెపరెపలాడించారు. ఏకంగా 3.92 లక్షల భారీ మెజారిటీతో గెలుపొందారు. ఈ ఎన్నికల్లో కడియంకు 6.61 లక్షల ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి సిరిసిల్ల రాజయ్యకు 2 లక్షల ఓట్లు వచ్చాయి. అయితే ఎంపీగా బాధ్యతలు చేపట్టిన కొన్నాళ్లకే రాష్ట్ర రాజకీయాల్లో వచ్చిన మార్పులతో కడియం శ్రీహరి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అయ్యారు. ఏడాది తిరక్కుండానే వరంగల్ లోక్‌సభ స్థానానికి ఉప ఎన్నికల జరిగింది. అప్పుడే పసునూరి దయాకర్‌కు అదృ ష్టం కలిసి వచ్చింది. దయాకర్‌కు 2015లో వరంగల్ లోక్‌సభ ఉప ఎన్నికలో పోటీకి టీఆర్ఎస్ అధిష్ఠానం టికెట్ ఇచ్చింది. ఈ ఉప ఎ న్నికల్లో దయాకర్ ఏకంగా 4.59 లక్షల ఓట్ల మెజారిటీతో ఘనవిజయం సాధించారు. ద యాకర్ మెజారిటీ తెలంగాణలో ఫస్ట్, బెస్ట్ రికార్డుగా నమోదైంది. ఆ తర్వాత 2019లో జరిగిన ఎన్నికల్లో దయాకర్ టీఆర్ఎస్ నుంచి రెం డోసారి అంతే ఘన విజయాన్ని సాధించారు.

కేంద్ర మంత్రులు

వరంగల్ లోక్‌సభ నుంచి పోటీ చేసి లోక్‌సభ అడుగుపెట్టిన అభ్యర్థుల్లో ఎవరూ కేంద్రమంత్రులుగా పదవిని అలంకరించకపోయినా రద్దయిన వరంగల్‌లోనూ, ఆ తర్వాత రద్దయిన హనుమకొండ లోక్‌సభ నుంచి పోటీ విజయం సాధించిన వారిలో కొందరు కేంద్ర మంత్రులుగా నియమితులయ్యారు. పీవీ నర్సింహారావు కేంద్ర మంత్రిగానే కాక, ఆ తర్వాత కాలంలో ప్రధాని పదవిని అధిష్ఠించారు. కమాలొద్దిన్ అహ్మద్ కూడా కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

మారిన సమీకరణలు

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించడంతో రాష్ట్రంలో రాజకీయ సమీకరణలు పూర్తిగా మారిపోయాయి. ఈ నేపథ్యంలో ఆ ప్రభావం వరంగల్ లోక్‌సభ స్థానంపై కూడా పడింది. రాష్ట్రంలో కాంగ్రెస్ హవా కొనసాగుతున్నందువల్ల ఈసారి ఎన్నికల్లో వరంగల్ కోటపై ఏపార్టీ జెండా ఎరుగుతుందోనన్న ఉత్కంఠ ప్రజల్లో నెలకొన్నది. బీఆర్ఎస్ నుంచి హనుమకొండ జడ్పీ ఛైర్మన్ డాక్టర్ సుధీర్ బాబు పోటీలు ఉన్నారు. బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ పోటీకి దిగారు. కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తె డాక్టర్ కడియం కావ్య రంగంలో నిలబడ్డారు. ఈ నేపథ్యంలో వరంగల్ లోక్‌సభ నుంచి పోటీ ఈసారి రసవత్తరంగా ఉండబోతోంది. ఓరుగల్లు కోటపై ఏ పార్టీ జెండా ఎగుర వేస్తుందోనన్న ఉత్సంఠ సర్వత్రా నెలకొన్నది.

- వరంగల్ లోక్‌సభ నియోజకవర్గానిది విలక్షణ తీర్పు
- ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోట
- తర్వాత టీడీపీ, బీఆర్ఎస్ పార్టీలకు పెద్ద పీట
- ప్రతీ ఎన్నికల్లో విలక్షణమైన తీర్పు ఇచ్చిన ఓటర్లు
- మహామహులను అందించిన ఓరుగల్లు కోట
- తాజాగా బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌ల పోటాపోటీ

హనుమకొండ లోక్‌సభ స్థానం రద్దు

దేశానికి ప్రధానిగా సేవలు అందించిన పీవీ నర్సింహారావు ప్రాతినిధ్యం వహించిన హనుమకొండ నియోజకవర్గం 2009 నుంచి రద్దయింది. 1977 నుంచి ఉన్న హనుమకొండ లోక్‌సభ నియోజకవర్గం నుంచి భారత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు సైతం రెండు సార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. 1977, 1980 ఎన్నికల్లో కాంగ్రెస్ పక్షాన పీవీ నర్సింహారావు పోటీ చేసి పిజనార్దన్‌రెడ్డిపై రెండు సార్లు విజయం సాధించారు. 1984లో బీజేపీ అభ్యర్థి సి.జంగారెడ్డి పీవీ నర్సింహారావుపై విజయం సాధించారు. 1989, 1991, 1996, 1998 ఎన్నికల్లో కమాలొద్దీన్ అహ్మద్ (కాంగ్రెస్) వరుసగా నాలుగు సార్లు విజయం సాధించారు. 1985లో, 1999లో టీడీపీ పక్షాన చాడా సురేష్ రెడ్డి రెండు సార్లు, 2004 సాధారణ, 2008 ఉప ఎన్నికల్లో బోయినపల్లి వినోద్‌కుమార్ టీఆర్ఎస్ పక్షాన రెండు సార్లు గెలుపొందారు. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో హనుమకొండ లోక్‌సభ స్థానం రద్దయింది.

నియోజవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	పోలింగ్ కేంద్రాలు
స్టేషన్‌ఘనపూర్	1,24,769	1,28,282	02	2,53,053	290
పాలకుర్తి	1,25,952	1,28,496	13	2,54,461	294
పరకాల	1,07,752	1,13,865	02	2,21,619	239
వరంగల్ పశ్చిమ	1,38,607	1,43,251	16	2,81,874	244
వరంగల్ తూర్పు	1,24,809	1,31,634	339	256,782	230
వర్ధన్నపేట	1,33,778	1,38,929	17	2,72,724	278
భూపాలపల్లి	1,36,273	1,39,751	06	2,76,030	317
మొత్తం	8,91,940	9,24,208	395	18,16,543	1,892

నాలుగోరోజూ నామినేషన్ల సందడి

- వరంగల్‌కు 11, మానుకోటలో నాలుగు నామినేషన్లు
- నామినేషన్ వేసిన కడియం కావ్య, సుధీర్‌కుమార్, సీతారాంనాయక్





వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్యకు నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మారపల్లి సుధీర్ కుమార్, నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య



మహబూబాబాద్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి అద్వైత్‌కుమార్ సింగ్‌కు నామినేషన్ పత్రాలను అందిస్తున్న బీజేపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్

వరంగల్ కలెక్టరేట్ / మహబూబాబాద్ టౌన్ / వరంగల్ చౌరస్తా, ఏప్రిల్ 22: పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల పర్వం ఉత్సాహంగా సాగుతోంది. నాలుగోరోజైన సోమవారం వరంగల్ పార్లమెంట్ స్థానానికి 11 నామినేషన్లు దాఖలవగా మహబూబాబాద్ స్థానానికికి నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. వరంగల్‌లో కాం గ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులతోపాటు ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులు, విడుతలై చిరుతైగల్ కచ్చి పార్టీ, ధర్మసమా జ్ పార్టీ నుంచి ఒకరు నామినేషన్ దాఖలు చేశారు. వరంగల్ కలెక్టరేట్‌లో పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాల ను స్వీకరించారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా మారపల్లి సుధీర్ కుమార్, కాంగ్రెస్ అభ్యర్థిగా కడియం కావ్య, విడుతలై చిరుతైగల్ కచ్చిపార్టీ నుంచి మచ్చ దేవేందర్, స్వతంత్ర అభ్యర్థులుగా తాళ్లపల్లి వెంకటయ్య, ఇసంపెల్లి వేణు, మంద నరేశ్, బొచ్చు రాజు, శనిగరపు రమేశ్ బాబు (రెండు సెట్లు), పొంగుల అశోక్ నామినేషన్ పత్రాలను సమర్పించారు. ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థి మేకల సుమ న్ ఈనెల 20న మొదటి సెట్ నామినేషన్ వేయగా, సోమవారం మరో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. కాగా, బీజేపీ అభ్యర్థిగా అరూరి రమేశ్ బుధ వారం నామినేషన్ దాఖలు చేయనున్నట్టు తెలిసింది. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా అజ్మీర సీతారాంనాయక్, స్వతంత్ర అభ్యర్థిగా పాల్వంచ దుర్గ, యూసీసీఆర్ఐఎంఎల్ అభ్యర్థిగా పగిడి ఎర్రయ్య, స్వతంత్ర అభ్యర్థిగా మైపతి అరుణ్‌కుమార్ నామినేషన్లు వేశారు. వారు మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో రిట ర్నింగ్ అధికారి అద్వైత్‌కుమార్‌సింగ్‌కు తమ నామినేషన్ పత్రాలు అందించారు. స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన పాల్వంచ దుర్గ ఈ నెల 19న కూడ ఒక సెట్ నామినేషన్ వేశారు. కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనా యక్ ఈ నెల 19న రెండు సెట్లు వేశారు. దీంతో ఇప్పటి వరకు ఎనిమిది మంది 10సెట్ల నామినేషన్లు వేశారు.

మంచి రోజు కావడంతో..

సోమవారం పౌర్ణమి తిథి ప్రవేశించడంతో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్‌తోపాటు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్ల దాఖలు సందర్భంగా పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు కాళోజీ జంక్షన్ వరకు ర్యాలీగా వచ్చారు. వరంగల్ కలెక్టరేట్ పరిసర ప్రాంతా లలో ఎన్నికల కోడ్ ఉండటంతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారులపై బారికేడ్లు ఏ ర్పాటు చేసి నామినేషన్ దాఖలు చేయడానికి వెళ్లే అభ్య ర్థితోపాటు మరో నలుగురికి మాత్రమే పోలీసులు అనుమతించారు.

రోడ్డుపైనే మీడియా సెంటర్ ..

వరంగల్ పార్లమెంట్‌కు అభ్యర్థులు తమ నామినేషన్ల దాఖలు చేసిన అనంతరం మీడియాతో మాట్లాడటానికి కలెక్టరేట్ బయట రోడ్డుపైనే మీడియా పాయింట్ ఏర్పాటు చేశారు. అసలే వేసవి కాలం పెద్ద సంఖ్యలో పోలీసులు, పెద్ద సంఖ్యలో ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా ఉండడం పార్టీల అభ్యర్థులు, ఎమ్మెల్యేలు, నాయకులు మీడియా పాయింట్‌లోనే సమావేశం నిర్వహించారు. తాగునీరు, తగినన్ని కుర్చీలు లేకపోవడంతో అంద రూ ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



కడియం కావ్య నామినేషన్ కార్యక్రమంలో సాంబయ్య, రామకృష్ణ తదితరులు

టికెట్ ఆశించినవారే కావ్యకు మద్దతుగా..

- చక్రం తిప్పుతున్న కడియం శ్రీహరి

వరంగల్ సిటీ, ఏప్రిల్ 22: వరంగల్ ఎంపీ సీటును ఆశించిన భంగపాటుకు గురైన ఆశావాహులే సోమవారం కాంగ్రెస్ అభ్యర్థిగా తొలి నామినేషన్ సెట్‌ను దాఖలు చేసిన కడియం కావ్యకు మద్దతుగా నిలువడం ఆసక్తిని కలిగించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అయ్యాక వచ్చిన ఈ ఎన్నికలు ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంది. వరంగల్ ఎంపీ టికెట్ కోసం 40మంది దరఖాస్తు చేసుకున్నా, రేవంత్‌రెడ్డికి సన్నిహితంగా ఉన్న దొమ్మాటి సాంబయ్యకు వస్తుందని అందరు అనుకున్నారు. అలాగే డాక్టర్‌గా మంచి పేరు తెచ్చుకున్న పెరుమాండ్ల రామకృష్ణ పేరు కూడా తెరపైకి వచ్చింది. అందరి ఊహాలకు చెక్ పెడుతూ వ్యూహాత్మకంగా మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి కుమార్తె డాక్టర్ కడియం కావ్యకు పార్టీ టికెట్ కేటాయించారు. కావ్యకు ప్రకటించినప్పటి నుంచి అలుకబూనిన ఆశావాహులతో కడియం శ్రీహరి జరిపిన చర్చలు ఫలించాయి. ఈ నేపథ్యంలోనే కావ్య నామినేషన్ కార్యక్రమానికి దొమ్మాటి సాంబయ్య, పెరుమాండ్ల రామక్రిష్ణ హాజరయ్యారు. టికెట్ ఆశించిన ఆశావాహులు ఒక్కొక్కరిగా కడియం కావ్యకు మద్దతుగా నిలిచేందుకు ముందుకువస్తుండడంతో కాంగ్రెస్ క్యాడర్‌లో ఉత్సాహం ఉరుకలేస్తోంది. కాంగ్రెస్ టికెట్ ఆశించిన మిగితా ఆశావాహులతో కడియం శ్రీహరి చర్చలు జరుపతున్నట్లు సమాచారం.

ప్రతిష్టాత్మకంగా కాంగ్రెస్ జన జాతర సభ

- పాల్గొననున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- జన సమీకరణకు ఏర్పాట్లు : వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, హనుకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి
- సభ ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యేలు

మడికొండ, ఏప్రిల్ 22: మడికొండలో బుధవారం కాంగ్రెస్ జనజాతర సభను ప్రతిష్టాత్మంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, హనుకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కే. ఆర్. నాగరాజు, కడియం శ్రీహరి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, పార్టీ నేతలు కూచన రవళి తదితరులతో కలిసి సభా ఏర్పాట్లను పరిశీలించారు. ఈసందర్భంగా నాయిని విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 24న వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య నామినేషన్‌ను పురస్కరించుకొని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వరంగల్‌కు వస్తున్నారని తెలిపారు. అందులో భాగంగా మడికొండలో జన జాతర సభను నిర్వహిసున్నామన్నారు. ముఖ్యమంత్రితో పాటు జిల్లా మంత్రి కొండా సురేఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు ధనసరి అనసూయ(సీతక్క), దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, కేంద్ర నేతలు దీపాదాస్ మున్షీ, రోహిత్ చౌదరి సభలో పాల్గొంటారని తెలిపారు. వర్ధన్నపేట, వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, పరకాల, భూపాలపల్లి, స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాల నుంచి లక్ష మంది పైచిలుకు జన సమీకరణకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. సభకు వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా అన్ని చోట్ల మంచినీటి వసతి కల్పిస్తున్నామన్నారు. సభా ప్రాంగణంలో రెండు లక్షల నీటి ప్యాకెట్లు, రెండు లక్షల మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. అలాగే ప్రతీ నియోజకవర్గం నుంచి వచ్చే వారికి విడివిడిగా పార్కింగ్ ఏర్పాట్లు చేశామన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కే. ఆర్. నాగరాజు పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ సమస్యలు ఎదురు కాకుండా పర్యవేక్షిస్తారని తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జిల్లాను ఆరు ముక్కలు చేయడంతో ఇరవై ఏళ్ళు వెనక్కి వెళ్లిందన్నారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి జన జాతర సభ దోహదం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కుర్ల మోహన్, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, గుర్రం అమర్‌నాథ్, పల్లపు రాజేందర్, ఏడబోయిన ప్రభాకర్, వస్కుల నాగరాజ్, వస్కుల శ్రీను, నీలం వేణు తదితరులు పాల్గొన్నారు.



సభ ఏర్పాట్ల గురించి ఎమ్మెల్యేలు కె. ఆర్. నాగరాజ్, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలతో చర్చిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



ఆటో డ్రైవర్ల ఘర్షణ

ధర్మసాగర్, ఏప్రిల్ 22: ప్రయాణికులను తీసుకెళ్లే కిరాయి విషయంలో ఇరువురు ఆటో డ్రైవర్ల మధ్య సోమవారం గొడవ జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ధర్మసాగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ రమేశ్ బస్టాండ్ నుంచి వడ్డేపల్లికి ఆటోలో ప్రయాణికులను తీసుకెళ్లడానికి కిరాయి మాట్లాడుకుని ఎక్కించుకున్నాడు. ఈ క్రమంలో మరో ఆటోడ్రైవర్ శ్రీనివాస్ తక్కువకు తీసుకెళ్తానని ప్రయాణికులతో చెప్పడంతో రమేశ్ ఆటోలోంచి దిగిపోయారు. దీంతో ఇరువురు ఆటోడ్రైవర్ల మధ్య మాటామాట పెరిగి గొడవకు దారితీసింది. ఈ క్రమంలో శ్రీనివాస్, రమేశ్ ముఖంపై కొట్టడంతో పళ్లు విరిగి రక్తస్రావం జరుగగా ఆస్పత్రికి తరలించారు.

బెల్ట్ షాప్ నిర్వాహకురాలిపై కేసు

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 22: ఎలాంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్న మహిళపై హనుమకొండ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనంప్రకారం.. సోమవారం బస్టాండ్ ప్రాంతంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా పక్కా సమాచారం మేరకు లక్ష్మీపురం ప్రాంతంలో వేముల సారమ్మ ఇంట్లో తనిఖీ చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సారమ్మపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బాలికను చైల్డ్‌లైన్‌కు అప్పగించిన ఆర్పీఎఫ్



బాలికను చైల్డ్‌లైన్‌కు అప్పగించిన పోలీసులు

కాజీపేట, ఏప్రిల్ 22: ఇంట్లో చెప్పకుండా పారిపోయి రైలులో ప్రయాణిస్తున్న ఓ బాలిక (17)ను ఆర్పీఎఫ్ సిబ్బంది అదుపులోకి తీసుకుని చైల్డ్‌లైన్‌కు అప్పగించారు. కాజీపేట ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఎం.సంజీవరావు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ నుంచి దానాపూర్ వెళ్తున్న దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో సోమవారం ఓ బాలిక ఒక్కతే టిక్కెట్ లేకుండా ప్రయాణిస్తోందని తోటి ప్రయాణికులు ఆర్పీఎఫ్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లు వి.వెంకట్, ప్రియాంక కాజీపేటలో ఆగివున్న రైలులోకి వెళ్లి బాలికను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి వివరాలు సేకరించారు. ఆ బాలిక ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రియాపాండెగా గుర్తించారు. ఇంట్లో వాళ్లు తనకు ఇష్టంలేని వివాహం చేయడానికి నిర్ణయించడంతో పారిపోయి వచ్చానని బాలిక వారికి తెలిపింది. దీంతో ఆర్పీఎఫ్ సిబ్బంది కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి బాలికను చైల్డ్‌లైన్‌కు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ సంజీవరావు తెలిపారు.

మనువాద ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడాలి

▸▸ టీపీఎఫ్ రాష్ట్ర కోకన్వీనర్ రమాదేవి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నేతలు

వడ్డేపల్లి, ఏప్రిల్ 22 : మనువాద ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ (టీపీఎఫ్) రాష్ట్ర కో కన్వీనర్ బి.రమాదేవి అన్నారు. ఫాసిజానికి వ్యతిరేకంగా ఈనెల 28న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీపీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర సదస్సుకు సంబంధించిన కరపత్రాలను సోమవారం హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాల నాయకులతో కలిసి ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో భారత్ బచావో నేత వెంగళ్ రెడ్డి, చైతన్య మహిళా సంఘం నాయకురాలు కళ, ప్రజా సంఘాల నాయకులు ప్రవీణ్, గద్దల సంజీవ, జయంత్, సదానందం, సుదర్శన్‌రెడ్డి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

మసీదు అక్రమాలపై విచారణ జరిపించాలి

▸▸ ముస్లిం మత పెద్దలు ఖలీల్ అహ్మద్, ఖాజా ఖుస్రు

వడ్డేపల్లి, ఏప్రిల్ 22: వరంగల్ సెంట్రల్ జైలు ఎదురుగా ఉన్న రంగంపేట మసీదులో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని రంగంపేట ముస్లిం మత పెద్దలు మహ్మద్ ఖలీల్ అహ్మద్, ఖాజా ఖుస్రు తదితరులు హనుమకొండ కలెక్టర్ సిక్తాపట్నాయక్‌తో పాటు సీపీ అంబర్ కిశోర్ ఝాకు విజ్ఞప్తి చేశారు. సోమవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మసీదు నిర్మాణం పేరుతో కమిటీ బాధ్యులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కమిటీ పదవి కాలం ముగిసినప్పటికీ కమిటీ బాధ్యులుగా చలామణి అవుతూ మసీదు నిర్మాణం కోసం వచ్చిన విరాళాలను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. మట్టెవాడ పోలీసులకు పాత కమిటీపై ఫిర్యాదు చేశామని అయినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఖాజా పాషా, ఇమ్రాన్‌పాషా, మీర్ ఇంతియాజ్ అలీ, గౌస్, ఇక్బాల్ పాషా, మహ్మద్ అలీ, ఎస్‌కే షాహబుద్దీన్, అబ్దుల్ మసూద్, మహ్మద్ హాజీ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టులోకి దూసుకెళ్లిన కారు

▸▸ నూతన వధూవరులతో సహా ఐదుగురికి తీవ్ర గాయాలు

మానకొండూర్, ఏప్రిల్ 22 : కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలంలోని గట్టుదుద్దెనపల్లి వద్ద నూతనంగా నిర్మిస్తున్న కల్వర్టులోకి కారు దూసుకెళ్లిన సంఘటనలో నూతన వధూవరులతో సహా ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. హనుమకొండకు చెందిన దామెర తిలక్, స్వాతిల వివాహం ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో జరిగింది. సోమవారం వధూవరులు, వరుడి తల్లిదండ్రులు దామెర సురేందర్, దామెర కౌసల్యతో పాటు పెళ్లి కూతురు చెల్లెలు విద్య కలిసి కారులో ఐదుగురు హనుమకొండకు బయలు దేరారు. మండలంలోని గట్టుదుద్దెనపల్లి ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద జాతీయ రహదారిపై పనులు నడుస్తుండగా నూతనంగా నిర్మిస్తున్న కల్వర్టులోకి కారు దూసుకపోయింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురికి తీవ్రగాయాలు కాగా కారు నుజ్జునుజ్జు అయింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజుకుమార్ తెలిపారు.

రేవంత్‌రెడ్డి సభను జయప్రదం చేయాలి

▸▸ అన్ని వర్గాలు తరలిరావాలి

▸▸ కేటీఆర్ క్షమాపణలు చెప్పాకే వరంగల్ రావాలి

▸▸ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 22 : మడికొండలో ఈ నెల 24న టీపీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనే జనజాతర సభను జయప్రదం చేయాలని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కోరారు. సోమవారం సాయంత్రం హనుమకొండలోని డీసీసీ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సాయంత్రం 3 గంటలకు సభ ప్రారంభం కానున్నట్లు తెలిపారు. రేవంత్‌రెడ్డి సభకు అన్ని వర్గాల ప్రజలు తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. వరంగల్ లోక్‌సభ ఎన్నిక క్రమంలో జరిగే ఈ సభకు పార్టీ శ్రేణులు డివిజన్ల వారీగా అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. ఈ నెల 23న వరంగల్‌కు వస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ముందుగా జిల్లా ప్రజలకు క్షమాపణలు చెప్పాలని రాజేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆ తరువాతే వరంగల్‌లో అడుగు పెట్టాలన్నారు. పదేళ్ల పాలనలో వరంగల్ జిల్లా అభివృద్ధిని విస్మరించి దోపిడీచేసిన కేటీఆర్ క్షమాపణలు చెప్పాల్సిందేనని ఖరాకండిగా చెప్పారు. బీఆర్‌ఎస్, బీజేపీ రెండూ ఒక్కటై ప్రజలను వంచించాయని మండిపడ్డారు. దేశంలో మత విద్వేషాలను రెచ్చగొడుతున్న బీజేపీకి లోక్‌సభ ఎన్నికల్లో తగిన గుణపాఠం లభించనుందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి డాక్టరు కడియం కావ్యను గెలిపించడం ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నుంచి వరంగల్ అభివృద్ధి కోసం అధికనిధులు సమకూర్చుకునే అవకాశం ఉంటుందన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ దేశ ప్రజలంతా మోదీని గద్దె దించాలనే కృత నిశ్చయంతో ఉన్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కత్తి వెంకటస్వామి, ఎర్రబెల్లి స్వర్ణ, కూచన రవళి, డాక్టరు పులి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిట్‌లో వర్క్‌షాప్ ప్రారంభం



వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 22: విద్యార్థులు, ప్రొఫెసర్ల జ్ఞానాన్ని పెంపొందించడం కోసం వర్క్‌షాప్ దోహద పడుతుందని నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి అన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెకానికల్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో అడిటివ్ మ్యాను ఫ్యాక్చరింగ్ భాగాల పోస్ట్-ప్రాసెసింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కమ్యూటేషనల్ టెక్నిక్స్‌పై రెండు వర్క్‌షాప్‌లు సోమవారం ప్రారంభం అయ్యాయి. ప్రారంభ సెషన్‌లో ఐఐటీ మద్రాస్‌లోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ జీఎల్.శామ్యూల్, ప్రొఫెసర్ ఎస్‌కె. పాల్, ప్రొఫెసర్ వి.సురేశ్‌బాబు హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలకు భారత ప్రభుత్వం వనరులను అందించడం ఉపకరిస్తుందన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 60 మంది రీసెర్చ్ స్కాలర్లు, అధ్యాపకులు హాజరయ్యారు. వర్క్‌షాప్‌నకు సమన్వయకర్తలుగా డాక్టర్ మంజయ్య, డాక్టర్ గంగాధరుడు, డాక్టర్ శివరామన్ వ్యవహరిస్తున్నారు.

కమ్యూనిస్టు నేత లెనిన్ సేవలు మరువలేనివి

▸▸ సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి



లెనిన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

న్యూశాయంపేట, ఏప్రిల్ 22: పేదరికం, మతం, జాతి, వర్ణ అసమానతలు లేని దోపిడీ రహిత సమాజం కోసం పరితపించిన గొప్ప కమ్యూనిస్టు ప్రపంచ మహానేత లెనిన్ అని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐజిల్లా కార్యాలయంలో సోమవారం లెనిన్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా లెనిన్ చిత్రపటానికి భిక్షపతి పూలమాల వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. లెనిన్ స్ఫూర్తితో అంతరాలు లేని సమాజం కోసం ప్రజలను చైతన్యం చేయాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు రహమాన్, బాషబోయిన సంతోష్, వేల్పుల చరణ్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు ఫోర్ట్‌పోలియో జడ్జిని కలిసిన బార్ ప్రతినిధులు

వరంగల్ లీగల్, ఏప్రిల్ 22 : వరంగల్, హనుమకొండ బార్ అసోసియేషన్ల అధ్యక్ష, కార్యదర్శులు, ఇతర ప్రతినిధులు పోర్ట్‌పోలియో జడ్జి జస్టిస్ మౌసమి భట్టాచార్యను సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఉభయ జిల్లాల న్యాయ స్థానాల్లో నెలకొన్న పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. న్యాయమూర్తిని కలిసిన వారిలో వరంగల్, హనుమకొండ బార్ అసోసియేషన్ల అధ్యక్షులు తీగల జీవన్‌గౌడ్, మాతంగి రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శులు లాడె రమేష్, ముదసర్ అహ్మద్, బార్ కౌన్సిల్ సభ్యులు, ఇతర కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

వరంగల్ లీగల్, ఏప్రిల్ 22 : పాత కక్షలు దృష్టిలో పెట్టుకొని ఒకరిని హత్య చేసిన వ్యక్తికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.4వేల జరిమానా విధిస్తూ రెండవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి(ఎస్సీ, ఎస్టీ కోర్టు) న్యాయమూర్తి మనిషా మెహర సోమవారం తీర్పు వెలువరించారు. కేసు వివరాలు ఈ విధంగా ఉన్నాయి. 2017 నవంబరు 7న సాయంత్రం 6.30గంటలకు చింతగట్టు గ్రామానికి చెందిన నద్దునూరి మురళి కిషన్‌పూర ఆటోఅడ్డా వద్ద నిలబడి ఉన్నాడు. అదేసమయంలో చింతగట్టుకు చెందిన జనగాని సృజన్ పాత కక్షలు మనసులో పెట్టుకొని మురళిపై కత్తితో దాడి చేశాడు. తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చేరిన మురళి చికిత్స పొందుతూ మరణించాడు. దీంతో మృతుడి సోదరుడు నద్దునూరి రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితుడు సృజన్‌పై కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితుడికి జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. దర్యాప్తు అధికారిగా వై. సతీష్ వ్యవహరించగా పీపీ ఎం.సత్యనారాయణ కేసు వాదించారు.

బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శిగా మల్లికార్జున్‌రావు



వడ్డేపల్లి, ఏప్రిల్ 22 : గ్రేటర్ వరంగల్ 57వ డివిజన్ వికాస్‌నగర్ ప్రాంతానికి చెందిన అల్లం మల్లికార్జున్‌రావు బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ ఆదేశం మేరకు బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి పూర్ణాచారి సోమవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన బీజేపీ రాష్ట్ర, జిల్లా నేతలు గై సారంగపాణి, మ్యాదరబోయిన మధు, చంద్ర యాదవ్, బాసెట్టి మల్లయ్యలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం

▸▸ ఓటరు అవగాహన ర్యాలీలో అదనపు కలెక్టర్ రాధిక గుప్తా



ఓటరు అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 22: ప్రజాస్వామ్యంలో ఓటు అనేది వజ్రాయుధమని అదనపు కలెక్టర్ రాధిక గుప్తా అన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, మహిళా, శిశు సంక్షేమ శాఖలు సంయుక్తంగా ఓటు చైతన్యంపై స్వీప్ ఆధ్వర్యంలో సోమవారం ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. సుబేదారిలోని ఆర్ట్స్ కళాశాల ప్రాంగణం నుంచి ప్రారంభమైన ర్యాలీని అదనపు కలెక్టర్ రాధిక గుప్తా జెండాఊపి ప్రారంభించగా కలెక్టరేట్ వరకు సాగింది. అనంతరం అదనపు కలెక్టర్ రాధిక గుప్తా మాట్లాడుతూ రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన ప్రతీ ఓటరు తప్పకుండా ఓటు వేసి ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలన్నారు. మే 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకుని పక్కనున్న ఓటర్లను కూడా ఓటు వేసే విధంగా చూడాలన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కళాకారులు ఓటరు చైతన్యంపై పాటలు పాడి ఆకట్టుకున్నారు. కలెక్టరేట్ ముందు కోలాటం ఆడి సందడి చేశారు. ట్రాన్స్‌జెండర్లు, సీనియర్ సిటిజన్లు, కోలాట బృందాలు నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీఆర్డీవో, స్వీప్ నోడల్ అధికారి నాగ పద్మజ, అడిషనల్ డీఆర్‌డీ ఓ శ్రీనివాసరావు, డీపీఓ లక్ష్మీరమాకాంత్, జిల్లా సంక్షేమ అధికారి మధురిమ, అధికారులు పాల్గొన్నారు.

భూమిని అందరం కాపాడుకోవాలి

▸▸ కలెక్టర్ సిక్తా పట్నాయక్



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 22: సమస్త ప్రాణకోటికి ఆధారమైన భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా ప్లాస్టిక్ వాడమని కలెక్టర్‌తో పాటు ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ ప్లాస్టిక్‌తో పాటు పర్యావరణానికి పెనుముప్పును కలిగించే అనర్థాలను నియంత్రించినప్పుడే ధరిత్రి బాగుంటుందన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కలెక్టరేట్‌లో ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు చేపట్టి, గత నాలుగు నెలల నుంచి ప్లాస్టిక్ నిషేధం అమలు చేస్తున్నామన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించడంలో అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నారన్నారు. ప్లాస్టిక్ నియంత్రణతో పాటు తడి, పొడి చెత్త నిర్వహణపై అవగాహన అవసరం అన్నారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పర్యావరణ హితమైన సంచులను కలెక్టర్ చేతుల మీదుగా వివిధ శాఖల అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, వెంకట్ రెడ్డి, ఐటీడీఏ పీవో చిత్రా మిశ్ర, డీఆర్‌వో వైవీ గణేష్, డీఆర్డీవో నాగ పద్మజ, జిల్లా సంక్షేమ అధికారి కె.మధురిమ, అదనపు డీఆర్డీవో శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఐనవోలు, ఏప్రిల్ 22: కొండపర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1992-93 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం జరుపుకున్నారు. పూర్వవిద్యార్థులు ఒకచోట చేరి చదువుకున్న రోజుల్లోని చిన్ననాటి జ్ఞాపకాలు నెమరేసుకొని మురిసిపోయారు. ఆ రోజుల్లో పాఠశాలలో చదువు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు.

పాఠశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

ఐనవోలు, ఏప్రిల్ 22: ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ ఉన్నత ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సోమవారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా జరుపుకున్నారు. ఏడాది చివరన ఫలితాలు తెలిపే రోజున యూనివర్సిటీ విద్యార్థుల స్నాతకోత్సవం వలే నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులు ప్రత్యేక డ్రెస్ కోడ్ ధరించి పట్టాలు పొందారు. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయుడు కె.ప్రతాప్‌రత్నకుమార్ అధ్యక్షత వహించగా ఉపాధ్యాయులు ఆరోగ్యమ్మ, యాదమ్మ, వెంకటనారాయణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యాసంస్థ నిర్వాహకుడిపై ఎస్సీ, ఎస్టీ కేసు

వరంగల్ క్రైం, ఏప్రిల్ 22: కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రైవేటు విద్యాసంస్థ నిర్వాహకుడిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. స్టేషన్ పరిధిలోని చింతగట్టు సమీపంలో ఆ విద్యాసంస్థ నిర్వాహణలోపంపై విద్యార్థి సంఘ నేత బొట్ల మనోహర్ ఈనెల 19న ప్రశ్నించారు. విద్యాసంస్థ నిర్వాహకుడిని ప్రశ్నించినందుకు తనను కులం పేరిట దూషించినట్లు సోమవారం కేయూ పోలీసులకు మనోహర్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిర్వహకుడిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.



హసన్‌పర్తి సదస్సులో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

బీజేపీకి ఓటేస్తేనే మాదిగలకు న్యాయం

▸▸ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

హసన్‌పర్తి, ఏప్రిల్ 22 : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటువేస్తేనే మాదిగలకు న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. సోమవారం హసన్‌పర్తిలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అనుబంధ సంఘాల సదస్సు జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నరేంద్రమోదీ నాయకత్వంలోనే మాదిగలంతా పనిచేయాలని కోరారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు మొదటి నుంచి మాదిగలను మోసం చేస్తూ, ఉద్యమాన్ని అణగదొక్కారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలిచేదిలేదూ.. గెలిచినా వాళ్ళు కేంద్రంలో చేసేది ఏమిలేదన్నారు. ఎందుకంటే వాళ్ళు ఎన్‌డీఏ, ఇండియా కూటముల్లో లేరన్నారు. బీఆర్‌ఎస్ ఇప్పుడు ఉనికిని కోల్పోయే పార్టీ అని పేర్కొన్నారు. మాదిగ బిడ్డలు బీఆర్‌ఎస్‌కు, కాంగ్రెస్‌కు ఓట్లు వేయాల్సిన పనిలేదని అన్నారు. వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేశ్‌ను అధిక మెజార్టీతో గెలిపించి నరేంద్ర మోదీకి మాదిగల తరుపున బహుమతిగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ జాతీయ నాయకులు మంద కుమార్ మాదిగ, బండారి సురేందర్ మాదిగ, అంబాల చంద్రమౌళి, తిరుపతి, చాడ ఏలియా, వేల్పుల నూరన్న తదితరులు పాల్గొన్నారు.

నామమాత్రంగా సర్వసభ్య సమావేశం

ధర్మసాగర్, ఏప్రిల్ 22 : వైస్ ఎంపీపీ రవీందర్ అధ్యక్షతన సోమవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నామమాత్రంగా ముగిసింది. మండలంలో 19మంది సర్పంచ్‌లు, 13మంది ఎంపీటీసీలు ఉండగా, సర్పంచ్‌ల పదవీ కాలం ఇటీవల ముగియడంతో వారికి సమావేశంలో పాల్గొనలేదు. 13 మంది ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యుడితో కలిపి 14 మంది ఉన్నారు. ఆరుగురు ఎంపీటీసీలు మాత్రమే హాజరు కావడంతో వ్యవసాయ, పశు సంవర్ధశాఖ, ఐసీడీఎస్, పీఆర్, విద్యాశాఖలపై సమీక్షను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అనిల్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అగ్రనేతలు వస్తున్నారు..

(5వ పేజీ తరువాయి)

వర్గాలు సమ న్వయంతో ముందుకు సాగుతుండటంతో క్యాడర్‌లో ఉత్సాహం ఉరకలేస్తుంది.

బీజేపీ బైక్‌ర్యాలీకి ఉత్తరాఖండ్ సీఎం

వరంగల్ పార్లమెంట్ స్థానంలో పాగా వేయాలనే లక్ష్యంతో పావులు కదుపుతున్న బీజేపీ బీఆర్‌ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను పార్టీలో చేర్చుకుని, అభ్యర్థిగా బరిలో దింపింది. ఇప్పటికే అరూరి రమేష్ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల కేంద్రాలతో పాటు మండలాలు, గ్రామాల్లో కూడా పర్యటనలు, రోడ్‌షోలు నిర్వహిస్తున్నారు. 40ఏళ్ల తరువాత వరంగల్ లో గెలుస్తామనే నమ్మకం బీజేపీ శ్రేణుల్లో కనిపి స్తోంది. ప్రధానంగా పట్టణ ఓటరుపై బీజేపీ దృష్టి పెట్టింది. ఈ నేపథ్యం లో ఈ నెల 25వ తేదీన బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి హాజరుకా నున్నారు. అదే రోజు వరంగల్, హనుమకొండ నగరాల్లో భారీ బైక్ ర్యాలీ నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే మే మొదటి వారంలో హోం మంత్రి అమిత్‌షా లేదంటే బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో బహిరంగ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మే 9న లేదా 10వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీంతో వరంగల్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించాలని బీజే పీ యోచిస్తుంది. ఇక ఈ సభాపర్వంలో బీజేపీ నేతలతో పాటు ఎంఆర్‌పీఎస్ నేతలు పాలుపంచుకోనున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులకు మద్దతుగా ప్రచారంలో పాల్గొనేందుకు అగ్రనేతలు ఓరుగల్లు బాట పడుతుండటంతో రాజకీయాలు వేడెక్కుతున్నారు. నేతల విమర్శలు, ప్రతి విమర్శలకు తోడు అగ్రనేతల పర్యటనలు రాజకీయం రసకందాయంగా మారనుంది.



ప్రతిజ్ఞ చేస్తున్న కరస్పాండెంట్ డాక్టర్ పాక వెంకటేశ్వర్లు, విద్యార్థులు

నక్కలగుట్ట వివేకానంద స్కూల్ విద్యార్థుల ఓటు ప్రతిజ్ఞ

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 22 : హనుమకొండ నక్కలగుట్టలోని వివేకానంద స్కూల్ విద్యార్థులు సోమవారం వినూత్నంగా ఓటు విలువను తెలియజెప్పారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పాక వెంకటేశ్వర్లు, సామాజిక వేత్త నిమ్మల శ్రీనివాస్‌లు నెల రోజుల పాటు ఓటర్లలో ఓటుపై అవగాహన పెంచే కార్యక్రమం చేపట్టారు. దీనిలో భాగంగా సోమవారం పాఠశాలలో విద్యార్థులకు వారి తల్లిదండ్రుతో ఓటు వేయించే విధంగా అవగాహన కల్పించారు. అలాగే ఓటుపై ప్రతిజ్ఞ చేయించారు. ఉపాధ్యాయుల మాట విద్యార్థులకు బ్రహ్మ వాక్కని ప్రతిజ్ఞ మేరకు విద్యార్థులందరూ వారి తల్లిదండ్రులతో మే 13న జరిగే ఎన్నికల్లో ఓటు వేయిస్తారని కళాశాల కరస్పాండెంట్ పాక వెంకటేశ్వర్లు, సామాజికవేత్తనిమ్మల శ్రీనివాస్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాక పద్మ, అనిత, షభానా బాను, శ్రీనివాస్,నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాల అమలుకు కృషి

▸▸ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సాంబశివరావు

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 22: ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను జిల్లాలో సంపూర్ణంగా అమలు చేసి వంద శాతం లక్ష్యాలను పూర్తి చేయడం జరిగిందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.సాంబశివరావు తెలిపారు. హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ బి.సాంబశివరావు విధులు చేపట్టి సోమవారం నాటికి రెండేళ్లకు చేరింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కార్యక్రమాలను జిల్లాలో ప్రతిష్టంగా అమలు చేసి ప్రజలకు మెరుగైనా సేవలు అందించామన్నారు. ప్రధానంగా ఆస్పత్రి ప్రసవాలు పెరిగేలా చర్యలు తీసుకున్నామన్నారు. 6123 ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రిలో జరగగా, 6019 ప్రసవాలు ప్రైవేట్‌లో జరిగాయని వివరించారు. పిల్లలకు, గర్భిణులకు ఇచ్చే వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని 100శాతం సాధించడం జరిగిందన్నారు. ఆరోగ్య మహిళా కార్యక్రమం కిందా 20,417 మంది మహిళలు చికిత్స పొందారని, కంటి వెలుగు కార్యక్రమంలో 4,21,655 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 61,730 మందికి దగ్గర చూపు అద్దాలు, 36,109 మందికి ప్రిస్కిప్షన్ అద్దాలు అందజేశామని వివరించారు. హనుమకొండ ప్రసూతి ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన టీ హబ్‌లో 63 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నామని, అన్ని అర్బన్ సెంటర్లు, ప్రైమరీ హెల్త్ సెంటర్ల నుంచి రక్త నమూనాలు సేకరిస్తూ ఇక్కడికి పంపించడం జరుగుతుందన్నారు.

మహిళా ఉద్యోగికి టోకరా

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 22 : అత్యాశకు పోయి ప్రభుత్వ మహిళా ఉద్యోగి డబ్బులు కాజేసిన ఘటన హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఆదర్శ కాలనీకి చెందిన ప్రభుత్వ ఉద్యోగి సెల్ నంబర్‌కు గుర్తు తెలియని వ్యక్తి నుంచి జనవరి 30న డబ్బులు ఇన్వెస్ట్ చేస్తే రెట్టింపు అవుతాయని మెసేజ్ వచ్చింది. అత్యాశకు పోయిన బాధిత మహిళ సమారు రూ.లక్ష వరకు పలు దఫాలుగా గూగుల్‌పే, ఫోన్‌పే ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసింది. డబ్బులు తిరిగి రాకపోవడంతో సోమవారం హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మలబద్ధకం, అతి వేడి లేదా అతి చల్లని నీళ్లతో స్నానం చేయడం వల్ల గుండె మీద ఒత్తిడి పడే సమస్య ఉన్నవాళ్లు ఓ పక్క హృద్రోగానికి మందులు వాడుకుంటూనే, గుండెకు చేటు చేసే అలవాట్లను మానుకోవాలి.

హార్ట్ కేర్

హృద్రోగులకు బాత్రూమ్ గండం



ఉదయాన్నే బాత్రూమ్‌లో కాలకృత్యాలు తీర్చుకోవడం లేదా స్నానం చేయడం లాంటి సాధారణ పనులు హృద్రోగులకు ప్రమాదకరంగా పరిణమించవచ్చు. ఈ ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ఉండాలంటే ఏం చేయాలో, ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో వైద్యులు వివరిస్తున్నారు.

కార్డియాక్ అరెస్ట్ ఎక్కడైనా, ఎప్పుడైనా జరగవచ్చు. కానీ రోజు మొత్తంలో ఉదయం వేళ గుండె పోట్లు, కార్డియాక్ అరెస్టులు తలెత్తే అవకాశాలు ఎక్కువ. గుండె కొట్టుకోవడం ఆగిపోయే ఇలాంటి పరిణామాలు బాత్రూమ్‌ను ఉపయోగించే సందర్భంలోనే ఎక్కువగా చోటు చేసుకుంటూ ఉంటాయి. స్నానానికి లేదా కాలకృత్యాలు తీర్చుకోవడం కోసం బాత్రూమ్‌లోకి అడుగు పెట్టిన పెద్దలు అక్కడే కుప్పకూలిపోయి, ప్రాణాలొదిలేసిన సందర్భాలు కూడా ఉంటూ ఉంటాయి. అదృష్టవశాత్తూ కొందరు పెద్దలు స్పృహ కోల్పోవడం లేదా కోలుకుని కుటుంబ సభ్యులను అప్రమత్తం చేయడం లాంటివి చేయగలుగుతారు. కానీ ప్రధానంగా ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా చూసుకోవాలి. ఒకవేళ తలెత్తితే, వీలైనంత త్వరగా చికిత్స అందేలా చేయాలి. హృద్రోగులకు ఎంత త్వరగా వైద్య చికిత్స అందించగలిగితే గుండెకు జరిగే నష్టాన్ని అంత మెరుగ్గా నివారించగలుగుతాం!

మలబద్ధకం మూలంగా...

మలవిసర్జన సమయంలో మలబద్ధకం మూలంగా ముక్కడం చేస్తే, ఆ ఒత్తిడి మూలంగా రక్తపోటులో ఒడిదొడుకులు ఏర్పడతాయి. ముక్కడం మొదలుపెట్టిన వెంటనే రక్తపోటు పెరిగిపోతుంది. ముక్కడం కొనసాగిస్తే, పెరిగిన రక్తపోటు తిరిగి విపరీతంగా పడిపోతుంది. రక్తపోటులో ఇంతటి వ్యత్యాసాలు గుండె మీద ప్రభావాన్ని చూపిస్తాయి. మరీ ముఖ్యంగా గుండెకు రక్తాన్ని చేరవేసే రక్తనాళాల్లో అడ్డంకులు ఉన్నవాళ్లు, హార్ట్ ఫెయిల్యూర్ సమస్య ఉన్న వాళ్లు.. ఈ రెండు కోవలకు చెందిన వాళ్లకు ఈ పరిస్థితి ప్రమాదకరం. రక్తనాళాల్లో అడ్డంకులు ఉన్నవాళ్లలో రక్తపోటులో హెచ్చుతగ్గుల వల్ల గుండె మీద ఒత్తిడి పెరిగి అది స్ట్రోక్‌కు దారి తీయవచ్చు. రక్తాన్ని పంప్ చేసే శక్తి లోపించిన, బలహీనమైన గుండె కలిగి ఉన్నవాళ్లలో ముక్కడం మూలంగా పెరిగిన రక్తపోటు వల్ల పంపింగ్ మరింత సన్నగిల్లుతుంది. కాబట్టి ఈ రెండు సమస్యలున్నవాళ్లు మలబద్ధకం లేకుండా మలవిసర్జన సాఫీగా జరిగేలా చూసుకోవాలి.



గోరువెచ్చని నీళ్లే సురక్షితం

తాపమానాల్లో హెచ్చుతగ్గుల ప్రభావం రక్తనాళాల మీద పడుతుంది. చల్లదనంతో రక్తనాళాలు కుంచించుకుపోతే, వేడి వల్ల రక్తనాళాలు విప్పారతాయి. గుండె సమస్యలున్న వాళ్లు ఈ రెండు పరిస్థితులకూ దూరంగా ఉండాలి. చల్లనీళ్ల స్నానం చేసినప్పుడు, రక్తనాళాలు ముడుచుకుపోయి రక్తపోటు పెరుగుతుంది. అప్పటికే గుండె పోటు, ఫెయిల్యూర్ చరిత్ర ఉన్న వాళ్లలో ఆ సమస్యలు పెరిగి గుండె పోటు రావచ్చు లేదా గుండె ఫెయిల్ అయిపోవచ్చు. అలాగే మరింత వేడిగా ఉండే నీళ్లతో స్నానం చేసినప్పుడు కూడా ఇవే సమస్యలు తలెత్తవచ్చు. ఎక్కువ వేడి కలిగి ఉన్న నీళ్లతో స్నానం చేసినప్పుడు రక్తనాళాలు విప్పారి, రక్తపోటు పడిపోతుంది. కాబట్టి మరీ చల్లగా లేదా మరీ వేడిగా ఉన్న నీళ్లతో కాకుండా గోరువెచ్చని నీళ్లతోనే స్నానం చేయాలి.

లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదు

హృద్రోగులు స్వల్ప మార్పులను కూడా కుటుంబ సభ్యుల దృష్టికి తీసుకువెళ్లాలి. అవేంటంటే...

- ఛాతీలో నొప్పి
- అకస్మాత్తుగా శ్వాసలో ఇబ్బంది తలెత్తడం
- మైకం
- వాంతులు

వేగస్ నాడి వల్ల...

శరీరంలో వేగల్ యాక్టివిటీ పెరిగినప్పుడు, న్యూరోకార్డియోజెనిక్ సింకోప్ అనే పరిస్థితి తలెత్తుతుంది. మెదడు నుంచి పొట్ట వరకూ కొనసాగే ఈ పొడవాటి వేగల్ నాడి, ముక్కుతూ మూత్రవిసర్జన, మలవిసర్జన చేసే సమయాల్లో ప్రేరేపితమవుతూ సదరు వ్యక్తులు స్పృహ కోల్పోయేలా చేస్తుంది. అయితే ఇది ప్రాణాంతకమైన పరిస్థితి కాదు. తాత్కాలికంగా స్పృహ కోల్పోయినా, తిరిగి నిమిషంలో మేల్కొని బాత్రూమ్ నుంచి బయటకు రాగలుగుతారు. కానీ ఇదే పరిస్థితి హృద్రోగుల్లో తలెత్తడం ప్రమాదకరం.



బాత్రూమ్ కేర్

గుండె జబ్బుల నుంచి కోలుకుంటున్న వాళ్లు, లక్షణాలు ఇంకా సమసిపోని వాళ్లు తప్పనిసరిగా కుటుంబ సభ్యుల పర్యవేక్షణలో నడుచుకోవాలి. కుటుంబ సభ్యులు కూడా హృద్రోగులను ఓ కంట కనిపెడుతూ ఉండాలి. తీవ్రమైన గుండె సమస్య ఉన్నవాళ్లు కాలకృత్యాలు, స్నానపానాలను తగిన పరికరాల సహాయంతో, పడక మీదే ముగించుకోవడం ఉత్తమం. ఒకవేళ బాత్రూమ్‌కు వెళ్లగలిగే ఓపిక ఉంటే...

- బాత్రూల్‌లో బెల్ ఏర్పాటు చేయాలి
- బాత్రూమ్‌లో ఫోన్ సౌలభ్యం చేతికి అందుబాటులో ఉండాలి
- పెద్దలు సెల్‌ఫోన్ ఉపయోగించడం నేర్చుకోవాలి
- పడిపోయినప్పుడు దెబ్బలు తగలకుండా పదునైన కొక్కేలు లాంటివి బాత్రూమ్‌లో లేకుండా చూసుకోవాలి
- హృద్రోగులు బాత్రూమ్ తలుపు గడి పెట్టుకోకూడదు
- పెద్దలు బాత్రూమ్‌లో నుంచి బయటకు రావడం ఆలస్యమైతే, వెంటనే కుటుంబ సభ్యులు అప్రమత్తం కావాలి
- అసహజ లక్షణాలను వ్యక్తం చేసేలా కుటుంబసభ్యులు పెద్దలను ప్రేరేపించాలి
- బాత్రూమ్‌లో టైమర్ లేదా అలారంను సెట్ చేసుకోవాలి
- పైకి లేవడానికీ, పట్టుకుని నడవడానికీ బాత్రూమ్ బయట, లోపల రైలింగ్స్ ఏర్పాటు చేయాలి

మూల కారణాలను సరిదిద్ది

మలబద్ధకం, అతి వేడి లేదా అతి చల్లని నీళ్లతో స్నానం చేయడం వల్ల గుండె మీద ఒత్తిడి పడే సమస్య ఉన్నవాళ్లు ఓ పక్క హృద్రోగానికి మందులు వాడుకుంటూనే, గుండెకు చేటు చేసే అలవాట్లను మానుకోవాలి. మలబద్ధకం తలెత్తకుండా చూసుకోవాలి. తాగే నీళ్ల మీద నియంత్రణ, శరీరంలో నీటి శాతాన్ని తగ్గించే మందుల వాడకం, ఎక్కువ సమయాల పాటు మంచానికే పరిమితమవడం, మందులు, ఆకలి లోపించడం, జీర్ణకోశానికి సరిపడా రక్తప్రవాహం లోపించడం లాంటివన్నీ మలబద్ధకానికి దారి తీస్తాయి. కాబట్టి అత్యంత సహజంగా తలెత్తే మలబద్ధక సమస్యను హృద్రోగులు తేలికగా తీసుకోకుండా, వైద్యుల సూచన మేరకు సుఖ విరోచనానికి తోడ్పడే మందులు వాడుకోవాలి. ఆహారంలో పీచుపదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి.

డాక్టర్ ఎ. శరత్ రెడ్డి
సీనియర్ కన్సల్టెంట్
ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్,
మెడికవర్ హాస్పిటల్స్,
హైదరాబాద్.

ఆలస్యం ప్రాణాంతకం

హృద్రోగుల్లో సమస్య తలెత్తినప్పుడు వీలైనంత వేగంగా చికిత్సను అందించాలి. స్పృహ కోల్పోయి తిరిగి మేల్కొన్నా, కింద పడిపోయి తిరిగి లేచినా, ఆ విషయాలను కూడా వైద్యుల దృష్టికి తీసుకువెళ్లాలి. అలాగే సరైన పద్ధతిలో ఆస్పత్రికి తరలించి, సత్వర చికిత్స అందించాలి.

పడుకోబెట్టి: సమస్య తలెత్తినప్పుడు హృద్రోగులను హడాహుడిగా ఆస్పత్రికి తరలించడం సరి కాదు. బాత్రూమ్‌లో పడిపోయిన పెద్దలను మంచం మీద పడుకోబెట్టి, విశ్రాంత స్థితిలోనే ఆస్పత్రికి తరలించాలి. అలా కాకుండా నెమ్మదిగా నడిపించి, కార్లో కూర్చోబెట్టి ఆస్పత్రికి తీసుకొచ్చేస్తూ ఉంటారు. ఇలా చేయడం వల్ల రక్తపోటులో హెచ్చుతగ్గులు జరిగి, గుండె మీద ఒత్తిడి పెరిగి, పరిస్థితి మరింత విషమించవచ్చు.



స్ట్రెచర్‌లు, చక్రాల కుర్చీలు: అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి తరలించే సమయంలో అంబులెన్స్‌కు కబురు పెడుతూ ఉంటారు. అంబులెన్స్ వచ్చేలోగా, ఆలస్యానికి తావు లేకుండా, రోగిని ట్రాలీ మీద విశ్రాంత స్థితిలో సిద్ధంగా ఉంచితే, అంబులెన్స్‌లోకి ఎక్కించడం తేలికవుతుంది. అందుకోసం నివాస ప్రాంతాల్లో, హౌసింగ్ సొసైటీల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్‌లు, వీల్ చైర్స్, స్ట్రెచర్‌లు అందుబాటులో ఉంచుకోవాలి. ఇవి ఉన్నప్పటికీ సొసైటీలో ఎక్కడున్నాయో, వాటినెలా ఉపయోగించాలో తెలిసిన వాళ్లు తక్కువ. కాబట్టి ఫెసిలిటీ మేనేజర్‌తో పాటు, ప్రతి ఒక్కరికీ వాటి వివరాలు, వాడకం గురించి తెలిసి ఉండాలి.

అవేర్‌నెస్

ఎలాంటి వంటపాత్రలు సురక్షితం?

అల్యూమినియం, స్టీల్, నాన్ స్టిక్, చేత ఇనుము, మట్టి.. ఇలా వంటలకు ఎన్నో రకాల ప్రాతలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ఏది సురక్షితం?

అల్యూమినియం: అద్భుతంగా వేడిని సంగ్రహించే గుణం కలిగిన అల్యూమినియం ఆమ్లగుణం కలిగిన పదార్థాలకు రియాక్ట్ అవుతూ ఉంటుంది. కాబట్టి ఈ పాత్రలను నాన్ రియాక్టివ్ కోటింగ్ లేకుండా వాడకూడదు. ఈ కోటింగ్ లేని అల్యూమినియం పాత్రల్లో వంటలు వండితే, ఈ లోహం ఆహారంలో కలిసిపోయి, హై బ్లడ్ అల్యూమినియంకు దారి తీస్తుంది. ఈ పరిస్థితి అల్జీమర్స్ సమస్యను తెచ్చి పెడుతుంది.



స్టెయిన్‌లెస్ స్టీల్: ఇది వంటపాత్రల తయారీకి సురక్షితమైన లోహం. అయితే ఉప్పని, ఆమ్లగుణం కలిగిన పదార్థాలను వండితే, పాత్రలోని నికెల్, క్రోమియంలు కొద్ది పరిమాణాల్లో ఆహారంలో కలిసే అవకాశం ఉంటుంది. అయితే ఇవి సురక్షితమైన పరిమాణాల్లోనే ఉంటాయి కాబట్టి ప్రమాదం ఉండదు. కానీ ఈ రెండు లోహాల పట్ల రియాక్షన్ కలిగిన వాళ్లు స్టీల్ పాత్రలను వంటకు ఉపయోగించకూడదు.

రాగి: ఆమ్ల గుణం కలిగిన పదార్థాలతో రియాక్ట్ అవకుండా ఉండడం కోసం వీటికి స్టీల్ లేదా టిన్ పైపూత వేస్తూ ఉంటారు. ఇలా పైపూత వేయని రాగి పాత్రలను వాడితే శరీరంలో కాపర్ టాక్సిసిటీ పెరిగి, వాంతులు, విరోచనాలు వేధిస్తాయి. పొట్ట, కాలేయ సంబంధ సమస్యలు కూడా మొదలవుతాయి.

నాన్‌స్టిక్ కుక్‌వేర్: టెఫ్లాన్ కోటింగ్ ఉన్న నాన్‌స్టిక్ పాత్రలు వేడెక్కినప్పుడు విషపూరిత వాయువులను వెలువరిస్తాయి. ఈ వాయువులు పాలిమర్ ఫ్యూమ్ ఫీవర్ అనే శ్వాససంబంధ సమస్యలను కలిగిస్తాయి. కాలేయ కేన్సర్, రొమ్ము కేన్సర్, థైరాయిడ్ సమస్యల ముప్పు కూడా ఎక్కువే! కాబట్టి ఈ పాత్రలను తక్కువ వేడితో వాడుకోవాలి.

ఇనుము: ఐరన్ లోపాన్ని అరికట్టే పాత్రలివి. ఆమ్ల గుణం కలిగిన పదార్థాలను ఈ పాత్రల్లో వండడం వల్ల పదార్థాల్లోని ఐరన్ మోతాదు పెరుగుతుంది. అయితే ఈ పాత్రలను ఉపయోగించే ముందు అవి శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. ఆక్సిడైజ్డ్ పొర ఏర్పడే వీలు లేకుండా వాటిని ఎప్పుడూ పొడిగా ఉంచాలి.

పింగాణీ: కొన్ని సెరామిక్ పైపూతల్లో సీసం, క్యాడ్మియంలు ఉంటాయి. వీటితో బ్రెయిన్ డ్యామేజ్ మొదలు కొన్ని రకాల కేన్సర్లు తలెత్తే ప్రమాదం ఉంటుంది.

మట్టి: పదార్థాలకు ప్రత్యేకమైన రుచిని తెచ్చి పెట్టే పాత్రలివి. సరైన పద్ధతిలో తయారుచేసిన మట్టి పాత్రలు నూరు శాతం సురక్షితమైనవి. కొన్ని మట్టి పాత్రల్లో క్యాడ్మియం, సీసం ఉండే అవకాశాలుంటాయి. కాబట్టి పాత్ర ఎలాంటి మట్టితో తయారైందో తెలుసుకోవాలి.

హెల్త్ వెల్త్

వాము టీ తాగితే...

కప్పు వేడి నీళ్లలో ఒక టీస్పూను వాము వేసి, కొద్ది సేపటి తర్వాత వడగట్టి, తేనె కలిపి, పరగడుపున తాగితే, కడుపుబ్బరం, ఛాతీ మంట, మలబద్ధకం వదులుతాయి. వాములోని థైమాల్, జీర్ణశక్తిని మెరుగు పరిచి పొట్ట నొప్పిని తగ్గిస్తుంది. వేసవిలో మందగించే ఆకలిని ప్రేరేపిస్తుంది. వాముకు ఉండే డైయ్యూటిక్ గుణం వల్ల, శరీరంలోని విషాలన్నీ బయటకు వెళ్లిపోతాయి. ఫలితంగా మెటబాలిజం పెరిగి, అధిక బరువు అదుపులోకొస్తుంది. కాబట్టి వేసవిలో పరగడుపున వాము తేనీరు తాగడం అలవాటు చేసుకోవాలి.



నిరాశ, నిస్సహాయతలు... మానసిక కుంగుబాటుకూ, ఆత్మహత్య ప్రయత్నానికీ ప్రధాన సంకేతాలు. నా సమస్య పరిష్కారమయ్యే మార్గాలే లేవు, నా సమస్యను ఎవరూ పరిష్కరించలేరు... లాంటి నిరాశ, నిస్సహాయతలు జీవితం మీద విరక్తిని కలిగిస్తాయి. నిజానికి ఆత్మహత్యకు ముందు, ఈ నిరాశ, నిస్సహాయ స్థితులకు లోనవకుండా ఉండడం కోసం, సదరు వ్యక్తులు వీలున్న ప్రయత్నాలన్నీ చేసే ఉంటారు. అందుకోసం చేసిన ప్రయత్నాలు ఫలితాన్నివ్వని సందర్భాల్లోనే ఆత్మహత్య ఆలోచనలు మొదలవుతాయి. అయితే ఆ ఆలోచనలు నిర్ణయానికి దారి తీయకుండా ఉండాలంటే ఎవరికి వారు కొన్ని లక్షణాలను గమనించుకోవాలి. అవేంటంటే...

మనసు అలసిపోయిందా?

- ఇష్టపడి చేసే పనుల మీద ఆసక్తి, ఏకాగ్రత తగ్గుతాయి
- జీవితం బోర్‌గా, ఖాళీగా అనిపించడం
- మనసులోని బాధను ఇతరులతో పంచుకోడానికి వెనకాడడం, సిగ్గుపడడం
- చేద్దామని మొదలుపెట్టిన పనిని, మధ్యలోనే వదిలేస్తూ ఉండడం
- నిద్ర పట్టకపోవడం, ఆకలి లేకపోవడం
- శ్రేయస్సును కోరే వ్యక్తులతో సైతం మనసులోని బాధను పంచుకోవాలని అనిపించకపోవడం
- ఎవరికి చెప్పినా ప్రయోజనం ఉండదు, నా సమస్యను ఎవరూ తీర్చలేరు అనే సైలకాజికల్ లోన్లీనెస్‌కు గురవడం
- చనిపోవడమే పరిష్కారం అనే ఆలోచన కలగడం

ఆత్మహత్యను ఆపొచ్చు

ఎవరికి వారు ఒంటరితనం తాలూకు డిప్రెషన్ లక్షణాలను గ్రహించినప్పుడు, వాటిని తమలోనే దాచుకోకుండా, సన్నిహితులు, స్నేహితులు, కుటుంబసభ్యులకు తెలియపరచాలి. అన్నిటికంటే ముఖ్యంగా ఒంటరితనానికి లోనై, మనసు కుంగిపోయినప్పుడు, మనసును మెలిపెట్టే బాధను ఇతరులతో మాటల్లో వ్యక్తపరచాలి. ఇందుకు సిగ్గుపడకూడదు. గుండె, కాలేయం, మూత్రపిండాలు.. ఈ అవయవాలన్నీ పని చేసీ, చేసీ ఎలా అలసిపోతాయో, మెదడు కూడా ఒక సమయానికి అలసిపోతుంది. ఆ పరిస్థితిని డిప్రెషన్ లాంటి పేర్లతో సంబోధించవలసిన అవసరం కూడా లేదు. గుండె ఉన్న వాళ్లకు గుండె సమస్యలు ఎంత సహజమో, మనసు ఉన్న ప్రతి ఒక్కరికీ మానసిక సమస్యలు అంతే సహజం అనే విషయాన్ని అర్థం చేసుకోవాలి. కాబట్టి అలసిన మనసు సేద తీరడం కోసం మనసు విప్పి మాట్లాడాలి.

కొట్టిపారేయకూడదు

డిప్రెషన్‌కు లోనై మనసులోని బాధను వెళ్లబోసుకుందామనుకునే వ్యక్తులు, ఆత్మన్యూనతకు, సిగ్గుకు లోనవుతారు. కానీ బాధను బయటపెట్టే వారి మాటలను కొట్టిపారేయకూడదు. డిప్రెషన్‌ను... అంతగా పట్టించుకోవలసిన అవసరం లేని విషయంగానో, పనిలేని వాళ్లు అవసరానికి మించి ఆలోచించి తెచ్చుకునే సమస్యగానో తేలికగా తీసిపారేసేలా మాట్లాడకూడదు. బదులుగా సదరు వ్యక్తి, ఇటీవలి కాలంలో అనుకోని ఒత్తిడికీ, బాధకూ, ఊహించని పరిణామానికీ లోనయ్యారా? అనేది గమనించాలి. దీర్ఘకాలికంగా హుషారు తగ్గినా, ఆసక్తి లోపించినా, మాటల్లో, ప్రవర్తనలో తేడాలు కనిపించినా, చనిపోతానని పదే పదే అంటున్నా, ఉద్యోగానికీ, కాలేజీకి వెళ్లకపోతున్నా, గదిలో ఒంటరిగా ఉండిపోతూ, ఎక్కువగా మొబైల్ ఫోన్‌తో గడుపుడూ, కదిలిస్తే కంటతడి పెట్టుకుంటూ ఉంటే, ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే అప్రమత్తం కావాలి. సాధారణంగా ఎవరైనా మానసికంగా కుంగిపోయినప్పుడు, అందరూ చుట్టూ చేరి, భుజం తట్టి, భరోసా ఇచ్చి ఎవరి దారిన వాళ్లు వెళ్లిపోతారు. కానీ అలా చేతులు దులుపుకుని వెళ్లిపోకుండా, డిప్రెషన్‌కు గురైన వ్యక్తి చెప్తున్నది సానుకూలంగా వినాలి.

మానసికం




అంతకంటే ముఖ్యంగా వైద్య సహాయం అవసరమనే నమ్మకాన్ని వాళ్లకు కలిగించాలి.

ఒంటరితనం ఇలా దూరం

- అభిరుచులు ఏర్పరుచుకోవాలి
- నచ్చిన పనులు చేయడానికి పూనుకోవాలి
- సోషల్ గ్రూప్స్ ఏర్పరుచుకోవడం, స్పోర్ట్స్ యాక్టివిటీస్‌లో పాలుపంచుకోవడం చేయాలి
- బుక్ ఫ్రెండ్స్, పెన్ ఫ్రెండ్స్‌ను పెంచుకోవాలి
- అభిప్రాయాలూ, అభద్రతాభావాలను సన్నిహితులతో పంచుకుంటూ ఉండాలి
- పరిస్థితుల ప్రభావంతో ఆవరించే ఒంటితనం తాత్కాలికం అనే విషయాన్ని అర్థం చేసుకోవాలి.

క్యాన్సర్‌పై విజయభేరి!

"ప్రతి రోగి నాకు ఒక కొత్త సవాలు. ఈ ప్రపంచానికి చెప్పటానికి ఒక ప్రత్యేకమైన కథ. అనుభూతి చెందటానికి ఒక కొత్త ఆశాకిరణం. నేర్చుకోవటానికి కొత్త పాఠం. ఆకాంక్షించడానికి కొత్త ప్రేరణ. పరిపక్వత సాధించటానికి కావాల్సిన కొత్త అంతర్దృష్టి." అంటారు డాక్టర్ సచిన్ మర్దా. ప్రతి రోగిని- 'మరో కేసుగా' కాకుండా- మానవతా కోణంలో చూసే డాక్టర్లు తక్కువ మంది ఉంటారు. పైగా డాక్టర్ సచిన్ స్పెషాలిటీ అంకాలజీ (క్యాన్సర్ రోగ చికిత్స). ఎక్కువ మంది రోగులు చివరి దశలోనే డాక్టర్ దగ్గరకు వస్తారు. అలాంటి స్పెషాలిటీలో- క్యాన్సర్ చికిత్స ద్వారా అనేక మంది రోగులను రక్షించిన డాక్టర్ సచిన్ రాసిన పుస్తకమే- "ఐ యామ్ అన్‌స్టాపబుల్ టుగెదర్ వికెన్". ఈ పుస్తకంలో కేవలం అనుభవాలు మాత్రమే కాకుండా- క్యాన్సర్ చికిత్సలో వచ్చిన ఆధునిక మార్పులు, చికిత్సా విధానంలో వస్తున్న ఆధునిక పద్ధతులు, రోగులతో పాటుగా వారి కుటుంబ సభ్యులకు ఉండాల్సిన ఆత్మస్థైర్యం మొదలైన విషయాలన్నింటినీ కూడా ఆ పుస్తకంలో వివరించారు. డాక్టర్ సచిన్ రాసిన ఈ పుస్తకాన్ని తెలుగులోకి -జర్నలిస్ట్ రచనా ముడుంబై- అనువదించారు.



ఐయామ్ అన్‌స్టాపబుల్ టుగెదర్ వికెన్
రచయితలు: డాక్టర్ సచిన్ మర్దా
రచన మంకాని
అనువాదం: రచన ముడుంబై
పబ్లిషర్: గురుకూల్ పబ్లిషింగ్
ధర: రూ. 1749

ఈ పరీక్షలు ఏడాదికోసారి

ముంచుకొచ్చే అనారోగ్య ముప్పును ముందుగానే పసిగట్టాలంటే ఏడాదికోసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. ఆ ఆరోగ్య పరీక్షలు ఏవంటే...

కంప్లీట్ బ్లడ్‌కౌంట్: తెల్ల, ఎర్ర రక్త కణాలతో పాటు, ప్లేట్‌లెట్‌ల మోతాదును కచ్చితంగా లెక్కించే పరీక్ష ఇది. అనీమియాతో పాటు, బ్లడ్ కేన్సర్ మొదలైన ప్రాణాంతక వ్యాధులను సైతం ఈ పరీక్షతో తేలికగా పసిగట్టవచ్చు.

లిపిడ్ ప్రొఫైల్: రక్తంలోని కొలెస్ట్రాల్, ట్రైగ్లిసరైడ్స్ మోతాదును కనిపెట్టే పరీక్ష ఇది. ఈ మోతాదులు పెరగడం గుండె జబ్బుకు సూచన. కాబట్టి ఈ పరీక్షతో రాబోయే గుండె జబ్బులను ముందుగానే పసిగట్టవచ్చు.



విటమిన్ డి: ఆస్టియొపొరోసిస్ అనే ఎముకలు గుల్లబారే సమస్యను ఈ పరీక్షతో తెలుసుకోవచ్చు.

థైరాయిడ్: థైరాయిడ్ గ్రంథి అవసరానికి మించి పని చేస్తోందా లేదంటే, పనిచేయడం మందగించిందా అనేది తెలుసుకోడానికి ఈ పరీక్ష సహాయపడుతుంది.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/eUgITJZలో చదవండి.



చింటూ: అన్నియ్యకు అర్థ బలం, అంగబలం లేవంటరా.. పాపం కదూ!
చిన్నా: తొడుక్కోవడానికి చొక్కా, వేసుకోవడానికి చెప్పులూ లేవంటాడేమో... చూడు మరి!
చింటూ: సొంత మీడియా కూడా లేదంట!
చిన్నా: ఆయనది మీడియానే కాదు.. అంతా రోత అని ఒప్పుకొన్నాడన్న మాట!
చింటూ: సరేగానీ... ఆయన చానల్‌లో పెద్దాయన బొమ్మ తీసేశారే!
చిన్నా: చెల్లీతల్లీ దూరమయ్యారు కదా! ఇక ఆయన మాత్రం ఎందుకనుకున్నాడో ఏమో!
చింటూ: అన్నియ్య పేదల పక్షపాతి., అప్పులు అబద్ధాలు చెప్పడంట!
చిన్నా: కాస్త గ్యాప్ ఇవ్వరా సామీ... నవ్వీనవ్వీ పొట్ట నొప్పొస్తోంది!

పెమ్మసాని ఆస్తులు 5,705 కోట్లు

- అమెరికా, హైదరాబాద్, గుంటూరులో చంద్రశేఖర్‌కు ఆస్తులు
- దేశంలోని టాప్ ధనిక ఎంపీ అభ్యర్థుల్లో ఒకరు
- గుంటూరు టీడీపీ ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు



గుంటూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): గుంటూరు లోక్‌సభ అభ్యర్థిగా టీడీపీ తరఫున ప్రవాస భారతీయుడు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల సంఘానికి ఆయన సమర్పించిన అఫిడవిట్‌లో మొత్తం ఆస్తులను రూ.5,705.47 కోట్లుగా పేర్కొన్నారు. మొత్తం 37 పేజీల అఫిడవిట్‌లో ఆయన తన కుటుంబ ఆస్తుల వివరాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. ఓ సాధారణ కుటుంబంలో పుట్టి వైద్య వృత్తి ద్వారా అంచెలంచెలుగా ఎదిగిన ఆయన.. అమెరికా, గుంటూరు, కృష్ణా జిల్లాలు, తెలంగాణలోని హైదరాబాద్‌లో ఆస్తులను సమకూర్చుకున్నట్టు తెలిపారు. ప్రస్తుత రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇంతపెద్ద మొత్తంలో స్థిర చరాస్తులను ఏ అభ్యర్థీ చూపించకపోవడం గమనార్హం. ఒకవిధంగా దేశంలోని అత్యంత ధనిక ఎంపీ అభ్యర్థుల్లో పెమ్మసాని ఒకరుగా ఉన్నారు. పెమ్మసాని కుటుంబానికి చరాస్తులు ఎక్కువగా ఉన్నాయి. పెమ్మసాని పేరు మీద రూ.2,316 కోట్లు, ఆయన సతీమణి శ్రీరత్న పేరుతో రూ.2,289 కోట్ల విలువైన చరాస్తులు ఉన్నాయి. పిల్లల్లో ఒకరి పేరుతో రూ.496 కోట్లు, మరొకరి పేరు మీద రూ.496 కోట్ల చరాస్తులున్నాయి. స్థిరాస్తులు పెమ్మసాని పేరుతో రూ.69.33 కోట్లు, భార్య పేరుతో రూ.25 కోట్లు ఉన్నాయి. పెమ్మసానికి 181 గ్రాముల బంగారు ఆభరణాలు, ఆయన సతీమణికి 2.5 కిలోల బంగారు ఆభరణాలు ఉన్నాయి. కుటుంబం పేరుతో రూ.4.20 లక్షల విలువైన 5.5 కేజీల వెండి ఆభరణాలున్నాయి. సొంతంగా మెర్సిడెస్ బెంజ్-ఎస్ క్లాస్, సీ క్లాస్, టెస్లా మోడల్ ఎక్స్ క్లాస్, రోల్స్ రాయిస్ ఘోస్ట్, టొయోటా ఫార్చునర్ కార్లు ఉన్నాయి.

పెమ్మసాని సోదరుడి ఆస్తి 1,655 కోట్లు

గుంటూరు లోక్‌సభ స్థానానికి టీడీపీ అభ్యర్థి పెమ్మసాని సోదరుడు పెమ్మసాని రవిశంకర్ కూడా నామినేషన్ దాఖలు చేశారు. ఏ కారణంతో అయినా చంద్రశేఖర్ నామినేషన్ తిరస్కరణకు గురైతే అప్పుడు రవిశంకర్ టీడీపీ అభ్యర్థి అవుతారు. ఈ సందర్భంగా రవిశంకర్ దాఖలు చేసిన అఫిడవిట్‌లో ఆయన ఆస్తులు రూ.1,655 కోట్లుగా పేర్కొన్నారు.

చీరాలలో ఆమంచి.. పి.గన్నవరంలో చిట్టిబాబు

- సుంకర పద్మశ్రీకి విజయవాడ తూర్పు
- 38 మందితో కాంగ్రెస్ అభ్యర్థుల మలి జాబితా

న్యూఢిల్లీ/అమరావతి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీని వీడి కాంగ్రెస్‌లో చేరిన చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్, పి.గన్నవరం (ఎస్సీ) ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబుకు కాంగ్రెస్ అధిష్ఠానం అవే అసెంబ్లీ టికెట్లు ఖరారుచేసింది. పార్టీ సీనియర్ నాయకురాలు సుంకర పద్మశ్రీని విజయవాడ తూర్పు అభ్యర్థిగా, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్కరాజు రామారావును విశాఖ ఉత్తరం అభ్యర్థిగా ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే మరో 38 మంది అభ్యర్థుల జాబితాను ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సోమవారం ఢిల్లీలో విడుదల చేశారు. మొదటి జాబితాలో 114, రెండో జాబితాలో 12 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా.. వాటిలో 10 సీట్లలో అభ్యర్థులను మార్చారు. దీంతో ఇప్పటివరకూ ఏపీలో 154 మంది అభ్యర్థులను ప్రకటించినట్లయింది.

మెగా డీఎస్సీపై తొలి సంతకం

ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలిస్తాం: చంద్రబాబు

- జాబు రావాలంటే బాబు రావాలి.. గంజాయి కావాలంటే జగన్ రావాలి
- పవన్ కాలిగోటికి కూడా సరిపోడు
- జగ్గంపేటలో టీడీపీ అధినేత నిప్పులు


శ్రీశైలంలోని బయలు వీరభద్రస్వామిని దర్శించుకుంటున్న చంద్రబాబు దంపతులు

కాకినాడ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి ఏపీలో అధికారంలోకి రాగానే తొలి సంతకం డీఎస్సీపైనే చేస్తానని టీడీపీ అధినేత చంద్రబాబు పునరుద్ఘాటించారు. 'ఓ ఆడబిడ్డ జగ్గంపేటలో నన్ను కలిసినప్పుడు నాకో పెన్ను ఇచ్చింది. ఆ పెన్నుతో నేను సీఎం అయ్యాక డీఎస్సీపై తొలి సంతకం చేయాలని కోరింది. కచ్చితంగా అలాగే చేస్తా' అని ప్రకటించారు. టీడీపీ వచ్చాక ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని అన్నారు. ప్రజాగళంలో భాగంగా సోమవారం కాకినాడ జిల్లా జగ్గంపేటలో జరిగిన భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. సేవ చేయాలని జగన్‌కు ప్రజలు అధికారం కట్టబెడితే.. అహంకారం, దోపిడీ, విధ్వంసమే జీవితాశయంగా ఆయన విధానాలు కొనసాగుతున్నాయని ధ్వజమెత్తారు. రాష్ట్రం భయంకర నేరస్థుల వెళ్లిపోయి నష్టపోతోందన్నారు. జగన్‌లాంటి దుర్మార్గుడు మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజల గతి ఏంటో ఒకసారి అందరూ ఆలోచించాలని కోరారు. ఆయన ప్రవర్తన ఎలాంటిదో ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. అసలే కోతి.. ఆపై కల్లు తాగిన చందాన ప్రవర్తిస్తున్నాడని మండిపడ్డారు. "రాష్ట్రంలో తానొక్కడే శాశ్వతం అనుకుని జగన్ ప్రవర్తిస్తున్నాడు. ప్రజలందరినీ తనకు బానిసలుగా చూస్తున్నాడు. దేవుడి కంటే తానే గొప్పోడనుకుని వ్యవహరిస్తున్నాడు. సినిమా రంగంలో పేరు ప్రఖ్యాతులు గాంచిన చిరంజీవి, డైరెక్టర్ రాజమౌళి వంటివారిని ఇంటికి పిలిచి అవమానించిన నీచుడు. సజ్జల రామకృష్ణారెడ్డి సైతం చిరంజీవిని విమర్శిస్తున్నారు. వీళ్లకు బలుపు ఎక్కువైంది. దీన్ని తగ్గించే అస్త్రం టీడీపీ దగ్గర ఉంది. . వైసీపీ దోపిడీ చేయడం తెలిసిన పార్టీ. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం తెలిసిన పార్టీ టీడీపీ. అందుకే జాబు రావాలంటే బాబు రావాలి. కానీ గంజాయి కావాలంటే జగన్ రావాలి." అని బాబు పేర్కొన్నారు.

పవన్ కాలిగోటికి కూడా సరిపోడు..

"మాట్లాడితే సీఎం జగన్ జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను బూతులు తిడుతున్నారు. ఎంత నీచం! ముఖ్యమంత్రి భార్య గురించి మేం ఎప్పుడైనా ఇలా మాట్లాడామా? అసెంబ్లీలో నా భార్యను కూడా తిట్టారు. అయినా పవన్ ఎక్కడ.. జగన్ ఎక్కడ? పవర్ స్టార్ కాలిగోటికి కూడా ఈయన సరిపోడు. నేను కూడా జగన్ బాధితుడినే. నాజోలికి రావడానికి ఎవరైనా భయపడతారు. కానీ సైకో కావడం వల్ల జగన్ భయపడలేదేమో! అటు ఎంపీ రఘురామరాజును కూడా చంపించాలని చూశాడు. తీర్పులు ఇచ్చిన న్యాయమూర్తులపైనా సోషల్ మీడియా ద్వారా దాడి చేయించారు. అలా దాడిచేసిన వారిని ఇప్పుడు పక్కన పెట్టుకుని తిరుగుతున్నాడు. అందుకే జగన్ ప్రవర్తన గురించి ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. రాష్ట్రంలో పెరుగు, మీగడ తను తినేసి మజ్జిగ జనాలకు పోస్తున్నాడు. రాజధాని అమరావతిని దెబ్బతీశాడు. జే బ్రాండ్‌తో ప్రజల ఆరోగ్యంతో ఆడుకున్నాడు. మద్య నిషేధాన్ని తుంగలో తొక్కాడు. సీపీఎస్ రద్దు అని చెప్పి అబద్ధాలాడాడు. విద్యుత్ చార్జీలను తొమ్మిది సార్లు పెంచాడు. అలాంటి జగన్‌కు ఓట్లు వేయించుకునే అర్హత లేదు" అని చంద్రబాబు పేర్కొన్నారు.

రాక్షసులతో ఎంత ఇబ్బంది పడిందో..

రాష్ట్రంలో సీఎం జగన్ అరాచక పాలనను దేశం దృష్టికి తీసుకెళ్లేందుకు గుంటూరుకు చెందిన అభ్యుదయ మహిళ కోవూరి లక్ష్మి తన వేలిని కోసుకున్నారన్న విషయం విని బాధేసింది. తమ ప్రాంతంలో అక్రమాలపై ఫిర్యాదు ఇచ్చిన వెంటనే అధికారులు వెంటనే స్పందిస్తే ఇలా జరిగి ఉండేది కాదు. రాష్ట్రంలో ప్రజల నిస్సహాయ పరిస్థితికి ఇది నిదర్శనం. అసలు వైసీపీ రాక్షసులు ఆమెను ఎంత దారుణంగా ఇబ్బంది పెట్టారో అంతా ఆలోచించాలి.



అభిమాని సైకిల్‌పై అధినేత

జనసేనాని పవన్ కల్యాణ్ గెలుపు కోసం ఆయన అభిమాని కాకినాడ జిల్లా, ప్రత్తిపాడు మండలం శరభవరం గ్రామానికి చెందిన మామిడి బాబ్జి 25 రోజులుగా పిఠాపురం నియోజకవర్గంలో సైకిల్‌పై ప్రచారం చేస్తున్నారు. ప్రచారంలో భాగంగా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని పవన్ నివాసం వద్దకు వచ్చారు. బయటకు వచ్చిన పవన్, తన అభిమాని బాబ్జీతో ముచ్చటించారు. ఆయన సైకిల్‌ను తొక్కారు. - పిఠాపురం

పవన్ హెలికాప్టర్‌లో
సాంకేతిక లోపం

అమరావతి(ఆంధ్రజ్యోతి), గొల్లప్రోలు, ఏప్రిల్ 22: జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రయాణించే హెలికాప్టర్‌లో ఆకస్మిక సాంకేతిక లోపం తలెత్తడంతో ఆయన పశ్చిమగోదావరి జిల్లా పర్యటన రద్దయింది. పవన్ సోమవారం తాడేపల్లిగూడెం, ఉంగుటూరుల్లో ప్రచార సభల్లో పాల్గొనాల్సి ఉంది. దీనికోసం ఆయన గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని నివాసం నుంచి బయలుదేరి హెలిప్యాడ్‌కు చేరుకుని హెలికాప్టర్ ఎక్కారు. ఇంజన్ స్టార్ట్ అయినా టేకాఫ్ అవ్వడంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో పవన్ తిరిగి. చేబ్రోలులోని తన నివాసానికి వెళ్లిపోయారు. దీంతో తాడేపల్లిగూడెం, ఉంగుటూరు సభలను పవన్ వాయిదా వేసుకున్నారు. పవన్ కల్యాణ్ పిఠాపురం శాసనసభ అభ్యర్థిగా నేడు నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించనున్నారు.

జగన్ ఆస్తి 529 కోట్లు

ఐదేళ్లలో 41 శాతం పెరిగిన సంపద .. చేతిలో నగదు రూ.7 వేలే



కడప, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే అత్యంత ధనిక ముఖ్యమంత్రి అని ప్రతిపక్షాలు విమర్శించే జగన్మోహన్ రెడ్డి మొత్తం ఆస్తుల విలువ రూ.529.87 కోట్లు. ఆయన భార్య భారతి పేరిట మరో 176.63 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయి. జగన్ సంపద ఐదేళ్లలో భారీగా పెరిగింది. పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న జగన్ తరఫున సోమవారం ఆయన చిన్నాన్న వైఎస్ మనోహర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. అఫిడవిట్‌లో జగన్ తన చరాస్తుల విలువను రూ. 483,08,35,064గా, స్థిరాస్తుల విలువను రూ.46 కోట్లుగా పేర్కొన్నారు. తన చేతిలో కేవలం రూ.7 వేలు నగదు ఉన్నట్టు చూపారు. తన సతీమణి భారతి పేరిట రూ.119,38,07,190 విలువైన చరాస్తులు, రూ.56 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నట్లు చూపించారు. వీరిద్దరి పేరిట మొత్తం రూ.706.50 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నట్టు వెల్లడించారు. భారతి వద్ద రూ.10,022 నగదు, పెద్ద కూతురు హర్షిణీరెడ్డి వద్ద రూ.9 వేలు, రెండో కూతురు వర్షితరెడ్డి వద్ద రూ.6,989 నగదు ఉన్నట్టు తెలిపారు. నలుగురి పేరిట నగదు మొత్తం రూ.40 వేలు కూడా లేకపోవడం గమనార్హం. ఇద్దరు కుమార్తెల పేరిట 51.50 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయి. 2019 ఎన్నికల్లో జగన్ ఆస్తి రూ.375.20 కోట్లు ఉండగా, ఐదేళ్లు తిరిగే సరికి ఆయన సంపద దాదాపు 41 శాతం పెరిగింది. 2019 ఎన్నికల్లో భారతి పేరిట రూ.124 కోట్లు, ఇద్దరు కుమార్తెల పేరిట రూ.11 కోట్లు ఆస్తులు ఉన్నట్టు వెల్లడించారు. 2022-23లో ఆదాయపన్నులో చూపించిన ఆదాయం జగన్‌కు 47,74,90,600, భారతికి10.96 కోట్లుగా ఉంది.

జగన్‌పై 26 కేసులు

తనపై 26 కేసులు ఉన్నట్టు జగన్ అఫిడవిట్‌లో పేర్కొన్నారు. 11 సీబీఐ కేసులు, 9 ఈడీ కేసులున్నాయి. నంద్యాల, విజయవాడ, మంగళగిరి, పొన్నూరు, సరూర్‌నగర్ పోలీసు స్టేషన్లలో ఆరు కేసులు ఉన్నాయి.

దర్శకుల సంఘానికి ప్రభాస్ రూ. 35 లక్షల విరాళం



తెలుగు దర్శకుల సంఘానికి ఓ సంక్షేమ నిధిని సమకూర్చుకోవడమే ప్రధాన ధ్యేయంగా మే 4న (దర్శకుడు దాసరి నారాయణరావు జయంతి సందర్భంగా) హైదరాబాద్‌లోని లాల్ బహదూర్ స్టేడియంలో 'డైరెక్టర్స్ డే'ని వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సంక్షేమ నిధి కోసం నటుడు ప్రభాస్ రూ. 35 లక్షల భారీ విరాళం ప్రకటించారు. సోమవారం జరిగిన 'డైరెక్టర్స్ డే' కర్టెన్ రైజర్ కార్యక్రమంలో దర్శకుడు మారుతి ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్ ఈ విరాళం ఇచ్చిన ప్రభాస్‌కు, మిగిలిన చిత్ర ప్రముఖులకు కృతజ్ఞతలు తెలిపారు. దర్శకుల దినోత్సవం ద్వారా సమకూరే నిధులను తమ సంఘ సభ్యుల ప్రయోజనాల కోసం మాత్రమే వినియోగిస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మరో దర్శకుడు హరీశ్ శంకర్ మాట్లాడుతూ.. చిరంజీవి, ప్రభాస్, మోహన్‌బాబు, విజయ్ దేవరకొండ, రామ్ పోతినేని, కల్యాణ్ రామ్ తదితర హీరోలు, హీరోయిన్లు, క్యారెక్టర్ ఆర్టిస్టులు ఎందరో ఈ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు దర్శకులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

'కూలీ'గా రజనీకాంత్



తమిళ దర్శకుడు లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రజనీకాంత్ ఓ చిత్రంలో నటిస్తున్నారు. అనౌన్స్‌మెంట్ నుంచే ఎంతో క్రేజ్‌ను సొంతం చేసుకున్న ఈ మూవీ వర్కింగ్ టైటిల్ 'తలైవర్ 171'. ఈ మూవీకి టైటిల్స్‌గా 'రాజా', 'తంగమ్' పేర్లు కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. సోమవారం చిత్ర బృందం ఈ హై వోల్టేజ్ యాక్షన్ ఎంటర్టైనర్ మూవీ టైటిల్‌ను ప్రకటించి ఓ టీజర్‌ను విడుదల చేసింది. ఆ టైటిల్ 'కూలీ'. ఈ టీజర్‌లో రజనీకాంత్ ఎంట్రీ, లుక్, సంభాషణలు చాలా స్టైలిష్‌గా ఉన్నాయి. ఈ టీజర్‌ను బట్టి సినిమా కథాంశం గోల్డ్ స్మగ్లింగ్ బ్యాక్‌డ్రాప్‌లో నడుస్తుందని తెలుస్తోంది. ఈ టీజర్‌లో రజనీ పాత చిత్రం 'తంగ మగన్'లోని డిస్కో పాట, మెగాస్టార్ చిరంజీవి చిత్రంలోని 'అబ్బనీ తీయనీ దెబ్బ' సాంగ్ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ వినిపించడం అందరినీ ఆకర్షించేలా ఉంది. "ఇదొక ప్రయోగాత్మక చిత్రం. ఇందులో రజనీకాంత్ పోషించే పాత్రకు నెగెటివ్ షేడ్స్ ఉంటాయి. మునుపెన్నడూ చూడని సరికొత్త సూపర్ స్టార్‌ను ఇందులో చూపించనున్నాను" అని దర్శకుడు ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఈ సినిమాలో షారుఖ్ ఖాన్, రణవీర్ సింగ్, నాగార్జున, శ్రుతీహాసన్, శోభన కీలక పాత్రలు పోషించనున్నారని టాక్ వినిపిస్తోంది.

ఆ మ్యాజిక్ రిపీట్ చేసేలా...



ఒకే ఇండస్ట్రీకి చెందిన ఇద్దరు టాప్ హీరోలు ఓ పాటకు స్టెప్పులేస్తే అది అభిమానులకు పండగే. ఆ ఊహను 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమాలో 'నాటునాటు' పాట నిజం చేసింది. అలా తెలుగు ఇండస్ట్రీకి చెందిన టాప్ డ్యాన్సర్స్‌గా పేరొందిన రామ్‌చరణ్, తారక్ ఆ పాటకు కాలు కదిపి వెండితెరపై పండగ వాతావరణాన్ని సృష్టించిన సంగతి తెలిసిందే. మరి, రెండు వేర్వేరు ఇండస్ట్రీలకు చెందిన సూపర్ హీరోలు ఇలా ఒక పాటకు డ్యాన్స్ చేస్తే? ఆ ఊహే ఎంతో గొప్పగా ఉంది కదూ. ఆ ఐ ఫీస్ట్‌నే త్వరలో మనం 'వార్-2'లో చూడబోతున్నాం. ఈ సినిమాతో బాలీవుడ్ ఎంట్రీ ఇస్తోన్న జూనియర్ ఎన్టీఆర్.. ప్రస్తుతం షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. కథాపరంగా ఈ సినిమాలో తారక్ ప్రతినాయకుడి పాత్రను, హృతిక్ రోషన్ హీరోగా 'వార్' మొదటి భాగంలోని కబీర్ పాత్రను కంటిన్యూ చేస్తూ పోషిస్తున్నారు. వీరిద్దరి ముఖాముఖి పోరును తెరపైన చూడటం కోసం యావత్ సినీ ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఈ ఆసక్తిని మరింత పెంచే సూపర్ న్యూస్ ఒకటి ఇప్పుడు నెట్టింట ట్రెండ్ అవుతోంది. అదే.. తారక్, హృతిక్ రోషన్ ఒకే పాటకు కాలు కదపడం. ఈ సినిమాలో వీరిద్దరూ ఒక పాటకు కలసి డ్యాన్స్ చేసే ప్రత్యేక సందర్భాన్ని దర్శకుడు అయాన్ ముఖర్జీ సృష్టించారట. ఆ సందర్భంగా వచ్చే ఈ పాట 'ఆర్‌ఆర్‌ఆర్'లోని 'నాటు నాటు' పాట మ్యాజిక్‌ను, 'వార్' మొదటి భాగంలోని 'జై జై శివ శంకర్' పాటలోని ఎనర్జీని రిపీట్ చేసేలా ఉంటుందట. ఈ పాట సినిమాకే హైలైట్‌గా నిలవడమే కాకుండా, సినిమా పాటల్లోనే ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకుంటుందని దర్శకనిర్మాతలు భావిస్తున్నారు. ఈ చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తోంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకొంటున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ఆగస్టు 14న విడుదల చేయడానికి చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.

నరేశ్ కామెడీని మిస్ అయ్యా



అల్లరి'నరేశ్ అందిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆ ఒక్కటీ అడక్కు' చిత్రం థియేట్రికల్ ట్రైలర్‌ను హీరో నాని సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'నరేశ్ అద్భుతమైన నటుడు. ఆయన బ్యాక్ టు బ్యాక్ కామెడీ సినిమాలు అప్పట్లో చేస్తుంటే వాటికి కొంచెం బ్రేక్ ఇవ్వమని నేనే కోరాను. కానీ ఈ సినిమా ట్రైలర్ చూశాక ఆ బ్రేక్‌లో తన కామెడీని మిస్ అయ్యానని అనిపించింది. ఇందులో పెళ్లి కంటెంట్ అందరికీ రిలేట్ అయ్యేలా ఉంది. ట్రైలర్ చూసి ఎంజాయ్ చేశా' అన్నారు. నరేశ్ మాట్లాడుతూ 'నాని మా ఫ్యామిలీ మెంబర్.. అతను ఈ వేడుకకు రావడం ఆనందంగా ఉంది. టీమ్ అంతా కష్టపడి చేసిన సినిమా ఇది. కచ్చితంగా ఈ సమ్మర్‌లో మిమ్మల్ని నవ్విస్తాను' అన్నారు నరేశ్. ఈ కార్యక్రమంలో హీరోయిన్ ఫరియా అబ్దుల్లా, నిర్మాత రాజీవ్ చిలక, రచయిత అబ్బూరి రవి, దర్శకుడు మల్లి అంకం తదితరులు పాల్గొన్నారు.

లవ్.. ఫ్యామిలీ ఎమోషన్స్



అంకిత్ కొయ్య, విశాఖ ధిమన్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'బ్యూటీ'. రావు రమేశ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. బాల సుబ్రమణ్యమ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఎ.వి జయ్‌పాల్ రెడ్డి నిర్మిస్తున్నారు. సోమవారం ఈ చిత్రాన్ని ప్రారంభించారు. దర్శకుడు మారుతి క్లాప్ కొట్టగా, డైరెక్టర్ బుచ్చిబాబు కెమెరా స్విచ్ఛాన్ చేశారు. లవ్, ఫ్యామిలీ ఎమోషన్స్ కలగలిపి తెరకెక్కుతోందీ చిత్రం. ఈ చిత్రానికి ఎడిటర్: మార్తాండ్ కె వెంకటేశ్, సినిమాటోగ్రఫీ: మనోహర్, సంగీతం: విజయ్ బుల్గానిన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ప్రకాశ్ రౌతు.

పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో...



కాజల్ అగర్వాల్ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'సత్యభామ'. ఈ సినిమాలో కాజల్ ఓ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ క్యారెక్టర్‌ను పోషిస్తున్నారు. నవీన్‌చంద్ర అమరేందర్ అనే కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ క్రైమ్ థ్రిల్లర్‌కు సుమన్ చిక్కాల దర్శకత్వం వహించారు. 'మేజర్' మూవీ డైరెక్టర్ శశికిరణ్ తిక్క స్క్రీన్‌ప్లే అందించి ఈ చిత్రానికి సమర్పకులుగా వ్యవహరించారు. బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మించారు. తాజాగా ఈ మూవీ రిలీజ్ డేట్‌ను అనౌన్స్ చేస్తూ మేకర్స్ ఓ ఆసక్తికరమైన వీడియోను విడుదల చేశారు. మే 17న ఈ సినిమాని విడుదల చేస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: బి.వి ష్ణు, సంగీతం: శ్రీచరణ్ పాకాల.



అబ్ కీ బార్?

ప్రజల దృష్టి మరల్చేందుకు మోదీ కొత్త వ్యూహాలు: రాహుల్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: సమస్యల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు ప్రధాని మోదీ కొత్త వ్యూహాలు పన్నుతున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. మొదటి దశ ఎన్నికల్లో నిరాశ ఎదురవడంతో మోదీ ఇప్పుడు అబద్ధాలు చెప్పడం ప్రారంభించారని ఆరోపించారు. దేశంలో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం గరిష్ఠ స్థాయిలో ఉంటే మోదీ అంతా బాగానే ఉందని చెబుతున్నారని ఆయన సోమవారం ఎక్స్ వేదికగా ధ్వజమెత్తారు. ఆయన అబద్ధాలకు త్వరలోనే ముగింపు పడనుందని రాహుల్ అన్నారు. ప్రధాని మోదీ విషపు భాష మాట్లాడుతున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శించారు.

బీజేపీ ఖాతాలో సూరత్

(మొదటి పేజీ తరువాయి)

నామినేషన్లను ఉపసంహరించకోవటం వంటి అనూహ్య పరిణామాల మధ్య ఈ ఏకగ్రీవ ఎన్నిక జరగటం గమనార్హం. సూరత్ బరిలో కాంగ్రెస్ తరఫున పోటీ పడుతున్న నీలేశ్ ఖుంభానీ అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదిస్తూ ఆయన నామినేషన్ పత్రాలపై ముగ్గురు చేసిన సంతకాలు అసలైనవి కాదని తేలిందని రిటర్నింగ్ అధికారి తన ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నీలేశ్ ఖుంభానీకి 24 గంటల్లో స్పందించాలని నోటీసులు కూడా జారీ చేశామని తెలిపారు. అయితే, ఆయన ఎన్నికల అధికారి కార్యాలయానికి తన అడ్వకేట్‌తో కలిసి వచ్చినప్పటికీ.. ఆయన వెంట ముగ్గురు ప్రతిపాదకులు రాలేదన్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన నామినేషన్‌ను తిరస్కరించినట్లు ప్రకటించారు. కాంగ్రెస్ ప్రత్యామ్నాయ అభ్యర్థి సురేష్ పడ్సాలా నామినేషన్ పత్రాలను కూడా ప్రతిపాదకుల సంతకాలు సరైనవి కావని తేలటంతో తిరస్కరించినట్లు పేర్కొన్నారు. బరిలో ఉన్న మిగిలిన ఎనిమిది మంది (వీరిలో ఒకరు బీఎస్పీ అభ్యర్థి కాగా మిగిలినవారు ఇండిపెండెంట్లు) కూడా నామినేషన్ పత్రాల ఉపసంహరణకు చివరి రోజైన సోమవారం తమ అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకున్నారు. దీంతో బరిలో ఉన్న ఏకైక అభ్యర్థి ముఖేష్ దలాల్ ఏకగ్రీవ విజయం సాధించినట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. షెడ్యూల్ ప్రకారం.. గుజరాత్‌లోని మొత్తం 26 స్థానాలకు మే 7వ తేదీన ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే ఇదంతా బీజేపీ కుట్ర అని కాంగ్రెస్ ఆరోపించింది. ఖుంబానీ అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించిన ముగ్గురూ ఆయన బంధువులేనని, వారిని (బీజేపీ వాళ్లు) కిడ్నాప్ చేశారని, దీనివల్లే వారు రాలేకపోయారని కాంగ్రెస్ నేత, న్యాయవాది బాబూ మంగూకియా తెలిపారు. గుజరాత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శక్తిసింగ్ గోహిల్ మాట్లాడుతూ, తమ అభ్యర్థి నామినేషన్ తిరస్కరణను వ్యతిరేకిస్తూ గుజరాత్ హైకోర్టులో పిటిషన్ వేస్తామన్నారు.

కర్ణాటకలో ప్రచారాస్త్రాలు.. చెంబు, చిప్ప!

బెంగళూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల వేళ కర్ణాటకలో కాంగ్రెస్, బీజేపీ-జేడీఎస్ కూటమి పార్టీలు కొత్త తరహా ప్రచారానికి తెరలేపాయి. గడిచిన



మూడు రోజులుగా వినూత్నమైన ప్రచార ప్రకటనలను విడుదల చేస్తున్నాయి. తొలుత ప్రధాని మోదీ రాష్ట్రానికి చెంబు ఇచ్చారని కాంగ్రెస్ ప్రకటన విడుదల చేసింది. అన్నభాగ్య పథకం కోసం బియ్యం కోరితే మోదీ ప్రభుత్వం ఖాళీ చెంబు ఇచ్చిందని ఆ ప్రకటనలో విమర్శించింది. కర్ణాటక చెల్లించే ప్రతి 100 రూపాయల పన్నులో మోదీ ప్రభుత్వం వాపసు ఇచ్చేది రూ.13 అంటూ చెంబు గుర్తుతో ప్రకటన ఇచ్చింది. కాంగ్రెస్ ప్రకటనలకు దీటుగా బీజేపీ కూడా కన్నడిగుల చేతికి కాంగ్రెస్ ప్రభుత్వం కొబ్బరిచిప్ప ఇచ్చిందని ప్రకటనలు ఇచ్చింది. కాంగ్రెస్ పాలనలో కన్నడిగుల చేతికి చిక్కింది చిప్పేనని తెలిపింది. ఇందులో ఆటో, క్యాబ్ డ్రైవర్లకు చిప్ప అని, విద్యార్థులకు చిప్ప.. కిసాన్ సమ్మాన్ ద్వారా రైతులకు రూ.4వేలు కోత విధించి అన్నదాతల చేతిలో చిప్ప పెట్టారని ఎదురుదాడికి దిగింది. తాజాగా సోమవారం కాంగ్రెస్ డేంజర్ అంటూ బీజేపీ మరో ప్రకటన విడుదల చేసింది. ఇందులో.. హోటల్లో టీ తాగేందుకు వెళ్లిన అమాయకులు బాంబు పేలుళ్లలో గాయపడాలా..? కాలేజీకి వెళ్లిన యువతి లవ్ జిహాద్‌కు బలి కావాలా..? అంటూ పలు ప్రశ్నలు సంధించింది.

మీ ఇళ్లు, నగలు.. అన్నీ లాక్కుంటుంది!



(మొదటి పేజీ తరువాయి)

ప్రజల ఆదాయం, సంపదపై కన్నేశాయని ఆరోపించారు. "కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తే.. ఎవరు ఎంత సంపాదిస్తున్నారు? ఎన్ని ఆస్తులు ఉన్నాయి? ఎన్ని ఇళ్లు ఉన్నాయి? అనే దానిపై విచారణ జరిపిస్తామని ఆ పార్టీ యువరాజు చెప్పారు. అలాగే ప్రజలు సంపదపై ప్రభుత్వ నియంత్రణ ఉంటుందని, వారి ఆస్తులను అందరికీ పంచుతామనీ మేనిఫెస్టోలో చెప్పారు" అంటూ రాహుల్ గాంధీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇక 'మంగళసూత్రం' వ్యాఖ్యలను మోదీ మళ్లీ చేశారు. కాంగ్రెస్ పార్టీ చట్టాలను మార్చి మహిళల ఆభరణాలనూ తీసేసుకోవాలని చూస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు సర్వే చేసి.. ఉద్యోగస్థులు ఎంత మొత్తంలో ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేశారు?, వారికి ఎన్ని వాహనాలు ఉన్నాయి?, ఎంత భూమి ఉంది? అనే వివరాలను సేకరించి ప్రజల ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని చూస్తున్నారని మోదీ పేర్కొన్నారు. ఊళ్లో పురాతన ఇల్లు ఉండి, నగరంలో ఫ్లాట్ కొనుక్కుంటే.. వాటిలో ఏదో ఒక ఇంటిని కాంగ్రెస్ లాగేసుకుంటుందని చెప్పారు. ఒక ఇల్లు ఉన్నది కాబట్టి మరొకటి అవసరం లేదని చెబుతుందన్నారు. ఇది మావోయిస్టు, కమ్యూనిస్టు ఆలోచనా ధోరణి అని.. ఇలాంటి వాళ్లు చాలా దేశాలను నాశనం చేశారని చెప్పారు. కాంగ్రెస్, ఇండి కూటమి ఈ విధానాన్ని భారత్‌లో అమలు చేయాలని చూస్తోందని ధ్వజమెత్తారు. "కూటమి నేతలు మోదీ ఎందుకు అభివృద్ధి చెందిన భారత్ అని మాట్లాడుతున్నాడు? ఎందుకు భారత్‌ను ప్రపంచంలో మూడో ఆర్థిక వ్యవస్థగా మారుస్తానని చెబుతున్నాడు? అనే ప్రశ్నిస్తున్నారు. ఈ నేతలు అధికారంలోకి రావడం కోసం, కుటుంబాల లబ్ధి కోసం తప్ప ప్రజల కోసం చేసిందేమీ లేదు. జనాన్ని మోసం చేయడమే వాళ్ల పని" అని మోదీ మండిపడ్డారు.

మోదీపై చర్యలు తీసుకోండి: కాంగ్రెస్

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశ సంపదను ముస్లింలకు పంచిపెడుతుందన్న ప్రధాని మోదీ వ్యాఖ్యలపై ఆ పార్టీ ఎన్నికల సంఘానికి(ఈసీ) ఫిర్యాదు చేసింది. మతం పేరుతో మోదీ ఓట్లు అడిగారని, కాంగ్రెస్ పార్టీపై అబద్ధపు ఆరోపణలు చేశారని, పార్టీ నేతలను అవమానించారని, ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారని అందులో పేర్కొంది. ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది. అభిషేక్ సింఘ్వీ నేతృత్వంలో కాంగ్రెస్ నేతలు సోమవారం ఎన్నికల సంఘాన్ని కలిసి ఫిర్యాదును సమర్పించారు. మోదీ వ్యాఖ్యలతో పాటు బీజేపీ నేతలు ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారంటూ మరో 16 ఫిర్యాదులు చేశారు. అయితే, మోదీ వ్యాఖ్యలపై స్పందించడానికి ఈసీ నిరాకరించింది. ఇదిలా ఉండగా, మోదీ విభజన రాజకీయాలు చేస్తున్నారని, రాజస్థాన్‌లో ముస్లింలపై నేరుగా దాడికి దిగారని, ఆయనపై వెంటనే చర్యలు తీసుకోవాలని 2,209 మంది పౌరులు ఎన్నికల సంఘానికి సంయుక్తంగా లేఖ రాశారు.

దేశ సంపదపై హక్కు పేదలది..

దేశంలోని వనరులపై తొలి హక్కు మైనారిటీలకే చెందుతుందని కాంగ్రెస్ నమ్ముతోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆరోపించారు. కానీ, దేశ వనరులపై పేదలు, ఆదివాసీలు, దళితులు, వెనకబడినవర్గాల వారికే హక్కు ఉంటుందని బీజేపీ బలంగా విశ్వసిస్తోందని చెప్పారు. సోమవారం ఆయన ఛత్తీస్‌గఢ్‌లో ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. కాంగ్రెస్ మేనిఫెస్టో పట్ల ప్రధాని చేసిన వ్యాఖ్యలపై ఆ పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. దీనిపై అమిత్ షా స్పందిస్తూ.. "నేను కాంగ్రెస్ నేతలను అడుగున్నా.. వారి మేనిఫెస్టోలో సర్వే చేస్తామని చెప్పారా? లేదా? దీనిపై రాహుల్ బాబా స్పష్టతనివ్వాలి. 2006లో ప్రధాని మన్మోహన్ దేశ వనరులపై తొలి హక్కు ఆదివాసీలు, దళితులది కాదని.. మైనారిటీలదేనని చెప్పారు. కానీ, మేం మాత్రం ఆ హక్కు పేదలు, దళితులు, ఆదివాసీలు, బీసీలదేనని చెబుతున్నాం. వారి (కాంగ్రెస్) కళ్లన్నీ మఠాలు, మందిరాలు, ప్రజల ఆస్తులపై ఉన్నాయి. ఆ సొమ్మంతా ఎక్కడికి పంపుతారు?" అని ప్రశ్నించారు. ఇక ఛత్తీస్‌గఢ్‌లోని నక్సలైట్లకు అమిత్ షా హెచ్చరిక చేశారు. లొంగిపోవాలని, లేదంటే రెండేళ్లలోగా అందరినీ ఏరిపారేస్తామని చెప్పారు. బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నాలుగు నెలల్లోనే 90 మంది నక్సలైట్లను ఎన్‌కౌంటర్ చేసినట్లు తెలిపారు.

మోదీజీ.. అపాయింట్‌మెంట్ ఇవ్వండి

కాంగ్రెస్ మేనిఫెస్టో గురించి వివరిస్తా: ఖర్గే



చెన్నపట్న(కర్ణాటక), ఏప్రిల్ 22: రాజ్యాంగాన్ని మార్చడానికి లోక్‌సభలో ఎన్డీయేకు అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ సాధించడమే మోదీ లక్ష్యమని, అందుకే 400 సీట్లు గెలవాలని కోరుకుంటున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు ఈ ఎన్నికలు ఎంతో కీలకమని చెప్పారు. కాంగ్రెస్ మేనిఫెస్టో ముస్లింలీగ్ ముద్రను కలిగి ఉందంటూ ప్రధాని చేసిన వ్యాఖ్యలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. యువతకు ఉపాధి కల్పిస్తామనడం, నారీ న్యాయ్, రైతులకు ఎమ్మెస్పీని చట్టబద్ధం చేయడం... ఇవన్నీ ముస్లిం లీగ్ కిందకు వస్తాయా అని ఖర్గే ప్రశ్నించారు. నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని ప్రధానిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల కోసం కాంగ్రెస్ విడుదల చేసిన మేనిఫెస్టోపై బహిరంగ చర్చకు సిద్ధమని ఖర్గే ప్రకటించారు. ప్రధాని అపాయింట్‌మెంట్ ఇవ్వాలని కోరారు. మోదీ అనవసరంగా గాంధీల కుటుంబాన్ని టార్గెట్ చేస్తున్నారని, 1989 నుంచి నేటివరకూ ఆ కుటుంబానికి చెందిన వారెవరూ ప్రధానమంత్రిగా లేదా మంత్రిగా, ముఖ్యమంత్రిగా లేరని చెప్పారు.

లోకం తీరు



యూజీసీ నెట్, సీయూఈటీలో.. స్కోర్ సాధారణీకరణకు చెల్లు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: యూజీసీ నిర్వహించే జాతీయ అర్హత పరీక్ష(నెట్), కామన్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ టెస్ట్(సీయూఈటీ) పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు శుభవార్త.! ఇకపై ఈ పరీక్షల్లో విద్యార్థులు సాధించే స్కోర్ సాధారణీకరణ(నార్మలైజేషన్)కు స్వస్తి పలుకుతున్నట్లు యూజీసీ చైర్మన్ జగదీశ్‌కుమార్ సోమవారం ప్రకటించారు. ఇకపై నిర్వహించే నెట్, సీయూఈటీ పరీక్షల్లో స్కోర్ సాధారణీకరణ ఉండబోదని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు యూజీసీ ఒకే సబ్జెక్టుకు సంబంధించి వేర్వేరు సెషన్లలో.. వేర్వేరు ప్రశ్నపత్రాలతో నెట్, సీయూఈటీ పరీక్షలను నిర్వహించేది. దాంతో.. ఒక సెషన్‌లో పరీక్ష రాసిన విద్యార్థి.. మరో సెషన్‌లో పరీక్ష రాసిన వారి మార్కులతో సామర్థ్యాన్ని పోల్చిచూసుకునేందుకు స్కోర్‌ను సాధారణీకరించేవారు. ఇలా చేయడం వల్ల పరీక్షల్లో తమ ప్రతిభపై దుష్ప్రభావం పడుతోందంటూ విద్యార్థులు ఆరోపిస్తూ వస్తున్నారు. గతంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) ద్వారా యూజీసీ ఈ పరీక్షలు నిర్వహించేది. సీబీటీ కోసం పరిమిత సంఖ్యలో ప్రత్యేక పరీక్ష కేంద్రాలుండేవి. దాంతో.. వేర్వేరు సెషన్లలో.. వేర్వేరు ప్రశ్నపత్రాలతో పరీక్షలను నిర్వహించాల్సి వచ్చేది. ఈ ఏడాది నుంచి యూజీసీ ఓఎంఆర్ పద్ధతిలో పరీక్షలను నిర్వహిస్తామని ప్రకటించింది. దీంతో.. దేశవ్యాప్తంగా ఎక్కువ కేంద్రాల్లో ఒక సబ్జెక్టుకు ఒకే ప్రశ్నపత్రం విద్యార్థులందరికీ ఏకకాలంలో పరీక్షలను నిర్వహించే అవకాశముంటుందని యూజీసీ చెబుతోంది. దీంతో.. స్కోర్ సాధారణీకరణే ఉండదని వివరించింది.

25 వేల మంది టీచర్లు ఇంటికే!



(మొదటి పేజీ తరువాయి)

ఆశ్రయించిన పలువురు అభ్యర్థులు తీర్పు రాగానే కోర్టు వెలుపల పెద్ద ఎత్తున గుమిగూడి హర్షం వ్యక్తం చేశారు. బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కూడా ఈ తీర్పుపై స్పందించారు. బీజేపీ నాయకులు న్యాయవ్యవస్థను, తీర్పులను సైతం ప్రభావితం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. ఈ వ్యవహారంపై 2022 మేలో సీబీఐ విచారణకు ఆదేశించిన హైకోర్టు న్యాయమూర్తి అభిజిత్ గంగోపాధ్యాయ స్వచ్ఛంద పదవీ విరమణ చేసి బీజేపీలో చేరి, ఇప్పుడు తామ్లుక్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న విషయాన్ని ఆమె పరోక్షంగా గుర్తుచేస్తూ.. ఇది ప్రస్తుతం బీజేపీలో ఉన్న ఒక వ్యక్తి ఇచ్చిన ఆదేశాల ఫలితమని వ్యాఖ్యానించారు. ఈ తీర్పును తాము సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామని స్పష్టం చేశారు. "కారణాలేవైనాగానీ.. దాదాపు 26 వేల మంది ఉద్యోగాలు లాగేసుకోవడం దారుణం. మేం దీనిపై పోరాడుతాం. ఉద్యోగాలు కోల్పోయినవారు బాధపడొద్దు. మేం మీకు అండగా ఉన్నాం. ఉంటాం." అని ఆమె వ్యాఖ్యానించారు.

అసలేమిటీ కేసు?

పశ్చిమబెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్.. 2014లో రాష్ట్ర ప్రభుత్వ ప్రాయోజిత, ఎయిడెడ్ పాఠశాలల్లో టీచర్ల నియామకానికి నోటిఫికేషన్ ఇచ్చింది. 2016లో నియామక ప్రక్రియ ప్రారంభించింది. 24,640 ఖాళీల భర్తీ కోసం చేపట్టిన ఈ పరీక్షకు 23 లక్షల మందికి పైగా హాజరయ్యారు. చివరికి 25,753 మంది నియమితులయ్యారు. కానీ, ఈ నియామక ప్రక్రియలో లోపాలున్నాయని కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. తమకన్నా తక్కువ మార్కులు వచ్చినవారికి తమకన్నా మెరుగైన ర్యాంకు ఇచ్చారని.. అసలు మెరిట్ లిస్టులో లేని అభ్యర్థులకూ నియామక పత్రాలు అందాయని హైకోర్టుకు మొరపెట్టుకున్నారు. మరోవైపు.. 2016లో బెంగాల్ సర్కారు రాష్ట్రంలోని ప్రభుత్వ ఎయిడెడ్ స్కూళ్లలో ఖాళీగా ఉన్న 13 వేల గ్రూప్-డీ పోస్టుల భర్తీకి మరో నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ పోస్టుల నియామకానికి సంబంధించిన ప్యానెల్ తుదిగడువు 2019లో ముగిసిపోయిన తర్వాత కూడా 25 మందిని నియమించిందనే ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై పలువురు అభ్యర్థులు వేసిన పిటిషన్లను పరిశీలించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభిజిత్ గంగోపాధ్యాయ సీబీఐ విచారణకు ఆదేశించారు. ఈమేరకు దర్యాప్తు చేపట్టిన సీబీఐ.. 2014లో నిర్వహించిన పరీక్షలో అవకతవకలు జరిగాయని తన ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. ఈ దందాలో పెద్ద ఎత్తున డబ్బు లావాదేవీలు కూడా జరిగినట్లు తెలియడంతో ఈడీ రంగంలోకి దిగింది. 2022 జూలై 23న పార్థ చటర్జీ(పరీక్ష జరిగినప్పుడు విద్యాశాఖ మంత్రి)కి అత్యంత సన్నిహితురాలిగా పేరున్న అర్పితా ముఖర్జీ ఇంట్లో దాడులు చేసి రూ.21కోట్ల నగదు, రూ.కోటి విలువ చేసే నగలను స్వాధీనం చేసుకుంది. పార్థచటర్జీని అరెస్టు చేసింది. వారిద్దరికీ సంబంధించిన రూ.103.10 కోట్ల విలువైన నగదు, నగలు, స్థిరాస్తులను జప్తు చేసినట్టు 2022 సెప్టెంబరులో కోర్టుకు తెలిపింది. అక్రమ మార్గాల్లో ఈ ఉద్యోగాలు పొందినవారు రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షల దాకా లంచాలు ఇచ్చినట్టు పేర్కొంది. కాగా.. మొత్తం 8611 మంది నియామకాల్లో అవకతవకలు జరిగినట్టు బెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్ హైకోర్టులో దాఖలు చేసిన ప్రమాణపత్రంలో అంగీకరించడం గమనార్హం.

సువేందుకు ముందే ఎలా తెలుసు?

"సోమవారం దాకా వేచి చూడండి. ఓ భారీ (రాజకీయ) పేలుడు.. మేనత్త-మేనల్లుళ్ల పార్టీ (టీఎంసీ)ని కుదిపేస్తుంది. దాన్నుంచి వారు తేరుకోలేరు" ..బీజేపీ నేత సువేందు అధికారి కిందటివారం చేసిన ప్రకటన ఇది. సువేందు అధికారి ఈ ప్రకటన చేసింది సోమవారంనాటి హైకోర్టు తీర్పుగురించేనని.. ఈ తీర్పు గురించి బీజేపీకి అసలు ముందే ఎలా తెలిసిందని తృణమూల్ నేతలు మండిపడుతున్నారు. అయితే.. తాను టీఎంసీలో అంతర్గత కలహాల గురించే అలా మాట్లాడానని సువేందు అన్నారు.

అప్పట్లో చౌతాలా..

ఇప్పుడు బెంగాల్‌లో జరిగినట్టే.. దాదాపు 24 సంవత్సరాల క్రితం హరియాణాలోనూ టీచర్ల నియామకంలో కుంభకోణం జరిగింది. ఆ కేసులో.. హరియాణా మాజీ సీఎం ఓం ప్రకాశ్ చౌతాలా 2013లో జైలు పాలయ్యారు. 2000 సంవత్సరంలో నాటి హరియాణా సర్కారు ఫోర్జరీ డాక్యుమెంట్లతో 3208 మంది టీచర్లను అక్రమంగా నియమించిందంటూ నమోదైన కేసుపై విచారణ జరిపిన కోర్టు.. వీరిని దోషులుగా నిర్ధారించింది.

ఎంపీ, ఎమ్మెల్యేల కేసుల్లో మందకొడిగా తీర్పులు

ఈ విషయంలో తెలంగాణ హైకోర్టు పనితీరు బాగు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: దేశవ్యాప్తంగా ఎంపీ, ఎమ్మెల్యేలపై నమోదైన క్రిమినల్ కేసుల పరిష్కారం మందకొడిగా సాగుతోంది. వీటి కోసం ఏర్పాటైన ప్రత్యేక కోర్టులు గత ఏడాది 2,018 కేసుల్లో తీర్పులు వెలువరించాయి. ఈ విషయం సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో వెల్లడయింది. ఎంపీ, ఎమ్మెల్యేలపై నమోదైన క్రిమినల్ కేసులను త్వరగా పరిష్కరించేలా ఆదేశించాలని కోరుతూ న్యాయవాది అశ్విన్ ఉపాధ్యాయ దాఖలు చేసిన పిల్‌పై విచారణ సందర్భంగా అమికస్‌క్యూరీగా వ్యవహరిస్తున్న సీనియర్ న్యాయవాది విజయ్ హన్సారియా ఈ అఫిడవిట్‌ను సమర్పించారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో కూడా క్రిమినల్ కేసులు ఉన్నవారు రంగంలో ఉన్నందున కేసుల సత్వర విచారణపై దృష్టి పెట్టాల్సి ఉందని తెలిపారు. మొదటి రెండు దశల ఎన్నికల్లో 2,810 మంది పోటీ చేస్తుండగా అందులో 501 మంది (18%)పై క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపారు. వీరిలో 327 మంది (12 శాతం)పై అయిదేళ్ల కన్నా ఎక్కువ కాలం పాటు శిక్షలు పడే తీవ్రమైన కేసులు ఉన్నాయని వివరించారు. క్రిమినల్ కేసులు ఉన్నవారు గణనీయ సంఖ్యలోనే ఎన్నికవుతున్నందున కేసుల సత్వర పరిష్కారానికి మరిన్ని ఆదేశాలు ఇవ్వాల్సి ఉంటుందని ఆ అఫిడవిట్‌లో సూచించారు. 2023 జనవరి ఒకటో తేదీ నాటికి మొత్తం 4,697 కేసులు పెండింగ్‌లో ఉండగా ఆ ఏడాది మొత్తం మీద ప్రత్యేక కోర్టులు 2,018 కేసులను పరిష్కరించాయి. కొత్తగా 1,746 కేసులు రావడంతో పెండింగ్ కేసుల సంఖ్య మళ్లీ 4,474కు పెరిగింది. మొత్తం 1,300 కేసుల్లో 766 కేసులను పరిష్కరించి ఉత్తరప్రదేశ్‌లోని కోర్టులు సంఖ్యాపరంగా మొదటి స్థానంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో కేసుల పరిష్కారంపై హైకోర్టులు మరింత నిశితంగా పర్యవేక్షించాల్సి ఉంటుందని అమికస్‌క్యూరీ హన్సారియా తన అఫిడవిట్‌లో సూచించారు. మూడేళ్ల కంటే ఎక్కువకాలంపాటు కేసులు పెండింగ్‌లో ఉంటే అందుకుగల కారణాలను వివరిస్తూ ఎంపీ/ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టుల జడ్జీల నుంచి హైకోర్టులు నివేదిక కోరాల్సి ఉంటుందని సిఫార్సు చేశారు. హైకోర్టులు ప్రతి కేసును సూక్ష్మస్థాయిలో పరిశీలించి విచారణ త్వరగా పూర్తయ్యేలా సూచనలు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కేసుల కోసం ప్రత్యేకంగా వెబ్‌సైట్ రూపొందించేలా సుప్రీంకోర్టు ఆదేశాలు ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇందు కోసం సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉంటుందని తెలిపారు. మూడేళ్లకుపైగా పెండింగ్‌లో ఉన్న కేసులపై తెలంగాణ, అలహాబాద్, ఢిల్లీ, పంజాబ్-హరియాణా, త్రిపుర హైకోర్టులు సూక్ష్మస్థాయి పరిశీలన జరిపి దర్యాప్తు పురోగతిని తెలుసుకున్నాయని హన్సారియా తెలిపారు. తగిన ఉత్తర్వులు కూడా ఇచ్చాయని పేర్కొన్నారు. మిగిలిన హైకోర్టులు మాత్రం పెండింగ్ కేసుల సమాచారాన్ని తెలుసుకున్నాయని వివరించారు.

'నానో యూరియా ప్లస్' మే 1 నుంచి విక్రయాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: 'నానో యూరియా ప్లస్' ఎరువు ఉత్పత్తిని ఈ వారం నుంచే ప్రారంభించనున్నట్టు సహకార దిగ్గజం ఇఫ్కో సోమవారం వెల్లడించింది. దీని వాణిజ్యపరమైన అమ్మకాలను మే 1 నుంచి చేపట్టనున్నట్టు తెలిపింది. నానో యూరియా నూతన వెర్షన్‌గా నానో యూరియా ప్లస్‌ను తీసుకువస్తున్నారు. పంట వృద్ధి దశల్లో అవసరమైన నత్రజనిని అవసరాలను తీర్చడానికి ఇది దోహదపడుతుంది. ఇఫ్కో మూడు ప్లాంట్లలో నానో యూరియా ప్లస్ ఉత్పత్తిని ప్రారంభించనున్నారు. ప్రపంచంలోనే మొదటిసారిగా ద్రవరూప నానో యూరియా ఎరువును 2021 జూన్‌లో ఇఫ్కో విడుదల చేసింది. ఆ తర్వాత 2023 ఏప్రిల్‌లో నానో డీఏపీని తెచ్చింది.

ప్లాట్‌ఫామ్ రుసుమును రూ.5కు పెంచిన జొమాటో

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో.. వినియోగదారుల నుంచి వసూలు చేసే ప్లాట్‌ఫామ్ రుసుమును పెంచింది. దీంతో ఒక్కో ఆర్డరుకు కస్టమర్లు రూ.5 చెల్లించాల్సి వస్తుంది. ఇంతకు ముందు ఇది రూ.4 ఉండేది. పెంచిన ఫీజు ఢిల్లీ-ఎన్‌సీఆర్, బెంగళూరు, ముంబై, హైదరాబాద్ తదితర పట్టణాల్లో అమలు చేస్తున్నట్టు తెలుస్తోంది. గత ఆగస్టులో కంపెనీ ప్లాట్‌ఫామ్ ఫీజును ప్రవేశపెట్టింది. కాగా జొమాటోకు పోటీగా ఉన్న స్విగ్గీ ఇప్పటికే ఒక్కో ఆర్డరుకు రూ.5 ప్లాట్‌ఫామ్ ఫీజు వసూలు చేస్తోంది.

ప్రాణం తీసింది సింథటిక్ స్వీట్‌నరే!

» కేక్‌లో అధికంగా కలపడం వల్లే పంజాబ్ చిన్నారి మృతి

పటియాలా, ఏప్రిల్ 22: పంజాబ్‌లో పుట్టిన రోజున కేక్ తిని ఓ పదేళ్ల బాలికమృతి చెందిన కేసులో.. అధిక మోతాదులో కేక్‌లో సింథటిక్ స్వీట్‌నర్ (చక్కెరకు ప్రత్యామ్నాయంగా వాడే కృత్రిమ రసాయనం) కలిసిందని, అదే ఆమె మృతికి కారణమైందని తేల్చారు. గత నెల 24న పటియాలాకు చెందిన మాన్వి పుట్టినరోజు వేడుకల కోసం కుటుంబీకులు ఆన్‌లైన్‌లో కేక్ ఆర్డర్ చేశారు. ఆ కేక్ తిన్న కాసేపటికే అందరూ అస్వస్థతకు గురయ్యారు. మాన్వి పరిస్థితి విషమించడంతో ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగానే ఆమె మృతి చెందింది. కేక్‌లో బేకరీ వారు విషం కలిపారని, అందువల్లే మాన్వి చనిపోయిందంటూ కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేక్‌లో అధికమోతాదులో సింథటిక్ స్వీట్‌నర్ కలిపినట్లు గుర్తించామని జిల్లా ఆరోగ్యశాఖ అధికారి తెలిపారు. సింథటిక్ స్వీట్‌నర్ ఎక్కువుండే పదార్థాలు తింటే రక్తంలో గ్లూకోజ్ స్థాయులు వేగంగా పెరిగి చేటు చేస్తాయన్నారు.

అన్ని కంపెనీల మసాలాలకు 'పరీక్ష'!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: భారతీయ మసాలా బ్రాండ్లు 'ఎవరెస్ట్, ఎండీహెచ్'కు చెందిన 4 ఉత్పత్తులపై హాంకాంగ్, సింగపూర్ నిషేధం విధించడంతో కేంద్రం అప్రమత్తమైంది. ఈ రెండింటితోపాటు దేశంలోని అన్ని కంపెనీల మసాలా దినుసుల తయారీ కేంద్రాల నుంచి నమూనాలు సేకరించాలని అధికారులను ఆదేశించింది. 'ఫుడ్ కమిషనర్లకు అందిన ఆదేశాలమేరకు నమూనాల సేకరణ ప్రక్రియ మొదలైంది. ఇది 3-4 రోజుల్లో పూర్తవుతుంది. సుమారు 20రోజుల్లో ల్యాబ్ నుంచి నివేదిక అందుతుంద'ని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఎవరెస్ట్ కంపెనీ ఫిష్ కర్రీ మసాలా, ఎండీహెచ్ స్పైసెస్‌కు చెందిన మద్రాస్ కర్రీ పౌడర్ (స్పైస్ బ్లెండ్ ఫర్ మద్రాస్ కర్రీ), మిక్స్‌డ్ మసాలా పౌడర్, సాంబార్ మసాలాలో 'ఇథిలీన్ ఆక్సైడ్' ఉన్నట్టు హాంకాంగ్, సింగపూర్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

ఇరాన్ ఎస్-300 డిఫెన్స్ వ్యవస్థ ధ్వంసం!

» గత వారం ఇజ్రాయెల్ దాడి ఫలితం

» ఉపగ్రహ చిత్రాల ద్వారా అమెరికా వెల్లడి

వాషింగ్టన్/టెల్అవీవ్, ఏప్రిల్ 22: ఇజ్రాయెల్ గత వారం జరిపిన డ్రోన్, క్షిపణి దాడుల్లో ఇరాన్‌కు చెందిన ఎస్-300పీఎంయూ2 వ్యవస్థ ధ్వంసమైనట్లు అమెరికా గుర్తించింది. ఈ నెల 15కు ముందు ఆ ప్రాంతంలో ఎస్-300 డిఫెన్స్ వ్యవస్థ ఆ ప్రాంతంలో ఉన్నట్లు.. ఇజ్రాయెల్ దాడి తర్వాత కనుమరుగైనట్లు పేర్కొంటూ.. 'గూగుల్ ఎర్త్' ఉపగ్రహ చిత్రాలను విడుదల చేసింది. న్యూయార్క్ టైమ్స్, బీబీసీల్లో ఈ మేరకు కథనాలు వచ్చాయి. ఇస్ఫహాన్ నగరంలో ఇరాన్‌కు చెందిన న్యూక్లియర్ ప్లాంట్లు, వైమానిక స్థావరాలు ఉన్న విషయం తెలిసిందే..! వీటికి రక్షణగా రష్యా నుంచి 2016లో కొనుగోలు చేసిన ఎస్-300పీఎంయూ2 ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను ఇరాన్ మోహరించింది. ఎస్-300 రాడార్లు శత్రువులు ప్రయోగించే క్షిపణులను గుర్తించి, వెనువెంటనే వాటిని ధ్వంసం చేస్తాయి. ఈ వ్యవస్థకు చెందిన బ్యాటరీలు ధ్వంసమైన ఉపగ్రహ చిత్రాలను బీబీసీ, న్యూయార్క్ టైమ్స్ తమ కథనాల్లో ప్రచురించాయి. ఇజ్రాయెల్ దాడిలో ఎస్-300 రాడార్ వ్యవస్థ పూర్తిగా ధ్వంసమైపోయినట్లు స్పష్టమవుతోంది.

ఇజ్రాయెల్ ఇంటెలిజెన్స్ చీఫ్ రాజీనామా

ఇజ్రాయెల్ మిలటరీ ఇంటెలిజెన్స్ చీఫ్ మేజర్ జనరల్ అహ్రోన్ హలీవా సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. అక్టోబరు 7 హమాస్ దాడికి బాధ్యత వహిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే.. తదుపరి చీఫ్‌ను ప్రకటించేవరకు అహ్రోన్ ఆ పదవిలోనే కొనసాగుతారని ఇజ్రాయెల్ ప్రభుత్వం వెల్లడించింది.

66 వేల మందికి యూఎస్ పౌరసత్వం

వాషింగ్టన్, ఏప్రిల్ 22: అమెరికా పౌరసత్వం పొందుతున్న వారిలో భారతీయులు రెండో స్థానంలో నిలిచారు. 2022లో నాచురలైజ్డ్ యూఎస్ సిటిజన్‌షిప్ పొందిన వారిలో మెక్సికన్లు 1.06 లక్షల మందితో ప్రథమ స్థానంలో నిలవగా, ఆ తరువాతి స్థానాల్లో వరుసగా భారత్, ఫిలిప్పైన్స్, క్యూబా, డొమినిసియన్ రిపబ్లిక్, వియత్నాం, చైనా నిలిచాయి. ఆ ఏడాది మొత్తం 65,960 మంది భారతీయులకు అమెరికా పౌరసత్వం లభించింది. అమెరికాలో 2022 నాటికి 4.60 కోట్ల మంది విదేశీయులు నివశిస్తున్నారు. మొత్తం యూఎస్ జనాభా 33.3 కోట్లలో అది 14 శాతం.

30 వారాల గర్భవిచ్ఛిత్తికి సుప్రీం కోర్టు అనుమతి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గర్భవిచ్ఛిత్తిపై సుప్రీంకోర్టు అసాధారణ తీర్పు ఇచ్చింది. అత్యాచారానికి గురైన 14 ఏళ్ల బాలికకు ఊరట కల్పించింది. 30 వారాల గర్భాన్ని విచ్ఛిత్తి చేయటానికి అనుమతించింది. మహారాష్ట్రకు చెందిన ఆ బాలిక గతంలో అత్యాచారానికి గురై గర్భం దాల్చింది. నెలలు నిండిన తర్వాతగానీ ఆమె తల్లి దాన్ని గుర్తించలేకపోయింది. తన కుమార్తె అబార్షన్‌కు అనుమతి ఇవ్వాలని ఆమె బాంబే హైకోర్టులో పిటిషన్ వేయగా కోర్టు నిరాకరించింది. దీంతో, బాలిక తల్లి సుప్రీంకోర్టుకు వెళ్లారు. సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం దీనిపై ఈ నెల 19న అత్యవసర విచారణ చేపట్టి.. అబార్షన్ చేస్తే బాధిత బాలిక శారీరక, మానసిక పరిస్థితి ఎలా ఉంటుందో నివేదిక ఇవ్వాల్సిందిగా ముంబైలోని సియాన్ ఆసుపత్రి మెడికల్ బోర్డును ఆదేశించింది. ఈ మేరకు సియాన్ ఆసుపత్రి తన నివేదికలో.. అబార్షన్‌కు సిఫారసు చేసింది. ఈ నివేదిక ఆధారంగా సుప్రీంకోర్టు సోమవారం తీర్పును వెలువరించింది. ఇది ఒక ప్రత్యేకమైన కేసని ధర్మాసనం పేర్కొంది. బాలికకు తక్షణమే గర్భ విచ్ఛిత్తి చేయాలని, వైద్యపరంగా అన్ని రకాల సంరక్షణ చర్యలు తీసుకోవాలని సియాన్ ఆసుపత్రి డీన్‌ను ఆదేశిస్తూ తీర్పును వెలువరించింది. మన దేశంలో గర్భవిచ్ఛిత్తికి (అబార్షన్) సంబంధించి మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ (ఎంటీపీ) అనే చట్టం ఉంది. ఆ చట్టంలోని సెక్షన్ 3 బీ ప్రకారం వివాహిత మహిళలు, మైనర్లు, దివ్యాంగులు, అత్యాచార బాధితులు 24 వారాలలోపు గర్భాన్ని సురక్షితంగా, శాస్త్రీయంగా తొలగించుకోవటానికి అనుమతి ఉంది.



బీజేపీ అభ్యర్థిని అలింగనం చేసుకున్న ఏఎస్సైపై వేటు

సైదాబాద్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి మాధవీలతను సైదాబాద్ పోలీస్‌స్టేషన్ ఏఎస్సై ఉమాదేవి అలింగనం చేసుకోవడం వివాదంగా మారింది. శనివారం సాయంత్రం ఐఎస్‌సదన్ డివిజన్ వినయ్‌నగర్‌లో మాధవీలత ఎన్నికల ప్రచారం సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. బందోబస్తు విధుల్లో ఉన్న ఉమాదేవి.. మాధవీలతతో కరచాలనం చేసి.. ఆ వెంటనే ఆమెను ఆలింగనం చేసుకున్నారు. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసు శాఖ కోడ్ ఉల్లంఘన కింద క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఆమెను సస్పెండ్ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పంద్రాగస్టులోపు రుణమాఫీ చేయకపోతే రాజీనామా చేస్తావా?

» సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్



సంగారెడ్డి/నర్సాపూర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పంద్రాగస్టులోపు రూ.39 వేల కోట్ల రైతుల రుణాలను మాఫీ చేయకపోతే రాజీనామా చేస్తావా? అని మాజీమంత్రి హరీశ్‌రావు సీఎం రేవంత్‌కు సవాల్ విసిరారు. సోమవారం నర్సాపూర్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలతో మండలాల వారీగా సమీక్ష నిర్వహించారు. అంతకు ముందు సంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లో మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రావిరెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీలే ఇప్పుడు ఆ పార్టీకి భస్మాసుర హస్తాలు అవుతాయని చెప్పారు. హామీలపై మాట తప్పిన కాంగ్రెస్‌ను ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతుల ఆత్మహత్యలు మొదలయ్యాయని ఆరోపించారు. బీజేపీ మెదక్ అభ్యర్థి రఘునందన్‌రావు కొందరు రైతులను అడ్డు పెట్టుకుని వెంకట్రామిరెడ్డిపై సోషల్‌మీడియా వేదికగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

ఎన్నికల శిక్షణకు గైర్హాజరు ..30మందిపై కేసులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధుల శిక్షణ తరగతులకు గైర్హాజరైన వారిపై చర్యలు కొనసాగుతున్నాయి. గతంలో పది మందిపై క్రిమినల్ కేసులు నమోదు కాగా.. తాజాగా మరో 30 మందిపై ఎఫ్ఐఆర్ నమోదైనట్టు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ తెలిపారు. మే 13వ తేదీన పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో వివిధ విభాగాలకు చెందిన 23 వేలమంది అధికారులు, ఉద్యోగులకు శిక్షణ తరగతులకు హాజరుకావాలని సందేశం పంపారు. వీరిలో పీవో, ఏపీవో, సూక్ష్మ పరిశీలకులు 3,700 మంది శిక్షణకు గైర్హాజరయ్యారు. దానిపై వివరణ ఇవ్వాలని జిల్లా ఎన్నికల అధికారి వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నోటీసులపై కొందరు స్పందించగా.. ఇంకొందరు ఇప్పటికీ వివరణ ఇవ్వలేదు. ఈ మేరకు విద్యాశాఖ, వాణిజ్య పన్నుల శాఖలకు చెందిన 30 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు.

కాంగ్రెస్‌లో చేరిన 'బండ్లగూడ' కార్పొరేటర్లు

నార్సింగ్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ వ్యతిరేకవర్గమైన బండ్లగూడ కార్పొరేషన్ కార్పొరేటర్లు సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. చేవేళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, లతాప్రేమ్‌గౌడ్‌తో పాటు మరో 8 మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లు సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్‌లో చేరతారనుకున్న ప్రకాశ్‌గౌడ్ చివరి నిమిషంలో వెనుకంజ వేయడంతో.. ప్రకాశ్‌గౌడ్ వ్యతిరేక వర్గాన్ని చేర్చుకునేందుకు కాంగ్రెస్ పావులు కదిపింది. మొన్నటి వరకు వీరంతా కాంగ్రెస్‌లో చేరతామన్నా రాజకీయ ఒత్తిళ్ల కారణంగా సీఎం అపాయింట్‌మెంట్ కూడా దొరకలేదు. ఇప్పుడు ప్రకాశ్‌గౌడ్ వెనుకంజతో సీఎంను కలిసి కాంగ్రెస్‌లో చేరారు.

రాష్ట్రవ్యాప్తంగా 169 నామినేషన్ల దాఖలు

» ఈటల, అసద్, విశ్వేశ్వర్ రెడ్డి తదితరుల నామినేషన్

హైదరాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వివిధ లోక్‌సభ స్థానాలకు సోమవారం 144 మంది అభ్యర్థులు 169 నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం, ఇతర పార్టీలకు చెందిన వారు 63 మంది ఉండగా అత్యధిక సంఖ్యలో 81 మంది ఇండిపెండెంట్లు ఉన్నారు. సోమవారం నామినేషన్ వేసిన ప్రముఖుల్లో మల్కాజిగిరి నుంచి ఈటల రాజేందర్ (బీజేపీ), హైదరాబాద్- గడ్డం శ్రీనివాస్ యాదవ్ (బీఆర్ఎస్), అసదుద్దీన్ ఒవైసీ (ఎంఐఎం), చేవెళ్ల- కొండా విశ్వేశ్వర్‌రెడ్డి (బీజేపీ), నాగర్‌కర్నూల్- ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ (బీఆర్ఎస్), భువనగిరి- క్యామ మల్లేశ్ (బీఆర్ఎస్), ఆదిలాబాద్- ఆత్రం సుగుణ (కాంగ్రెస్), వరంగల్- సుధీర్ కుమార్ (బీఆర్ఎస్), మహబూబాబాద్- సీతారాంనాయక్ (బీజేపీ), కరీంనగర్ నుంచి వెలిచాల రాజేందర్ రావు(కాంగ్రెస్) ఉన్నారు. వెలిచాలను కాంగ్రెస్ పార్టీ అధికారికంగా తమ అభ్యర్థిగా ప్రకటించకపోయినా ఆయన అట్టహాసంగా ర్యాలీ నిర్వహించి నామినేషన్ వేశారు. అధిష్ఠానం సూచనతోనే ఆయనతో నామినేషన్ వేయించామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. త్వరలో ఆయన అభ్యర్థిత్వాన్ని ఏఐసీసీ ప్రకటిస్తుందని తెలిపారు.

రేపు దానం నాగేందర్ నామినేషన్

» హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్22 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఉజ్జయినీ మహంకాళి ఆలయంలో పూజలు నిర్వహించిన తర్వాత ఉదయం 9.30గంటలకు భారీ ర్యాలీతో నామినేషన్ వేసేందుకు తరలివెళ్లనున్నారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు, ముఖ్య నేతలు హాజరుకానున్నారు. ర్యాలీ అనంతరం సికింద్రాబాద్‌లో నిర్వహించే స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగించనున్నారు.

మోదీకి ఓటమి భయం

(మొదటిపేజీ తరువాయి)

ఎవరి నమ్మకాలు వారికి ఉంటాయని, దేవుడు గుడిలో ఉండాలని, భక్తి గుండెల్లో ఉండాలని అభిప్రాయపడ్డారు. రాముడు బీజేపీ వాళ్లకే కాదు.. తమకూ దేవుడేనని, ఇతర దేవుళ్లను కూడా తాము ఆరాధిస్తామని తెలిపారు. నేను హిందువునైనందుకు గర్విస్తానని, అదే సమయంలో ఇతర మతాలను గౌరవిస్తానని స్పష్టం చేశారు. మతసామరస్యాన్ని కాపాడే కాంగ్రెస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. "రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టాలని ఢిల్లీలో మోదీ, గల్లీలో కేసీఆర్ ప్రయత్నిస్తున్నారు. సీఎంగా కేసీఆర్, పీఎంగా మోదీ పదేళ్ల పాటు ఉండి.. ఏ ఒక్క హామీనీ అమలు చేయలేదు. వంద రోజుల్లోనే ఇన్ని సంక్షేమ పథకాలను అమలు చేసిన మా ప్రభుత్వాన్ని మాత్రం పడగొట్టాలంటున్నారు. మరి పదేళ్ల అధికారంలో ఉన్నోళ్లను నడి బజార్‌లో ఉరి తీయాల్నా.. వంద మీటర్ల గోతి తీసి పాతి పెట్టాల్నా మీరే నిర్ణయించాలి.. అయినా, మా ప్రభుత్వాన్ని ఎందుకు కూలగొట్టాలి? మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించినందుకా? లేక రాజీవ్ ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.10లక్షలకు పెంచినందుకా? 40లక్షల కుటుంబాలకు రూ.500కే గ్యాస్ సిలిండ్ ఇస్తున్నందుకా? ప్రతి పేదవాడికి 200 యూనిట్ల ఉచిత కరెంటు ఇస్తున్నందుకా?" అని ప్రశ్నించారు. తమ పథకాలను చూసి మోదీ, కేసీఆర్ కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారని విమర్శించారు. వంద రోజుల్లోనే 30వేల ఉద్యోగాలు ఇచ్చిన తమ సర్కారును పడగొడితే నిరుద్యోగులు చూస్తూ ఊరుకుంటారా!? అని ప్రశ్నించారు. తెలంగాణలో ప్రజా పాలన మొదలైందని, ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే ఐదింటిని అమలు చేశామని గుర్తు చేశారు. బాసర సరస్వతీ దేవి సాక్షిగా.. వచ్చే పంద్రాగస్టులోగా 2లక్షల రుణమాఫీ చేసే బాధ్యత తనదని అన్నారు. రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొంటామని, క్వింటాల్‌కు రూ.500బోనస్ ఇస్తామని భరోసా ఇచ్చారు. వారు కోరుకుంటున్నట్లు రాష్ట్రంలో కాంగ్రెస్‌ను ఓడగొడితే పథకాలన్నీ ఆగిపోయే ప్రమాదం ఉందని అన్నారు.



నిజామాబాద్ జనజాతర సభకు హాజరైన జనం

వరి వేస్తే ఉరేనన్న చరిత్ర కేసీఆర్‌ది..

వరి వేస్తే ఉరే అని చెప్పిన చరిత్ర కేసీఆర్‌దని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. అందుకే ఆయనను శాసన సభ ఎన్నికల్లో రాజకీయంగా ప్రజలు గోతి తీసి పాతిపెట్టారన్నారు. నిజామాబాద్ రైతులను మోసం చేస్తే శాశ్వతంగా రాజకీయ సమాధి చేస్తారని ఇక్కడి రైతులు నిరూపించారన్నారు. చక్కెర ఫ్యాక్టరీని తెరిపిస్తానని చెప్పి మాట తప్పిన కవితను 2019 ఎన్నికల్లో రాజకీయ సమాధి చేశారని గుర్తు చేశారు. ఇక, ఐదు రోజుల్లో పసుపు బోర్డు తీసుకువస్తానని హామీ ఇచ్చి గెలిచిన అర్వింద్.. ఆ తర్వాత పట్టించుకోలేదన్నారు. గత అక్టోబరులో పసుపు బోర్డుపై మోదీ ప్రకటన చేశారే కానీ, ఆ జీవోలో ఎక్కడ పెడతారో స్పష్టం చేయలేదన్నారు. స్పైసెస్ బోర్డును పసుపు బోర్డు అని నవిస్తుంచే ప్రయత్నం చేస్తున్న అర్వింద్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. బండిని, గుండును ఇక్కడి ప్రజలు నమ్మబోరని అన్నారు. ఇచ్చిన హామీ మేరకు సెప్టెంబర్ 17లోగా మూతపడిన చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఆదిలాబాద్‌కు వర్సిటీ మంజూరు చేస్తా

ఎవరెన్ని కుట్రలు చేసినా దేశంలో వచ్చేది ఇండియా కూటమేనని రేవంత్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా జీవన్‌రెడ్డిని గెలిపిస్తే పార్టీ నేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీని ఒప్పించి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి పదవి ఇప్పించే బాధ్యతను తాను తీసుకుంటానన్నారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టును నిర్మిస్తామని, కేసీఆర్ హయాంలో తొలగించిన అంబేడ్కర్ పేరునే మళ్లీ ప్రాజెక్టుకు పెడతామని స్పష్టం చేశారు. ఆదిలాబాద్ జిల్లాకు యూనివర్సిటీని మంజూరు చేస్తామన్నారు. మోదీ, కేడీ కలిసి సీసీఐ సిమెంట్ పరిశ్రమను మూసేశారని, ఆ ఫ్యాక్టరీని తెరిపించేందుకు శాయశక్తులా కృషి చేస్తామన్నారు. కుప్టి ప్రాజెక్టును పూర్తి చేసి, బోథ్‌ను అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటామన్నారు. కడెం ప్రాజెక్టుకు మరమ్మతులు పూర్తి చేస్తామన్నారు. బీసీలకు దామాష ప్రకారం నిధులు మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు. బయ్యారం ఉక్కు కర్మాగారం, రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, ట్రిపుల్ ఐటీ, ఐటీఐఆర్ కారిడార్ వంటివి ఇవ్వకుండా మోసం చేసిన మోదీ.. సంకుచిత స్వభావంతో నిధులన్నీ గుజరాత్‌కే తరలిస్తున్నారని విమర్శించారు. మోదీకి ఓటేసినా, కేసీఆర్‌కు ఓటేసినా ఒక్కటేనని, వారిద్దరూ తోడుదొంగలని విమర్శించారు. తోడు దొంగల్లో ఒకరిని డిసెంబరు 7న బండకేసి కొట్టారని, రెండో దొంగను వచ్చే నెలలో గోడకేసి కొట్టాలని పిలుపునిచ్చారు. ఆదిలాబాద్ బరిలో ఉన్న ఆత్రం సుగుణను గెలిపించాలని కోరారు.



ఆదిలాబాద్ జనజాతర సభలో గిరిజన డోలు వాయిస్తున్న రేవంత్‌రెడ్డి

మల్కాజిగిరి ప్రజలను మరిచిపోను

కుట్ర చేసి కొడంగల్‌లో తనను ఓడిస్తే.. మల్కాజిగిరి ప్రజలు తనను అక్కున చేర్చుకున్నారని, వారిని ఎప్పటికీ మరచిపోనని రేవంత్ అన్నారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో మల్కాజ్‌గిరి పరిధిలోని సమస్యలపై పోరాడనన్నారు. కానీ, బీఆర్ఎస్ పెద్దలు కుట్ర చేసి అభివృద్ధికి అడ్డుపడ్డారని ఆరోపించారు. ఇక్కడ సునీతారెడ్డిని గెలిపించుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నందున సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. టీఆర్ఎస్‌తో బీజేపీకి రహస్య ఒప్పందం ఉన్నందునే కేసీఆర్ అవినీతి, ఫోన్ ట్యాపింగ్‌పై ఈటల మాట్లాడడం లేదని విమర్శించారు. మోదీ ఇచ్చిన హామీలపై బహిరంగ చర్చకు సిద్ధమా..? ఈటల సిద్ధమైతే మైసంపల్లిని పంపిస్తానని సవాల్ విసిరారు. కోకాపేట్‌లా మల్కాజ్‌గిరిని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

నామినేషన్లకు హాజరు కాని రేవంత్‌రెడ్డి

ఆదిలాబాద్/ నిజామాబాద్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్, నిజామాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్ దాఖలు కార్యక్రమాలకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరు కాలేదు. ఆదిలాబాద్‌లో ఆత్రం సుగుణ నామినేషన్‌కు సీఎం హాజరు కావాల్సి ఉన్నా.. పర్యటన రెండు గంటల పాటు ఆలస్యం కావడంతో బహిరంగ సభలో పాల్గొని వెనుదిరిగారు. దీంతో ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తదితరులతో కలిసి ఆత్రం సుగుణ నామినేషన్‌ను దాఖలు చేశారు. నిజామాబాద్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డితో కలిసి రేవంత్‌రెడ్డి వెళ్లినా.. సమయం మించిపోవడంతో జిల్లా కలెక్టరేట్ గేటు వద్ద నుంచీ వెనుదిరిగి వచ్చి జనజాతర సభలో పాల్గొన్నారు. కాగా, జీవన్‌రెడ్డి.. మంగళవారం నామినేషన్ దాఖలు చేసే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

నేడు 2 జిల్లాల్లో సీఎం పర్యటన

నాగర్‌కర్నూల్/మద్దూర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో భాగంగా నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం పర్యటించనున్నారు. నారాయణపేట జిల్లా మద్దూర్‌లో ఉదయం 11 గంటలకు జరిగే కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొననున్నారు. ఆ తర్వాత తిమ్మారెడ్డిపల్లిలో బావోజీ బ్రహ్మోత్సవాలకు హాజరవుతారు. కాగా, నాగర్‌కర్నూల్ జిల్లాలోని బిజినేపల్లిలో జనజాతర సభ నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. మల్లు రవి నామినేషన్ కార్యక్రమానికి సీఎం హాజరుకానున్నారు.

అనుమతి లేకుండా డ్రోన్ ఎగరవేసిన ముగ్గురిపై కేసు

మూడుచింతలపల్లి: సీఎం సభ సందర్భంగా అనుమతులు లేకుండా డ్రోన్‌ను ఎగురవేసిన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మేడ్చల్ జిల్లా తూంకుంట మునిసిపాలిటీ అంతాయిపల్లిలో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి సభ జరుగుతుండగా కొందరు డ్రోన్‌ను ఎగురవేశారు. దీన్ని గమనించిన పోలీసులు వెంటనే అప్రమత్తమై, డ్రోన్‌ను ఆపరేట్ చేస్తున్న ఎండీ ఇద్రీస్, గణేష్‌రెడ్డి, అక్షయ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనుమతిలేకుండా డ్రోన్ కెమెరాను వాడటంతోపాటు డ్రోన్‌వల్ల వీఐపీకి ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందు వల్ల వారిపై కేసు నమోదు చేశారు.

నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడే.. దేశంలో రాముడి పాలన మొదలైంది

ఆ రాముడే తొలి ప్రధానిని నిర్ణయించారు.. రాహుల్ కుటుంబ రక్తంలోనే త్యాగాలు ఉన్నాయి

» గాంధీ, నెహ్రూ చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చాలి

» రాముడి హయాంలోనూ కులాలు, మతాలున్నాయి

» రామ రాజ్యంలో వాటికి అతీతంగా పాలన సాగింది

» బీజేపీ నేతలకు ఇది అవసరం లేదా?: తూర్పు జగ్గారెడ్డి



గాంధీభవన్‌లో మాట్లాడుతున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): భారత ప్రధానిగా జవహర్‌లాల్ నెహ్రూ ఉన్నప్పుడే దేశంలో రాముడి పాలన మొదలైందని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. దేశ ప్రజలు కష్టాలు, బాధల్లో ఉన్నారని ఆ రాముడే నెహ్రూను తొలి ప్రధానిగా నిర్ణయించి ఉంటారని అన్నారు. అప్పట్లోనూ ప్రస్తుత బీజేపీ నాయకుల్లాంటి వారు ఉన్నారని, కానీ.. తొలి ప్రధానిగా నెహ్రూకే అవకాశం దక్కడందేవుడి నిర్ణయమేనని అభిప్రాయపడ్డారు. రామ రాజ్యంలోనూ కులాలు, మతాలు ఉన్నాయని, వాటికి అతీతంగా రాముడి పాలన కొనసాగిందని చెప్పారు. ఇది బీజేపీ వాళ్లకు అవసరం లేదా అని ప్రశ్నించారు. గాంధీభవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రామాయణం, మహాభారతంలో పాత్రల మాదిరిగానే స్వాతంత్ర్యానంతర భారతదేశంలో గాంధీ కుటుంబానికీ ఘన చరిత్ర ఉందని అన్నారు. రక్తపాతానికి తావు లేకుండా శాంతి మార్గాన్నే గాంధీ, నెహ్రూ నమ్మారని గుర్తు చేశారు. స్వాతంత్రోద్యమంలో జైలు జీవితాన్నీ గడిపిన నెహ్రూను దేశ ప్రజలు ఏకగ్రీవంగా ప్రధానిని చేశారని వెల్లడించారు. "దేశంలో ఎన్నికల వ్యవస్థను తెచ్చిందే నెహ్రూ. ఈ చరిత్రను కాదనే శక్తి బీజేపీ నేతలకు ఉందా?" అని సవాల్ విసిరారు. అప్పటికి మోదీ, అమిత్‌షా పుట్టనే లేదని ఎద్దేవా చేశారు. దేశంలో ఆకలి చావులను నిర్మూలించాలన్న లక్ష్యంతోనే భారీ సాగునీటి ప్రాజెక్టులకు నెహ్రూ శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. నాగార్జున సాగర్, శ్రీశైలం వంటి బహుళార్థక ప్రాజెక్టులను కట్టిన చరిత్ర నెహ్రూదని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందని మాట్లాడుతున్న కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌కు ఇవి కనబడట్లేదా? అని ప్రశ్నించారు. నెహ్రూ వేసిన పునాది నుంచే చంద్రబాబు, కేసీఆర్, రేవంత్‌రెడ్డి వంటి నేతలు పుట్టుకొచ్చారని చెప్పారు. త్యాగాలు చేయడం అన్నది రాహుల్‌గాంధీ కుటుంబ రక్తంలోనే ఉందన్నారు. గుండు సూది మొదలు శాటిలైట్ల వరకు తీసుకువచ్చిన చరిత్ర కాంగ్రెస్‌దని వివరించారు. తాను లేవనెత్తిన ఈ అంశాలపైన చర్చకు వచ్చే దమ్ము బీజేపీ నేతలకు ఉందా? అని సవాల్ విసిరారు. గాంధీ, నెహ్రూల చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని, ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కోరతానని చెప్పారు. నెహ్రూ పాలనను తప్పు పడుతున్న మోదీ.. నెహ్రూ ఉన్నప్పుడే పుట్టి ఉంటే బాగుండేదన్నారు. ఇప్పటికైనా బీజేపీ నేతలు అబద్ధపు ప్రచారాన్ని మానుకోవాలని హితవు పలికారు.

తెలంగాణలో అవినీతి సర్కార్

» పేదల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారు

» పదేళ్లు దోచుకున్న బీఆర్ఎస్ పనైపోయింది

» ఇండియా కూటమిలో పదవుల కోసం కుస్తీ

» రాహుల్ ఎన్నటికీ ప్రధాన మంత్రి కాలేరు

» కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

» కొండా, బీబీ పాటిల్ నామినేషన్లకు హాజరు



సంగారెడ్డిలో జరిగిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి పీయూష్ గోయల్

రంగారెడ్డి అర్బన్/సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి, అక్రమాలకు పాల్పడుతోందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. పదేళ్ల పాటు తెలంగాణలో ప్రజలను దోచుకున్న బీఆర్ఎస్ శకం ముగిసిందన్నారు. ప్రజా వ్యతిరేక పాలన వల్లే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీని ఓడించారని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి.. జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ ఆయా నియోజవర్గాల్లో సోమవారం నామినేషన్లు వేశారు. ఈ కార్యక్రమాలకు పీయూష్ గోయల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌కు, మిత్రపక్షాలకు మధ్య ఉన్నది దోస్తీ కాదని.. పదవుల కోసం జరుగుతున్న కుస్తీ అని విమర్శించారు. రాహుల్ గాంధీ నాయకత్వం పూర్తిగా బలహీనంగా ఉందని, ఇండియా కూటమి ప్రజల విశ్వాసాన్ని గెలవలేకపోతోందని చెప్పారు. రాహుల్ ఎన్నటికీ ప్రధాని కాలేరని అన్నారు. అవినీతి, కుటుంబ పాలనకు కాంగ్రెస్ కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిందని ఆరోపించారు. రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో మంజూరుచేసిన నిధుల్లో 85 శాతం దళారులు దోచుకుంటే 15 శాతమే పేదలకు అందేవని పేర్కొన్నారు. మోదీ చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల వల్ల దేశంలోని 25 కోట్ల మంది నిరుపేదలు ఆర్థికంగా నిలదొక్కుకున్నారని తెలిపారు. మోదీ పాలనలో దారిద్ర్యం తగ్గి, గ్రామీణ ప్రాంతాలు ఆర్థికంగా అభివృద్ధి దిశగా సాగుతున్నాయని పీయూష్ గోయల్ పేర్కొన్నారు.

ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు: కొండా

చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ప్రజలు తనకు బ్రహ్మరథం పడుతున్నారని కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. తన విజయం తథ్యం అని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సోమవారం రాజేంద్రనగర్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి విశ్వేశ్వర్‌రెడ్డి నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. నామినేషన్ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి కొండా సంగీతారెడ్డి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కమలం పువ్వును చూపుతూ ఆమె ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంగీతారెడ్డి మాట్లాడారు. మోదీ నాయకత్వంలో భారతదేశంలో చేసిన అభివృద్ధి మరే దేశంలో చూడలేదన్నారు. చేవెళ్లలో ప్రజల కోసం పని చేసే నాయకుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలన్నారు.

కాంగ్రెస్‌లో చేరని వారిపై అక్రమ కేసులు

» లబ్ధిపొందిన వారే పార్టీని వీడుతున్నారు

» బీఆర్ఎస్‌కు 8 నుంచి 10 సీట్లు: కేటీఆర్



సిరిసిల్ల, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌లో చేరాలంటూ బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్ నేతలు ఒత్తిడి చేస్తున్నారని, పార్టీలో చేరని వారిపై అక్రమ కేసులు పెడుతూ వేధింపులకు గురి చేస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఆరోపించారు. ఎవరూ అధైర్యపడవద్దని, అందరికీ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో బలమైన ప్రతిపక్షంగా ఉన్నామని, ప్రజల పక్షాన ప్రజల సమస్యలే ఎజెండాగా కొట్లాడుదామని పిలుపునిచ్చారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సిరిసిల్ల మునిసిపల్ బీఆర్ఎస్ క్లస్టర్ స్థాయి సమావేశం నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్‌తో లబ్ధి పొందిన కొందరు నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీని వీడుతున్నారని ఆరోపించారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పై వంద రోజుల్లోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని విమర్శించారు. రైతుబంధు అందించలేదని, రుణమాఫీ చేయలేదని, రైతులను మరోసారి మోసం చేయడానికి ఆగస్టు 15వ తేదీలోగా రుణమాఫీ చేస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి కొత్త డ్రామాకు తెరలేపరని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ 8 నుంచి 10 సీట్లను సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఐదేళ్లు ఎంపీగా ఉన్న సంజయ్ కరీంనగర్‌కు చేసిందేమీ లేదని చెప్పారు. బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్‌ను గెలిపిస్తే కరీంనగర్‌ను అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. మే 10న సిరిసిల్లలో కేసీఆర్ రోడ్ షో ఉంటుందని, ప్రతీ కార్యకర్త తరలివచ్చి, రోడ్ షోను విజయవంతం చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

హామీల అమలులో.. కాంగ్రెస్, బీఆర్ఎస్ విఫలం

» పేదలకు కనీసం రేషన్ కార్డులివ్వలేదు

» ఆ పార్టీలకు ఓటు అడిగే హక్కు లేదు

» అన్ని వర్గాలూ మోదీకే జై: కిషన్‌రెడ్డి



నల్లకుంటలోని ఫీవర్ ఆస్పత్రి చౌరస్తాలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): హామీలు, అభివృద్ధి పేరుతో ప్రజలను వంచించిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఓటు అడిగే నైతిక హక్కు లేదని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం.. అభివృద్ధి పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేశాయని మండిపడ్డారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు పేదలకు కనీసం రేషన్ కార్డులు కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. ఆ రెండు పార్టీలకు పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజల నుంచి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. అన్ని వర్గాల ప్రజలు మోదీకే జై కొడుతున్నారని.. సికిందరాబాద్‌లో మరోసారి కమలం జెండా రెపరెపలాడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బర్కత్‌పుర, కాచిగూడ, అంబర్‌పేటలో కిషన్‌రెడ్డి సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాగా, ముషీరాబాద్‌లో ఏర్పాటు చేసిన బీజేపీ ఎన్నికల కార్యాలయాన్ని కిషన్‌రెడ్డి, ఎంపీ లక్ష్మణ్ సోమవారం సాయంత్రం ప్రారంభించారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడారు. సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో ఇప్పటికే 30 శాతం ప్రచారాన్ని పూర్తి చేశామని, ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా శివసేన పార్టీకి చెందిన పలువురు కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ఖేల్ ఖతం.. దుకాణ్ బంద్.. అని రాష్ట్రంలో ఆ పార్టీ పని అయిపోయిందని ఎంపీ లక్ష్మణ్ అన్నారు. కాంగ్రెస్‌కు కూడా అదే గతి పట్టబోతోందని, భవిష్యత్తు బీజేపీదే అని ధీమా వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ 40 సీట్లు కూడా గెలుచుకునే పరిస్థితి లేదని, రాహుల్ ప్రధాని అవుతారని కాంగ్రెస్ పగటి కలలు కంటోందని ఎద్దేవా చేశారు.

ఆ సత్తా కోమటిరెడ్డికే ఉందేమో: మహేశ్వర్‌రెడ్డి

"పంద్రాగస్టు నాటికి రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామంటూ దేవుళ్లపై ఒట్టేసి చెబుతున్న మీరు.. మిగతా హామీల అమలు కోసం ఎంత మంది దేవుళ్లపై ఒట్టేస్తారు" అని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి.. సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలను పంద్రాగస్టు నాటికి పూర్తిచేస్తామని ఒట్టేసి చెప్పడానికి సిద్ధమా..? అని సవాల్ చేశారు. "కాంగ్రెస్ నుంచి 20 మందిని బీఆర్ఎస్‌లోకి తీసుకెళ్లే సత్తా మంత్రి కోమటిరెడ్డికే ఉందేమో..? అందుకే తనతో పాటు సీఎం అయ్యే అర్హత కోమటిరెడ్డికి ఉందంటూ రేవంత్ ఆయన్ను ఆపే ప్రయత్నం చేశారేమో..?" అని అన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా గురువారం మెదక్ పార్లమెంటు పరిధిలోని సిద్దిపేటలో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రేమేందర్ రెడ్డి తెలిపారు. ముందుగా ప్రతిపాదించిన షెడ్యూల్ ప్రకారం అమిత్ షా గురువారం బాన్సువాడ సభలో పాల్గొనాల్సి ఉంది. అయితే ఆ వేదిక సిద్దిపేటకు మారింది.





నవతరం.. యువతరం

పార్లమెంటు ఎన్నికల్లో పోటీ అంటే.. అందరూ ఉద్దండులు, అనుభవజ్ఞులే ఉంటారని అనుకుంటాం! ఇప్పటి వరకూ చాలా సందర్భాల్లో అటువంటి సంప్రదాయం కొనసాగింది కూడా! కానీ, ఇప్పుడు తరం మారుతోంది! అసెంబ్లీ ఎన్నికల్లోనే కాదు.. లోక్‌సభ ఎన్నికల్లోనూ నవతరం దూసుకొస్తోంది! ఏకంగా పార్లమెంటులోనే తొలిసారి అధ్యక్షా.. అనాలని ఎదురు చూస్తోంది! రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటి వరకూ ప్రకటించిన అభ్యర్థుల్లో సగానికి సగం ప్రత్యక్ష ఎన్నికలకు పూర్తిగా కొత్తవారు కాగా.. మిగిలిన వారిలో అత్యధికులు గతంలో ప్రత్యక్ష ఎన్నికల్లో పాల్గొంచుకున్నా.. లోక్‌సభ ఎన్నికల బరిలోకి తొలిసారి దిగుతున్నవారు కావడం విశేషం! వీరిలోనూ ఒకరిద్దరు మినహా మిగిలిన వారంతా యువతరం కావడం మరో విశేషం!! అంతేనా.. అభ్యర్థుల్లో కొందరు రాజకీయ వారసులు ఉన్నా.. అత్యధికులకు మాత్రం రాజకీయ అనుభవం లేకపోవడం గమనార్హం! ఇక, అభ్యర్థుల్లో ఒకరు ఐఏఎస్ అధికారి అయితే.. మరొకరు రాజీనామా చేసిన ఉపాధ్యాయిని! ఇంకొకరు డాక్టర్ అయితే.. మరొకరు ఆస్పత్రి యజమాని! ఇక, అభ్యర్థుల్లో మిగిలిన వారిలో కొందరు గతంలో ప్రజా ప్రతినిధులుగా పని చేశారు! అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచినవారూ ఉన్నారు.. పోటీ చేసిన వారూ ఉన్నారు! కానీ, వారంతా తొలిసారిగా పార్లమెంటు బరిలో నిలుస్తున్నారు! ఒక్కో నియోజకవర్గంలో అయితే ప్రధాన పార్టీల అభ్యర్థుల ముగ్గురూ కొత్తవారే! వీరిలో ఎవరు గెలిచినా 'కొత్త' చరిత్రకు నాంది పలికినట్లే!!

వారసత్వమే బలంగా..



కె.రఘువీర్‌రెడ్డి
నల్లగొండ (కాంగ్రెస్)

కుందూరు జానారెడ్డి పెద్దకొడుకు. సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌కు అన్న. మిర్యాలగూడ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయాలని భావించినా టికెట్ దక్కకపోవడంతో ఇప్పుడు లోక్‌సభ బరిలో నిలిచారు. కాంగ్రెస్ నేతలంతా ఏకమై పనిచేస్తుండడంతో ఎంపీగా గెలిచి తండ్రి వారసత్వాన్ని బలంగా చాటాలని భావిస్తున్నారు.

పట్టు నిలుపుకోవాలని..



పట్నం సునీతారెడ్డి
మల్కాజిగిరి (కాంగ్రెస్)

మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి సతీమణి. మూడు పర్యాయాలు జడ్పీ చైర్‌పర్సన్. మారిన పరిస్థితుల్లో భర్తతోపాటే బీఆర్‌ఎస్‌ను వీడారు. కాంగ్రెస్ పార్టీ పిలిచి మరీ మల్కాజిగిరి ఎంపీ టికెట్ ఇవ్వడంతో రంగారెడ్డి జిల్లాలో తమ కుటుంబం పట్టు నిలుపుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు.

సీఎం సన్నిహితుడిగా..



కిరణ్‌కుమార్‌రెడ్డి
భువనగిరి (కాంగ్రెస్)

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సన్నిహితుడు. భువనగిరి కాంగ్రెస్ టికెట్ కోసం తీవ్ర పోటీ ఎదురైనా.. సీఎం అండతో అవకాశం దక్కించుకున్నారు. నియోజకవర్గంపై పట్టున్న కోమటిరెడ్డి బ్రదర్స్ మద్దతు పొందగలిగారు. కాంగ్రెస్ సిటింగ్ స్థానాన్ని నిలబెడతానన్న ధీమా వ్యక్తం చేస్తున్నారు.

నామమాత్రమైనా..



జి.శ్రీనివాస్ యాదవ్
హైదరాబాద్ (బీఆర్‌ఎస్)

అసెంబ్లీ ఎన్నికల్లో గోషామహల్ నుంచి పోటీ చేయాలనుకున్నారు. అప్పుడు టికెట్ నిరాకరించిన బీఆర్‌ఎస్ అధిష్ఠానం ఇప్పుడు హైదరాబాద్ ఎంపీగా బరిలోకి దించింది. ఇక్కడ బీఆర్‌ఎస్ పోటీ నామమాత్రమేనన్న అభిప్రాయాలున్నా.. గడ్డం శ్రీనివాస్ యాదవ్ మాత్రం సీరియస్‌గానే ప్రచారం చేసుకుంటున్నారు.

ఎమ్మెల్యేగా ట్రై చేస్తే..



రాగిడి లక్ష్మారెడ్డి
మల్కాజిగిరి (బీఆర్‌ఎస్)

ఉప్పల్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయాలనుకున్నారు. టికెట్ దక్కకున్నా పార్టీ పట్ల విధేయత ప్రదర్శించారు. స్వయంగా అధినేత పిలిచి మరీ ఎంపీ టికెట్ ఇచ్చారు. లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలందరూ సహకారం అందిస్తుండడంతో గెలుస్తానన్న ధీమాతో ఉన్నారు.

బలమైన నేపథ్యంతో..



గడ్డం వంశీకృష్ణ
పెద్దపల్లి (కాంగ్రెస్)

తాత దివంగత మాజీ కేంద్రమంత్రి వెంకటస్వామి. తండ్రి వివేక్, పెదనాన్న వినోద్ ప్రస్తుతం ఎమ్మెల్యేలు. అంతకుముందు పలు పదవులు నిర్వహించారు. రాజకీయంగా, ఆర్థికంగా బలమైన కుటుంబం. పైగా ప్రచారంలో నాన్న, పెదనాన్నలే వంశీకృష్ణ వెనక ఉండి అన్నీ తామై నడిపిస్తున్నారు.

బడిలో పాఠాలే కాదు..



ఆత్రం సుగుణ
ఆదిలాబాద్ (కాంగ్రెస్)

ఆదివాసీ ఉద్యమంలో పని చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సంపాదించారు. బడిలో పిల్లలకు పాఠాలు చెప్పడంతోనే కాకుండా.. సమాజంలోనూ మార్పు తీసుకురావాలనుకున్నారు. ఉద్యోగానికి రాజీనామా చేసి.. కాంగ్రెస్‌లో చేరి లోక్‌సభ ఎన్నికల బరిలోకి దిగారు..

హిందూ ఫైర్‌బ్రాండ్



కొంపెల్ల మాధవీలత
హైదరాబాద్ (బీజేపీ)

రాజకీయాల్లో అడుగుపెడుతూనే ఫైర్‌బ్రాండ్ నాయకురాలిగా గుర్తింపు పొందారు. పాతబస్తీలో హిందూ ధార్మిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా బీజేపీ నాయకత్వం దృష్టిని ఆకర్షించారు. ఎంఐఎంకు కంచుకోటగా భావించే హైదరాబాద్‌లో అసదుద్దీన్ ఒవైసీకి ముచ్చెమటలు పట్టిస్తున్నారు.

బీఆర్‌ఎస్‌ను కాదని..



కడియం కావ్య
వరంగల్ (కాంగ్రెస్)

సీనియర్ రాజకీయ నాయకుడు, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తె. వృత్తిరీత్యా ఎంబీబీఎస్ డాక్టర్. వరంగల్ నుంచి బీఆర్‌ఎస్ టికెట్ ఇచ్చినా కాదని.. కాంగ్రెస్‌లో చేరి ఆ పార్టీ అభ్యర్థి అయ్యారు. తండ్రి రాజకీయ వారసత్వాన్ని నిలబెట్టాలన్న ప్రయత్నంలో ఉన్నారు.

వారసుడిగా తెరపైకి



పోతుగంటి భరత్
నాగర్ కర్నూల్ (బీజేపీ)

బీఆర్‌ఎస్ ఎంపీ, మాజీ మంత్రి పి.రాములు కుమారుడు. అదే పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేయాలనుకున్నారు. సొంత పార్టీ నేతలతో పొసగక బీజేపీలో చేరారు. తండ్రి రాములు తప్పుకొని మరీ కొడుక్కి టికెట్ ఇప్పించుకున్నారు. 2019లో జడ్పీటీసీగా గెలుపొంది.. ఇప్పుడు నేరుగా లోక్‌సభ బరిలో నిలిచారు.

విశ్వాసం నిలబెట్టాలని



కంచర్ల కృష్ణారెడ్డి
నల్లగొండ (బీఆర్‌ఎస్)

సుదీర్ఘ కాలంగా రాజకీయాల్లో ఉన్న నేత. మునుగోడు ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్ గెలుపునకు కృషి చేసి అధినేత కేసీఆర్ విశ్వాసాన్ని చూరగొన్నారు. తన తమ్ముడు, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అండతో ఈ ఎన్నికల్లో అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

ఆలస్యంగా గుర్తింపు



ఎం.సుధీర్‌కుమార్
వరంగల్ (బీఆర్‌ఎస్)

తెలంగాణ ఉద్యమకారుడు. 2001 నుంచి బీఆర్‌ఎస్‌లో క్రియాశీలంగా పనిచేస్తున్నారు. గతంలో కరీంనగర్ జడ్పీ వైస్‌చైర్మన్‌గా పని చేశారు. ప్రస్తుతం హనుమకొండ జడ్పీ చైర్మన్‌గా ఉన్నారు. వరంగల్ నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఎంపిక చేసిన కడియం కావ్య పార్టీ మారిపోవడంతో.. సుధీర్‌కుమార్‌కు అవకాశం దక్కింది.

విధేయతే అర్హతగా



పి.వెంకట్రామారెడ్డి
మెదక్ (బీఆర్‌ఎస్)

జిల్లా కలెక్టరు ఉద్యోగం వదిలి రాజకీయాల్లోకి వచ్చారు. ఉద్యోగంలో ఉన్నప్పుడు అప్పటి సీఎం కేసీఆర్‌పై ప్రదర్శించిన విధేయతతో బీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం దక్కించుకున్నారు. ఒకప్పటి ప్రభుత్వ అధికారిగా జిల్లాలో ఉన్న పరిచయాలతో ఎంపీ ఎన్నికల్లో గెలవాలనే ప్రయత్నాలు చేస్తున్నారు.

సేవా రంగం నుంచి..



తాండ్ర వినోదరావు
ఖమ్మం (బీజేపీ)

అమెరికాలో ఉన్నత చదువులు చదివి, కొంతకాలం ఉద్యోగం చేసి వచ్చారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో హిందూ ధర్మ పరిరక్షణ కోసం పనిచేస్తున్నారు. ఓ ఫౌండేషన్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ రాజకీయాల్లోకి వచ్చారు. ఎంపీగా గెలిపిస్తే ఖమ్మంకు పరిశ్రమలు తెస్తానంటున్నారు.

లోక్‌సభ బరిలో తొలిసారి..



పేరు - శానంపూడి సైదిరెడ్డి
నియోజకవర్గం- నల్లగొండ (బీజేపీ)



పేరు - దానం నాగేందర్
నియోజకవర్గం- సికింద్రాబాద్(కాంగ్రెస్)



పేరు - టి. పద్మారావు గౌడ్
నియోజకవర్గం-సికింద్రాబాద్(బీఆర్‌ఎస్)



పేరు - కాసాని జ్ఞానేశ్వర్
నియోజకవర్గం- చేవెళ్ల (బీఆర్‌ఎస్)



పేరు - నీలం మధు
నియోజకవర్గం- మెదక్ (కాంగ్రెస్)



పేరు - ఆత్రం సక్కు
నియోజకవర్గం- ఆదిలాబాద్ (బీఆర్‌ఎస్)



పేరు - ఈటల రాజేందర్
నియోజకవర్గం- మల్కాజిగిరి (బీజేపీ)



పేరు - రఘునందన్‌రావు
నియోజకవర్గం- మెదక్ (బీజేపీ)



పేరు - బాజిరెడ్డి గోవర్ధన్
నియోజకవర్గం- నిజామాబాద్(బీఆర్‌ఎస్)



పేరు - చల్లా వంశీచంద్
నియోజకవర్గం- మహబూబ్‌నగర్ (కాంగ్రెస్)



పేరు - ఆర్.ఎస్. ప్రవీణ్
నియోజకవర్గం- నాగర్‌కర్నూల్ (బీఆర్‌ఎస్)



పేరు - ఆరూరి రమేశ్
నియోజకవర్గం- వరంగల్ (బీజేపీ)



పేరు - కొప్పుల ఈశ్వర్
నియోజకవర్గం- పెద్దపల్లి (బీఆర్‌ఎస్)

గుబులు గులాబీ!

(మొదటిపేజీ తరువాయి)

లోక్‌సభ ఎన్నికల ప్రచారపర్వం చేపట్టను న్నారు. ఇందులో భాగంగానే కార్నర్ మీటిం గులకు హాజరు కానున్నారు. వాటితోనే ప్రజ లతో మమేకం కావాలని భావిస్తున్నారు. కల్లా ల్లోకి వెళ్లి రైతులతో ముచ్చటించనున్నారు. ఈ మేరకు భారీ ప్రచార వ్యూహాన్ని సిద్ధం చేసుకున్నారు. ఇక, అధినేత కేసీఆర్ సార థ్యంలో కేటీఆర్, హరీశ్ రావు ఇప్పటికే ప్రచార పర్వంలో నిమగ్నమయ్యారు. అధికా రంలో ఉన్నప్పుడే కాదు.. ఇప్పుడు కూడా ఆ ముగ్గురే కారును ముందుకు నడిపిస్తున్నారు. ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయ కుండా కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని వి మర్శిస్తూనే.. రాష్ట్ర ప్రభుత్వ తీరుపై ఆరోప ణలు గుప్పిస్తున్నారు. అధికార పార్టీ ఎత్తు లకు పైయెత్తులు వేస్తున్నారు. వలసలను నిరోధించడమే ధ్యేయంగా కాంగ్రెస్ అధికా రంలో ఏడాది కూడా ఉండదని, ఆ పార్టీ ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారనే వ్యాఖ్య లనూ బీఆర్‌ఎస్ నేతలు చేస్తున్నారు. మరో వైపు, బీజేపీ నుంచి ఆ పార్టీకి పెను ముప్పు పొంచి ఉంది. బీఆర్‌ఎస్ కంటే బీజేపీ ఎక్కువ సీట్లు గెలిస్తే.. వలసలు మరింత పెరుగు తాయి. ఇప్పుడు చతికిలపడితే తెలంగాణలో ప్రత్యామ్నాయంగా బీజేపీ బలపడే అవకాశం ఉందన్న గుబులు కూడా ఆ పార్టీ నేతల్లో వ్యక్తమవుతోంది. అయితే, అధికారంలో ఉన్న ప్పుడు ఉండే సహజమైన అనుకూలతలు ప్రతిపక్షంలో ఉండవని ఆ పార్టీ నేతలకు తెలుసు. అందుకే, మరోసారి ఉద్యమ నినా దాన్ని నెత్తుకెత్తుకున్నారు. కేసీఆర్ కూడా మళ్లీ తన పాత ప్రస్థానాన్ని కొత్తగా వినిపిస్తు న్నారు. మరోసారి ఉద్యమ కేసీఆర్‌ను చూడ బోతున్నారని పదే పదే ప్రజలకు చెబుతు న్నారు. అనేక పోరాటాలు చేశామని, లెక్కకు మించిన ఒడిదుడుకులు చవి చూశామని, ఉత్థానపతనాలను చూసిన తాము ఈ సవా ల్‌ను కూడా అధిగమించాలనే సంకల్పంతో ఆ పార్టీ నేతలు ముందుకు సాగుతున్నారు. రాష్ట్రంలో ఇతర పార్టీలకు లేనంతగా.. తమ పార్టీకి బూత్ స్థాయి నుంచి కార్యకర్తల బలం ఉందని, అన్ని స్థాయిల్లో పార్టీ కార్యకర్త లను రంగంలోకి దింపాలని పావులు కదుపు తోంది.

ప్రజాస్వామ్యం కోసం...

అసెంబ్లీ ఎన్నికల్లో స్థానిక అంశాలు ప్రభావం చూపుతాయి. కానీ, లోక్‌సభ ఎన్ని కలు అందుకు పూర్తి భిన్నం. వీటిలో జాతీయ అంశాలకే పెద్దపీట. దీనికితోడు, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కూడా కాలేదు. మరో నాలుగేళ్లకుపైగా ఆ పార్టీయే అధికారంలో ఉండనుంది. ఇటు వంటి పరిస్థితుల్లో ఇటు రాష్ట్రంలో అధికారం ఉన్న పార్టీకి గానీ.. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ వైపు కానీ ఓటర్లు మొగ్గు చూపే అవకాశం ఉంటుంది. దీనికితోడు, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి, దేశంలో మోదీ హవా ఉండనే ఉంది. బీఆర్‌ఎస్‌కు ఇది ఏమాత్రం అను కూలం కాని పరిస్థితి. ఇదే విషయంపై ఆ పార్టీ అధిష్ఠానం ఎంపీ అభ్యర్థులు, ముఖ్య నేతలతో ఇటీవల చర్చించింది. 'ప్రజా స్వామ్యం కోసం' అనే నినాదాన్ని తీసుకొని ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించుకుంది. ఇది ఒకప్పటి కాంగ్రెస్ నినాదం కాగా.. ఇప్పుడు అధికారం కోల్పోయిన తర్వాత చిత్రంగా బీఆ ర్‌ఎస్ అందిపుచ్చుకుంది.



ఆశల పల్లకిలో కారు

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైనా ప్రజలు తమకు దూరం కాలేదనే భావన బీఆర్‌ఎస్ నేతల్లో వ్యక్తమవుతోంది. అసెంబ్లీ ఎన్ని కల్లో కాంగ్రెస్‌కు, తమకు వచ్చిన ఓట్లలో తేడా కేవలం 1.8 శాత మేనని ఇప్పటికే కేసీఆర్ సహా ఆ పార్టీ నేతలు పలుమార్లు చెప్పిన సంగతి తెలిసిందే. 39 అసెంబ్లీ స్థానాలను దక్కించుకోవ డమే కాకుండా.. 81 నియోజకవర్గాల పరిధిలో తాము రెండో స్థానంలో నిలిచామని తెలిపింది. తద్వారా, ప్రజలు తమకు పూర్తిగా దూరం కాలేదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తోంది. ఇప్పుడు అధికార కాంగ్రెస్‌పై ఉండే వ్యతిరేకత తమకు అనుకూల పరిస్థితులను తెచ్చిపెడుతుందని అధినాయకత్వం భావిస్తోంది. పలు ఎంపీ స్థానాల్లో మెజార్టీ తమదేనన్న ధీమాను ఆ పార్టీ నేతలు వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు అనుగుణంగా ప్రచార వ్యూహాన్ని సిద్ధం చేశారు. ఒకవైపు ప్రజా సమస్యలను ప్రస్తావి స్తూ.. మరోవైపు కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నమ్మి జనం ఓట్లు వేశారని, వాటిని అమలు చేయకుండా కాంగ్రెస్ పార్టీ ప్రజ లను మోసం చేసిందని ఆరోపణలు గుప్పిస్తోంది. కాంగ్రెస్ హామీ లను నమ్మి ఒకసారి మోసపోయామని, ఒక చాలు అంటూ జనా ల్లోకి వెళుతోంది. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిందంటూ కాంగ్రెస్‌పై బీఆర్‌ఎస్ తన ప్రచార వ్యూహాన్ని సిద్ధం చేసుకుంది. సాగు, తాగునీటి సమస్య, విద్యుత్తు, రూ.500 బోనస్, రూ.2లక్షల రుణమాఫీ వంటి విషయాలను ప్రజలకు వివరించేలా దృష్టి పెడుతోంది. వెరసి, జాతీయ పార్టీల దూకుడును తట్టుకుని నిల బడుతుందో.. అసెంబ్లీతోపాటు పార్లమెంటు ఎన్నికల్లోనూ చతికిల బడుతుందో కాలమే సమాధానం చెబుతుంది!!

కాంగ్రెస్‌లో తేలని టికెట్ల పంచాయితీ

(మొదటిపేజీ తరువాయి)

అధిష్ఠానానికి చెప్పినట్లు తెలిసింది. లేకపోతే ఆ ప్రభావం ఇతర నియోజకవర్గాలపైనా పడుతుందని ఆయన అభిప్రా యపడినట్లు సమాచారం. ఇక పొంగులేటి.. తన తమ్ము డికి బదులుగా వియ్యంకుడు రఘురామిరెడ్డి పేరును ప్రతిపాదించినట్లుగా ప్రచారం జరిగింది. రఘురామిరెడ్డి స్థానికత పాలేరు నియోజకవర్గంలోనే ఉందని, ఆయన తండ్రి సురేందర్‌రెడ్డి.. కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ అని ఆయన మద్దతుదారులు గుర్తుచేస్తున్నారు. పొంగులేటితో పాటు కొంతమంది పార్టీ ముఖ్య నేతలూ రఘురామిరెడ్డికే మద్ద తుగా నిలవడంతో ఆయన పేరు దాదాపుగా ఖరారైనట్లు ప్రచారం జరిగింది. అయితే కమ్మ సామాజిక వర్గం బలంగా ఉన్న చోట.. రెడ్డి సామాజిక వర్గానికి టికెట్ కేటాయిస్తే దాని ప్రభావం ఇతర నియోజకవ ర్గాల్లోనూ పడుతుందన్న వాదన మళ్లీ తెరపైకి రావడంతో అధిష్ఠానం.. నియోజకవర్గ పరిధిలోని పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రా వుకు ఫోన్లు చేసి అభిప్రాయాలు తీసుకుంది. ఈ క్రమంలోనే బెంగళూ రులో ఉన్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే.. సోమవారం అక్కడే భట్టి, పొంగులేటితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా.. స్థానిక నేత, కమ్మ సామాజిక వర్గానికి చెందిన రాయల నాగేశ్వర్‌రావు పేరును భట్టి ప్రతి పాదించినట్లు ప్రచారం జరుగుతోంది. పార్టీ పరిస్థితి బాగా లేనప్పుడూ ఖమ్మం స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున రాయల నాగేశ్వర్ రావు పోటీ చేశారని, పార్టీకి ఉన్న ప్రజాప్రతినిధుల కన్నా ఎక్కువ ఓట్లు సాధించారని వివరించినట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అధిష్ఠానం ఈ సీటుపై సీఎం రేవంత్‌రెడ్డినీ సంప్రదించి.. మంగళ-బుధవారాల్లో అభ్యర్థిని ప్రకటించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

అధిష్ఠానం చెప్పకుండానే..

కరీంనగర్‌లో ప్రవీణ్‌రెడ్డి, వెలమ సామాజిక వర్గానికి చెందిన వెలి చాల రాజేశ్వర్‌రావు మధ్యే ప్రధానంగా పోటీ నెలకొన్న సంగతి తెలి సిందే. అయితే ఖమ్మం సీటుతో ముడిపడి ఉండడంతో ఈ సీటునూ అధిష్ఠానం పెండింగ్‌లో పెట్టింది. ఖమ్మం సీటును రెడ్డి సామాజిక వర్గా నికి కేటాయిస్తే కరీంనగర్ సీటును రాజేశ్వర్‌రావుకు ఇస్తారని.. ఖమ్మం సీటును రెడ్డి యేతర సామాజిక వర్గానికి కేటాయిస్తే కరీంనగర్‌లో ప్రవీ ణ్‌రెడ్డినే అభ్యర్థిగా ప్రకటించేందుకు అవకాశం ఉంటుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే అధిష్ఠానం పేరును ప్రక టించకముందే వెలిచాల రాజేశ్వర్‌రావు సోమవారం నామినేషన్ దాఖలు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఆయనకు మద్దతుగా ఉన్న మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా నామినేషన్ దాఖలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఖమ్మం సీటును ఏ సామాజిక వర్గానికి కేటాయిస్తారో తేలకుండానే వెలిచాల నామినేషన్ వేయడం కాంగ్రెస్ పార్టీ మార్కు రాజకీయాలను మరోమారు గుర్తు చేసిందం టున్నారు. ఖమ్మం సీటు రెడ్డియేతర సామాజిక వర్గానికి కేటాయిస్తే.. ప్రవీణ్‌రెడ్డి పేరు మళ్లీ తెరపైకి వచ్చే ఆస్కారం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో వనపర్తి వంటి చోట్ల పార్టీ అభ్యర్థిని ప్రకటించి.. ఆ తర్వాత ఆ స్థానంలో వేరే అభ్యర్థిని ప్రకటించిన సంగతినీ గుర్తుచేస్తున్నారు.

అభ్యర్థులను ప్రకటించగానే..

ఖమ్మం, కరీంనగర్, హైదరాబాద్ సీట్లలో అభ్యర్థులను ప్రకటిం చిన అనంతరం సీఎం, టీపీసీసీ అధ్యక్షుడు అయిన రేవంత్‌రెడ్డి.. 17 మంది అభ్యర్థులకూ బీ ఫారాలు ఇవ్వనున్నారు. ఇప్పటి వరకూ నామినేషన్లు దాఖలు చేసిన ఏ అభ్యర్థీ రిటర్నింగ్ అధికారికి బీ ఫారాలు ఇవ్వలేదు. బీ ఫారాలు సిద్ధంగా ఉన్నప్పటికీ అందరికీ ఒకే సారి ఇద్దామన్న ఉద్దేశంతో ఇవ్వట్లేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. 25న సాయంత్రం 3 గంటలకల్లా రిటర్నింగ్ అధికారికి అభ్యర్థులు తమ బీ ఫారాలు సమర్పించాల్సి ఉంది. ఒకటి, రెండు రోజుల్లోనే అభ్యర్థులకు బీ ఫారాల మంజూరు కార్యక్రమాన్ని రేవంత్ చేపట్టను న్నట్లు చెబుతున్నారు. దానం నాగేందర్.. లోక్‌సభ ఎన్నికల్లో సికిం ద్రాబాద్ నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సంగతి తెలి సిందే. అయితే బీఆర్‌ఎస్ టిక్కెట్టుపైన ఎమ్మెల్యేగా గెలిచిన దానం.. ఆ పదవికి రాజీనామా చేయకుండా కాంగ్రెస్ బీ ఫారంపైన లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయవచ్చా లేదా అన్నదానిపైన స్పష్టత లేదని, బీ ఫారాల మంజూరులో ఆలస్యానికి ఇదీ ఒక కారణమన్న ప్రచారం పార్టీ వర్గాల్లో జరుగుతోంది.

తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడకూడదు: సీఎస్

హైదరాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల రోజుల పాటు రాష్ట్రంలో తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయాలు ఉండకుండా చూడాలని అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) శాంతికుమారి ఆదేశించారు. ఈ మేరకు సోమవారం సచివాలయంలో మున్సిపల్, నీటిపారుదల, పంచాయితీరాజ్ శాఖల అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్న ప్రాంతాలను గుర్తించి ప్రజలు ఇబ్బంది పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నగరంలో సంబంధిత సీజీఎం ముందస్తు అనుమతితో మాత్రమే నిర్వహణ పనులు చేపట్టాలని, ఆయా ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా ప్రత్యామ్నాయంగా తాగునీటిని సరఫరా చేయాలని ఆమె ఆదేశించారు.

మిగులు విద్యుత్ విక్రయించండి

» పూర్తి సామర్థ్యంతో ఉత్పత్తి చేయండి.. కేంద్రం లేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఉత్పత్తి సామర్థ్యానికి తగ్గట్టుగా పంపిణీ సంస్థలు విద్యుత్‌ను కొనుగోలు చేయకపోతే.. మిగిలే విద్యుత్‌ను బహిరంగ మార్కెట్(ఓపెన్ యాక్సెస్)లో విక్రయించాలని కేంద్రం జెన్‌కోలకు స్పష్టం చేసింది. ఉదాహరణకు ఒక జనరేటింగ్ కంపెనీ 1000 మెగావాట్ల సామర్థ్యం కలిగి ఉంటే... ఆమేరకు విద్యుత్‌ను కొనుగోలు చేసేందుకు డిస్కమ్‌లు ఒప్పందం చేసుకుంటాయి. అయితే ఎప్పటికప్పుడు ఒక రోజు ముందు ఎంత విద్యుత్ కావాలో డిస్కమ్‌లు జెన్‌కోలకు సమాచారం ఇస్తాయి. ఇలా 1000 మెగావాట్లకుగాను 850 మెగావాట్ల విద్యుత్ చాలు అని చెబితే... మిగిలిన విద్యుత్‌ను ఉత్పత్తి చేయకుండా జెన్‌కోలు బ్యాక్ డౌన్ చేస్తాయి. ఇక ముందు అలా చేయకుండా... పూర్తి సామర్థ్యం మేరకు ఉత్పత్తి చేసి మిగిలిన విద్యుత్‌ను బహిరంగ మార్కెట్‌లో విక్రయించాలని కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఈమేరకు కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖ ఇంధన శాఖ కార్యదర్శులు, జెన్‌కోల సీఎండీలకు సోమవారం లేఖ రాసింది.



నల్లమలలో ప్రారంభమైన సలేశ్వరం యాత్ర

అచ్చంపేట, ఏప్రిల్ 22: నల్లమలలో సలేశ్వరం యాత్ర సోమవారం ప్రారంభమయింది. నాగర్‌కర్నూల్ జిల్లాలో నల్లమల అభయారణ్యంలో వెలసిన సలేశ్వరం లింగమయ్య స్వామి ప్రతి ఏటా చైత్రశుద్ధ పౌర్ణమిన, ఆ ముందు రోజు, తర్వాతి రోజున భక్తులకు దర్శనమిస్తారు. స్వామి వారి దర్శనం కోసం లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. ఈ క్రమంలో మొదటి రోజైన సోమవారం భక్తుల తాకిడి ప్రారంభమైంది. మరో అమర్‌నాథ్‌గా పిలిచే సలేశ్వరం యాత్ర కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

చెరువుల ఆక్రమణలపై న్యాయమూర్తి లేఖ

» సుమోటోగా స్వీకరించిన హైకోర్టు

హైదరాబాద్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మెట్రోరైల్ ప్రాజెక్టుతో పాతబస్తీలోని భూముల ధరలు భారీగా పెరుగుతుండటంతో చెరువుల ఆక్రమణలు చోటుచేసుకుంటున్నాయంటూ వచ్చిన కథనాలను హైకోర్టు సుమోటో కేసుగా స్వీకరించింది. చాంద్రాయణ్‌గుట్ట పరిధిలోని జల్‌పల్లి, ఉందానగర్ చెరువులను చెత్త, మట్టి నింపడం ద్వారా ఆక్రమించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొంటూ పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రియదర్శిని లేఖ రాశారు. ఈ లేఖను చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం సుమోటో పిల్‌గా స్వీకరించింది.

జూబ్లీహిల్స్ ప్రమాదం కేసులో రహీల్ నిందితుడే

» హైకోర్టుకు తెలిపిన పోలీసులు

హైదరాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రహీల్ అమీర్ అలియాస్ సాహిల్ జూబ్లీహిల్స్ ప్రమాదం కేసులో నిందితుడేనని పోలీసుశాఖ హైకోర్టుకు వెల్లడించింది. అతడిని అరెస్ట్ చేయకుండా హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ఎత్తేయాలని విజ్ఞప్తి చేసింది. ఈ కేసులో తొలుత అతడు నిందితుడిగా లేడని, ప్రస్తుతం అతడి పేరును చేర్చినట్లు పోలీసుశాఖ జీపీ మహేశ్ రాజే తెలిపారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం విచారణను 29కి వాయిదా వేసింది. 2022లో జూబ్లీహిల్స్ పరిధిలో జరిగిన ప్రమాదంలో వేగంగా కారునడపడం వల్ల రోడ్డుపక్కన ఉండే ఓ చిన్నారి మృతి చెందడంతోపాటు ఓ మహిళ తీవ్రంగా గాయపడ్డ సంఘటనలో అతడు నిందితుడని పోలీసులు తెలిపారు.

నేడు మద్యం షాపులు, బార్లు బంద్

హనుమాన్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం(23న) గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ) పరిధిలోని మద్యం షాపులు, బార్లు, క్లబ్బులను మూసి ఉంచాలని ఎక్సైజ్, పోలీసుశాఖల అధికారులు ప్రకటించారు. ఎక్కడా మద్యాన్ని విక్రయించే ప్రయత్నాలు చేయొద్దని షాపుల యజమానులను హెచ్చరించారు. కాగా, ఈ నెల 17న శ్రీరామ నవమి సందర్భంగా మద్యం షాపులు, బార్లను మూసేసిన సంగతి తెలిసిందే. మళ్లీ ఆరు రోజుల తర్వాత ఇప్పుడు మద్యం షాపులు మూసి ఉంచాల్సి రావడం మందుబాబులకు కాస్త ఇబ్బందికరమే.

మంత్రి సురేఖపై చర్యలకు ఈసీని ఆదేశించండి

» హైకోర్టులో దాసోజు శ్రవణ్ పిటిషన్

హైదరాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కేటీఆర్ వ్యక్తిగత జీవితంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి కొండా సురేఖపై చర్యలు తీసుకునేలా ఎలక్షన్ కమిషన్‌కు ఆదేశాలు జారీచేయాలని కోరుతూ బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్‌కుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇటీవల మంత్రి సురేఖ వరంగల్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో ఫోన్‌ట్యాపింగ్‌పై మాట్లాడుతూ ఈ వ్యవహారంతో కేటీఆర్‌కు సంబంధం ఉందని ఆరోపించారని తెలిపారు. ఈ కేసుపై దర్యాప్తు జరుగుతుండగా కేటీఆర్‌పై ఆధారాల్లేని వ్యాఖ్యలు చేయడం ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించడమేనని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన మంత్రిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈనెల 8న ఈసీకి ఫిర్యాదు చేశామని తెలిపారు. తమ ఫిర్యాదుపై స్వయంగా గానీ లేదా వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి కం కలెక్టర్ ద్వారాగానీ తీసుకునేలా ఆదేశించాలని హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు.

అసదుద్దీన్‌పై మాధవీలత ఫిర్యాదు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీపై బీజేపీ హైదరాబాద్ అభ్యర్థి మాధవీలత సోమవారం ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఎన్నికల ప్రచారంలో అసదుద్దీన్ మతపరమైన వ్యాఖ్యలు చేశారని పేర్కొంటూ ఆమె రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్‌కు లిఖిత పూర్వకంగా వివరించారు. మతాల మధ్య చిచ్చుపెట్టేలా అసదుద్దీన్ వ్యాఖ్యలు చేస్తున్నారని.. 'బీఫ్ జిందాబాద్' అంటూ హిందువులను రెచ్చగొడుతున్నారని చెప్పారు. ఈ విషయంలో పోలీసుల తీరుపైనా తమకు అనుమానాలున్నాయని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఖమ్మం నుంచి పోటీకి నేను సిద్ధం:రేణుకాచౌదరి

హైదరాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి తనను పోటీ చేయమంటే చేసేందుకు సిద్ధంగా ఉన్నానని రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి ప్రకటించారు. తాను రాజ్యసభ సభ్యురాలిగా ఉన్నా.. లోక్‌సభకు పోటీ చేయాలని అధిష్ఠానం ఆదేశిస్తే పోటీ చేస్తానన్నారు. ఖమ్మంను పాలించడం వస్తే దేశాన్నే పాలించే అనుభవం వస్తుందని చమత్కరించారు. కేసీఆర్‌కు వడదెబ్బ తాకిందో.. డోస్ ఎక్కువైందో గానీ ఏదేదో మాట్లాడుతున్నారని, ఆయన విశ్రాంతి తీసుకుంటే మంచిదని సూచించారు. ప్రధాని మోదీ గ్యారెంటీలకు వారెంటీ గడువు ముగిసిందని, ఆయనకు ఓటమి భయం పట్టుకుందన్నారు.

భార్య పుట్టినరోజు జరిగిన రెండో రోజే..

ఘోర రోడ్డు ప్రమాదం

» ఆగిన కంటైనర్ కిందకి దూసుకెళ్లిన కారు
» యువ దంపతుల దుర్మరణం
» భర్తది ఖమ్మం, భార్యది ఎన్టీఆర్ జిల్లా... సూర్యాపేట జిల్లా మునగాలలో ఘటన

మునగాల, ఏప్రిల్ 22: భార్యభర్తలిద్దరూ ప్రైవేట్ ఉద్యోగులు.. రెండేళ్ల క్రితం వివాహమైంది.. రెండు రోజుల క్రితం అత్తమామల సమక్షంలో పుట్టినరోజు వేడుకలు జరుపుకుంది ఆ ఇల్లాలు. సెలవుల అనంతరం విధులకు హాజరయ్యేందుకు ఆ జంట కారులో బయలు దేరింది. అయితే ఆ సంతోషం ఎంతోసేపు నిలవలేదు. రోడ్డుపక్కన నిలిపిఉంచిన లారీ కంటైనర్ మృత్యువు రూపంలో ఆ దంపతులను కబళించింది. సోమవారం సూర్యాపేట జిల్లా మునగాల మండలంలోని ముకుందాపురం గ్రామంలో ఈ విషాద సంఘటన జరిగింది. ఎస్ఐ అంజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా వైరా మండలంలోని సోమవరం గ్రామానికి చెందిన సామినేని నవీన్‌రాజు(29) ఏపీ, విజయవాడలో శ్రీచైతన్య కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేటకు చెందిన



సూర్యాపేట జిల్లా ముకుందాపురంలో రోడ్డుపక్కన ఆగిఉన్న లారీ కంటైనర్ కిందికి దూసుకెళ్లిన కారు

ఆయన భార్య భార్గవి(26) విజయవాడలోనే ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగి. వారిద్దరూ విజయవాడలోనే నివాసం ఉంటున్నారు. ఈ నెల 20వ తేదీన భార్గవి పుట్టినరోజు కావడంతో హైదరాబాద్ హయాత్‌నగర్‌లో నివాసం ఉంటున్న నవీన్ తల్లిదండ్రుల ఇంటికి వెళ్లారు. కుటుంబసభ్యులతో కలిసి భార్గవి పుట్టినరోజును వేడుకగా జరుపుకొన్నారు. సోమవారం తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో హైదరాబాద్ నుంచి సొంత కారులో విజయవాడకు బయలుదేరారు. ఈ క్రమంలో మునగాల మండలం ముకుందాపురం గ్రామ శివారులోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కన నిలిపిఉంచిన కంటైనర్ కిందికి దూసుకువెళ్లింది. ప్రమాదంలో నవీన్‌రాజు, భార్గవి అక్కడికక్కడే మృతిచెందారు. కంటైనర్ కిందికి దూసుకెళ్లడంతో కారు నుజ్జునుజ్జయింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి క్రేన్ సాయంతో మృతదేహాలను కష్టతరంగా బయటికి తీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రెండేళ్ల క్రితమే నవీన్, భార్గవిలకు వివాహంకాగా, పిల్లలు లేరు. ఈ ఘటనతో వారి కుటుంబాల్లో విషాదం నెలకొంది. నవీన్‌రాజు తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా, రోడ్డు పక్కన కంటైనర్‌ను నిలిపిన ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

'కొండా' ఆస్తులు 4,490 కోట్లు

భారీగా స్థిర, చరాస్తులు, షేర్లు..అప్పులు రూ.13.83 కోట్లు.. చేతిలో నగదు 9 లక్షలు

వేల కోట్లున్నా సొంత వాహనం లేదు!



రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా చేవెళ్ల లోక్‌సభ స్థానం బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆస్తులు రూ.4,490 కోట్లు! అప్పులు రూ.13.83 కోట్లు! వేల కోట్లు ఆస్తులున్నా కొండా దంపతుల పేరున కానీ, వారి కుమారుడి పేరున కానీ ఒక్క వాహనం కూడా లేకపోవడం గమనార్హం. కొండా తన ఎన్నికల అఫిడవిట్‌లో ఆస్తుల వివరాలు ప్రకటించారు. ఆయన పేరుమీద రూ. 1,178.72 కోట్ల ఆస్తులు ఉండగా ఆయన భార్య సంగీతా రెడ్డి పేరిట రూ.3,203.90 కోట్ల ఆస్తులు ఉన్నాయి. ఆయన కుమారుడు వీరజ్ మాధవరెడ్డి పేరున ఉన్న ఆస్తులు రూ.107.44 కోట్లు! కొండా వద్ద 3 లక్షలు, ఆయన భార్య వద్ద 6 లక్షల నగదు ఉన్నట్లు చూపించారు. ఆయన పేరుమీద వివిధ బ్యాంకుల్లో అప్పు రూ.17.69 లక్షలు, ఆయన భార్య పేరిట రూ.12.06 కోట్ల అప్పులు ఉన్నట్లు పేర్కొన్నారు. ఆయన వద్ద రూ.60 లక్షలు, ఆయన భార్య వద్ద రూ.10.44 లక్షల విలువ చేసే బంగారు, వజ్రాభరణాలు ఉన్నట్లు చూపించారు. కొండా పేరున చేవెళ్లలో మూడు ఎకరాలు, ధర్మసాగర్‌లో 43.26 ఎకరాలు, చేవెళ్ల మండలం కమ్మెటలో రెండు ఎకరాలు, కుమ్మెరలో 21.13 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు వెల్లడించారు. ఆయన భార్య పేరిట రాజేంద్రనగర్ మండలం నార్సింగిలో ఎకరం, ఏపీలోని చిత్తూరు జిల్లాలో 14.13 ఎకరాల సాగుభూమి ఉన్నట్లు ప్రకటించారు. చేవెళ్ల, గంధంగూడలో 5 ఓపెన్ ప్లాట్లు, బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12, ఉస్మాన్‌గంజ్, జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 86లో వాణిజ్య భవనాలు, బంజారాహిల్స్ రోడ్ నంబర్ 13, పుప్పాలగూడలో నివాస భవనాలు ఉన్నట్లు చూపించారు. ఆయనతో పాటు భార్య, కొడుకు పేరిట ఉన్న ఖాళీ ప్లాట్లు, కమర్షియల్, నివాస భవనాల విలువ రూ.78 కోట్లకు పైగా ఉంటుందని పేర్కొన్నారు.

సునీతా రెడ్డి ఆస్తులు 60.72 కోట్లు.. కారు లేదు!

మేడ్చల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తమ కుటుంబానికి రూ. 60.72 కోట్ల ఆస్తులు ఉన్నట్లు మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతారెడ్డి ఎన్నికల అఫిడవిట్‌లో ప్రకటించారు. ఆమె పేరిట రూ.51.95 లక్షలు, ఆమె భర్త మహేందర్‌రెడ్డి పేరున రూ.5.51 లక్షలు, కుమారుడు రినీష్ రెడ్డి పేరుమీద రూ.19.2 లక్షల చరాస్తులు ఉన్నట్టు వెల్లడించారు. రూ.59.96 కోట్ల స్థిరాస్తులు ఉన్నట్టు వెల్లడించారు. ఇందులో ఆమె పేరిట రూ.30.84 కోట్లు, భర్త పేరిట రూ.3.55 కోట్లు, కుమారుడి పేరిట రూ.25.57 కోట్ల స్థిరాస్తులు ఉన్నట్లు వివరించారు. రూ.2.5 కోట్ల అప్పులు ఉన్నాయన్నారు. తన విద్యార్హత పదో తరగతిగా పేర్కొన్నారు. తమ పేరిట ఎలాంటి వాహనాలు లేవని తెలిపారు.

షెట్కార్ ఆస్తులు రూ.12 కోట్ల పైమాటే

సంగారెడ్డి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ కోటీశ్వరుడే. తన కుటుంబ ఆస్తుల విలువ రూ.12 కోట్ల పైనే ఉంటుందని ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. దాని ప్రకారం.. షెట్కార్ కుటుంబం పేరిట ఉన్న డిపాజిట్లు, బంగారు ఆభరణాల విలువ రూ.57.51 లక్షలు. ఆయన భార్య ఉమాదేవి పేరిట డిపాజిట్లు, నగల విలువ రూ.2.61 కోట్లు. నారాయణఖేడ్, జుక్కల్, నాగిల్‌గిద్ద ప్రాంతాల్లో రూ.3.49 కోట్ల విలువైన 28.32 ఎకరాల భూములు ఉన్నాయి. నిర్మాణ సంస్థల్లో పెట్టుబడుల విలువ రూ.7.12 కోట్లు.

మల్లేష్‌కు రూ.119.14 కోట్ల ఆస్తి

యాదాద్రి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): భువనగిరి బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్ పేరిట రూ.119.14 కోట్ల ఆస్తి ఉండగా ఆయన భార్య జంగమ్మ పేరున రూ.26.20 కోట్ల ఆస్తి ఉంది.

బీబీ పాటిల్‌పై పెండింగ్‌లో 19 కేసులు

జహీరాబాద్ లోక్‌సభ స్థానం బీజేపీ అభ్యర్థి, సిటింగ్ ఎంపీ బీబీ పాటిల్ కుటుంబం ఆస్తుల విలువ రూ.144 కోట్లపైనే ఉంది. స్థిరాస్తుల విలువ రూ.142.85 కోట్లు వుంటుందని ఆయన ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించారు. ఆయనకు 2022-23 ఆర్థిక సంవత్సరంలోలో రూ.54.34 లక్షలు, ఆయన భార్య అరుణ పాటిల్‌కు రూ.21.64 లక్షల ఆదాయం వచ్చింది. తన పేరిట రూ.3.40 కోట్లు, తన భార్య పేరిట రూ.11.25 లక్షల అప్పులు ఉన్నాయని తెలిపారు. బెంజ్, స్కోడా, మహీంద్రా ఎక్స్‌యూవీ 500, స్కార్పియో తదితర 16 వాహనాలు పాటిల్ వద్ద ఉన్నాయి. తనపై 19 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని పాటిల్ పేర్కొన్నారు.

సీతారాం నాయక్ ఆస్తులు 3.08 కోట్లు

మహబూబాబాద్: మహబూబాబాద్ లోక్‌సభ బీజేపీ ఎంపీ అభ్యర్థి, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్‌పై కేసులేమీ లేవు. ఆయన భార్య ఇద్దరు కుమారుల ఆస్తుల విలువ రూ.3.08 కోట్లు కాగా అప్పులు రూ.1.37 కోట్లు ఉన్నాయి.

వెలిచాలకు రూ.26 కోట్లపైగా ఆస్తులు

కరీంనగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్ లోక్‌సభ స్థానం కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు పేరిట రూ.4.59 కోట్లు, ఆయన భార్య రేఖ పేరుతో రూ.3.67 కోట్ల విలువైన చరాస్తులు ఉన్నాయి. ఆయనకు రూ.10.52 కోట్లు, భార్య పేరిట రూ.7.82 కోట్ల స్థిరాస్తులు ఉన్నాయి. ఎన్నికల అఫిడవిట్‌లో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. ఆయన వద్ద 7.5 లక్షలు, భార్య వద్ద 95 లక్షల బంగారు ఆభరణాలు ఉన్నాయి. ఆయన పేరుతో రూ.2.78 కోట్లు, భార్య పేరుతో రూ.1.90 కోట్ల రుణాలు ఉన్నట్లు పేర్కొన్నారు.

స్థిరాస్తి లేని వరంగల్ అభ్యర్థులు

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 22: వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య కుటుంబానికి రూ.56.62 లక్షల విలువైన చరాస్తులు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఎలాంటి స్థిరాస్తులు లేవు. ఆమె భర్త మహ్మద్ నజిరుల్లా షేక్ పేరిట ఉన్న చరాస్తుల విలువ రూ.86,42,303, స్థిరాస్తులు రూ.6.75 లక్షలు ఉన్నాయని చూపారు. బ్యాంకు రుణాలు రూ.83.41 లక్షలు, రూ.20.53 లక్షల బంగారు, వెండి ఆభరణాలు ఉన్నాయని, చేతిలో నగదు లక్షా 15 వేలు ఉన్నట్టు వెల్లడించారు. తనకు రూ.20.31 లక్షల విలువైన చరాస్తులు ఉన్నాయని వరంగల్ బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్ కుమార్ అఫిడవిట్‌లో తెలిపారు. తన కుటుంబ స్థిరాస్తులు రూ.2.88 కోట్లు ఉన్నట్టు చూపారు.

సైదిరెడ్డి కంటే భార్య ఆస్తులే ఎక్కువ

» ఆమె పేరిట కెనడాలోనూ ఇళ్లు

నల్లగొండ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నల్లగొండ లోక్‌సభ స్థానం బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి కంటే ఆయన భార్య రజిత ఆస్తులే ఎక్కువ! సైదిరెడ్డికి రూ.5.34 కోట్లు, ఆయన భార్యకు రూ.15.63 కోట్ల విలువైన స్థిర, చరాస్తులున్నాయి. సైదిరెడ్డికి రూ.91 లక్షలు, ఆయన భార్యకు రూ.5.19 కోట్ల అప్పులు ఉన్నాయి. సైదిరెడ్డి భార్యకు కెనడాలో రెండుచోట్ల నివాస గృహాలు ఉన్నాయి.

జేఎన్‌టీయూ అధికారుల తనిఖీలపై

ఈసీ నజర్..!

» ఇటీవలి ఫిర్యాదుపై చర్య తీసుకోవాలని విద్యాశాఖ కార్యదర్శికి సీఈవో ఆదేశం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో జేఎన్‌టీయూ అధికారులు చేపట్టిన తనిఖీలు.. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఉన్నాయని ఆరోపిస్తూ మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) ఈ నెల 18న ఇచ్చిన ఫిర్యాదుపై ఎన్నికల సంఘం స్పందించింది. ఎంఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి డి.శ్రీకాంత్ చేసిన ఫిర్యాదును పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిని ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) వికాస్‌రాజ్ ఆదేశిస్తూ తాజాగా నోటీసులు జారీ చేశారు. విద్యాశాఖ తీసుకున్న చర్యలకు సంబంధించిన సమాచారాన్ని తమ కార్యాలయానికి, ఫిర్యాదుదారుడికి వెంటనే అందజేయాలని నోటీసులో స్పష్టం చేశారు. అయితే జేఎన్‌టీయూ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ (ఎఫ్ఎఫ్‌సీ) తనిఖీలపై ఎంఎస్ఎఫ్ ఫిర్యాదు గురించి ఎన్నికల సంఘం నుంచి గానీ, విద్యాశాఖ నుంచి గానీ తమకెలాంటి సమాచారం అందలేదని వర్సిటీ రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు.

తనిఖీల సమాచారం బయటకురావొద్దు..

ఇంజనీరింగ్ కాలేజీల్లో ఎఫ్ఎఫ్‌సీ తనిఖీలకు వెళ్తున్న అధికారులు బయటి వ్యక్తులతో ఎట్టి పరిస్థితుల్లో మాట్లాడవద్దని జేఎన్‌టీయూ ఉన్నతాధికారులు ఆదేశించారు. "రూ.40వేలేనా.. ఇంకేం లేదా" శీర్షికతో ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం జేఎన్‌టీయూలో ప్రకంపనలు సృష్టించింది. తనిఖీలకు వెళ్లిన అధికారులు ప్రైవేటు కాలేజీల యాజమాన్యాల నుంచి లంచం డిమాండ్ చేస్తున్నట్టుగా వచ్చిన ఆరోపణలపై జేఎన్‌టీయూ ఉన్నతాధికారులను విద్యాశాఖ ముఖ్య అధికారులు వివరణ కోరినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో సోమవారం కరీంనగర్, వరంగల్ జిల్లాల్లోని కాలేజీల్లో తనిఖీలకు వెళ్తున్న అధికారులకు జేఎన్‌టీయూ ఉన్నతాధికారులు పలు సూచనలు చేశారు. తనిఖీల సందర్భంగా కళాశాలల్లో చర్చకు వచ్చిన అంశాలపై ఎవరితోనూ సంభాషించవద్దని స్పష్టం చేశారు. కాగా శుక్రవారం తనిఖీల నిమిత్తం ఖమ్మం జిల్లాలో ప్రైవేటు కాలేజీలకు వెళ్లిన జేఎన్‌టీయూ అధికారులను వివరణ కోరుతూ నోటీసులు జారీ చేయాలని, తనిఖీలకు వచ్చిన అధికారుల్లో ఎవరెంత డబ్బు డిమాండ్ చేశారనే దానిపై కాలేజీల యాజమాన్యాల నుంచి సమాచారం తెప్పించుకోవాలని వర్సిటీ ఉన్నతాధికారులు భావిస్తున్నట్లు సమాచారం. ఎఫ్ఎఫ్‌సీ తనిఖీలకు వెళ్లిన అధికారుల్లో కొందరు చేతివాటం ప్రదర్శించడం వల్ల మిగతా వారు కూడా ఆ అపవాదు మోయాల్సి వస్తుందని వర్సిటీ సిబ్బంది చర్చించుకుంటున్నారు. తనిఖీలకు వెళ్లకుండా ఉండడం మేలని మరికొందరు ప్రొఫెసర్లు భావిస్తున్నారు. తనిఖీలకు వెళ్లిన అధికారులపై ఆరోపణలు రావడంతో సోమవారం ప్రైవేటు కాలేజీల్లో ఎఫ్ఎఫ్‌సీ తనిఖీలకు హైదరాబాద్ జేఎన్‌టీయూ కాలేజీ నుంచి ఒక్క ప్రొఫెసర్ కూడా వెళ్లకపోవడం గమనార్హం.

వెంకయ్యకు పద్మవిభూషణ్ ప్రదానం

» 132 మంది పద్మ విజేతల్లో 67 మందికి పురస్కారాల అందజేత
» మిగిలిన వారికి వచ్చేవారం
» ఊపిరి ఉన్నంత వరకూ దేశసేవ చేస్తా: వెంకయ్య నాయుడు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం పద్మవిభూషణ్ పురస్కారాన్ని ప్రదానం చేశారు. వెంకయ్య నాయుడుతో పాటు మరో ఇద్దరు ఆ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకున్నారు. వారిలో ప్రముఖ భరత నాట్యం కళాకారిణి పద్మా సుబ్రహ్మణ్యం, సులబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు, దివంగత బిందేశ్వర్ పాథక్ తరఫున ఆయన సతీమణి అమోలా పాథక్ ఉన్నారు. సోమవారం రాష్ట్రపతి భవన్‌లో పద్మ పురస్కారాల విజేతలకు అవార్డుల ప్రదాన కార్యక్రమం జరిగింది. ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌కర్, ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, విదేశాంగమంత్రి జైశంకర్ తదితర ప్రముఖులు హాజరయ్యారు. నటుడు విథున్ చక్రవర్తి, గాయని ఉషా ఉతుప్, మాజీ గవర్నర్ రాంనాయక్, పారిశ్రామికవేత్త సీతారాం జిందాల్ పద్మభూషణ్ పురస్కారాన్ని స్వీకరించారు. పద్మశ్రీ పురస్కారాలను అందుకున్న తెలుగువారిలో తెలంగాణకు చెందిన చిందు యక్ష కళాకారుడు గడ్డం సమ్మయ్య, బుర్ర వీణ కళాకారుడు దాసరి కొండప్ప, భగవద్గీతను బంజారాభాషలో అనువదించిన కేతావత్ సోంలాల్ నాయక్ ఉన్నారు. కాగా, వెంకయ్య నాయుడుకు పద్మవిభూషణ్ అందజేయటం ద్వారా పురస్కార కార్యక్రమాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. రాష్ట్రపతి తాను స్వయంగా వేదిక దిగి వచ్చి వెంకయ్యకు అవార్డును అందజేయడం గమనార్హం. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, పలువురు కేంద్రమంత్రుల హర్షధ్వానాల మధ్య వెంకయ్య పురస్కారాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ఆయన సతీమణి ఉష, కూతురు దీప, ఇతర కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ఈ ఏడాది ఐదుగురికి పద్మవిభూషణ్, 17 మందికి పద్మభూషణ్, 110 మందికి పద్మశ్రీ అవార్డులను ప్రకటించగా వారిలో 67 మందికి సోమవారం పురస్కారాలను అందజేశారు. మిగతా వారికి వచ్చే వారం ప్రదానం చేయనున్నారు.



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి పద్మశ్రీ అందుకుంటున్న కొండప్ప, సమ్మన్న

గ్రామీణ నేపథ్యం నుంచి..

ఓ చిన్న గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించిన తాను.. దేశ రెండవ అత్యున్నత పురస్కారాన్ని స్వీకరించటం తనకు ఎంతో గౌరవనీయమైన విషయమని వెంకయ్యనాయుడు తెలిపారు. గ్రామీణ నేపథ్యం నుంచి మొదలైన తన ప్రజా ప్రస్థానం సుదీర్ఘ పోరాటాలు, సవాళ్ల మధ్య సాగిందని, అనేక ప్రతికూలతలను అధిగమించి రెండవ అత్యున్నత రాజ్యాంగ పదవి అయిన ఉపరాష్ట్రపతి బాధ్యతలు స్వీకరించానన్నారు. భగ వంతుడి కృప, విలువల పట్ల తన నిబద్ధత వల్లే ఇంతవరకూ వచ్చానని, కొనఊపిరి ఉన్నంత వరకూ దేశానికి సేవ చేస్తానని వెంకయ్య తెలిపారు.

దేవుళ్ల పేరుతో రేవంత్ డ్రామా

» ప్రమాణాలు చేస్తూ మభ్య పెడుతున్నారు
» ఓట్ల కోసమే మరోసారి రుణమాఫీ హామీ
» విపక్షాల ప్రధాని అభ్యర్థి ఎవరు: సంజయ్

ఎల్కతుర్తి/హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 22: దేవుళ్ల పేరుతో ప్రమాణాలు చేస్తూ రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి మరో డ్రామాకు తెరలేపారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ విమర్శించారు. దేవుళ్లను అడ్డుపెట్టుకుని ఓటర్లను మభ్య పెడుతున్నారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చాక హామీలను అమలు చేయకుండా రైతులను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. సోమవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో వరి కొనుగోలు కేంద్రాన్ని సంజయ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తడిసిన ధాన్యమంటూ క్వింటాకు 10 కిలోల వరకు కోత విధిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం, మిల్లర్లు కుమ్మక్కై రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్న సర్కారు మాటలు వార్తా పత్రికలకే పరిమితమవుతోందని విమర్శించారు. వరి ధాన్యానికి రూ.500 బోనస్‌తో పాటు ఇతర పంటలకు బోనస్ ఇవ్వడానికి రూ.5 వేల కోట్లు కావాలన్నారు. తాలు, తేమ, తరుగుతో సంబంధం లేకుండా ధాన్యాన్ని కొనాలంటే ప్రభుత్వంపై రూ.700 కోట్లు భారం పడుతుందన్నారు. తక్కువ బడ్జెట్ ఖర్చయ్యే ఈ రెండు హామీలనే అమలు చేయని వారు.. ఆగస్టు 15 లోపు రూ.30వేల కోట్ల రుణమాఫీ ఎలా చేస్తారో దేవుడి మీద ప్రమాణం చేసి చెప్పాలని డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.



ఎల్కతుర్తిలో రైతులతో మాట్లాడుతున్న బండి సంజయ్

ఐపీఎల్ కెప్టెన్ మోదీ..

ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికలు ఇండియన్ పొలిటికల్ లీగ్ మ్యాచ్ అని.. ఇందులో బీజేపీ కెప్టెన్ మోదీ అని బండి సంజయ్ అన్నారు. విపక్ష పార్టీల్లో ఇంత వరకు ప్రధాని అభ్యర్థి ఎవరనేది తేలలేదన్నారు. కెప్టెన్ లేకుండా లీగ్ మ్యాచ్ నడుస్తుందా..? అని ప్రశ్నించారు. ప్రతిపక్ష పార్టీల పరిస్థితి ఈ విధంగా ఉంటే దేశాన్ని ఎలా అభివృద్ధి చేస్తారని నిలదీశారు. సోమవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో జరిగిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో సంజయ్ మాట్లాడారు. మోదీని మూడోసారి ప్రధానిని చేయాలన్న ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తాజా, మాజీ సర్పంచులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, కార్పొరేటర్లు బీజేపీలోకి వస్తున్నారని పేర్కొన్నారు. పంచాయతీలకు నేరుగా చేరాల్సిన కేంద్రం నిధులను బీఆర్ఎస్ దారి మళ్లించి సర్పంచులను బిచ్చగాళ్లుగా మార్చిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పి మోసం చేసిందని మండిపడ్డారు. నిత్యం తనను తిట్టే హుస్నాబాద్ ఎమ్మెల్యే.. ఆ నియోజకవర్గంలో ఎంత మందికి ఆరు గ్యారెంటీలు ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాగా, హుస్నాబాద్‌లో నియోజకవర్గ కార్యకర్తల సమావేశానికి హాజరైన బండి సంజయ్‌కి అంబేడ్కర్ చౌరస్తాలో గిరిజనులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: **K. Srinivas.** Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● మంగళవారం 23 ఏప్రిల్ 2024

నమస్కారం ఎందుకు పెడతారో తెలుసా!

ఇంటర్వ్యూల్లో కొన్ని సందర్భాల్లో విచిత్రమైన ప్రశ్నలు ఎదురవుతుంటాయి. సివిల్ సర్వీసెస్ ఇంటర్వ్యూలో నాకు ఇలాంటి అనుభవమే ఎదురయింది. సాధారణంగా మనం ఎవరినైనా పలకరించాలన్నా, గౌరవించాలన్నా పెద్దవారైతే నమస్కారం, సమ వయస్కులు లేదా చిన్నవారు అయితే హలో చెబుతాం. నేను ఇంటర్వ్యూ రూమ్ లోపలికి వెళుతూనే అందరికీ నమస్కారం పెట్టాను. దాంతో అసలు నమస్కారం ఎందుకు పెడతారని ప్రశ్నించారు. నమస్కారానికి ఉన్న ప్రాధాన్యం, దాంతో కలిగే ప్రయోజనాలు, ఏర్పడే బంధాలు తదితరాలపై అడిగి తెలుసుకున్నారు.

- సాధారణంగా వ్యక్తుల ప్రవర్తన, హఠాత్తుగా ఏదైనా ప్రశ్న ఎదురైతే ఎలా స్పందిస్తారు, తను చేసే పనుల పట్ల ఎంత అవగాహన ఉంది తదితరాలు ఇలాంటి వాటివల్ల తెలుస్తాయి అని నేను అనుకుంటున్నా. సివిల్స్‌లో దినేష్ దాసా బోర్డు నన్ను ఇంటర్వ్యూ చేసింది. నా ఆప్షనల్ సబ్జెక్టు సోషియాలజీ. నా సబ్జెక్టు మొదలుకుని పలు రంగాలపై నన్ను బోర్డు ప్రశ్నించింది. వాటన్నిటికీ సంతృప్తికరంగానే జవాబు ఇచ్చాను.
- గ్రాడ్యుయేషన్ తరవాత ఐటి కంపెనీ 'క్యాప్ జెమినీ'లో ఉద్యోగం చేశాను. అక్కడ నా జాబ్ నేచర్, నేను అందించిన సేవలు, నిర్వర్తించిన పనుల గురించి అడిగారు. ఐఐఎఫ్‌టీ విద్యార్థిని కావడంతో వాణిజ్య యుద్ధాల(ట్రేడ్ వార్స్)పై ప్రశ్నించారు. సోషియాలజీలో ఆత్మహత్యలపై ఒక థియరీ ఉంది. నా ఆప్షనల్ అదే కావడంతో ఆ థియరీని ప్రస్తావిస్తూ మహారాష్ట్రలో రైతులు, అలాగే కోటాలో విద్యార్థులు ఆత్మహత్యలపై నా అభిప్రాయం అడిగి తెలుసుకున్నారు. రెంటినీ కంపార్ చేస్తూ చెప్పమన్నారు. ఒకవేళ కోటా కలెక్టర్‌గా వెళితే, అక్కడ విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోకుండా మీరు ఏమి చర్యలు తీసుకుంటారని అడిగారు. అలా పుస్తకంలో ఉన్న థియరీని, ప్రాక్టికల్ సమస్యలకు ఎలా అప్లయ్ చేయగలనో తెలుసుకునే ప్రయత్నం చేశారు.
- నా హాబీ ట్రావెల్ అని చెప్పడంతో ఏయే ప్రదేశాలను సందర్శించావు, భారతదేశంలో పర్యాటక అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలేమిటి అని అడిగారు. ప్రతీది నా బయోడేటా ఆధారంగా అడిగారు. ఎలా పరిష్కరించవచ్చో తెలుసుకునే ప్రయత్నం చేశారనిపించింది. దాదాపుగా నా డీటైల్డ్ బయోడేటా చుట్టూనే ప్రశ్నలన్నీ ఉన్నాయి.

కోచింగ్ తీసుకోలేదు

సివిల్స్ కోసం నేనెక్కడా కోచింగ్ తీసుకోలేదు. సొంత ప్రిపరేషన్‌పైనే ఆధారపడ్డాను. ప్రిలిమ్స్‌లో జనరల్ స్టడీస్ కోసం చదువుతున్నప్పుడు సోషియాలజీపై ఆసక్తి పెరిగింది. జనరల్ స్టడీస్‌లో ఎక్కువగా సమాజంపై వివిధ అంశాలు చూపే ప్రభావం ఎక్కువ ఉంటుంది. అదే నన్ను సోషియాలజీని ఆప్షనల్ సబ్జెక్టుగా ఎంచుకొనేలా చేసింది. పరీక్షల్లో కూడా 2013 నుంచి జనరల్ స్టడీస్ పేపర్లన్నీ చూశాను. అలా మెయిన్స్‌లో అడిగే ప్రశ్నల తీరును సునిశితంగా పరిశీలించగలిగాను. ప్రిలిమ్స్ క్లియర్ అయ్యాక మెయిన్స్‌కి సంబంధించి గంటకు ఆరు ప్రశ్నలకు సమాధానాలు రాసేవాడిని. ఇది నా రెగ్యులర్ ప్రాక్టీస్. గూగుల్‌లో టాపర్ల సమాధానాలు, ఇంటర్వ్యూలు లభిస్తాయి. వాటితో నా సమాధానాలను సరిపోల్చుకునేవాడిని. లోపాలు ఏమైనా ఉంటే సరిదిద్దుకొని ముందుకు వెళ్లాను. అలా నా మెయిన్స్ ప్రిపరేషన్ కొనసాగింది. మొత్తమ్మీద మొదటి యత్నంలోనే సివిల్స్‌లో 82వ ర్యాంకు సాధించగలిగాను.

- నేను చూసిన కొందరు ఐపీఎస్ అధికారుల పనితీరు నన్ను సివిల్స్ వైపు మొగ్గుచూపేలా చేసింది. ఢిల్లీలో చదువుతున్నప్పుడు, అది మరింత బలపడింది. అదే నన్ను సివిల్స్ రాసేలా చేసింది. సివిల్స్‌కు ప్రిపేరయ్యే అభ్యర్థులు కనీసం పది పదిహేనుమంది టాపర్ల ఇంటర్వ్యూలను యూట్యూబ్‌లో చూడాలి. ఆ టాపర్లు తమ ప్రిపరేషన్ ఎలా జరిగిందనేది చెబుతుంటారు. వాటిలో మనకు నచ్చిన విషయాలు తీసుకుని సొంతంగా ప్రిపరేషన్ ప్రణాళిక రూపొందించుకోవాలి. మరీ ముఖ్యంగా పాత ప్రశ్నపత్రాలను పరిశీలిస్తే ఎగ్జామ్ సరళి తెలుస్తుంది. ప్రశ్నలు అడిగే విధానం అర్థమవుతుంది. పరీక్షపై సంపూర్ణ అవగాహన కలుగుతుంది. అదే మన ప్రశ్నకు చుక్కానిలా పనిచేస్తుంది.



సివిల్స్ ర్యాంకర్స్ వాయిస్

మెరుగు కౌశిక్
ర్యాంకు: 82

స్వస్థలం: జనగామ(తెలంగాణ)
తండ్రి: సుధాకర్(కన్‌స్ట్రక్షన్ బిజినెస్)
తల్లి: సుజాత(గృహిణి). **సోదరి:** నివేదిత
అర్హత: ఉస్మానియా ఇంజనీరింగ్ కాలేజి నుంచి సివిల్ ఇంజనీరింగ్‌లో బీటెక్. ఢిల్లీలోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్‌ట్రేడ్(ఐఐఎఫ్‌టీ) నుంచి ఇంటర్నేషనల్ ట్రేడ్‌లో ఎంబీఏ.
ఉద్యోగం: క్యాప్ జెమినీలోని ఆర్థిక సేవల విభాగంలో ఫైనాన్షియల్ కన్సల్టెంట్‌గా ఒక ఏడాది అనుభవం.

నోటిఫికేషన్స్



ఏపీ డీఈఈ సెట్

ఇబ్రహీంపట్నం(విజయవాడ)లోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాఠశాల విద్య విభాగం- డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(డీఈఈ సెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ టెస్ట్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా రెండేళ్ల వ్యవధి గల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్ఈడీ) కోర్సులో ప్రవేశాలు కల్పిస్తారు. ప్రభుత్వ డైట్‌లు(డిస్ట్రిక్ట్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెయినింగ్), ప్రైవేట్ ఎలిమెంటరీ టీచర్ ట్రెయినింగ్ సంస్థల్లో అడ్మిషన్స్ ఇస్తారు. మేథమెటిక్స్, ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్, సోషల్ స్టడీస్ సబ్జెక్టుల్లో ఒక్కోదానిలో 25 శాతం సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ డైట్‌లలోని సీట్లు, ప్రైవేట్ సంస్థల్లోని ఎ కేటగిరీ సీట్లను సింగిల్ విండో పద్ధతిలో; ప్రైవేట్ సంస్థల్లోని బి కేటగిరీ సీట్లను ఆ సంస్థల నిర్ణయం మేరకు భర్తీ చేస్తారు. ఇంగ్లీష్ మీడియం సీట్లు కూడా అందుబాటులో ఉన్నాయి. వీటికి ఆంగ్ల మాధ్యమంలో చదివినవారు మాత్రమే అర్హులు. ఏపీ డీఈఈ సెట్ 2024కు తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. ఒకేషనల్ కోర్సులు చేసినవారు దరఖాస్తుకు అనర్హులు. డిప్లొమా కోర్సులో మేథమెటిక్స్‌ను ఎంచుకోవాలంటే ఇంటర్‌లో మేథ్స్ ప్రధాన సబ్జెక్టుగా చదివి ఉండాలి. అలాగే ఫిజికల్ సైన్స్‌కు ఫిజిక్స్, కెమిస్ట్రీ; బయలాజికల్ సైన్స్‌కు బోటనీ, జువాలజీ; సోషల్ స్టడీస్‌కు సివిక్స్, ఎకనామిక్స్, హిస్టరీ, జాగ్రఫీ, కామర్స్‌లలో ఏవైనా రెండు సబ్జెక్టులు చదివి ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 సెప్టెంబరు 1 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.

డీఈఈ సెట్ వివరాలు: ఇందులో రెండు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో 60, రెండో పార్ట్‌లో 40 చొప్పున మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 100. మొదటి పార్ట్‌లో టీచింగ్ ఆప్టిట్యూడ్, జనరల్ నాలెడ్జ్, ఇంగ్లీష్, తెలుగు అంశాలనుంచి ఒక్కోదానిలో 5; ఎంచుకొన్న లాంగ్వేజ్(తెలుగు/తమిళం/ఉర్దూ/ఇంగ్లీష్), మేథమెటిక్స్, జనరల్ సైన్స్, సోషల్ స్టడీస్ అంశాల నుంచి ఒక్కోదానిలో 10 ప్రశ్నలు ఇస్తారు. రెండో పార్ట్‌లో అభ్యర్థులు సబ్జెక్టులు ఎంచుకోవాల్సి ఉంటుంది. మేథమెటిక్స్‌లో 40; ఫిజికల్ సైన్స్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి ఒక్కోదానిలో 20; బయలాజికల్ సైన్స్‌లో బోటనీ, జువాలజీల నుంచి ఒక్కోదానిలో 20 ప్రశ్నలు ఇస్తారు. సోషల్ స్టడీస్‌లో హిస్టరీ, ఎకనామిక్స్, సివిక్స్ నుంచి ఒక్కోదానిలో 13 ప్రశ్నలతోపాటు ఆ సబ్జెక్టుల్లో ఒకదాని నుంచి మరో ప్రశ్న ఇస్తారు. మొదటి పార్ట్‌లో ఆరో తరగతి నుంచి పదోతరగతి వరకు ఏపీ స్టేట్ సిలబస్ ఆధారంగా; రెండో పార్ట్‌లో ఏపీ ఇంటర్ బోర్డు సిలబస్ ఆధారంగా ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థి ఎంచుకొన్న ప్రకారం తెలుగు/ఉర్దూ/తమిళం/కన్నడం/సంస్కృతంతోపాటు ఇంగ్లీష్ మాధ్యమంలో ప్రశ్నపత్రం ఇస్తారు. పరీక్ష సమయం రెండున్నర గంటలు. డీఈఈ సెట్‌లో అర్హత సాధించాలంటే జనరల్, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు కనీసం 50 శాతం మార్కులు రావాలి. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు వస్తే చాలు. వీరు జనరల్/ఎన్‌సీసీ/సీఏపీ/స్పోర్ట్స్ కేటగిరీ సీట్లకు పోటీ పడాలంటే మాత్రం 50 శాతం మార్కులు తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** రూ.750
- **ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** మే 8
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 9
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** మే 21 నుంచి
- **ఏపీ డీఈఈ సెట్ 2024 తేదీలు:** మే 24
- **ఫలితాలు విడుదల:** మే 30
- **వెబ్ ఆప్షన్స్:** జూన్ 6 నుంచి 8 వరకు
- **అభ్యర్థుల మెరిట్ లిస్ట్ విడుదల:** జూన్ 10
- **సర్టిఫికెట్స్ వెరిఫికేషన్:** జూన్ 12 నుంచి 15 వరకు
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** జూన్ 20 నుంచి
- **వెబ్‌సైట్:** https://apdeecet.apcfss.in

యూజీసీ నెట్

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)- యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(యూజీసీ నెట్) జూన్ 2024కి దరఖాస్తులు కోరుతోంది. దేశవ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలు, కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేయడానికి, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్)నకు, పీహెచ్‌డీ అడ్మిషన్స్‌కు నెట్ అర్హత తప్పనిసరి. ఎన్ఎఫ్ఎస్సీ, ఎన్ఎఫ్ఓబీసీ, ఎన్ఎఫ్‌పీడబ్ల్యూడీ ఫెలోషిప్‌లకు కూడా నెట్ అర్హతనే ప్రామాణికంగా తీసుకొంటారు. మొత్తం 83 సబ్జెక్టుల్లో ఈ టెస్ట్‌ని నిర్వహిస్తున్నారు.

అర్హత: హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్(లాంగ్వేజ్‌లు సహా), కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, ఎలక్ట్రానిక్ సైన్స్ తదితర విభాగాల్లో కనీసం 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులు; కనీసం 75 శాతం మార్కులతో నాలుగేళ్ల బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులు; ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. డిగ్రీ(నిర్దేశ కాలపరిమితి) అభ్యర్థులను జేఆర్ఎఫ్/పీహెచ్‌డీ అడ్మిషన్‌కు మాత్రమే అనుమతిస్తారు. వీరు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేసేందుకు వీలు లేదు. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్)నకు అప్లయ్ చేసుకొనే అభ్యర్థుల వయసు 2024 జూన్ 1 నాటికి 30 ఏళ్లు మించకూడదు. అసిస్టెంట్ ప్రొఫెసర్ అర్హతకు/పీహెచ్‌డీ అడ్మిషన్‌కు అప్లయ్ చేసుకొనే అభ్యర్థులకు వయోపరిమితి నిబంధనలు లేవు.

యూజీసీ నెట్ 2024 వివరాలు: దీనిని ఓఎంఆర్ మోడ్‌లో నిర్వహిస్తారు. ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. రెంటిలో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. మొదటి పేపర్ 100 మార్కులకు ఉంటుంది. ఇందులో అభ్యర్థికి ఉన్న టీచింగ్/రీసెర్చ్ ఆప్టిట్యూడ్ పరిజ్ఞానాన్ని పరీక్షించేలా రీజనింగ్ ఎబిలిటీ, రీడింగ్ కాంప్రహెన్షన్, డైవర్జెంట్ థింకింగ్, జనరల్ అవేర్‌నెస్ అంశాలకు సంబంధించి 50 ప్రశ్నలు అడుగుతారు. రెండో పేపర్ 200 మార్కులకు ఉంటుంది. ఇందులో అభ్యర్థి ఎంచుకొన్న సబ్జెక్టు నుంచి 100 ప్రశ్నలు అడుగుతారు. రెండు పేపర్లలో ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు కేటాయించారు. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం మూడు గంటలు. ప్రశ్న పత్రాన్ని హిందీ, ఇంగ్లీష్ మాధ్యమాల్లో ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1150; ఓబీసీ, ఈడబ్ల్యుఎస్ అభ్యర్థులకు రూ.600; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.325
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 10
- **ఆన్‌లైన్ దరఖాస్తులో కరక్షన్స్:** మే 13 నుంచి 15 వరకు
- **యూజీసీ నెట్ జూన్ 2024 తేదీ:** జూన్ 16
- **వెబ్‌సైట్:** https://ugcnet.nta.ac.in, www.nta.ac.in

ज्ञान-विज्ञान विमुक्तये

భారత్ సొంత సూచీలను ఏర్పాటు చేసుకునే తరుణం ఆసన్నమయ్యిందా?

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే



కొలమానం ఒకటే అయినప్పుడు, పోలిక సమఉజ్జీల మధ్య ఉండాలి. ఒకవేళ అసమానులను, సమానులను ఉమ్మడిగా తూచాలంటే తదనుగుణమైన కొలమానాన్ని నిర్మించుకోవాలి. అప్పుడే అంచనాల్లో కచ్చితత్వం వస్తుంది.

అయితే ఇటీవలికాలంలో విడుదలైన ప్రపంచ సంతోష సూచీ, ప్రపంచ ప్రజాస్వామ్య సూచీ(లిబరల్ డెమోక్రసీ ఇండెక్స్), ప్రపంచ పాత్రికేయస్వేచ్ఛా సూచీ(వరల్డ్ ప్రెస్ ఫ్రీడం ఇండెక్స్) వంటి సూచీల అంచనాల్లో డొల్లతనం వాటి సూచీ నిర్మాణ లోపాలను, ఆ సంస్థల విశ్వసనీయతను గురించిన ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. కొన్ని సంవత్సరాలుగా ఈ సూచీల కారణంగా భారతదేశానికి సంబంధించి తప్పుడు సమాచారాన్ని ప్రపంచ వేదికలపై ప్రకటిస్తున్న కారణంగా భారీగా నష్టపోతున్న భారత్ తన సొంత సూచీల నిర్మాణం దిశగా సమాయత్తం అవుతోంది. ఈ నేపథ్యంలో ఇటీవలి సూచీల్లో ప్రకటితమైన అసంబద్ధ అంశాలను, ఆ సూచీల నిర్మాణంలో నిర్హేతుకతనూ, భారత్ సొంత సూచీలను నిర్మించుకోవాల్సిన ఆవశ్యకతను గురించి చర్చిద్దాం.

వివిధ నివేదికలు వాటిలోని అసంబద్ధ అంశాలు

మార్చి మొదటివారంలో విడుదలైన 'లిబరల్ డెమోక్రటిక్ ఇండెక్స్(ప్రపంచ ప్రజాస్వామ్య సూచీ)-2024' ప్రకారం సర్వే చేసిన 179 దేశాల్లో, అతిపెద్ద ప్రజాస్వామ్యదేశమైన భారత్ 104వ ర్యాంకును పొందింది. అయితే ఇదే సూచీలో భారత్‌కు ఎగువ ఉన్న 103వ స్థానంలో నిజేర్ ఉండగా, మరింత మెరుగైన స్థానంలో(98) కువైట్ ఉంది. ఆశ్చర్యకరమైన విషయమేమంటే గత నెలలో ఒక పార్లమెంటు సభ్యుడు ఆ దేశ రాజు(అమిర్)ను విమర్శించిన కారణంగా మొత్తం పార్లమెంట్‌నే రద్దు చేశారు. ఇక నిజేర్‌లో గత సంవత్సరం జూలై నుంచి ఆ దేశ అధ్యక్షుడు గృహనిర్బంధంలో ఉండగా, అక్కడ మిలిటరీ జుంటా చేతిలోకి పరిపాలన వెళ్లిపోయింది. ఇలాంటి దేశాలు భారత్ కంటే మెరుగైన ర్యాంకులను పొందగా, క్రమం తప్పకుండా ఎన్నికలు జరుగుతూ, ఎప్పుడూ మిలిటరీ పాలనను చవిచూడని అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్, అసలు ప్రజాస్వామ్యం ఊసే లేని దేశాలకంటే అధమస్థాయి ర్యాంకును పొందడం ఆశ్చర్యకరం.

- ఇటీవల విడుదలైన ప్రపంచ సంతోషసూచీలో 143 దేశాల్లో భారత్ స్థానం '126'. అయితే ఈ నివేదికలో మయన్మార్ 118వ స్థానంలో, పాకిస్థాన్ 108వ స్థానంలో, పాలస్తీనా 103వ స్థానంలో, ఉక్రెయిన్ 106వ స్థానంలో ఉన్నాయి. ఈ దేశాల్లో దేనిలోనూ ప్రశాంత పరిస్థితులు లేవు. మయన్మార్‌లో ఏడు దశాబ్దాలుగా అంతర్యుద్ధ(సివిల్ వార్) పరిస్థితులు నెలకొని ఉన్నాయి. పాకిస్థాన్‌లో అస్థిర ప్రభుత్వం, ద్రవ్యోల్బణం, మిలిటరీ ఆధిపత్యం, ఉగ్రవాద ప్రాబల్యం, నిరుద్యోగిత, కనీస అవసరాలకు కటకట వంటి పరిస్థితులు నెలకొన్నాయి. ఇక పాలస్తీనా దశాబ్దాల తరబడి ఒక దేశంగా గుర్తింపు కోసం పోరాడుతూనే ఉంది. నిరంతరం దాడులు, పేదరికంతో అలమటిస్తోంది. ఉక్రెయిన్ విషయానికి వస్తే ఇటీవలకాలంలోనే కాదు, కొద్ది సంవత్సరాలుగా యుద్ధ పరిస్థితుల్లో ఉంది. మత్తు మందు కొరత ఏర్పడింది. దాంతో మత్తు ఇవ్వకుండానే క్షతగాత్రులకు శస్త్రచికిత్సలు చేస్తున్న హృదయవిదారక పరిస్థితి అక్కడ ఉంది. ఆహార ధాన్యాల కోసం ఇతరదేశాల సాయం కోసం చూడాల్సిన దైన్యం. రష్యా నుంచి బాంబుల వర్షం. ఇలాంటి భయానక పరిస్థితులు నెలకొన్న దేశాలతో పోలిస్తే ఎంతో ప్రశాంతంగా ఉన్న భారతదేశం ఆనందసూచీలో ఈ దేశాల కన్నా వెనుకబడి ఉండటం విస్తుగొలుపుతోంది. ఏ ప్రాతిపదికన ఈ సూచీని తీసుకున్నారు? దానికి కొలమానాలేంటి అనే సందేహాలు ముప్పిరిగొంటున్నాయి. ఇక ప్రపంచ ప్రెస్ ఫ్రీడం ఇండెక్స్‌లోనూ ఇదే ధోరణి కనబడుతోంది. దీనిలో 180 దేశాల్లో భారత్‌ది 161వ స్థానం. ఆఫ్ఘనిస్థాన్ 152వ స్థానంలో, పాకిస్థాన్ 150వ స్థానంలో, యూఏఈ 145వ స్థానంలో సొమాలియా 141వ స్థానంలో, ఉగాండా 133వ స్థానంలో ఉన్నాయి.
- తాలిబన్ల కనుసన్నల్లోనే ఏదైనా జరిపే ఆఫ్ఘనిస్థాన్, నియంతృత్వ పోకడలు ఉన్న ఉగాండా, సొమాలియా, యూఏఈ, పాకిస్థాన్ వంటి దేశాల కంటే సమాచారాన్ని ఒక ప్రాథమిక హక్కుగా కల్పించిన భారతదేశంలో తక్కువగా పాత్రికేయ స్వేచ్ఛ ఉందనడం హాస్యాస్పదం. ఈ దృష్టాంతాలు సూచీలను వెల్లడిస్తున్న సంస్థల విశ్వసనీయతను, వాటి దత్తాంశ సేకరణ ప్రమాణాలను ప్రశ్నిస్తున్నాయి.

ఎన్నుకున్న ప్రమాణాల్లో లోపాలు

- ఐక్యరాజ్యసమితికి చెందిన 'సస్టయినబుల్ డెవలప్‌మెంట్ సొల్యూషన్స్ నెట్‌వర్క్' ఏటా గాలప్ వరల్డ్ పోల్, ఆక్స్‌ఫర్డ్ వెల్ బీయింగ్ రీసెర్చ్ సెంటర్ సహకారంతో ప్రపంచ ఆనందసూచీ(వరల్డ్ హ్యాపీనెస్ రిపోర్ట్)ని విడుదల చేస్తుంది. వీరు ఈ రిపోర్ట్/సూచీ తయారుచేయడానికి సంతోషాన్ని కొలవడానికి ఆరు కొలమానాలను ప్రాతిపదికగా తీసుకుంటారు. అవి-

1) సామాజిక మద్దతు(సోషల్ సపోర్ట్)
2) ఆదాయం 3) స్వేచ్ఛ 4) దాతృత్వం
5) ఆరోగ్యం 6) అవినీతి లేకపోవడం.


గాలప్ వరల్డ్ పోల్ సంస్థ ఈ ఆరు అంశాలకు సంబంధించి ప్రపంచవ్యాప్త సర్వే నిర్వహిస్తుంది. అన్ని దేశాల్లో ఒక నిర్ణీత సంఖ్యలో అనగా ప్రతి దేశంలో రమారమీ వెయ్యిమంది పౌరులను సర్వే చేస్తుంది. ఆరు కొలమానాలపరంగా తమ సంతృప్తి స్థాయిల ప్రకారం సున్నా నుంచి పది పాయింట్ల మధ్య ఒక నంబరును ఎంచుకుంటారు. ఈవిధంగా వెయ్యిమందిలో గరిష్ఠంగా ఎంచుకున్న సంఖ్య, కనిష్ఠంగా ఎంచుకున్న సంఖ్యల మధ్య గల వ్యత్యాసం(హ్యాపీనెస్ గ్యాప్) ఆధారంగా ఆ దేశపు ర్యాంకు నిర్ణయించవచ్చు. వ్యత్యాసం తక్కువగా ఉంటే మెరుగైన ర్యాంక్ లభిస్తుంది. అదే వ్యత్యాసం భారీగా ఉంటే అధమస్థాయి ర్యాంకులు లభిస్తాయి. అయితే భారతదేశం వంటి అత్యధిక వైవిధ్యతలు, విభిన్న సంస్కృతి సంప్రదాయాలు, కుల, మత, ప్రాంత, భౌగోళిక, భాషాపరమైన వైవిధ్యతలు, ఆదాయ, విద్యాపరమైన స్థాయిలో భారీ వ్యత్యాసాలు గల దేశంలో అభిప్రాయాల్లో ఏకరూపత ఉండదు. అందువల్ల ఒకేతరహా పరిస్థితులను ఎదుర్కొంటున్న అల్లకల్లోల పరిస్థితులున్న దేశాల ప్రజల అభిప్రాయాల్లో ఉన్న ఏకత్వం ఇక్కడ కనపడదు. అంతమాత్రంతో కేవలం అభిప్రాయాల్లో ఉన్న వ్యత్యాసాలు ఆధారంగా సంతోష స్థాయిలు నిర్ణయించడం నిర్హేతుకం.

- భారతదేశం వంటి భారీ జనాభా గల దేశంలో వెయ్యిమందిని సర్వే శాంపిల్స్‌గా తీసుకోవడం అంటే చాలా తక్కువమంది అభిప్రాయాలను దేశం మొత్తానికి అంటగట్టడమే. అదేవిధంగా భారతదేశంలో ఒకరాష్ట్రంలో ఉన్నంత జనాభా కూడా లేని దేశాలను, భారతదేశాన్ని ఒకే గాడిని కట్టి, ఒక నిర్ణీత సంఖ్యలో అభిప్రాయ సేకరణ జరపడం అహేతుకం.

(మిగతా రేపటి దిక్సూచిలో)



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్



క్షమాపణలు చెప్పిన సింహం

ఒక అడవిలో సింహరాజు ఉండేది. అసలే అడవికి రాజు. దానికి గర్వం బోలెడంత. ఏ జంతువు ఎదురుగా వచ్చినా సహించేది కాదు. ఆఖరికి ఏనుగు వచ్చినా.. తానే గొప్ప అనుకునేది. ఏనుగులు కూడా పెద్దగా పట్టించుకునేవి కావు. అయితే ఆ సింహానికి మాత్రం ఎవరూ అసలు విషయం చెప్పేవారు కాదు. ఎందుకంటే సింహమంటే భయం. పైగా రాజుల దగ్గర నిజాలు ఎవరూ చెప్పరు.

సింహానికి ఓ కుందేలు అడవిలో జరిగే విషయాలన్నీ చెప్పేది. అయితే ఆ తర్వాత ఆ కుందేలుని ఓ నక్క వేటాడి తినేసింది. ఆ కుందేలు సమాచారం ఇవ్వకపోవటంతో సింహం గిలగిలలాడేది. దీంతో ఓ నక్క ఆ సింహం పంచన చేరింది. ఆ నక్కను నమ్మే పరిస్థితి లేదు సింహానికి. దీంతో నక్కను దూరం చేసుకుంది. ఇలా అడవిలో అన్నీ ఆలోచించటం వల్ల ఇబ్బంది. అయినా ప్రశాంతత కోసం ఏమీ పట్టించుకోకూడదు అనుకుంది. అయితే సింహానికి కోపం ఎక్కువైంది. ఎంతైనా రాజు కదా!

ఒక రోజు సింహం గుహలో నిద్రపోతోంది. ఒక చిట్టెలుక బొరియ చేసుకుంది. అయినా సింహం నిద్రపోతూ ఉంది. ఈ సింహం అయితే నేనేమీ చేయాలి అనే ఆలోచన చిట్టెలుకది. సింహం పడుకున్న చోటే చిట్టెలుక బొరియ తవ్వింది. ఆ తర్వాత సింహం మీద ఆడుకుంది. పరిగెత్తింది.




సింహం పెద్దగా పట్టించుకోలేదు. ఆ తర్వాత సింహం మీద ఎగిరింది. దీంతో ఒక్క ఉదుటున పంజాతో చిట్టెలుకను పట్టేసుకుంది. 'పిల్లల మీద మీ కోపమా? నేను ఆదుకుంటాను మిమ్మల్ని. ఇప్పుడు విడిచిపెట్టు' అన్నది చిట్టెలుక. దీంతో సింహం వికటాట్టహాసం చేస్తూ నవ్వింది. పిడికెడు లేవు నువ్వు నన్ను కాపాడడమా? అన్నది. అయినా నీ ధైర్యం, నీ మాటలు బావున్నాయి. బతుక్కో అంటూ వదిలేసింది.

అడవిలో సింహానికి సమాచారం ఇచ్చేవారు లేరు. ముగ్గురు వేటగాళ్లు అడవిలోకి వచ్చారు. వలలు పన్నారు. అది కూడా సింహం ఆనవాళ్లు, జాడ చూసి వలలు వేశారు. గుహలోంచి వచ్చిన సింహం ఆ వేటగాళ్లు పడిన వలలో పడింది. ఇక చావే శరణ్యం అనుకుంది సింహం. ఆ చెట్టు మీద చిట్టెలుక ఉంది. సింహం పరిస్థితి చూసి కిందకు వచ్చి నిముషాల్లో ఆ వలను కొరికేసింది. తుంటలుగా వల పడిపోయింది. 'నీ ఆకారం చూసి తక్కువ అంచనా వేశా. క్షమించు. ఈరోజు నుంచి నువ్వు నా దగ్గరే ఉండు' అని సింహం అడిగింది. అప్పటినుంచి వారిద్దరి స్నేహం అలా కొనసాగింది.

జత ఉన్న బొమ్మ ఏది?







10 తేడాలు గుర్తించండి



డైలీ సుడోకు - 288

8			2					
					6			3
4		9		1		8	6	
		8				3	1	9
5	2	6				4		
	9	7		4		2		6
1			5					
					3			7

సుడోకు - 287 సమాధానం

9	6	4	1	3	7	5	8	2
3	5	2	8	6	4	1	9	7
1	8	7	9	5	2	3	6	4
2	7	8	6	9	3	4	5	1
5	9	6	2	4	1	8	7	3
4	1	3	7	8	5	9	2	6
6	3	5	4	7	9	2	1	8
8	4	1	5	2	6	7	3	9
7	2	9	3	1	8	6	4	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.